'ఆదివారం—ఆదివారం'

—జానకి

'బుడుగు'

—ముళ్ళపూడి వెంకటరమణ

'మీ న్యాయశాస్త్రపరిచయ మెంత?

సంక్రాంతి సంచిక



ఆంధ్రసచిత్ర వారపత్రిక

ఉత్తరాలు

తెలుగు వెలుగులు

4—1—61 తేదీ వార పత్రిక తెలుగు వెలుగులుశీర్షికలో 'శ్రీ అంబా ప్రసాద్‌గారి' సంగ్రహ చరిత్ర మిక్కిలి ప్రశంసనీయమైనది.

"నాదోపాసనలో లీనం కావడమే కాక ఎన్నో సంస్థలలో బాధ్యత కలిగిన పదవులు నిర్వహిస్తూ, సంగీత శాస్త్రాభివృద్ధికి నిర్విరామంగా కృషి చేస్తున్నవాడు శ్రీ అంబాప్రసాద్. ఆంధ్రుల హృదయాలలో ఆయన కున్న స్థానం మాత్రం శాశ్వత మైనది" అన్న వాక్యాలు అక్షరాలా నిజం. వ్యాసకర్తకు, చిత్రకారునికి ఈ పత్రిక ద్వారా నా ధన్యవాదాలర్పిస్తున్నాను.

పోతిరెడ్డి శ్రీమన్నారాయణరావు
(చిలకలపూడి)

*   *   *

తెలుగు వెలుగులు శీర్షికను ఎక్కువగా కళాకారులకు కేటాయించడము కానిపని. అందు నా సంగీత విద్వాంసులను గూర్చే వరుసగా వ్రాయడం వైపరీత్యం. రాజకీయ నాయకులు, కూడా తెలుగు వెలుగులన్న మాటరచయిత మరిచిపోయారు కాబోలు.

స్వామి, (బొబ్బిలి).

మరచిపోలేదు. వెనుకటి సంచికలు చూడండి.

*   *   *

కవితా కింకిణి

మీ "కవితా కింకిణి" పోటీలో ఇంతవరకు మెచ్చుకోతగ్గ రచన ఒక్కటీ రాకపోయినందుకు ఎంతో చింతించుచున్నాము. చక్కటి గీతాలకూ, గేయాలకూ ప్రథమ స్థానం యిచ్చి, నవీన భావాలతో, ఆధునికత ప్రస్ఫుటీకరించే రచనల్ని ప్రచురిస్తారని ఆశిస్తున్నాను.

కె. వి. రమణ (హైదరాబాదు)


ఈ వారము(4—1—'61) పత్రికలోని కవితా కింకిణి శీర్షిక క్రింద ప్రచురించిన "వర్షము" పద్యాలు చాలా బాగుగా ఉన్నవి. యువ రచయితలకు ఈ శీర్షిక ప్రోత్సాహకరముగా ఉన్నది.

విప్పర్తి ద్వారకా కృష్ణ (విజయనగరము)

*   *   *

కార్టూనులు

4—1—1961 సచిత్ర వార పత్రిక యందు ఉమెన్‌గారి పంచాయితి కోడి బంగారు గుడ్డు కార్టూన్ చాలా బాగుంది. పంచాయితీ పాలనవల్ల హత్యలు, కొట్లాటలు, అన్యాయాలు ఎక్కువ అయినవి. ఈకార్టూన్‌లో ప్రభుత్వ ఉద్యోగులపై జరుగు



ఉత్తరాలు

వలసింది. ముఖ్యంగా ఉపాధ్యాయులను బానిసల కంటె హీనముగ చూచుచున్నారు. ఉద్యోగులు ఇంగ్లీషువారి పాలనలో పొందని కష్టములు ఇప్పుడు అనుభవిస్తున్నారు.

అనంతరాం కె. (మహబూబ్‌నగర్).

* * *

ఓమన్‌గారి 'పంచాయతి కోడి—బంగారు గ్రుడ్డు' కార్టూను చాల బాగున్నది.

ఎన్. పెద్దిరెడ్డి, (మదనపల్లె.)

* * *

న్యూఢిల్లీ లేఖ

4—1—61 తేదీ ఆంధ్ర సచిత్ర వారపత్రికలో ప్రకటిత మయిన శ్రీ కృష్ణగారి 'ఢిల్లీ లేఖ'' శ్రీ నెహ్రూ అనుయాయులకు కొంత కనువిప్పు కల్గించక మానదు.

'ఒక వైపున అకాలీలు ఢిల్లీ పోలీసులతో యుద్ధం చేస్తుంటే మన ప్రభుత్వం కాంగో కల్లోలాలపై మితిమీరిన ఆందోళన ప్రకటించింది''—ఎంతో హాస్యాస్పదము. అందుకే మన పూర్వులు 'ఇంట గెలిచి రచ్చ గెలవ' మన్నారు.

'పంజాబీ సుబా' ఏర్పాటు శ్రీ కృష్ణగారు నుడివినట్లు దేశ ఐక్యత కొక గొడ్డలిపెట్టు. అంతేగాక శ్రీ నెహ్రూ విధానమునకు అగ్నిపరీక్ష యేమో !

చక్కని విమర్శవలలో న్యూఢిల్లీ లేఖ అందించుచున్న శ్రీ కృష్ణగార్కి నా హృదయపూర్వక అభినందనలు.

ఆర్. ఎస్. మూర్తి (పూనా).

* * *

కథలు

4—1—61 ఆంధ్ర సచిత్ర వారపత్రికలో శ్రీ నరసింహాచార్యులు రచించిన "విమల" అను కథ చాలా బాగున్నది. కథ ముగింపులో అర్థము కాలేదు. విమల చనిపోయినదని శేఖరం అక్క చెపుతుంది. అయితే అంతవరకు శేఖరానికి సేవలు చేసినది ఎవరు ? విమల దయ్యమా ! దయచేసి మా సందేహము తీర్చుమని ప్రార్థించుచున్నాము.

కె. సుందరీదేవి (పొదిలి).

విమల దయ్యమే.

* * *

4—1—61 సంచికలో ప్రచురింపబడిన వేమూరి సుబ్రహ్మణ్యం గారిచే రచితం బయిన 'ఉదరపోషణార్థం' అను కథ నాకు చాల నచ్చినది. ఇది ఈ కాల పరిస్థితులను చాటుతున్నది. ఎవరికితగ్గ మాట వారికి చెప్పినవాడే నిజముగా రాణించి జీవించగలడని నిదర్శనముచూపుతున్నది. రచయితకు నా అభినందనలు.

నేలబోట్ల అప్పయ్య, (విడవలూరు).

* * *

28—12—60 తేదీ పత్రికలో ప్రచురించబడిన "ఇంటర్వ్యూ", "బస్ స్టాప్" కథలు చదవడానికి చాల బాగుండి ఆనందాన్ని కలుగజేస్తున్నాయి. కాని, ఇంతకు పూర్వమే, ఆ రెండింటిని, ఎప్పుడో,

ఆంధ్రసచిత్ర వారపత్రిక

★

వ్యవస్థాపకులు:
దేశోద్ధారక కాశీనాథుని
నాగేశ్వరరావు పంతులుగారు

స్థాపితము
1908

★

సంపాదకుడు:
శివలెంక శంభుప్రసాద్

★

సంపుటము 55
సంచిక 19

18-1-61
బుధవారం

శార్వరి మాఘ శుద్ధ విదియ

★

విడిప్రతి వెల 25 న. పై.
సంవత్సర చందా 13-0-0

★

ఆంధ్రపత్రిక కార్యాలయము
7, తంబుచెట్టివీధి,

విషయానుక్రమణిక

ముఖచిత్రం:
"సంక్రమణరమాహేల" చిత్రకారుడు: బాపు

వచ్చే వారం......

బాపూ బొమ్మా!....కథ
ఎలిజబెత్ రాణి రాక — వ్యాసం
మల్కిభరాం కథ — చాటుకథా మంజరి


సరికొత్త శీర్షిక!

ఆంధ్ర సచిత్ర వారపత్రిక ఫిబ్రవరి 8వ తేది సంచిక నుంచి కవరుపేజీకి సరికొత్త శీర్షిక ప్రారంభమవుతుంది.

సంక్రాంతి ప్రత్యేక సంచిక కావడం చేత ఈ సంచికలో 'తెలుగు వెలుగులు' శీర్షిక క్రింద వ్యాసం ప్రచురించ లేదు.



ఆంధ్ర సచిత్ర వారపత్రిక



హెర్క్యులిస్ అతని అమూల్యమైన చరాస్తి


"కాస్త తప్పుకుంటారా, నా హెర్క్యులిస్ తాళం వేశానో లేదో చూసుకొని వస్తా"

మీరు సైకిలు కొనుక్కోవాలంటే మీరూ మీ వాళ్లూ కూడా అనేక విధాల ఖర్చులు తగ్గించుకోవలసి రావచ్చు—బస్సులకనండి, కాఫీ ఫలహారాలకనండి, చీరా సారే అనండి, నగా నట్రా అనండి ..

అందుచేత ఆ కొనేదేదో ఉత్తమోత్తమమైనదే కొనాలనిపించడం సహజం. హెర్క్యులిస్ కొనండి. కంటికి ఇంపైన రూపం, ఎదురుగాలిలో కూడా సునాయాసంగా వెళ్లడానికి అనువుగా తీర్చి దిద్దిన రూపురేఖలు, ఘోయిగా, సాఫీగా సాగిపోయే నడక — ఇవి దీనికి ప్రథమస్థానం సంపాదించిపెట్టాయి. ప్రపంచావధిని 134 పైచిలుకు దేశాల్లో హెర్క్యులిస్‌నే మిగతావాటిమీద ఎన్నిక చేస్తున్నారు.

ఇండియాలో అన్నిటికన్నా పెద్దదైన ఫ్యాక్టరీలో సర్వాంగ సమగ్రమైన సాధనసంపత్తితో నిర్ణీత ప్రమాణాలకు తూ.చ. తప్పకుండా తయారుచేసిన విభాగాలతో హెర్క్యులిస్ సైకిలు నిర్మించబడుతోంది. "స్ప్రా-గ్రేనోడైజింగ్" పద్ధతిలో తుప్పుపట్టడానికి ఏమాత్రం ఆస్కారం లేకుండా కట్టుదిట్టం చేస్తారు. ఆపైన ముమ్మారు ఎనామెల్ చేయడంవల్ల సైకిలు ధగధగ మెరుస్తూ వుంటుంది.

మీ సైకిలు పెట్టుబడిలాటిది— హెర్క్యులిస్ మీ సొమ్ముకి పూర్తి విలువనిస్తుంది.



హెర్క్యులిస్

సైకిల్ కంటె ఎక్కువైనది — అది మీ ప్రాణమిత్రుడు

తయారీ : టి.ఐ. సైకిల్స్ ఆఫ్ ఇండియా అంబత్తూరు — మద్రాసు దగ్గర

IWT-TIC 1145a

సంక్రాంతి లక్ష్మి

తెలుగువారి పండుగ లన్నింటిలో సంక్రాంతి చాలా పెద్దపరేడుగ. ఇది ఇంకా నెలరోజు లుందనగానే మన ఇళ్ల ముంగిళ్ళు రోజు రోజూ చక్కని చిక్కని ముగ్గులతో అలంకరిస్తారు.

పసి బాలికలు ఆ ముగ్గులలో గొబ్బిళ్ళు పెట్టి పసుపుతో కుంకుమతో పూజచేసి 'బంతిపువ్వంటి బావ నియ్యావే, తామరపువ్వంటి తమ్ముణ్ణియ్యావే, మొగలిపువ్వంటి మొగుణ్ణియ్యావే!' అని పాట పాడుతూ చుట్టుతిరిగి ప్రదక్షిణం చేస్తారు. ఈ చివరి పాదం దగ్గిర ఒకరొకరి ముఖాలు చూసుకుని ముసిముసినవ్వులు నవ్వుకుంటారు.

ఎంతటి సామాన్యసంసారు లయినా ఇళ్లకు వెల్లలు వేయించుకుంటారు.

పండుగ పదిరోజు లున్నదనగానే పల్లెల్లో గంగిరెద్దులవాళ్ళు ఇంటింటికీ తిరుగుతూ గంటలు వాయిస్తూ 'ప్రభువుగారికి దండంపెట్టు, పెద బాబులుకి దండం పెట్టు' అంటూ పాటలుపాడుతూ పాత జరీకండువాలవంటి బహుమతుల కోసం చేతులు చాపుతారు. ఇక చెప్పొక్కిన కొమ్మదాసర్ల కోలాహలం మాట చెప్పనే అక్కర్లేదు. !

సంక్రాంతి నాటికి పొలాలలో పంటల కోత లయిపోతాయి. ధాన్యాలతో పురులు నిండుతాయి. అప్పటినించి రైతులందరికి చాలా వరకు ఆటవిడుపే. పల్లెలలో పాలేళ్ల జీతాలు, కమ్మరులు, కుమ్మరులు మొదలైనవారికి మామూళ్ళు ముట్టేది ఈ పండుగనాడే. విద్యార్థు లందరికి సెలవు లిస్తారు. ఆడపడుచులు పుట్టిళ్లకు వస్తారు. పూర్వం ఖైదుల్లో పెట్టిన వాళ్లని కూడా ఈ పండుగనాడు విడిచిపెట్టేవారట.

ముఖ్యంగా నూతన వధూవరుల కిది ముచ్చటయిన పండుగ. కొత్త అల్లుళ్లందరు ఈ పండుగ రోజులలో అత్తవారిళ్లకు వెళ్లి నూతన వస్త్రాలు, బహుమతులు అందుకొంటారు. బావ మరుదులతో, మరదళ్లతో సరస సల్లాపాలతో కులాసాగా కాలక్షేపం చేస్తారు.

ఉత్తరాయణం బహు పవిత్రమయినదని మన సంప్రదాయ వేత్తల అభిప్రాయం. సూర్యుడు మకరరాశిలో ప్రవేశించిననాడే ఉత్తరాయణం ప్రారంభ మవుతుంది. ఈ పుణ్య తిథినాడు సదాచారులు కొందరు పితృదేవతల ప్రీతికోసం దానధర్మాలు చేస్తారు.

సంక్రాతి నాటికి వానలు బాగా వెనకపట్టి మన పల్లెసీమలన్నీ పాడి పంటలతో కలకలలాడుతుంటాయి. ఈ రోజుల్లో గృహాలన్నీ చక్కగా అలంకరించి బొగడ, బంతిపూల దండలతో ద్వారబంధా లలంకరిస్తారు.


ఈ సంక్రాంతి పండుగతో బలిచక్రవర్తి గాథకు చాల దగ్గర సంబంధ మున్నదని పెద్ద లంటారు. వామనావతారంలో విష్ణుమూర్తి బలి తలమీద అడుగుపెట్టిన గాథ అందరికి తెలిసినదే. బలిచక్రవర్తి సంక్రాంతి పండుగలో తిరిగి ఒకమారు భూలోకం సందర్శిస్తాడని ఒక పురాణ గాథ వినవస్తున్నది. ఆ పుణ్యమూర్తి సంస్మరణార్థమే ఈ పండుగ మూడు రోజులపాటు జరుపుతున్నారని అంటారు. నిజానికి భోగి, సంక్రాంతి, కనుము, ముక్కనుము అని ఈ పండుగ వరుసగా నాలుగు రోజులు జరుపుకుంటారు.

పి. భ్రమరాంబ

పలుప్రాంతాలలో కర్షకులు కనుమునాడు, పశువుల సంబరం జరుపుకుంటారు. ఆనాటి ఉదయమే వారు తమ పశువులను వింత రంగుల పూలతో, చిరుమువ్వలతో అలంకరిస్తారు. మెడలలో చిన్న చిన్న గంటల పట్టెడలు కట్టి పసుపుతో కుంకుమతో కొమ్ము లలంకరిస్తారు.

దక్షిణదేశంలో మధుర, తిరునల్వేలి జిల్లాలలో ఒక వింత ఆచారం అనుశ్రుతంగా వస్తున్నది. ఆనాడు ఆ ప్రాంతాలలో వ్యవసాయదారులు ఎద్దుల కొమ్ములు, నగలతో, నాణ్యాలతో అలంకరించి పరుగులు పెట్టించి పోటాపోటీల పందాలతో వినోదిస్తారు. పూర్వకాలంలో యీ పందాలలో నెగ్గిన యువకులనే కన్యకలు వరించేవారట!


తెలుగునాట కూడా ఇలాంటివే కొన్ని వింత వేడుకలు జరుపుకొంటారు. ఆంధ్రదేశంలో ఆబాలగోపాలము ఆనందించే ఇంత గొప్ప పండుగ ఇంకొకటి లేదు. ★



చిత్రకారుడు — కె. ఎస్. మార్కండేయులు (తెనాలి)

ఎప్పుడూఇంతే— 67

శంకర్



[illegible]

పండు వేసంగి—

పట్టపవలే తాతగారు ఘుమఘుమలాడుతున్నారు, ఏమా విశేషం—అనుకున్నాను:

ఒరే నవమదనా—ఏం చేస్తున్నావురా ? అన్నారు. గదిగుమ్మంలోకి వచ్చి—

చేత నున్న పుస్తకం దాచేయబోయినాను. కాదూ, వారికి చిరునవ్వు వచ్చింది : వచ్చి సరసను కూర్చుని, మునివేళ్లతో చెంపలు పుణికి—భార్య పురుడోసుకునేందుకు పుట్టిన యింటికి పోంగానే, పుస్తకం చేపట్టావా, నాన్నా ! —పరాసుదేశం బోసిబొమ్మలు — కాగితపు దళసరి, తళుకే కాని, కాలక్షేపానికి పనికివస్తాయా—!

ఒరేయ్ మన దేశం రత్నగర్భరా !— రా పోదాం !

'ఎందాకా ?'

అందాకా !—నేరని విద్దెలు నేర్చుకునే వయసు తీరని కోరికలు తీర్చుకునే వయసు—ఒంటరి పానుపుమీద అసురుసురంటూ, కాగితబ్బొమ్మల కాళ్లా వేళ్లా పడితే—కలిసొచ్చేనా ?—

పలుకరిస్తే—పలికే చిలకలుండగా, పావుతావు కాగితంతో ప్రణయా లేమిటిరా ?—

తాతయ్యా ! యివి బూతుబొమ్మలు కావు! మహాశిల్పుల కళాఖండాలు :—

అయితే అలా బైండు పుస్తకంలో పడి ఉండనీ : కళ అనేది—కంటికి కట్టాలి—తక్షణం—వంటికి పట్టాలి : అంగలార్చితే వచ్చేది కాదురా ఆనందం—అంకెకు దార్చి అనుభవంలో అందుబాటు చేసుకోవాలి !—మనం పడుచువాళ్లంరా భడవా !—ప్రత్యక్షం మనకు ప్రమాణం—కావలసినన్ని కళాఖండాలు, కనుచూపుమేరలో కలవురా—యిహ కదులు :

కదలక తప్పింది కాదు!

ఎక్కడికని అడిగేందుకు ధైర్యంలేదు

నీరెండ పొడ ఉండగా, ఆ చెరువుగట్టున బండీ దిగినాము. మామిడితోపు అద్దరిని వూరు, చూచాయగా కనపడుతూంది:

బండీ కట్టుకొచ్చిన పెద్ద పాలేరు, వూర్లోకి వెళ్లాడు: తాతగారు తీరుబడిగా స్నానం చేసి అనుష్ఠానం తీర్చుకుని, మడి మూని, యథోచితమ్మైన తీవితో, మెట్లమీద కూర్చున్నారు:

దీన్ని కామావధాన్లగారి కోనేరంటారు : తెలుసునా.

ఊహూ—

వారు, మా ముత్తాతగారన్న సంగతి తెలుసునా—

నీవు, చెప్పగా విన్నాను:

పేరు చెప్పాను కాని, ప్రతాపం చెప్పలేదురా—చెప్పనా—నీవు యీ యీడున ముఖ్యంగా తెలుసుకోవలసిన హంశం!

ఆయన నవద్వీపంలో, చదువుకున్నాడు—మిథిలలో మెరుగులు దిద్దుకున్నాడు—వారణాసిలో చండప్రచండులచేత చిరంజీవన్న అనిపించుకున్నాడు. అయిదు సంవత్సరాల పాటు, కాశీ నరేశుల పండిత మండలికి మకుటాయమానులై ఉన్నారు

అంతట స్వదేశానికి వచ్చారు.

వచ్చిన కొత్తలో,—

దేశంలో, మహారాజుల దివాణంలో, సంక్రాంతి పండుగలు, వేసీవేయని వేడుకలు—

ఆనాడు కూడ, పండితసదస్సు, వేయికి పైగా దుశ్శాలువలు కోటగుమ్మం తొక్కినవి.

ఈ కామన్నకు పట్టుమని బ్రహ్మవర్చస్సైతే ఉన్నది కాని, పైన సేలువ లేదు—కనుబొమ్మల గర్వంలేదు. దండలు తిరిగి ఉన్నవి కాని, దర్పం లేదు—తనంతవాడు లేడన్న తలవిసురు లేదు. గుమ్మంవద్దనే ఆపేశారు. జందెపుపోచ చూసి, దొడ్డిసంభావనకు పొమ్మన్నారు.

పొమ్మన్నవాడి వంక, కామన్న అహా !—అన్నట్లు చూశాడు. అవతలివాడు జబ్బ పట్టుకున్నాడు: పట్టుకున్నాడో — పదిబారల దూరాన పోయి పడ్డాడు—

ఏం రభస అయేదో కాని, యింతలో అచ్చన్న దీక్షితులుగారు అక్కడికి రావడం జరిగింది. ఈ అచ్చన్నగారి దగ్గిర చిన్నప్పుడు కామన్న రామ శబ్దం ప్రారంభించి, సాగక మానేశాడు—మానడానికి కారణం ఏమో తెలుసునా—

యీ కాకికూతలు నే కూయలేను—కావ్యపాఠం మొదలుపెట్టండి అన్నాడుట.

నోరుమూయరా—అన్నారుట వారు.

నోరు మూసుకుంటే చదువొస్తుందా, ముక్కు మూసుకుంటేక మోక్షం వస్తుందా,—అన్నాట్ట యితగాడు: అంత కోపధారీ అట్టే నవ్వి—ఒరే కాముడూ, దైవం రక్షించాలి గాని, నీవు తార్కికుడ వయ్యేవురా ! నీ వైనంలో ఆ ఝుడితి ఉందిరా, కనుపాపల్లో గంభీరిమ కద్దురా — నీకు చదువు చెప్పగల సత్తా నాకు లేదురా—పో—దేశం మీదికి పో—దేశాలన్నీ జయించుకురా — అని—వెన్నుచరచి వారట కామన్న కదిలాడు:

ఆపైన భారతమంత గ్రంథం ఉంది: అది మరోమారు:

అదిగో, ఆ అచ్చన్నగారూ, వీరూ, అన్నేళ్లకు అక్కడ తారసిల్లారు: ఆ దుడుకుతనం చూసీ చూడంగనే పోల్చుకున్నారు. కామన్నా అని కౌగలించుకున్నారు: బుగ్గలు నులుముతూ:—

ఏమిరా, యింతకాలం ఎక్కడున్నట్లు ?

దేశం మీద—

ఏం నేర్చినావురా—? యీ విద్యేనా—? అక్షరం ముక్క ఏమన్నా అబ్బిందా ?—

అబ్బింది—జబ్బపుష్టి !—

అరి విప్రబాసీ, పరువుగా, నోరు పెట్టుకుని బ్రతుకుతా వనుకుంటినిరా!—పైన సేలువతోకంట పడతా వనుకుంటినిరా !— ఆయెపో !—ఏమైనా మెట్టుకు, నా శిష్యుడివే—దా, సభకు పోదాం—

సభలో సంతర్పణ మాకు కాదు—మాది దొడ్డి సంభావన !—

అని ఎవరన్నారు ?—

ఆ జలపాలరాయుడు—

అన్నాడో — పడ్డాడో — రాయడూ, మన సులో చెంపలు వేసుకుని, మావాని పాదాభివందనం చెయ్యి —.

సభలో,—

కామన్న గురువుగారికి వెనుకగా నిలుచున్నాడు.—వారిది — అగ్రాసనం—

మహారాజు విచ్చేసి, సభకు మ్రొక్కి ఆసీనులు కాంగా,—ఆ సంజె ప్రొద్దుకు,—

ఒక బక్కపలచని పడుచువాడు, తురక తీవివాడు, చిగురుమీసంవాడు, తులసిమాల మెడ దాల్చినవాడు, లేచి నిలుచుని, తన బిరుదుల ఏకరువు పెట్టి, గురువుల పేరెత్తి, దీటైన పండితులను, తనతో మాట కలుపమని, తన్నోడించగలవా రున్నారా అని గద్దరించి, సభాపతికి హెచ్చరింపుగా చేజాపి, అంగుళితో ప్రశ్నించినాడు—

అచ్చన్నగారు, వాని ఆగడము చూసి, కామన్న వంక జూసి, వీ డెవడో రాలుగాయిరా, అనంగా,

ఆకాయను యిట్టే రాల్చేను. అనుజ్ఞ నీయండి—

అభాసు చేయవుగద—

సభ మరింతగా, భాసించేను—చిత్తగించండి !—

అనగా—అచ్చన్నగారు తల యూచి ముగుదల ఊయగా,

కామన్న, ముందుకు వచ్చి, పండితులకు మ్రొక్కి—గీర్వాణంగా—

ఈ ఆయుష్మంతుడు—వరుస తప్పిన వారయోషిన్మృదంగము!

విద్దెలకు పరువుగా వినయమునేర్పిన పెద్దలు

మల్లాది రామకృష్ణశాస్త్రి

ప్రోల ధిక్తాం అని మ్రోగినది: ప్రభువు లవ ధరించినారుగద !—(మహారాజు మోముబోమముడి ఖ్యైనది)

వేలు ! ....

ఈ విద్వాంసునితో, తలపడగల సరసత, సభలో ఛాందసులకు — లేదు—వీరందరూ మడి గట్టు కొన్నవారు — వేదచోదితమ్మైన దుడుసుతనం కలదేమో కాని, తారతమ్య మారయక నోరు పార వేసుకొనుట వీరి తరముకాదు. ఈ—వీరి విద్యతో వస యెట్టిదో నిగ్గుదేల్చగలవారిని ప్రభువులు రప్పించవలె—

వా రెవరనేరా—'కౌగిట నెనుబది నాలుగు విధముల గరడీలు గరపు' అలనాటి ప్రౌఢనాయకి, సహస్రసమాసజీవి, గుడిసేవ సభారంజని— కామాగమాధ్యయన పాటవమున వీ రెంతటి గడితేరినవారో, ఆమె తమ సముఖమున తలస్పర్శగా పరీక్షించును గాక: అలదానిచే భళా యనిపించుకొనేనో, మన పండితులు సేలువలతో వీనికి పాను పమరించేరు. కామశాస్త్రము గోష్ఠికి రాదగిన విద్య యని ఆదిశంకరు లంగీకరించినదే—యింక ఆలస్య మెందులకు—ప్రభూ!

అందులకు దీక్షైన సభాపతులు—దేవరవారే—

అచ్చన్న దీక్షితులవారు, వాకోవాక్యమున మేలుబంతి కాని, యిందుల, యీ వయసున, కోవిదులు కారు! దక్షత కల తావూ విశ్వైల, కయ్యము, వినోదముగ, అవధరించి, కృతకృత్యు లైనవారికి, మెచ్చి, ఉపద లిచ్చేరో ఉలుపా లిచ్చేరో, ...

అన్నాడయ్యా!

ఆసళంగా, పండితు లందరూ, పట్టలేక సేలువలు సవరించుకుంటూ చిరునవ్వులు నవ్వుకున్నారు.

ఇహ, సభా లేదు, శాస్త్రార్థమూ లేదు!

కామన్న తెలిసి అన్నాడో, తెలియక అన్నాడో కాని, మహారాజావారు బుజాలు తడుముకున్నారు.

వైనం ఏమంటే .... వారికీ నీలాగే కళాభిలాష, ఆ అభిరుచి, ఉడ్డోలం.

మనం ఏదో తగుమాత్రం సంపన్నులం గనుక బోలెడంత విలువ పెట్టి, బొమ్మలున్న గ్రంథాలు కొనుక్కొంటాము. వారు వేసీవేయని సిరులున్నవారాయెను, తమకము అగ్గలమయే తరుణాన సజీవప్రతిమలతో రాసవినోదములు ఏర్పాటు చేయించడం, పదములొత్తువారి సరసను ఏకాంత గోష్ఠిలో ఆనందించడం కద్దు: అది తరతరాలుగా వస్తూ ఉన్నదే: అది మన సీమలో పండిత పామరులు యావన్మందికీ ప్రాత్కవిలే—

మహారాజావారు, ఏమాట కామాట—రాచపుట్టువు కదూ, మనుసు రగులుతున్నా, పైకి శాంతంగానే చేయెత్తి అప్పటికి సభ చాలించి ఏకాంత మందిరానికి దయచేశారు!

సభలోవారు సభలో మిగిలారు!

అచ్చన్నగారు ముక్కుమీద వేలువేసుకుని, హన్నా! ఎంతపని జేస్తివిరా! అన్నారు!

ఆ గౌడబ్రాహ్మణుడు, యినుమిక్కిలి తల విసురుగా యిచటివారి పాండిత్య మింతింతయేనా.



అన్నాడు—అనడం తడవుగా కామన్న చరచర వాని మీదికి పోయి, భుజములమీద చేతులు వేసి వాని చెవిలో గుసగుస లాడినాడు—వాడు అమాంతం కామన్నకు సాష్టాంగపడినాడు!

ఏల ?—

కామన్నను అప్పటికి, వాడు గురుతించాడు.

ఇంతకూ వా డెవరని—నవద్వీపంలో కామన్నతో కలసి చదువుకున్నవాని శిష్యుడు! కామన్న వారణాసిలో ధర్మాధికారిగా ఉంటూన్నపుడు మహారాజదర్శనం చేసి, విద్య చూపి అచ్చటి పెద్దలను మెప్పించి, సమ్మానము లందినవాడు! వాని బిరుదావళిలో కొన్ని, కామన్న కటాక్షించినవే, వాని వ్రేలి రవల ఉంగరము కామన్న మెచ్చి యిచ్చినదే.

పైన సేలువా, పటాటోపమూ లేని యీ అవతారములో, అతగాడు కామన్నను పోల్చుకోలేకపోవడంతో, ఆ రవంత రభసా జరిగింది.

చిగురుకు సద్దు మణిగింది! ఆతడు, ఆ పండితులు, తమ పరువు సలక్షణంగా దక్కిందని ఆనందించారు! కామన్న కలుగజేసుకుని ఉంటే ఆ గొడుడు ఆగేనా ? వాని కా తీరున వినయము గరపి, తానూ, తన సీమ పెద్దరికము నిలిపినాడు.

ఇంతలో, అచ్చన్నగారికి వర్తమానం వచ్చింది—ప్రభువులు, ఏకాంతమందిరంలో ఉన్నారు—తక్షణం దర్శనం యిప్పించమని శ్రీవారి సెలవైందీ, అని—

అచ్చన్నగారు—అడుగు ముందుకు వేశారు—కామన్న ఆపేశాడు—

ఆ వచ్చినవానితో—యిలా అన్నాడు—

మహారాజా పరువుకు పుట్టలేదా—ధర్మము పట్టం కట్టలేదా ? తాను పరగణాకు ప్రభువు కాని, పండితుల పాదధూళి శిరస్సున దాల్చి వర్ధిల్లవలసినవాడు కాదా ?—యింతకాలమూ సుఖముగా నున్నది— వీరి దీవెనల బలిమిని కాదా—చతుర్ముఖుడు కానీ, శారదాదేవి కానీ, పండితులను విద్యాతపస్సంపన్నులను చులకన చేసిన, వారికి పూవూ పత్రీ పుట్టవే—మన రాజెంత ! బ్రాహ్మణ్యము కన్ను దెరచిన ఒక్క చిటికెలో త్రోసిరాజా కాడా !— పండితసభ విడిచిపోయి వాడే, — ఎవరి అనుమతి కోరినాడు?—పో—గురువుల దర్శనభాగ్యమే అపేక్షించినవారైతే, వచ్చి పదములంటి ప్రసన్నుల జేసికొనమను !—అని తరిమివేసినాడు—అందరూ కలవరపడినారు, కాని ఎవ్వరూ కామన్న కెదురాడరైరి.

పండితు లందరితో కలసి కదలిపోయి—వేణుగోపాలస్వామి ఆలయంలో యిష్టగోష్ఠిలో ఉండగా—పక్కా ఝాముకు, పెద్దలంటే భయభక్తులున్న ఓ ఉద్యోగి నురుగులు గ్రక్కుతూ, అక్కడకు వచ్చిపడ్డాడు! సభలో కామన్న అన్నమాటలు చిలవలు పలవలుగా మహారాజుల చెవిని పడ్డవి—వారు కణకణలాడుతున్నారు. ఆ బ్రాహ్మణుడి సిగపాయ దెచ్చినవారికి పది సంచుల వరా లిస్తామన్నారు! కాని, కోటలో బంటెవరూ ముందుకు రాలేదు: పాలెం వర్తమానం పంపారు, సాటిరాచవారికి—గడియకో, రెండు ఘళ్ళకో వారు వచ్చిపడగలరు—యీతణ్ణి బ్రతకనీయరు—ఇక బ్రాహ్మణీకానికి ఉప్పూ, పత్రీ పుట్టదు...

వినివినడంతోనే ఉన్నవా రందరూ గగ్గోలైనారు. కామన్న చిరునవ్వుతో,-అలాగా-అన్నాడు.

వచ్చేవా రెందరు ?

ఒకరో—యిద్దరో—

అంతేనా—మన కొక్క వేలిక్రింద !

వారిచేత కత్తులుండేవయ్యా !—

రాచవారిచేత కత్తులు కాక, గరిటె లుంటవటయ్యా—రానీ—హుటాహుటి యిక్కడికే వచ్చేరు కద !—

ఉహుఁ—ఆలయములో అంతకు తెగించలేరు! బయట ఏ క్రీడనో నక్కి ఓ వ్రేటు వేసేరు!

మంచిది—నే నిక్కడ ఉన్నట్టు వారికి రూఢిగా తెలుసునా, వర్తమానం అంపవలెనా,

ఇక్కడికే వచ్చిపడతారయ్యా—

అయితే మా బాగేనయ్యా !—

అచ్చన్నగారు కామన్నను కౌగలించుకుని, నాయనా నిన్నెట్లా రక్షించుకొందునురా !—అని వాపోవపోగా — కామన్న పెద్దపెట్టున నవ్వి—గురువుగారు—మీ ఆశీస్సు నాచేతి వజ్రాయుధము — వచ్చిపడేవి — మీసములు పోతరించిన సొరకాయలు—నరకడం ఒక లెక్కా !—

మనము పరశురాముని కోవలో వారమే—కాని, రాచవారిని నిశ్శేషము చేయము.

మీకా భయము అక్కరలేదు—యీ ఒక్క తప్పూ కాచేము—

ఒకరు సైకిల్ మీదనుంచి పడిపోగా తీవ్రమైన గాయాలు తగిలాయి. బాధ పడుతున్నాడు.

ఆదారినపోయే పెద్దమనిషి ఆతని దగ్గరికి వెళ్లి "నువ్వు చాలా అదృష్టవంతుడివోయ్" అన్నాడు.

"ఎందుచేతనో సెలవిస్తారా" అని కోపంగా అడిగాడు బాధలో ఉన్న మనిషి.

"ఏమీలేదు. ఆస్పత్రి ప్రక్కనే ఉందిలే."

బవిరిశెట్టి సుబ్బరాజు (నవశేశ్వరం)

గాయత్రి మనకు రక్ష—ఆ తల్లిమీద కత్తులు దూయగలవా డెవడండీ !—

అన్నాడు—

అంతలో పండితులందరూ ఒక్కుమ్మడి ఉవ్వెత్తున లేచి, నడుముకు అంగవస్త్రము చుట్టారు!

అచ్చన్న బాబూ—యిందరముండి యీ చిన్నవాడిమీద యీగ వాలనిచ్చేమా ?— యిద్దర కానీ, ఇన్నూరు కానీ, ఈ చాయలకు వచ్చారో, కలికంలోకైనా కనబడేరా ?—అన్నారు.

కామన్న వా రందరికీ మ్రొక్కి—తమకు తామసం జెల్లదు; యీ చిన్నవాడిమీద ఆ యీగలు వాలవు—చూచేరుగా—మీరు కలుగజేసుకోవలసిన గండకత్తెర కాదిది—అంటూ అనునయించినంతలో—

రాచవారు, రానే వచ్చారు. చీకటిమాటున, దొంగచాటున, కాదు—రొమ్ము విరుచుకునే—దివ్వటీలుగా ....

అచ్చన్నగారిని పేరున పిలిచారు. వారు ముందుకు దయచేశారు...వెనువెంటనే ఉన్న కామన్నను నిర్దేశిస్తూ,—ఆ ఆతతాయి సిగ ఉత్తరించి తమకు అందజేయమన్నారు! లేదా, అని, హుంకరించి చేతపట్టినవి—ఝుళిపించారు! కామన్న మెరుపల్లే గాలి యీతగా, దూసుకునిపోయి, వారిచేత కత్తులు అంకించుకొని, కత్తి మొన మోపుగా పల్టీ కొట్టి ఎగిరి నిలుచుని, కత్తులు దూరంగా విసిరేసి,—ఆ జోడుమీదకు విడిసిపడి, రెక్క లొడిసిపట్టి, గోట మీటినట్లు, వా రిద్దరినీ అచ్చన్నగారి పదసన్నిధికి ఎగజిమ్మినాడు. రాచచోదులు, బెల్లపు అచ్చులవలె, పడినారు—కామన్న, వారి వెన్ను తట్టి లేవనెత్తి,—ఏలినవారి బుద్ధి క్షణికంగా చంచలించి వాయి పులుమేసింది పో, మీకు విచక్షణ అక్కరలేదా ?— అన్నదాతలు కనుసన్నగా ఆజ్ఞాపించినారని ఆగడము చూపవచ్చారా ?— అమాయకులారా—మీకు మీసలు ఎగదువ్వంగనే యీ విడిమేలపు రోసమబ్బెనా, యీనాటినుండి, మీరు, మీ వంగసమువారు, మీసముపై చేయి వేయరాదు—యిదే మీకు శిక్ష, యిదే మీ ఐదువల కుంకుమకు కలకాలము రక్ష—అని మందలించి, మహారాజులు ఎచ్చట, ఏ తీరున ఉన్నదీ, వారివలన తెలుసుకుని ఆ తావుకు ఒక్క ఉరుకున పోయినాడు—

ఆ తావు ?—

ఉద్యానంలో, పూలపాన్పు, కలపమలందిన మేనితో కన్నుల మత్తుతో, శ్రీవారో మల్లెల మాలను ఒడిసిపట్టే సన్నాహంలో ఉన్నారు : ఆ చిన్నది ససేమిరా .... ఏలినవారూ, బ్రాహ్మణుడి సిగ ఉత్తరించమని సెలవిచ్చినారట— ఇంత పాపం ఏనాడూ మన సీమలో పుట్టలేదు—మీరు కులానికి మచ్చ దెచ్చారు— మీ పెద్దల బ్రాహ్మణభక్తిని, గంగపాలు చేశారు! మీరు భ్రష్టులు,,—నేను వెలయాలినే కాని, కులమున్నదానను—ఈ కన్నె, మీకు లోకువ గాదు !—

ప్రభువులు, బూతుకూతలకు దిగినారు—నిన్ను మా దండుకు ఎరగా వేస్తానన్నారు. దాని గొంతు పట్టుకుని, చీ పోవే అని విసిరేసి, తాము తూలుతూ పానుపుమీద పడినారు: అంతలో ఆ చాయకు వచ్చిన కామన్న, ఆ చిన్నది, పడిపో

కుండా సందిట పట్టి నిలిపి—మహారాజుల సరసకు జేరి, వారి ఎగు మీసం, క్రిందికి దువ్వి,—ప్రభూ! అని పలుకరించగా, వారు, రవుద్రంతో పిడికిలి బిగించి, కామన్న మొగానికి గురి చూడగా, అతడా చేతిని ఒడిసి పట్టి, ఎడమచేయి రొమ్ముమీద వేసి శాంతించవలె అనంగా, వారు, భటుల కోసం పొల్లు కేక పెట్టపోగా—ఆ చేయి వారి పెదవుల కదిమి, మీ గొంతు, మోటవానిచేత బడ్డ మొగలిరేక, నులుముట మా కలవోక—

కాని, మీరు కలకాలము, నీతివంతులై వర్ధిల్లుట మా అభిమతము. మా ఆశీస్సు—ప్రభూ! మీ కరములు మా పాదము లంటి ఆయుర్భాగ్యమందవలెనే కాని, మాపై కాలుదువ్వ నగునా?—

బ్రాహ్మణుని సిగ—వేదశిఖ—దానిని మీ కులము వా రహరహ మారాధించవలె—మీరు శలభములు కారాదు—యిచ్చి పుచ్చుకొను నేర్పు మా కులమున కున్నది. మీకు ప్రాణదానము చేసినాము. మాకు మీరు వాగ్దానము చేయవలె.

మీ వంశము ధర్మరక్షణకు పేరు ప్రోగవలె. బ్రాహ్మణభక్తితో వాసి కెక్కవలె.

కామన్న కుడిచేయి జాపినాడు. ప్రభువులు తమ కరపల్లవము నందుంచి, 'యిదే మా పెద్దల మీద ఆన' అన్నారు బుద్ధిగా—

మీరు వస్తుత: బుద్ధిమంతులే, కాని, రాజసమై' రావణుని, కుక్కుటపుతనము మిమ్ము కమ్మినది. పోనిండు. ఉభయుల గండము గడిచినది—

ఇంక మీ పెద్దరికము నిలుపుకొనవలె— యీ చిన్నదానిని మీ కోడలుగా చేసికొనండి.

కులము చాలదనుకొనేరా—ఆపన్నను రక్షించి నప్పుడే అది నాకు కూతురైనది! యిందుకోసము, యీ బ్రహ్మచారి గృహస్థయి కన్యాదానము చేసెను! అభ్యంతరమా?—అన్నాడు కామన్న.

తమ ఆజ్ఞ అయినది కదా! అన్నారు శ్రీవారు.

అప్పుడు—కామన్న ఒక యింటివాడైనాడు. కన్య ఎవరు—ఆ గౌడ పండితుడి సోదరి—అచ్చన్న దీక్షితులుగారు కన్యాదానం చేసినారు—

ఒరే నాన్నా—మన యింటికి తెలుగుపిల్ల కోడలుగా రావడం, నా హయాంలోనే ఆరంభం—మా తల్లి మహారాష్ట్ర దేశపు ఆడుపడుచు, మా ముత్తవ—ఒక కాశ్మీరకుసుమం—సరే కామన్న గారి యిల్లాలు: నాయనా, ఆనవాయతి తప్పకుండ నీ బిడ్డలకైన దేశంమీద సంబంధాలు చేయరా—

అది మునుముందు చూసుకుందాం, మళ్ళీ కథలోకి వద్దాం—ఆ కామన్నగారు, ఆ చిన్నదానిని, తానన్న మాటమేరకు, సాలంకృత కన్యాదానం చేశారు; ఎవరికి,—ఏలినవారి, రెండో కుర్రవాడికి—వేణుగోపాలుడి ఆలయంలో వివాహం జరిగింది:

ఆ కుర్రవాడు, భార్యతో కోటలో ఉండలేదు: ఈ గ్రామంలో సౌధం నిర్మించుకుని కాపురం చేశారు: కామన్నగారు— యీ గ్రామంలో గోపాల ఆలయం నిర్మింపజేశారు! వారు చుట్టపు చూపుగా వచ్చినపుడు, స్నానాదికములకుగాను,—యీ తటాకనిర్మాణం జరిగింది.

మనం యింతదూరము వచ్చిం దెందుకు—ఆ స్వామి దర్శనానికి. ఆ లోగిలిలో నిత్యకళ్యాణిగా నివసిస్తూన్న—వృద్ధావారి దర్శనానికి—

ఇక బయలుదేరాము: ఆ గుమ్మము సమీపించ గానే,—యిద్దరు బాలలు పూర్ణకుంభములతో ఎదురైనారు: అడుగు ముందుకు వేయగా, మరో సుందరి ఆరతి పట్టినది: యింకను ముందుకు పోగా,—ఆ అప్స,—కైమోడ్పుతో, ఎదురై,—తాత గారి పదము లంటి, కైదండ యిచ్చి, లోనికి సాగినది:

ఆసీనులమైనాము: వీణలు మీటుతూన్న జవ్వనులు, వాదన మాపి చేయెత్తి మ్రొక్కినారు.

కృష్ణా ! వీడు, మా మనుమడమ్మా !—

అలాగే !—పొత్తిళ్లలో ఉండగా వీరి దర్శనము చేసుకున్నాను: ఆనాటి కీనాడు, స్వామి దర్శనానికి తాతగారి వెంట దయచేశార్గా, నాయనా—

మన వేణుగోపాలుడు కడు చక్కని స్వామి కదయ్యా—మనసులు తన కైవసము చేసిన కన్నెలకు, వయారమూ ఒద్దికలూ, లేతదనం, నీతిదనం—కలకాలమూ నిలిచే వరాలుగా వారు యిచ్చేరయ్యా, వారి వేణురవళి, మాకు గానం నేర్పేను. వారి మువ్వల సవ్వడి నాట్యం నేర్పేను. వారి చిరునవ్వు మాకు బాసికము, వారి కొంటెచూపులు మాకు మంగళసూత్రము—ఆ వెన్నెల చిందులమయ్యా, మేము—మా కన్నులకు అలవాడు పండువేనయ్యా—అని,

అయ్యగారూ, స్వామి దర్శనానికి, తరలి పోయేమా, తాము ముందు నడవేరా, అని మనవి చేసి,—నాయనా, ఒక్క క్షణములో ఆయత్తమయేమయ్యా—అని, లోనికి పోయినది—

ఆ కన్నెలందరూ, తాతగారికి చేరువగా వచ్చి నిలచారు. తాతగారు ఓ చిన్నదానితో,

ఏమే నవమల్లికా—మా మనుమడు చక్కనివాడందమా, అనగా—ఆ వయారి,

మోమందము—కేమి గాని, కన్నులలో రసికత వన్నెలు తేరలేదే—అన్నది.

వెలది వెన్నెల

మరో పడుచు—ఓరచూపీసుకుమారుడు నేర్వలేదో—అనంగా,

మరో ప్రోడ—చిరునవ్వు లెన్ని తీరులో, మీ చిన్నవాడు వల్లెవేసెనో,—అని కనులార ప్రశ్న సేయగా

మరో నేర్పరి—కనుసైగలతో పలుకరించు అలవాటు,—మవునముగా పలుకాడు నేర్పు వీరికి వెన్నతో పెట్టలేదో—అని మోవిని లాస్య మాడించగా,

యిలా, యిలా ఆ బాలలు నామీద పూవుల బాణాలు వేశారు!

తాతగారు—అమాయికంగా, వీడిని, మన బడిలో చదువవేయలేదమ్మా— వీడి బాలుణ్ణాయిన మన కోవకు తేవలె—అనగా,

మువ్వలు మ్రోగినటుల కిలకిలలాడి వారగా లోనికి పోయినారు:

తాతగా రందుకున్నారు:—చూశావ్రా, యీ కృష్ణాజీ ఉన్నదే—మన కామన్నగారి చేతి చలువను వెలసిన వంశంలో చిగురుకు మిగిలినది. పారంపర్యంగా, ఆనాటినుండీ యీ కులానికి రాచపొత్తే—యీమెను పొరుగు జమీందారులు చేపట్టారు. కాని వంశాభివృద్ధి కాలేదు—అని కించపడలేదు—యీ భవనము, ఏనాడో,కన్యా గురుకులమైనది: ఈ బాలలందరూ రంభాకులమువా రనుకునేవు—నేను పలుకరించిన చిన్నది బ్రాహ్మణుల ఆడుపడుచు: పేద కుటుంబములలో ఉన్న కన్యా రత్నములను వెదకి తెచ్చి విద్యాబుద్ధులు నేర్పి—చక్కని శిక్షణ యిస్తూ—జీవితం గడుపుతున్నది. ఈమె—

పూర్వం పాటలీపుత్రంలో యిలాటి విద్యానికేతనము లుండేవట! అయినయింటికన్నెలు కూడ, అచ్చట ఒద్దికలు నేర్చుకునేవారట.

లలితకళలే, లోకమునకు రక్ష—అనీ,

కన్నె లందరూ, ఆట పాటలు నేర్చి, విద్దెలను దైవమున కంకితము చేసిననాడు—ఇంటింటా నిత్యకళ్యాణము కాదా అనీ, ఆమె అభిప్రాయము. మన అభిమతమూ అదే....

ఇంతలో ఆమె తిరిగి వచ్చినది: అందరమూ ఆలయమునకు వెళ్ళినాము:

గోపాలుని సన్నిధిలో వీణెలు లాలనగా తానములు మీటినవి: మువ్వలు మందమేలములుగా కువకువ లాడినవి: అంతటా అలముకున్న అగరు జవాది ధూపము మైమరపు ఘటించినది: బాల గోపాలుని మోమున మల్లెలు విరిసినవి. చివురులు కదిలినట్లు, చిలుకరెక్క లాడినట్లు,—కొదమ తుమ్మెద ముసిరినట్లు,—తంబురనాదము, రవళించగా,—పండుతనము,, నిండుతనము వెల్లివిరియంగా—ఆ గానము నా చెక్కిలి పుణికినది—

గోరు వెచ్చని వెన్న లిందరా—
గోరుగోరు మీగడ లిందరా—
గుమ్మపా లిందరా .....
కమ్మని తాయిల్ల మిందరా—
యిందరా—
నందయగారి బుల్లి తువ్వాయీ—అందరా॥
అందెలు మువ్వలు సందిట దండలు
రవ్వల మొలనూ లిందరా—
పిల్లంగోరు చెన్నాకోలు
బన్నసరా లిందరా—
యిందరా—
గొల్లలవాడలో కొంటెకోణంగీ—అందరా॥
వెన్నెల నీడ—వేడుకమీర
సన్న జాజుల పానుపుమీద

పావుర పలుకు పలికేరా—
కోరిన తీరున కులికేరా—
పచ్చకప్పురపు తమ్మల మిందరా—
యిందరా—
కొమ్ములవాడి కోడె నాగన్నా—అందరా!!

ఆ గానములో, మబ్బును మెరుపు కమ్మిన ట్లయినది—

గోపాలమూర్తి పారాడు పాపడైనాడు—
లాలనగాపిలిచేది—వాడలో గోపిక—
అవ్వాడు—పసిబాలు డైనాడు—
చేరదీసేది—యశోద.

వేణుగానలోలుడు వేడుకకాడైనాడు. సరసాలకు మంతన మాడేది — పొన్నమాను నీడను నిలిచిన ఒక జాణ—

కృష్ణాజీ మోమున, యిన్ని కళలు తిరిగినవి. ఇన్ని వన్నెలు యిన్ని మన్ననలు మెరసినవి—

కన్నా — నిన్ను చూచిన కన్నుల వెలది వెన్నెల కలకాలము నిలిచేను.

నిన్ను కొలిచిన చేతుల, చివురుల సును మెత్తం దనమె అనుదినము— పసమీరేను.

నిను తలచినమనమే, నిను సేవించిన తనువే.— శాశ్వత యవ్వనమయ్యేను:

వెన్న దిన్నవాడా—నీ చక్కందనమే— కామనల కన్నెతనము.

నిన్ను కొలుచు వరము మాకు యిటులనే ప్రసాదించవే

మమ్మాదరించవే—మారుని కన్నవాడా—!

అని విన్నపాలు పలికినదై, కృష్ణాజీ సెలవిచ్చింది కదా— "నాయనా— అందము యీ నల్లవాని కన్నుల నున్నది: అలవిమాలిన ఆనందము వీని సన్నిధి నున్నది: నాకులాన కన్నెను దయ జూచినవాడు, రంభాకులమువారి విద్దెలకు వెలితనము బాపి ఐదువతనము అనుగ్రహించినవాడు. దైవానికి మించిన దైవం—మన కులముస్వామి— కామావధానులుగారు: వారి నిత్యదీవెన—వారి శాశ్వతప్రసాద రూప మీ గోపాలమూర్తి—మనసున చిరుమబ్బులు కమ్మిననాడు—తనువు, తనదే పెత్తనమున, దారికి వైదొలగించ యత్నించిన నాడు—తాతగారి మనుమడా, దైవం మెచ్చే బాలుడా, ఈ గోపాలుడు నీ సంగడికాడై సరస నుండేనయ్యా—కోరిన ఆనంద మిచ్చేనయా—తీరని కోరిక తీర్చేనయా—అని దీవెనగా అన్నది: నా కనులు ఆ అవ్వకు మ్రొక్కినవి ....

తాతగారు నన్ను కౌగిట జేర్చినారు: వేయి జన్మలకు సరిపడిన చదువు చెప్పిన ఆ వేదమయునికి వీని మనము పూజాసుమమైనది...

★




ఊహామాలిక

కుమారి కె. లక్ష్మి

పూ జాతాల కమనీయ పరిమళమ్ము
మల్లె మొల్లల స్వచ్ఛతల్ మనసునింప,
పరుగులిడిపోయి ప్రసవాల ప్రోగుజేసి,
మాల లల్లితి బాల్యాన, గలుగుగంటి.
నీలిజలదాల అంచుపై దేలిపోయి,
మానసపథాన నూహాసుమాల నేరి,
కోరి యోచనా సూత్రాన గూర్చుకొంటి,
పరిమళమ్ములు నిండె నా భావవీథి.
మనసుపడి కూర్చుకున్న నందన సుమాలు
అర్థరహితమ్ములౌ నూహ లందురంచు,
ఒకరికేరికి దెలుపక విరులసరము
దాచుకొన్నాను మనసులో దీప్తితోడ.
ప్రకృతిలో రేగ నెప్పుడో ప్రబలఝంఝ
జాలివీడి ప్రభంజనస్వామి రేగి
కంటకింపయిదోచు నా మింటిపూల
మాల నింతలో గిరికీల దూలజేసె.
మనసు గైసేసికొన్నట్టి మాలవాడ,
గుండె బరువెక్కి జలములు కురిసె కనులు;
వ్యథితమౌ హృదయాన భావాలు వాహినులయి,
దేవదేవుని పాదాల దృష్టినిలిచె.

కవితా కింకిణి

బహుమతి పొందిన కవిత



రాష్ట్రగవర్నర్ శ్రీ భీమ్‌సేన్‌సచార్ ఇటీవల రాజమండ్రి వెళ్లినసందర్భంలో
ఆస్థానకవి (కీ. శే) శ్రీపాదకృష్ణమూర్తిశాస్త్రిని కలుసుకొన్నారు.

న్యూఢిల్లీ లేఖ

శ్రీ కృష్ణ

అనర్థాలకు హేతువైన '60 కి వీడ్కోలు: నిర్మాణాత్మకృషికి '61 లో దీక్ష

1960 సంవత్సరాన్ని ఇప్పుడు సింహావలోకనం చేద్దాం ప్రధాని అన్నట్లుగా ఇది బహు చెడ్డ సంవత్సరం భారతదేశం శ్రేయోభిలాషు లందరికీ కూడా ఇది చెడ్డ సంవత్సరంగానే గడిచింది సరిహద్దులోని మన భూభాగం మీద చైనా నిష్కారణంగా దురాక్రమణ జరిపింది భారత—పాకిస్తాన్ సంబంధాలు బాగుపడే సూచనలు కనిపించినట్లే కనిపించిగాని,సంవత్సరాంతంలో మళ్లీ చెడిపోయాయి నేపాల్‌లో ప్రయోగాత్మకంగా ఏర్పాటైన ప్రజాస్వామిక ప్రభుత్వం రద్దయి తిరిగి మహారాజు పరిపాలన ఆరంభమైంది భూటాన్, సిక్కిం దేశాలు చైనా వత్తిడికి లోనై ఉక్కిరిబిక్కిరి అయ్యాయి రష్యా, బర్మా, ఆఫ్ఘనిస్తాన్ మిత్ర దేశాలుగానే ఉన్నాయి సింహళంలో చిన్నసైజు విప్లవం తలఎత్తింది ఆ దేశంలో స్థిరపడిన భారతీయుల పరిస్థితి — పౌరసత్వం లేకపోవటం — యథాతథంగానే ఉన్నది

దేశ రాజకీయాలలో అస్థిరత్వం ప్రబలింది "ఏమి జరుగుతుందో చూద్దాం" అన్న అనిశ్చిత విధానమే ఇందుకు ప్రధాన కారణం

పంజాబీ సుబా ఉద్యమం ఈ అనిశ్చిత విధానానికి మచ్చుతునక ఉద్యమ కార్యకర్తలు సంవత్సరాంతంలో ఆమరణ నిరాహారదీక్ష ప్రారంభించారు రాజ్యాంగబద్ధంగా తాము ఇంతకాలం నుంచి కోరుతున్నదానిని, నిరాహార దీక్షతో సాధించవచ్చునని అకాలీలకు తెలుసు ఆంధ్రులకు ఆంధ్ర ప్రదేశ్ ఏర్పడినట్లు, ద్విభాషాబొంబాయి రాష్ట్రం గుజరాత్, మహారాష్ట్రాలుగా విభజింపబడినట్లు,నాగాలాండ్ ఏర్పాటు కానున్నట్లు తమకూ, పంజాబీ సుబా లభించగలదనీ వారు ఎరుగుదురు. ప్రజాస్వామ్యంలో ప్రజాభిప్రాయానికి తలవంచక తప్పదనే వాదానికి ఇక్కడ ఆస్కారం లేకపోలేదు ఉదాహరణకు ఆంధ్రరాష్ట్రాన్నే తీసుకుందాం. తెలుగు భాష మాట్లాడేవారు విసిరి వేయబడినట్లుగా మూడు రాష్ట్రాలలో ఉండటంచేత, వారి అభివృద్ధికి అంతరాయం కలిగింది ఈ కారణంగా తమకు ప్రత్యేక రాష్ట్రం ఉండాలని వారు కోరారు. ఇది కేవలం భాషను పురస్కరించుకొని చేసిన విజ్ఞప్తే గాని, మతం ప్రసక్తి ఇక్కడ లేదు.

బొంబాయి నగరం సమస్య అడ్డు వచ్చింది

న్యూఢిల్లీ లేఖ

గాని, లేకపోతే మహారాష్ట్ర, గుజరాత్‌లు ఆదిలోనే ప్రత్యేక రాష్ట్రాలుగా ఏర్పడేవి.

పంజాబీ సుబా వ్యవహారం ఇలాంటిది కాదు. శిఖ్కులు మాత్రమే దీనిని (పంజాబీ సుబాను) కోరుతున్నారు. నిజానికి ఇది శిఖ్కిస్తాన్‌కు మారుపేరు.

ఉపశమన చర్యలవల్ల శత్రువులను కూడ గట్టుకొని రాలేక పోవటమే కాక, విశ్వాస పాత్రులైన చిరకాల మిత్రులను కోల్పోవలసి వస్తుంది, కూడా. చాంబర్లియన్ ఉపశమన చర్యలే బ్రిటన్ వినాశానికి దారితీశాయి. భారత జాతీయ జెండాలో శిఖ్కుల రంగుకు స్థానం కల్పించి, వారిని ఉపశమింపజేసేందుకు తొలిసారిగా ప్రయత్నించిన వారు మహాత్మా గాంధి. దేశంలో ప్రధాన అల్ప సంఖ్యాక వర్గాలు ముసల్మానులు, శిఖ్కులు అనే సిద్ధాంతాన్ని దీనివల్ల అంగీకరించినట్లు అయింది.

లిన్‌లిత్‌గో ప్రభువు తన "జాతీయ మంత్రి వర్గం" లో జాతీయోద్యమంతో సంబంధం లేని శిఖ ప్రముఖుడు స్వర్గీయ జోగింద్రసింగ్‌ను నియమించి మరింత అనర్థానికి కారకులయ్యారు. కాంగ్రెసు అధికారంలోకి వచ్చినప్పుడు వారిలో ఒక శిఖ్ సభ్యుడు కూడా ఉన్నారు. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన రోజున శ్రీ నెహ్రూ, మహమ్మద్ ఆలీ జిన్నా, సర్దార్ బలదేవ్ సింగ్ రేడియోలో ప్రసంగించారు. ఏ సిద్ధాంతాన్ని పురస్కరించుకొని మహాత్మా గాంధి, శ్రీ నెహ్రూ కాంగ్రెసు అధిష్టాన వర్గంలోని ఇతర సభ్యులు ఆనాడు రేడియో ప్రసంగం చేసేందుకు శ్రీ బలదేవ్ సింగ్‌ను అనుమతించారో ఇంతవరకు తెలియలేదు.

ఇంతటితో ఈ విషాదగాథ సమాప్తం కాలేదు. హిమాచలప్రదేశ్‌ను పంజాబ్‌లో విలీనం చెయ్యాలని రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ సంఘం ఆదిలో నిర్ణయించింది. శ్రేయోదాయకమైన ఈ విలీనీకరణకు అప్పుడు అడ్డుపడిన వారు ఇద్దరు. ఒకరు హిమాచల ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి డా. పార్‌మర్, రెండవవారు సర్దార్ బలదేవ్ సింగ్. ఈనాడు పంజాబ్ జనాభాలో 100 కి 30 మంది మాత్రమే శిఖ్కులు. హిమాచల ప్రదేశ్ పంజాబ్‌లో విలీనం అయివున్నట్లయితే 100 కి 20 మంది శిఖ్కులు కూడా ఉండేవారు కారు.

ఇప్పుడు పంజాబ్ జనాభాలో నూటికి 30 మంది మాత్రమే శిఖ్కులైనందువల్ల వారి అభిప్రాయాలనే ప్రజావాణిగా స్వీకరించే వీలు లేదు. ఏమాట కామాటే అనుకోవాలి, హిందీ భాష వాడుకలో ఉన్న ప్రాంతాలు కూడా తమకే చెందాలని శిఖ్కులు అనటంలేదు. తాము అధిక సంఖ్యాకులుగా ఉన్న ప్రాంతాలతోనే ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు కావాలని వారు కోరుతున్నారు.

ఈ దేశంలో భాష అనేక అనర్థాలకు హేతువైంది. ఇప్పుడు మళ్లీ చరిత్రను ఒకింత పరిశీలిద్దాం. బ్రిటిష్‌వారికి వ్యతిరేకంగా సాగించిన ఉద్యమంలో భాగంగా కాంగ్రెసు, భాషా ప్రాతిపదికపై దేశాన్ని రాష్ట్రాల క్రింద విభజించింది. స్వాతంత్ర్యం సముపార్జించిన తరువాత కూడా భాషా ప్రయుక్త ప్రదేశ్ కాంగ్రెసు సంఘాలు పనిచేశాయి. దీనివల్ల భాషా రాష్ట్రాల ఉద్యమం తీవ్రతరం అయింది.

ఈ విచ్ఛిన్నకర విధానం ఇప్పుడు మరొక అడుగు ముందుకు సాగింది. బెంగాల్‌లోని పారిశ్రామిక, వాణిజ్య సంస్థలన్నీ బెంగాలీలను మాత్రమే నియమించుకోవాలని అక్కడ వార్తాపత్రికలు చేస్తున్న సూచనలను ఇందుకు ఉదాహరణగా చెప్పవచ్చు. ఇలాంటి విధానంవల్ల పెట్టుబడులు సమకూరటానికి గాని, కొత్త సంస్థలు ఏర్పాటు కావడానికి గాని ఎంతవరకు అవకాశం ఉంటుందో తేలికగా వూహించవచ్చు.

రాజకీయ పక్షాలలో కూడా ఈ విచ్ఛిన్నకర వైఖరులు చొచ్చుకొనిపోయాయి. సోషలిస్టులు అన్నీ ఉడిగిపోయినవారు. ఆ పార్టీ నాయకుడు శ్రీ అశోక్ మెహతా రచనలను పరిశీలిస్తే ప్రధాన సమస్యల పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న విధానానికి, ఆయన సూచించే విధానానికి వ్యత్యాసమేమీ కనుపించదు. సర్వసాధారణంగా సోషలిస్టులు నియతృత్వ ప్రభుత్వాల ఏర్పాటుకు దారితీసి, చరిత్రాత్మకమైన పాత్ర నిర్వహించారని చెప్పవచ్చు.

భారత కమ్యూనిస్టులను శక్తివిహీనులుగా చేసి, కాంగ్రెసుకు చైనా మహోపకారం చేసింది. శ్రీ చౌ—ఎన్—లే భారతదేశానికి వచ్చినప్పుడు కమ్యూనిస్టులు నల్లజెండాల ప్రదర్శనం నిర్వహించి ఉన్నట్లయితే, వారు ఈనాడు ఉచ్చస్థితిలో ఉండేవారు. వారా పని చేయకపోవటం పెద్ద పొరబాటే అయినా, వారిలో వారికి గల విభేదాలను గూర్చి విశేషమైన ప్రచారం జరిగినా, దేశంలో కమ్యూనిస్టు పార్టీ ఒక్కటే క్రమశిక్షణాయుతమూ, శక్తివంతమూ అయిన పార్టీగా ఉన్నది. ఈ విషయాన్ని త్రోసిపుచ్చే వీలులేదు.

కాంగ్రెసుపార్టీ ఇప్పుడు విచ్ఛిన్నమయ్యే స్థితిలో ఉన్నది. ఆ పని జరుగకుండా ప్రధాన మంత్రి ఇంతవరకు కూడగట్టుకు వస్తున్నారు. కాని పార్టీ విచ్ఛిత్తికి దారితీస్తున్న అంశాలను తొలగించేందుకు ఆయన కూడా ప్రయత్నించలేదు.

ఏ కొద్దిమంది వ్యక్తులో అధికారాన్ని గుత్తకు తీసుకొనడం వీటిలో ప్రధానమైన అంశం. ఉదాహరణకు శ్రీ జగ్జీవన్‌రామ్‌నే తీసుకుందాం. ఈయన 1946 సెప్టెంబరు 2 వ తేదీ నుంచి—అంటే 14 ఏళ్ల నుంచి—మంత్రిగా ఉంటున్నారు. కేంద్ర మంత్రివర్గంలో షెడ్యూల్డ్ కులాల వారికి ఏకైక ప్రతినిధిగా వ్యవహరిస్తున్నారు.

అస్పృశ్యతా సమస్య, దక్షిణదేశంలో ఉన్నంత తీవ్రతరంగా ఉత్తర దేశంలో ఎన్నడూ లేకపోయినా, దక్షిణాదికి చెందిన షెడ్యూల్డ్ కులాల వారి నాయకుడు ఒక్కరు కూడా ఇంతవరకు శ్రీ నెహ్రూ ప్రభుత్వంలో క్యాబినెట్ హోదా కల మంత్రిగా నియమింపబడలేదు. ఒక్కసారి మంత్రులైనవారే మళ్లీ, మళ్లీ మంత్రులవుతున్నారు. ఇందుకు వారి సమర్థతతో గాని, వయస్సుతో గాని నిమిత్తం లేకపోతోంది. ఈ కారణంగా కాంగ్రెసు పార్టీలోనే “కలవారు”, “లేనివారు” అనే సమస్యకు ఆస్కారం కలిగింది.

లాయిడ్ జార్జి ఒకానొకప్పుడు అన్నట్లు ‘సి3’ ప్రజలతో “ఎ1” సామ్రాజ్యాన్ని పరిపాలించటం సాధ్యంకాదు. ఎవరి సహకారంతో శ్రీ నెహ్రూ ఈ దేశాన్ని పరిపాలిస్తున్నారో, వారిలో చాలా మంది “డి4” వర్గానికి చెందినవారు. కనుక ‘ఎ!’ ప్రజలు వ్యతిరేకించటం, ఎదురు తిరగటం సహజమే !

ఇంతవరకు నేను అభివర్ణించిన విషయాలను బట్టి దేశ పరిస్థితులు మరీ దారుణంగా ఉన్నాయని భావించరాదు. 1960 లో దేశం, పారిశ్రామిక వాణిజ్య రంగాలలో బ్రహ్మాండమైన అభివృద్ధిని సాధించింది. పైకి అసంబద్ధంగా కనిపించినా, ఆధునిక భారతావని రూపు రేఖలను తీర్చిదిద్దిన వారిలో ఒకరుగా నాజీ ఆర్థికమంత్రి శ్రీ టి. టి. కృష్ణమాచారి పేరు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుంది. విదేశీ మారకం కొరతవల్ల ఎదుర్కోవలసి వస్తున్న చిక్కులకు చాలా మట్టుకు ఆయనే బాధ్యులైనా, ఇప్పుడు దిగుమతులు సన్నగిల్లాయి. దిగుమతులను నిషేధించటంతో దేశంలో త్వరితగతిని పరిశ్రమలు అభివృద్ధి చెందాయి. భారతీయులతో సహకరించి నూతన సంస్థలను ఏర్పాటు చేయడానికి మునుపు ఎన్నడూ ముందుకురానంత మంది విదేశీయులు ఈవిడువచ్చారు. ప్రతివారికి వెనుకటికంటె ఇప్పుడు అన్నవస్త్రాలు సమృద్ధిగా లభిస్తున్నాయి.

వ్యవసాయ రంగంలో అనుకున్నంతగా అభివృద్ధిని సాధించలేక పోయాం. పరిశ్రమలలోను, రవాణా సదుపాయాలలోను, ఇనుము, బొగ్గు వంటి సరుకుల ఉత్పత్తిలోను, సాంకేతిక నిపుణుల విషయంలోను లోపాలు కనిపిస్తున్నాయి.

“సర్వ విధాల దేశాన్ని ఉన్నత స్థితికి తీసుకొని వెళ్లేందుకు కష్టపడి పనిచెయ్యండి” అని ప్రధాన మంత్రి తరచు ఇచ్చే సందేశాన్ని జ్ఞాపకం చేస్తూ 1961 సంవత్సరానికి స్వాగతం పలుకుతాను. ★

పెను పండువు...

వేటూరి సుందరరామమూర్తి

సంక్రాంతి వచ్చె సంసార కాసార క
ల్హార పంక్తికి పూర్ణ శారదవలె
జీవిత మహాకుహూ చింతా తమిస్రాన
సకియ హాసవికాస చంద్రిక వలె
విధుర విరహవ్యథా మధుర సంయోగాన
చిందు నానందాశ్రుబిందువు వలె
లొచ్చు గుండియలనుల్లోలంబు గావించు
పుత్రదీపమయూఖ పుంజమువలె
తరుణ భావుక కవితావతరణమువలె
మంచుకౌగింటిలో చలి మంటవోలె
ప్రణయ వీణా సుఖదానురాగ మధుర
సీధునది యొంచు పండించె జీవితమ్ము-
నాదు జీవిత రామాయణమ్ము లోన
భూమిజాతకు నీడుగా పౌష్యలక్ష్మి
పుడమి పండించి పండి మా ఎడదలోన
పండువుల్ నించె; నిదె పెనుపండువయ్యె.



మి కిష్టుడు

అవసరాల రామకృష్ణారావు

ఆ చిన్న అబ్బాయి స్టేషనులో ఒక చివర సిమెంటు బెంచీమీద కూచున్నాడు. క్రిందికి మొహంమీద పడుతున్న వెంట్రుకలూ, యింకొంచెం క్రిందికి చూస్తున్న కళ్లూ, యింకా క్రిందికి ధారలు కడుతున్న కన్నీళ్లూ...యింకా బాగా క్రిందికి దిగి... ఆ అబ్బాయిగుండెల్లో లోతుగాతొలిస్తే—?

*　　*　　*

'ఏం బాబూ యింకా అలా కూచున్నావేం, నువ్వివాళ మాతో సినిమాకిరావా? ఇవాళ ఆఖరురోజు తెలుసా? నాకేం, మేం వెళ్ళిపోతున్నాంలే...అరే? అదేవిట్రా అంతలా తలదించుకూర్చున్నావ్?'

సుందరి కిష్టుడి తల పైకెత్తింది.

'అదేంరా, అంత విచారంగా ఉన్నావేంరా, ఏం యిక్కడ నీకు ఏం తక్కువొచ్చింది? చెప్పకుండా తీసుకొచ్చావనా? నాతో చెప్పవా, మీ బావ ఏమయినా అన్నారా? అంతేకదూ, నాతో చెప్పవ్ కదూ?'

'చెప్పడానికేమీ లేదమ్మగారూ!'

'అదిగో...అలా పిలవొద్దన్నానా... అక్కా అని పిలవమన్నానా... నామాట వినవన్నమాట...సరేలే'

'అలాగే పిలుస్తానక్కా...'

'ఆఁ, అలా దారికిరా...యిప్పుడు చెప్పు. ఎందుకలా ఉన్నావ్ అక్కణ్ణించి యిక్కడికి వచ్చానని బెంగగాఉందా? కొత్తగాఉందా?

'అది కాదక్కా...'

'మరేవిటి? మీ నాన్నకోసం బెంగెట్టుకున్నావా?'

అడిగి అడిగి సుందరికి విసుగెత్తిపోయింది. పదిమాటలు అడిగితే ఒక్కమాటయినా సరిగ్గా జవాబు చెప్పడు...కనీసం కుర్రాళ్ళయినా గుర్రాలలా హుషారుగా ఉండాలి. బాధ్యతలూ సమస్యలూ పెద్దవాళ్ళవి. వీడి కుండే బాధలన్నీ తనిక్కడికి తీసుకురాడంతోటే తీరిపోయి ఉండాలి...అసలు వాణ్ణి తనిక్కడికి తీసుకురావడమూ చిత్రంగానే జరిగింది...

ఎరిగున్నవాళ్ల యింట్లో పెళ్లంటే బెజవాడ వెళ్లింది. అక్కడ ఆయన స్నేహితుడు ప్రసాదు ఉంటే చూద్దామని ఓసారి వాళ్లింటికి వెళ్లింది. తీరా సమయానికి ఆయన లేనే లేడు. ఆయన పెళ్ళాం సావిత్రి ఎంతో మర్యాదచేసి కూచోపెట్టి ఆకబురూ ఈ కబురూ చెప్పింది. కొంతసేపటికి పాలోయి వస్తే 'ఒరేకిష్టూ, వీణ్ణి తోపుడు బండీలో కూచోపెట్టి అలా గాలిలో తిప్పి తీసుకురా' అని ఓకుర్రాడికి యిచ్చింది. సుందరి తలెత్తి చూసింది. మాసిపోయినబట్టలూ, మలినమైన శరీరమూ...ఇవి కాదు...అవిణ్ణి ఆకర్షించింది ఆశ్చర్యపరిచిందీ ఆకుర్రాడి అతిలేత మొహం ఆ కుర్రాడు వెళ్ళిపోయాక... అవిణ్ణి అడిగింది.

'ఇంత చిన్నకుర్రాడు మీ కెక్కడ దొరికేడూ?'

'ఆఁ కనిపిస్తున్నంత కసింగందేం కాదు. పన్నెండేళ్లు తక్కువ వుండవులెండి...అయినా వాడు పైవాడేం కాదు. మాఅబ్బాయే..."

సుందరి ఆశ్చర్యానికంతులేకపోయింది.

'అవునండీ, అంతఆశ్చర్యం దేనికి? వాడు ఆయన మొదటి భార్య కొడుకు. వాడికి రెండేళ్లుండగా తల్లి పోతే నన్ను మళ్ళీ చేసుకున్నారు...'

సావిత్రి మళ్లీ మాటాడింది.

'వాణ్ణి అలా చూస్తున్నానేమని అడుగుతారా?...పనిమనిషి క్రింద వాడుకుంటున్నానని ప్రశ్నిస్తారా? అక్కర్లేదు, నేనే చెబుతాను.. ఇది అతి సహజమైంది. నేను వాడి సవితితల్లిని...మరిచిపోయారా?'

'ఆరే అన్నీ అలా అనేసుకుంటే నేనేం చెప్పను?'

'అందుకు కాదు...లోకంతీరు నేను చెప్పేను...ప్రపంచంలో సవతితల్లులు ఎలాగా పేరు పడనే పడిపోయారు...ఆ మాటే ఎందుకు కాదనాలి? నేను మరోలా చేస్తే నమ్ముతారా? వాడికి నాలుగు అక్షరమ్ముక్కలు రావాలని నేను విశ్వప్రయత్నం చేసేనంటే ఎవరేనా ఒప్పుకుంటారా?'

సావిత్రి నవ్వింది. ఆ నవ్వు సుందరికి



నచ్చలేదు...లేచి నిలబడింది. తిరిగి యింటికి వచ్చేస్తూంటే...ఆమెను దిగబెట్టడానికి వచ్చిన దాసీది మరికొన్ని చెప్పి, పిల్లల నెత్తినితల్లి హృదయాన్ని మరింత రగిల్చింది.

'ఇంకా యిప్పుడాయమ్మ బిడ్డ నెత్తింది, కాస్త నయం...అంతకుముందు చూడాలి తల్లీ ఆవిడ పెట్టిన బాధలు...రెండేసి రోజులు అన్నమే పెట్టేదికాదు, మూడేసి రోజులు గదిలో పెట్టి తీసేదేకాదు...కనిపించినచోటల్లా కదల బాదిచెయ్యడమేనా యింకేమేనా ఉందా?'

సుందరి మనస్సులో ప్రభవించిన ప్రవహించిన ప్రేమనెలువ ప్రళయరూపం దాల్చింది. అయితే ఆమె కోపం సావిత్రి మీద కాదు.

'ఆ అబ్బాయితండ్రి బ్రతికేఉన్నాడా?' అనిపించింది ఆమెకు. ఇంటికివెళ్ళడం మాని ఆఫీసుకే దారితీసింది. ప్రసాదు ఆవిణ్ణి చాలా ఆదరించాడు.

'మీ ఆదరాభిమానాలకి సంతోషం... కాని నేను అందుకు రాలేదు...ఒక్కమాట చెప్పడానికి వచ్చాను...ఎక్కువ చనువు తీసుకుంటే క్షమించండి...కాని అది నా విధిగా భావిస్తున్నాను...మీరు మీ అబ్బాయిని చూస్తూన్న పద్ధతి నాకేం నచ్చలేదు.'

'మీ అభిప్రాయం అది కావచ్చు. నాకేం అభ్యంతరం లేదు.'

'అంత తేలికగా మీరెలా తీసుకోగలుగుతున్నారు? తండ్రిగా మీ బాధ్యత మీకు లేదా? ఆ పిల్లాడు- అంత దిక్కుమాలి పోయాడా? ఆపిల్లాణ్ణి కన్న తల్లే బ్రతికివుంటె మీరిలా చెయ్యగలిగేవారా?'

'కాని ఆ తల్లి బతికి లేదుగా, అయినా నాకు కాలజ్ఞానం లేదుగా!' సుందరి మరమర చూసింది. 'చూడండి, జీవితాన్ని సీరియస్ గా నేనెప్పుడూ 'వ్యూ' చెయ్యలేను. లల్లాశరీరమూ మనస్సూ కష్టపెట్టుకున్న మగ పగవాళ్ళకి సాయంకాలంయింటికివెళ్ళేక రెస్టు కావాలి. నేనింట్లో వుండేది కొన్ని గంటలుండీ ఆ కొద్ది కాలమూ అంవివెవరివి కానియ్యం. నేను సమస్యలు పరిష్కరించలేను తండ్రిగా నేనెప్పుడూ వాణ్ణి నా పెద్దకొడుకుగానే ప్రేమిస్తాను. ఒకరు చేసిన పనులకి నేరం యింకొకరిది కాదు. శాసించడంవల్ల సమస్యా పరిష్కారం ఆశించడం కేవలం భ్రమ అని నా ఉద్దేశం...ఇప్పటికేనా నన్ను అర్థం చేసుకున్నారా?'

'మిమ్మల్ని యిదివరకే అర్థం చేసుకున్నాను...మీ మాటలే అర్థంచేసుకోలేకుండా ఉన్నాను. సరే లెండి, దానికేం గాని మీ కిష్టుణ్ణి నాతో తీసికెళ్ళాలని ఉంది. మీకేం అభ్యంతరమా?'

'నామటుకు నాకేం అభ్యంతరం లేదు-'

'—సరే లెండి.'

సావిత్రి కూడా కొన్నాళ్ళపాటు వాణ్ణి తీసికెళ్ళ డానికేమీ అభ్యంతరం చెప్పలేదు.

* * *

ఆ రోజు పడుకోబోయేముందు సుందరి భర్తతో అంది.

'ఆ మొగుడూ పెళ్ళాలకంటె ఈ పిల్లాడే ఎక్కువ చిత్రంగా ఉన్నాడు సుమండీ. మనసులో ఏముందో చెప్పడు, ఎందుకో చెప్పడు...వాణ్ణి సుఖపెట్టడానికి మనం చెయ్యగలిగినంతా చేశాం...ఎన్ని చేసినా ఆకుర్రాడు కొంచెమేనా కులాసాగా ఉన్నట్టు నాకేం కనిపించడంలేదు ... పిన్ని చేతి దెబ్బలే పిప్పరెంటు బిళ్ళలేమో...'

'అందుకే అలవాటు పడాడేమో ... కానియ్యి కాలమే నిర్ణయిస్తుంది' ఆ మాట నిజమే. మరో అరగంటకి ఆ యింటి తలుపు తెరుచుకుని కిష్టుడు యివతలికొచ్చేశాడు. సుందరక్క కుట్టించిన రెండు కొత్త జతలూ సంచీలో పెట్టుకుని నెమ్మదిగా స్టేషనుకి వచ్చాడు. స్టేషనుదగ్గర కళ్ళీ కొట్టువాడికి ఆ బట్టలు యిచ్చేసి రెండ్రూపాయలు పుచ్చుకున్నాడు. తన ఊరికి టిక్కెట్టు కొనుక్కున్నాడు. అరరూపాయి మిగులు తే రబ్బరుబొమ్మ కొన్నాడు. సుందరక్క వచ్చేస్తుందా? తన్ని మళ్ళీ తీసుకెళ్ళిపోతుందా?

(93-వ పేజీ చూడండి)



నీహారిక

బృందగీతి :

మరల వచ్చె చలికాలము
విరహుల గుండెల గాలము
నిరుపేదల నరము లెల్ల
నరుకుచున్న కరవాలము
కత్తుల వలె గాలి వీచె
గుత్తిగ చేమంతి పూచె
ఆకాశములో పగలే
అర్కుడు చంద్రుడుగ తోచె
నరక బిలము మూత బడెను
సురాలయము తలుపు విడెను
అన్నిటి భక్షించివేయు
అగ్నికె ఉదరమ్ము చెడెను
వంగపూల రైకతో
పసిగన్నెరు కోకతో
చనుదెంచెను హిమబాలిక
సంక్రాంతి పతాకతో

హిమబాల :

మంచు ముత్తెములు
పంచిపెట్టుటకు
మల్లెల మణులను
ముల్లె గట్టుటకు
అశోక సుమముల
నందగించుటకు
చుక్కలార! పూ
మొక్కలార! నా

అక్కలార నా
కన్న తల్లి!
అమృతవల్లి నీ
కన్న తల్లి!
లోకమ్ముల పాలించెదవే
శోకమ్ముల నణగించెదవే
చండ భాస్కరుని దండించెదవే
కార్చిచ్చులనే ఖండించెదవే
బడబానలమును భంజించెదవే
మృత్యుకాలాహిని మ్రింగివేతువే
అక్కలార! పూముక్కులార నా
రెక్కలార సుధ చుక్కలార!
ఎటు తేలనట్టి పెనుచిక్కులార!
తారే!

నా
లీల చూపి పోరే!

అగ్నిహోత్రుడు:

సూర్యుని పాలించు
సుందరీ ఎవతెవే?
నది గడ్డగట్టించు
నారి యెవ్వతెవే?
మంచు పరదాలలో
పొంచి యెవ్వతెవే?
పంచభూతమ్ములను
బంధింతు వెవతెవే?
స్మరుని కోదండమ్ము
సంధింతు వెవతెవే?



...న్న చవిగొంటి నీ
...ర మొక్కటి తప్పు,
...ని, నేతాకినది
...ను బూడిదకుప్ప.
...న్న గెలిచినవాడు
...దిక్కుల లేడు.
...న్నమించినవాడు
...న్నలకు కనరాడు
...హోత్రస్వామి
...దురే నన్ను
...చాల నా రాశి
...మనే నిన్ను
...మెరుంచు ముత్యాల
...లు పెట్టేవు
...స్పగన్నెరు పూల
...వ కట్టేవు
...కారసుమాలు
...ముల చేర్చేవు
...ప్పులోన అశోక
...సుమాలు కూర్చేవు
...న్నిన్ని మనసున్న
...న ఎవ్వతెవే?
...ల్లిమెల్లిగ వచ్చు
...లత ఎవ్వతెవే?

నీహారిక

తెలిపట్టు ముసుగున్న
దేవి ఎవ్వతెవే?
చనుకట్టు కనుపట్టు
చాన ఎవ్వతెవే?
నినువంటి అందాల
వనిత కనరాదే
నినుగూర్చి ఇందాక
నేను వినలేదే
అతి పవిత్రుడ నేను
అఘ లవిత్రుడ నేను
స్నేహపాత్రుడనేను
స్నిగ్ధ గాత్రుడనేను
నిన్ను ప్రేమించినా
నే శీతలస్వాంత!
నీ అధరమును తాక
నీయవే నుంత!

యాజ్ఞికులు:
వద్దు వద్దు పితిహోత్ర!
వసుధా చైతన్యసూత్ర!
హిమకామిని బాహులలో
ఇముడబోకు పవిత్రా!



"అందుకే నాయనా! ప్రభుత్వము అందరినీ
లైఫ్ ఇన్సూరెన్సు చేసుకోమంటుంది!"

చిత్రకారుడు: వి. నాగరాజ (ప్రొద్దుటూరు)

హిమాధరము చుంబించి న
శించబోకు అగ్నిహోత్ర!
తెల్లనిదేహాము గాని
నల్లనరా దానిమనసు.
ప్రణయము గొలుపును గాని
ప్రళయమురా దానివయసు.
ఎల్లరి ఫలిగించు నీవు
చల్లారకు స్వామీ!
మొగముచూచి మోహమంది
దగా తినదవేమీ!
పగలమారి ముగుపజేరి
పోగ చూరెదవేల?
పోగ మంచుల కంచెలలో
ముగియును నీ జ్వాల
నీవులేని దీ లోకము
నిలువున భస్మమ్మగురా!
బూదికుప్పలో జీవము
పాడుకొనగ బోదురా!
మంచుకుప్పలోన జ్యోతి
పంచత్వమునందురా!
నీలోపలి చైతన్యము
నేలపాలు జేయకురా!
పచ్చదనము తిగ్రమింగడి
మచ్చెకంటి కోరకురా!
లోకమ్ము లడంగురా!
నాకమ్ములు ప్రుంగురా!
శోకములో ప్రాణికోటి
భీకరముగ ప్రుంగురా!
హిమము కోరబోకురా!
క్రమము తప్పబోకురా!
గ్రుడ్డిగా హిమమ్ము బొంది
గడ్డ గట్టబోకురా!

హిమబాల:
పైడి మకుటము వాడరారా!
వేడి చూపులవాడ రారా!
పచ్చపచ్చని బాహుయుగళం
విచ్చి నన్నిక అదుకోరా!
పడుజ్వాలలవాడ! నీకే
లేదు లోకములోడరా! మన
ఈడుజోడును చూడరా! నా
వాడరా వైశ్వానరా!
హిమదుకూలము తెత్తురా! నీ
కమృత చషకము లిత్తురా! నా
బాహుయుగళీ బంధనమ్ముల
స్వర్గమును చూపింతురా!
అధరమును చుంబించరా! నా
అక్షులను బింబించరా! నీ
జ్వాలలను నవ తోరణముగా
వాడ వాడల కట్టరా!
సంక్రమణశుభసమయమున నా
సరసజేరి సుఖించరా!
జడతుషార శరీరమందున
జ్వాలలను వ్యాపించరా!

బృందగీతి:
వలిగవలిగ భోగిమంట
విశ్వానికి వెలుగు పంట
హిమబాలకు, శుచి కీలకు
అమరె మంచి జంట!
చేమంతుల పూబంతులు
సింగారించిన ఇంతులు
హిమకీలలు శుచిబాలలు
అమర వచ్చె సంక్రాంతులు!
నీహార విహారములో
నిత్యాగ్ని విలాసములో
సంక్రాంతి శుభాలు నిండ
జనాళి హృదయాలువండ
హిమ, కీలల చేరిక
ఎల్లజనుల కోరిక,
సుజనావళి సుఖపెట్టుము
జోహార్ నీహారికా!

★



జూల్స్ వెర్న్ నవల

౮౦ రోజులలో భూప్రదక్షిణం

అనువాదం :

ఎస్. పార్థసారథి

సూయజ్ నుండి ఏడెన్‌కు సరిగ్గా 13 వందల 10 మైళ్ళు. ఈ దూరం ప్రయాణం చేయడానికి కంపెనీ నిర్ణయించిన కాలం 138 గంటలు. పుష్కలంగా బొగ్గు వేసుకొని ధాటీగా దాన్ని వాడుకొంటూ చకచక వెళ్ళిపోతున్న 'మంగోలియా' నడక, అనుకున్న వేళకి అడంగి చేరి తీరుతుందని నమ్మకం కలిగిస్తోంది. బ్రిండిసీలో ఆ ఓడ ఎక్కినవాళ్ళు, దాదాపు అందరూ ఇండియా వెళ్ళేవాళ్ళే. కొందరు బొంబాయివరకూ, అయితే, మిగతావాళ్ళు కలకత్తా దాకా పోవలసి ఉంది. కలకత్తా వెళ్ళేవాళ్ళుకూడా ఇపుడు బొంబాయిలోనే దిగుతున్నారు. బొంబాయినుంచి కలకత్తా వరకు ఈపెడనుంచి ఆపెడకి రైలు పడింది కాబట్టి పూర్వంలా ఇపుడు ఓడమీద సింహళం దాకా వెళ్ళి ప్రదక్షిణంచేసి రానక్కరలేదు.

'మంగోలియా' ప్రయాణికులలో సైనికోద్యోగులూ, సివిల్ సర్వీసు ఉద్యోగులూ చాలామంది ఉన్నారు. సైన్యాధిపతులలో కొందరు ఫక్తు బ్రిటిష్ సేనాధిపతులే. మిగతావాళ్ళు ఇండియాలోని సిపాయిదళాలకు నాయకులు.

ఈస్టిండియాకంపెనీ అధికారాలూ, బాధ్యతలూ అన్నీ బ్రిటిష్ ప్రభుత్వం పుచ్చుకొన్ననాటినుండి వీళ్ళందరికీ భారీ ఎత్తున జీత భత్యాలు ముడుతున్నాయి. సబ్ లెఫ్టినెంట్‌లకు 280 పౌండ్లు. బ్రిగేడియర్లకు రెండువేలనాలుగు వందలు. జనరల్‌కు 4 వేల పౌండ్లు. ప్రభుత్వోద్యోగులకు మరీ ఎక్కువ. మామూలు 'మొదటి తరగతి' ఉద్యోగులు అనిపించుకున్నవారికి నాలుగు వందల ఎనభై. జడ్జీలకు రెండువేల నాలుగు వందలు. ప్రధాన న్యాయమూర్తులకు పదేసి వేల పౌండ్లు. గవర్నర్లకు పన్నెండేసి వేలు. గవర్నర్ జనరల్‌కు ఇరవైనాలుగు వేల పైమాట.

'మంగోలియా' మీద యావన్మందీ సుష్టుగా భోజనంచేసి, అన్ని సదుపాయాలతో హాయిగా ప్రయాణం సాగిస్తున్నారు. లక్షల పెట్టుబడి పట్టుకు బయల్దేరిన ఇంగ్లీషు యువకులు కొందరున్నారు. విదేశాలలో వ్యాపారం చేయాలన్న సంకల్పంతో ఉత్సాహంగా ఉన్నారు. డబ్బుకేం తక్కువలేదు., డబ్బు కొనగలవాటికి అంతకన్న తక్కువలేదు. భోజనాదికాలు చూసే అధికారి అన్నీ అందంగా, ముచ్చటగా జరిపిస్తున్నాడు. ముప్పూటలా భోజనాలవేళ జిహ్వలు ఊరిపోయేలా మంచి మంచి వంటకాలతో రిఫ్రిజిరేటర్‌లో పెట్టి స్వచ్ఛంగా ఉంచినవీ, అప్పటికప్పుడు వండించినవీ— నింపేస్తున్నాడు. ఓడమీద ఆడవాళ్ళు ఆటేమంది లేరుగాని ఉన్నవాళ్ళు ఈపూటా ఆపూటా కూడా దుస్తులు మార్చుకుని అందంగా అలంకరించుకు తిరుగుతున్నారు. విందులకు దీటుగా వీనుల విందైన సంగీతం ఉంది. పాడేవాళ్ళు, వినేవాళ్ళూ సందడిగా తిరుగుతున్నారు. సముద్రం స్వయంగా నృత్యం ఆరంభించి ఓడచేత, అందులో జనం చేతా కూడా డాన్సు చెయ్యడానికి వడికట్టని వేళల్లో, ఓడ సాఫీగా పోతున్నప్పుడు ప్రయాణికులు నృత్యంకూడా చేసి ఆనందిస్తున్నారు.

కాని ఎర్రసముద్రం సరసత్వానికి పెట్టింది పేరుకాదు. అతి తరచుగా అల్లరిపడుతూ పెడుతూ ఉంటుంది. నిజానికది పెద్ద సముద్రం కాదు. సంకుచిత సముద్రం లాటిది. బుద్ధీ అంతే. ఇటు ఆసియానుంచిగాని అటు ఆఫ్రికా నుంచిగాని కాస్త ధాటీగా గాలి వీస్తే సముద్రం ఎగిరెగిరి పడుతుంది. దాంతోపాటు ఓడ కూడా. చాలా పొడుగ్గా, సన్నగా ఉన్న మంగోలియా మరీను. అలాటి ఉపద్రవాలు వచ్చే సరికి సందడి చప్పున చల్లారిపోతుంది. సంగీతం ఆగిపోతుంది. ఆడవాళ్ళు ఇట్టే మాయమైపోతారు. ఎన్ని వచ్చినా ఒక్కటి గొప్ప విషయం. మంగోలియా ఇంజన్‌లు మంచి బలం గలవి. ఓడ దారి తప్పకుండా, వేళ కూడా తప్పకుండా ముందుకు తోసుకు తీసుకుపోతున్నాయి. మెల్లిగా మంగోలియా బాబెల్ మండిబ్ జలసంధిలో ప్రవేశించింది.

అందరూ ఆడుతూ, పాడుతూ తిరుగుతూ ఉంటే ఫిలియాస్ ఫాగ్ ఏం చేస్తున్నట్టు? ప్రాణాలు బిగబట్టుకుని ఆకాశంకేసి చూస్తున్నాడా? గట్టిగా గాలివీస్తే ఓడకేమవుతుందోనని గజగజ వణికిపోతున్నాడా? ఎక్కడ ఏ ఉపద్రవం జరుగుతుందో, ఏ ఇంజను దెబ్బతింటుందో, ఓడ ఎక్కడ లంగరు వేసేస్తుందో తన యాత్ర ఎక్కడ దెబ్బతిని ఏమాలస్యం అవుతుందోనని బెంగపెట్టుకున్నాడా?

అలాటి దేమీ లేదు. ఒకవేళ అటువంటి వూహలు పోయినా, వాటిని బయటపడనీయడు ఫాగ్. ఎక్కడా తొణుకూ, బెణుకూ, తొట్రుపాటూ లేకుండా ఆవంతకూడా వంతలేకుండా వూళ్ళో, క్లబ్బులో ఉన్నప్పుడు ఎలా కనుపించాడో ఇపుడూ అలాగే ఉన్నాడు. నిశ్చింతాక్రాంతుడు ఫాగ్. అతని

NVKR

80 రోజులలో భూ ప్రదక్షిణం

లోకి బెంగలు జొరబడలేవు. అద్భుతాలు ఆశ్చర్య పరచలేవు. గాలి జోరుగా వీచి వోడ అల్లల్లాడిపోతున్నా, వోడలో క్రోనోమీటర్లలాగే ఫాగ్ మాత్రం స్తిమితంగా ఉన్నాడు. అసలు గది విడిచి బయట డెక్‌మీదకు ఎప్పుడూ రాడు. మానవుడి చరిత్రలో మహోజ్వలఘట్టాలకు కథాస్థలమైన ఈ ఎర్రసముద్రాన్ని తీరుబాటుగా చూడాలనీ, అవన్నీ మననంచేసుకుని ఉత్తేజితుడు కావాలనీ అతను తంటాలుపడలేదు. దూరతీరాలమీద అక్కడక్కడ చక్కని చిత్రాలలా లీలగా కనిపిస్తున్న పట్టణాల, నగరాలకేసి, సుందరప్రకృతికేసి చూసి ముగ్ధుడుఅయి మైమరచి పోవాలని ఉబలాట పడలేదు. అరేబియా జలసంధిదగ్గర వచ్చిపడగల ప్రమాదాలగురించి తలుచుకుని బెంబేలెత్తిపోలేదు. ఇక్కడ జరిగిన ఫారోలకు స్ట్రాబో, ఆరియన్, ఆర్టిమిడోరస్ వంటి చరిత్రకారులు కూడా చలించిపోయారు. ఈప్రాంతాలకు వోడను తేవడానికి నావికులు జంకేవారు. వస్తే గిస్తే పూజలూ, పునస్కారాలూ, బలులూ లేందే కదిలేవారేకారు. ఫాగ్‌కి అసలు ఆ ధ్యాసేలేదు.

మరి అతనికి ఉన్నది ఏ ధ్యాస ? తెలీదు. ఆరంభంలో కొన్నాళ్ళు రోజుకి నాలుగు వేళలా స్తిమితంగా, సావధానంగా ఆరగింపు కానిచ్చేవాడు. అందుకు ముందూ వెనకా పేకాడేవాడు. అందు కతనికి జతగాళ్ళూ సమకూడారు. వాళ్ళకి కూడా విస్ట్ అంటే ఇతనికున్నంత పిచ్చి ఉంది. ఒకతను పన్నుల కలెక్టరు. గోవాలో ఉద్యోగం. మరొకాయన క్రైస్తవ మతాచార్యుడు, రెవరెండ్ డెసిమస్‌స్మిత్. ఆయన దేశాంతరం వెళ్ళి ఇప్పుడు బొంబాయికి తిరిగి చేరుకుంటున్నాడు. మూడో పెద్దమనిషి మిలిటరీ ఆసామి. బ్రిటిష్ సైన్యంలో బ్రిగేడియర్ జనరల్. ఆయన బెనారస్‌లోని తన కేంద్రానికి వెళ్తున్నాడు. ఈ నలుగురు కలసి గంటలతరబడి విస్ట్ ఆడుకునేవారు.

పాస్పార్తుకి కూడా బెంగలు లేవు. ప్రయాణం గురించి బెంగపడాల్సినసిన అవసరంలేదు. నౌకాయానంవల్ల అతని ఆరోగ్యానికేమీ ఉపద్రవాలు రాలేదు. అంచేత శ్రద్ధాసక్తులతో ఎక్కడా లోటు లేకుండా వేళప్రకారం సుష్టుగా తినడం అతని ముఖ్య కార్యక్రమం. కాబట్టి అతనిపని బాగానే ఉంది. ఆమాట అనుకున్నాడు కూడా. తినడం, వెచ్చగా కప్పుకు పడుకోవడం. పోతే ఈ యాత్ర బొంబాయితో తప్పకుండా పూర్తిఅయిపోతుందని అతనికి గట్టి నమ్మకం. సూయజ్ నుంచి బయలుదేరిన మర్నాడు డెక్‌మీదకి షికారొచ్చేసరికి అతని ఎరిగున్న మొహం కనబడి ప్రాణం లేచొచ్చింది. అది ఈజిప్టులో చూసిన మొహం.

జరిగిన కథ

లండన్ రిఫారం క్లబ్ సభ్యులలో ఫిలియాస్ ఫాగ్ విశిష్టమైన వ్యక్తి. 80రోజులలో భూప్రదక్షిణం సాధ్యమే నని 20 వేలపౌండ్లు పందెం కాసి, అరోజు రాత్రే తన సేవకుడు పాస్పార్టూను వెంట తీసుకొని భూప్రదక్షిణానికి బయలుదేరుతాడు ఫాగ్. ఫాగ్ ప్రయాణం ప్రారంభమైన విడవ రోజున స్కాట్లండ్ స్క్వేర్ సెంట్రల్ ఆఫీసులోని పోలీసుకమీషనర్ "కేవాస్"కు సూయజ్ నుంచి డిటెక్టివ్ ఫిక్సు టెలిగ్రాం వస్తుంది. బ్యాంకు దొంగ ఫిలియాస్ ఫాగ్ దొరికాడని, అతనిని అరెస్టు చేయడానికి వెంటనే బొంబాయికి ఒక వారంటు పంపమనీ దాని సారాంశం.

పాస్పార్టు మెల్లిగా అతని దగ్గరకు వెళ్లి పలకరించాడు.

"నాకు సూయజ్ లో దారి గట్రా చూపించింది మీరేగదూ" అన్నాడు.

ఫిక్స్ మందహాసం చేశాడు సాదరంగా.

"మరే. మన్వేగా—ఆ వింత ఇంగ్లీషాయన జవాను" అన్నాడు.

"అవునండి." అంటూ, "మీ పేరు—" అన్నట్టు నసిగాడు పాస్పార్టు.

"ఫిక్స్."

"ఓహో. మిమ్మల్నిక్కడ మళ్లీ కలుసుకున్నందుకు చాలా ఆనందంగా ఉంది.తమ రెందాకా?"

"మీ రెళ్లే వూరే. బొంబాయి."

"ఓ. బ్రహ్మాండంగా ఉంది. మీ రిదివరకే ఇటు వెళ్లొచ్చి ఉంటారుగదూ ?"

"బోలెడుసార్లు .... నేను పెనిన్సులర్ కంపెనీ ఏజెంటుని" అన్నాడు ఫిక్స్.

"అయితే మీకు ఇండియా బాగా తెలుసన్న మాట."

"ఫిక్స్ ధాటీ తగ్గించి తమాయించుకున్నాడు—వీడే తనని ప్రశ్న లడుగుతున్నాడు.

"ఆ. ఆ. తెలియకేం. తెలుసు" అన్నాడ ముభావంగా.

"చాలా చిత్రమైన దేశంట గదండి ?"

"ఆ. చాలా చిత్రమైన దేశం. అద్భుతా లెన్నో ఉన్నాయి. మసీదులు, గుళ్లూ గోపురాలూ, పులులూ, పకీర్లూ, ఇంకా పాములూ, డాన్సు లాడే అమ్మాయిలూ .... బోలెడన్ని వింతలు. కాని ఇవన్నీ చూడడానికి మీకు వీలూ, వేళా ఉంటాయో ఉండవో పాపం" అన్నాడు ఫిక్స్ ఓరకంట చూసి.

"ఉంటుందనే అనుకుంటాను. ఉండాలనే కోరుకుంటాను. ఎంత ఇదైనా, 80 రోజుల్లో భూప్రదక్షిణం అంటూ వంకపెట్టి వూరికే వేలం వెర్రిగా ఓడలోంచి రైల్లోకి, రైల్లోంచి ఓడలోకి గెంతుతూ, పరుగెడుతూ ఎంతకని పోతాం. ఎక్కడో అక్కడ అంతుండాలి మనిషిన్న వాడికి. ఉంటుందిలెండి. ఈ గెంతులన్నీ బొంబాయితో ఆగిపోతాయి. అందుకేం సందేహం లేదు." అన్నాడు పాస్పార్టు.

ఈ విషయంలో పాస్పార్టు కన్న ఫిక్స్‌కు నూరింతలు ఆశగా ఉంది ఫాగ్ బొంబాయిలో ఆగిపోవాలని. పాస్పార్టు కబుర్లు వింటున్నకొద్దీ అతనికి ఆశ, ఉత్సాహం, ఉద్వేగం రెచ్చిపోతున్నాయి.

"మిస్టర్ ఫాగ్ కులాసాగా ఉన్నారా ?"అన్నాడు యదాలాపంగా అడిగినట్టు నటించి.

"బ్రహ్మాండంగా ఉన్నారు. నేనూ అంతే. నేను మరీ లంఖణాలుచేసిన రాక్షసుడిలా తెగ తింటున్నాను. సముద్రపు గాలిమహత్యం అనుకుంటా. ఆకలి తెగవేస్తుంది."

"మీ దొరగారు ఎప్పుడూ గదివిడిచి ఇవతలికి రాడే ?" అన్నాడు ఫిక్స్ చర్చను తనక్కావలసిన దారికి లాగుతూ.

"మరే. రాడు. అడ్డమైన గొడవల్లోకి పోవడం ఆయనకి గిట్టదు."

"అసలు ఒకటి చూశావో లేదో. ఈ ప్రపంచ యాత్ర ఉందే—అసలిది ఒక పెద్ద రహస్యమైన వ్యవహారానికి దేనికో అడ్డు కాపనిపిస్తోంది. నాకు—మాటవరసకి అదేదో రాజకార్యంలాటి దనుకో—" అన్నాడు ఫిక్స్.

"ఏమో బాబు. నా కలనదేం గొడకో తెలీదు. ఒట్టు. తెలుసుకోవాలన్న వూహా లేదు. నా కెందుకు" అన్నాడు పాస్పార్టు.

ఈ గోష్ఠి తరవాత ఇద్దరూ మిత్రులైపోయారు. తరుచు కలుసుకొని కబుర్లు చెప్పుకుంటూ ఉండేవారు. ఈ నౌకరుగాణ్ణి మెల్లిగా మంచి చేసుకుని 'మనవాణ్ణి' చేసుకోవడం అవసరమనిపించింది, డిటెక్టివ్ ఫిక్స్‌కి. ఎప్పుడో ఒకప్పుడు ఎందుకో ఒకందుకు పనికొస్తాడు. బార్‌లో కలుసుకున్నప్పుడ ఫిక్స్, పాస్పార్టు. విస్కీ, ఏల్ అవీ ఇప్పించడం మొదలుపెట్టాడు వద్దు వద్దంటూనే పుచ్చుకునేవాడు పాస్పార్టు. మనమెందుకు తీసిపోవాలన్నట్టు తనూ ఎదటి మనిషికి పానీయాలు ఇప్పిస్తూ వచ్చాడు. ఈ ఫిక్స్ చాలా పెద్దమనిషి అని గట్టిగా గురి కుదిరింది పాస్పార్టుకు.

* * *

స్టీమరు ఆటంకాలేవీ లేకుండా వేగంగా సాగిపోతోంది.

అక్టోబరు 13 వ మోచా (యెమెన్) రేవు కనబడింది. శిధిలమైపోతున్న గోడలూ, వాటిని తన్నుకొని వచ్చి వేళ్లాడుతున్నట్లున్న ఖర్జూరపు చెట్లూ వింతగా ఉన్నాయి. దూరాన విశాలమైన కాఫీతోటలు .... ఈ దృశ్యం చూసి పాస్పార్టు ఆనందంతో పొంగిపోయాడు. వలయాకారంగా ఉన్న ఆ ఎత్తయిన గోడలూ, శిధిలమైపోతున్న ఒక

కోటా దూరంగా తోటలూ అన్నీ—ఒక పెద్ద ఖబ్బా, సొనరూలా కనిపించాయి పాస్పార్టు కళ్ళకి.

ఆ రాత్రి బాబెల్ మాందెబ్ జలసంధిగుండా సాగింది 'మంగోలియా'. అరబిక్ భాషలో బాబెల్ మాందెబ్ అంటే 'బాష్పద్వారం' అని తాత్పర్యం. మర్నాడు స్టీమర్‌పాయింట్ దగ్గర లంగరు వేశారు. ఇది ఏడెన్‌కు వాయువ్యంగా ఉన్న చిన్న రేవు. ఇక్కడ ఓడలు బొగ్గు వేసుకుంటాయి. బొగ్గు దొరికేచోట్ల ఫరవాలేదుగాని, ఇలా దూర ప్రాంతాలలో బొగ్గు నిలువచేసేచోట అది కొని వేసుకోవడం చాలా ఖర్చు. పెనిన్సులర్ కంపెనీకి ఇందుకోసం సాలీనా ఎనిమిది లక్షల పౌండ్లు ఖర్చుపెడుతుంది. ఇలాటి బొగ్గుకేంద్రాలు దూరతీరాలలో చాలాచోట్ల నెలకొల్పుకోవడం అవసరం ఇక్కడ బొగ్గువెల టన్ను మూడు నాలుగు పౌండ్లవరకూ ఉంటుంది.

బొంబాయి, ఇంకా 1650 మైళ్ళ దూరాన ఉంది. మంగోలియా స్టీమర్‌పాయింట్‌లో బొగ్గు వేసుకుందికి నాలుగు గంటలసేపు ఆగాలి.

అయితే ఇందువల్ల ఫాగ్ యాత్రలో అనుకోని ఆలస్యం ఏమీ జరుగబోదు. ఇది ముందరే లెక్కవేసు కొన్న ఆలస్యం. ఆమాటకొస్తే ఫాగ్‌కి ఈసారి కొంత కలిసివచ్చింది కూడా. మంగోలియా ఇక్కడి నుంచి బయల్దేరాక, ఏడెన్ వెళ్లి ఆగింది. ఏడెన్ చేరవలసిన వేళ 15 వ తేదీ ఉదయం అయితే ఇది చేరుకున్న వేళ 14 వ తేదీ సాయంకాలం, అంటే దాదాపు 15 గంటలకాలం కలిసివచ్చిందన్నమాట.

ఏడెన్‌లో దిగగానే ఫిలియాస్‌ఫాగ్ కాన్సల్ కార్యాలయానికి వెళ్లి పాస్‌పోర్టుమీద విసాముద్ర వేయించుకున్నాడు. అతనికంటబడకుండానే వెంటబడి వెళ్లివచ్చాడు డిటెక్టివ్ ఫిక్స్.

విసాపని కాగానే, ఫాగ్ మళ్లీ మామూలుగా ఓడ మీదికి వచ్చేసి పేకాటలో కూర్చున్నాడు. నౌకరు పాస్పార్టు రివాజుప్రకారం రేవులో షికార్లు సాగించి ఏడెన్ ప్రజలని వేషభాషలని పరిశీలిస్తూ వింతలు చూస్తూ ఆనందిస్తున్నాడు. ఏడెన్‌లో జనం వేషభాషలన్నీ ఒక్క మూసలో పోసినట్లుండవు. అక్కడి పాతికవేల జనాభాలోను పాతిక జాతులవారుంటారు—పార్శీలు, యూదులు, యూరపియనులు, సోమాలీలు, అరబ్బులూ మొదలైనవారు రకరకాల వర్తకవ్యాపారాలమీద తిరుగుతూ ఉంటారు.

హిందూమహాసముద్రంపాలిటి జిబ్రాల్టర్ అనిపించుకున్న ఆ రేవుకి కట్టుదిట్టాలూ, అక్కడి కట్టడాలూ చూసి చాలా మెచ్చుకున్నాడు పాస్పార్టు. సాలమన్ కాలంనాటి ఇంజనీర్లు కట్టిన ఎత్తయిన జలాశయాల పక్కలోనే నేటికీ ఇంగ్లీషు ఇంజనీర్లు నీటిసరఫరాకోసం నిర్మిస్తున్న బ్రహ్మాండమైన జలాశయాలు చూసి శభాష్ అనుకున్నాడు. నాలుగూ చూడాలంటే నాలుగుదేశాలూ తిరిగి రావాల్సిందే. తిరగడం ఎంతమాత్రం దండగ కాదు అనిపించింది అతనికి.

ఆ సాయంకాలం ఆరుగంటలకి మంగోలియా ఏడెన్‌నుంచి బయలుదేరి హిందూమహాసముద్రంలో ప్రవేశించింది. బొంబాయి చేరుకోవడానికి ఇంక 168 గంటల గడువుంది. అందుకు హిందూమహాసముద్రం అభ్యంతరం పెట్టదలుచుకున్నట్టు లేదు. గాలి కూడా వాలుగా వీస్తోంది. యంత్రశక్తికి ప్రకృతికూడా తోడ్పడి ఓడ సూటిగా, ధాటీగా, కాలవమీద పడవలా సాఫీగా ఒడుదుడుకులు లేకుండా వెళ్లిపోతోంది. వెంటనే ఓడలో స్త్రీలంతా చక్కగా ముస్తాబై బిలబిలలాడుతూ వచ్చారు. ఆట పాటలతో, వేడుకలు వినోదాలతో ప్రయాణం సరదాగా జరిగిపోతోంది. తనకి కాలక్షేపానికి తోడుగా ఓ మిత్రుడు జతపడ్డాడని పాస్పార్టుకూడా సంతోషపడిపోయాడు.

అక్టోబరు 20, ఆదివారం మధ్యాహ్నం 12 గంటలవేళ భారతఖండపు తీరం దూరంగా కనపడింది. ఇంకో రెండుగంటల తరువాత రేవు నుంచి పైలట్ ఎదురువచ్చి మంగోలియా మీదికి ఎక్కాడు.

దూరదిగంతాలలో భూధరాలూ, జలధరాలూ అందంగా కలిసిపోయాయి. మరికొంతసేపటికి వర్తులశ్రేణి లీలగా కనబడింది. మెల్లిగా వచ్చని చెట్లు, మందమందంగా తలలూపుతూ కనిపించసాగాయి.

క్రమంగా 'మంగోలియా' కొస్తి సమీపించింది. సాల్సెట్, కొలాబా, ఎలిఫెంటా, బుచర్ ద్వీపాలలోకి వచ్చి, సాయంకాలం నాలుగున్నర గంటలకు బొంబాయిరేవులో ఆగింది. ఆ నిముషానికి ఫిలియాస్‌ఫాగ్ 33 వ ఆట గెలుస్తున్నాడు. అతను, అతని జతగాడూ సాహసించి వేసిన ఒక ఎత్తుతో 13 పట్లూ రావడంతో, అద్భుతమైన విజయం లభించింది.


అసలు మంగోలియా బొంబాయికి అక్టోబరు 22 న రావాలి. కాని వచ్చిన తేదీ అక్టోబరు ఇరవయ్యే .... అంటే లండన్ నించి బయలుదేరినతరువాత ఈ యాత్రలో ఫిలియాస్ ఫాగ్‌కు అనుకున్న గడువులో రెండు రోజులు కలిసివచ్చిందన్నమాట. వెంటనే ఫాగ్ తనపుస్తకంలో ఈ వైనం వ్రాసుకున్నాడు.

భార్య — (కొడుకుతో)
అబ్బబ్బా! ఏమిట్రా గొడవ?
నువ్వు ఛస్తే నగం పీడ వదిలి
పోతుంది గదరా!

భర్త—మిగిలిన సగమూ
నే ఛస్తే పోతుందంటావ్-
అంతేనా?

—దాస్ క. (రేపల్లె)


త్వరలో వస్తూంది!
అంజలీదేవి
NT రామారావు
SV రంగారావు
కాంతారావు
రమణారెడ్డి
మిక్కిలినేని
రమణారెడ్డి
రాజనాల
రామకృష్ణ
రాజశ్రీ
సంధ్య
S. రజనీకాంత్ సమర్పించు
శ్రీకాంత్ ప్రొడక్షన్స్
సతీ సులోచన
దర్శకత్వం:
S. రజనీకాంత్ B.A.,
రచన: కెమెరా: సంగీతం:
సముద్రాల - సి. నాగేశ్వరరావు - టి.వి. రాజు
నిర్మాతలు:
డి.వి. సూర్యారావు - కె. మాధవరావు
డిస్ట్రిబ్యూటర్సు:- ఆంధ్ర: ప్రీమియర్ ఫిలిమ్స్ (ప్రై) లిమిటెడ్ విజయవాడ.
సీడెడ్: భాస్కర్ పిక్చర్స్ గుంతకల్, నైజాం: విజయ పిక్చర్స్ సికింద్రాబాద్, మైసూర్: ప్రసాద్ ప్రొడక్షన్స్ (ప్రై) లి. బెంగుళూరు.
CHITRALEKHA
STUDIO SAREGAM



మీ న్యాయశాస్త్రపరిచయ మెంత?

మీ న్యాయశాస్త్ర పరిచయమెంతో అడగాలని మాకు, చెప్పాలని మీకు చాలా కాలంగా ఉంది. కాని ఈ అడిగింది, ఆ చెప్పేది సాధారణ న్యాయసూత్రాలను స్థూలంగా స్మరించడం అవుతుందేగాని పూర్తి విమర్శ కాదు. న్యాయశాస్త్రం శంఖంలో పోసిన తీర్థం కాదు. దేశకాలావసరాలనుబట్టి మారింది. మారుతున్నది. న్యాయశాస్త్ర విజ్ఞానం లేకపోవడం క్షేమం కాదు. మీ క్షేమమే మా క్షేమం.

(1) కాంట్రాక్టు న్యాయరీత్యా చెల్లడానికి వ్రాతమూలకంగా ఉండి తీరాలి —కాదు

చట్టరీత్యా కొన్ని కాంట్రాక్టులు చెల్లుబడి కావాలంటే అవి వ్రాతమూలకంగా ఉండాలి. అలా ఉన్నప్పుడే ఆ కాంట్రాక్టు ఉన్నట్లు ఋజువు అవుతుంది. దాని అమలు సాధ్యమవుతుంది. అయితే కాంట్రాక్టు చేసుకున్న పక్షాల ప్రవర్తన వల్ల, కొన్ని సందర్భాలలో వ్రాతమూలకంగా లేకపోయినా కాంట్రాక్టులు చెల్లడం కద్దు. మరి కొన్ని చోట్ల కాంట్రాక్టు చేసుకునే విధానాన్ని బట్టి వ్రాతమూలకంగాను, నోటిమాట ప్రకారం గాను, ప్రవర్తన పరిస్థితులను బట్టి మిశ్రమంగా ఉంటాయి. అంటే కొన్ని షరతులు వ్రాతలో వుంటాయి. మరికొన్ని పరస్పర అంగీకారంమీద ప్రవర్తనా మాత్రంగా ఉంటాయి.

(2) సాధారణంగా జూదం న్యాయ సమ్మతం కాదు —కాదు

కొన్ని ప్రత్యేక విషయాలకు సంబంధించిన న్యాయ శాసనాలను 'స్పెషల్ లాస్' అంటారు. ఎక్సయిజు నల్లమందు, జూదం, పశువులు విచ్చలవిడిగా తిరగడం వీటిపై సుంకం విధించడాన్ని గురించి భారతీయ శిక్షాస్మృతి (ఇండియన్ పీనల్ కోడ్) 40, 41 సెక్షన్లలో ఈ 'స్పెషల్ లాస్' ఉటంకించబడినాయి. వీటి దృష్ట్యా న్యాయ సమ్మతంగా చెలామణి అవుతున్న కొన్ని పనులు కొత్తగా నేరాల క్రిందకు వస్తాయి. శిక్షాస్మృతి ప్రకారం, ఈ క్రొత్త నేరాలు దండనార్హం అవుతాయి.

(3) రహదారి నేరాలు దండనార్హములు. —అవును

భారతీయ శిక్షాస్మృతిలో 279 వ సెక్షను ఈ రహదారి నేరాలు దండనార్హాలని నిర్ణయించింది. "ఎవరైతే నడివీధులలో అశ్రద్ధగాను, **అతి వేగంతోను బండి నడపడం ద్వారా గాని,** లేదా తాము వెళ్లడం ద్వారా గాని ప్రజల ప్రాణానికి ముప్పు తెచ్చినా, ఇతరులకు గాయం కలిగించినా కలిగించే స్థితికి వచ్చినా వారికి ఆరు నెలల కఠిన, సాధారణ శిక్షలుగాని, 1000 రూపాయల జరిమానా గాని రెండూ గాని విధింపబడుతాయి."

ఎం. నాగేశ్వరరావు

(4) కొన్న వస్తువులు తిరిగి ఇచ్చివేయవచ్చు. —కాదు

సామాన్యముగా కొన్ని వస్తువులు త్రిప్పివేయడానికి వీలులేదు. కాని ఆ కొన్న వస్తువులు కొనుగోలుదారు ముందుగా చూసే అవకాశం లేక చూడలేక పోయినా, కాంట్రాక్టులో పేర్కొనబడిన రకానికి చెందిఉండక పోయినా తిరిగి ఇవ్వడం న్యాయ సమ్మతమే. తాను చూడడానికి ఏమాత్రం అవకాశం ఉన్నా ముందుగా వస్తువులు కాంట్రాక్టులో చెప్పిన రీతిగా ఉన్నవో లేవో చూడనప్పుడు కొనుగోలుదారు వాటిని తిరిగి యివ్వడానికి వీలులేదు.

(5) జూదంలో ఒప్పందాలు న్యాయసమ్మతం కావు —కాదు

కాంట్రాక్టుచట్టం ప్రకారం జూదం ఒప్పందాలు, పందెముల వలెనే చెల్లవు. అంతమాత్రం చేత చట్ట సమ్మతం కాకపోవు అయితే పందెం ఒప్పందం న్యాయసమ్మతం కాదనికూడా బొంబాయి స్థానిక న్యాయ చట్టాలు తేల్చాయి. ఇలా తేలని చోట్ల పందెం ఒప్పందం ప్రభుత్వ విధానాలకు విరుద్ధం కనుక చెల్లదు. అంతేకాని న్యాయ విరుద్ధం మాత్రం కాదు.

(6) రహదారులు మరమ్మతులు లేకుండా ఉండడానికి బాధ్యత నగరపాలక సంఘానిదే. —కాదు

చట్టరీత్యా ఇదమిద్ధంగా చెప్పబడివుంటే తప రహదారుల బాధ్యత వహించే స్థానిక పరిపాలకు లోపాలవల్ల ఆ రహదారులు గనుక పాడయి వారిపై న్యాయరీత్యా ఎట్టి చర్య తీసుకో వీలులేదు.

(7) మారుపేరుతో వ్యవహరించడం న్యాయ సమ్మతం కాదు. —కాదు

లేని పేరు పెట్టుకొని వ్యవహరించడ మొక్కటే పై నేరానికి చాలదని మద్రాసు హైకోర్టు తీర్పు యిచ్చింది. "ఏదో ప్రయోజనం అర్థించి మరొక వ్యక్తిగా చెలామణి కావడం కోసం దురుద్దేశ్యంతో మారు పేరు పెట్టుకున్నట్లు ఋజువు కావాలి. ఇతర పేర్లు పెట్టుకుని ఏ దురుద్దేశం లేకుండా వ్యవహరించడం అరుదుకాదు. తప్పూకాదు.

(8) పౌరులందరికీ రిపబ్లిక్ అధ్యక్షుడయ్యే అర్హత ఉండదు–అవును

రిపబ్లిక్ అధ్యక్షుడు కాదలచే వ్యక్తికి 35 సంవత్సరాల వయస్సు ఉండాలి. పార్లమెంటు సభ్యుడుగా ఎన్నిక కాదగిన అర్హతలు ఉండాలి. ప్రభుత్వం కింద జీవికకు ఉద్యోగం చేసిఉండరాదు.

(9) జీవిత భీమా పట్టాలో పేర్కొనబడిన ధనానికి హక్కుదారు పేరు ఆతని అనుమతి లేందే మార్చరాదు —కాదు.

భీమా చేసినవాని అభిమతం ప్రకారం గాని, భీమా పట్టా (ఇన్సూరెన్సు పాలిసీ) పరిపక్వమయ్యే ముందు అతను వ్రాసిన విల్లు ప్రకారం గాని హక్కుదారు పేరు తొలగించడమో, మార్చడమో చేయువచ్చును.

(10) మీకు చదవడం రాకపోయినా సరే మీ పేర జరిగిన కాంట్రాక్టుకు మీరే బాధ్యులు. —కాదు

కాంట్రాక్టు ఉపపాదనం, అంగీకారం ఈ రెంటివల్ల ఏర్పడుతుంది. అవి రెండు గాని, ఏ ఒకటి గాని లేకపోతే కాంట్రాక్టు లేనేలేదు. మోసంచేసి తాను తలపెట్టని, అంగీకరించని కాంట్రాక్టు మీద సంతకం పెట్టిస్తే అక్కడ అంగీకారం లేదు. కనుక కాంట్రాక్టు లేదు. దానితోబాటు **బాధ్యత కూడా లేదు.**

(11) కాంట్రాక్టులు చేయడానికి చ్చివారు అర్హులే. —అవును

చట్టరీత్యా పిచ్చివాళ్ళ ఒప్పందాలు చెల్లవు. ుతే మానసిక ఆరోగ్యం బాగా ఉండి పిచ్చి తొలగినప్పుడు మానసిక చికిత్సాలయంలో ఉడే పిచ్చివారు కూడా కాంట్రాక్టులలో దిగ ప్పను. వారి ఆస్తి పంపకాలు చట్టరీత్యా చెల్లు యి. వ్రాసే వీలునామా, చేసే అమ్మకం చెల్లు యి. కాని అతని తరపున వీటి అమ్మకం,

మీ న్యాయశాస్త్ర...


పంపకం జరపడానికి ఒక కమిటీ కనుక ఉంటే అతని చర్యలు చెల్లవు.


(12) సంతకాలు విధిగా స్వదస్తూరిలో ఉండనవసరం లేదు.

—అవును

గంటకు 3000 చెక్కులపై సంతకాలు ముద్రించగల యంత్రాలు ఉన్నాయి. సంతకం చేయడానికి బదులు రబ్బరు స్టాంపులు వాడడం కూడా అమల్లో ఉన్నది. పై రెండు విధాల సంతకాలు చెల్లడానికి వివరంగా చదివి సంతకం చేయనక్కరలేని డాక్యుమెంట్లు అయివుండాలి.

★





గృహ జీవితంలో మార్పు

సి. కృష్ణకుమారి

"ఏమిటా గోల! పొద్దున లేచినప్పటినుండీ రాత్రి పడుకోబోయేదాకా పిల్లలమీద అరుస్తూనే వుంటావ్! ఆ మాత్రం సముదాయించుకోవటం చేతకాదా? మళ్ళీ ఆడ పుట్టుక..." అంటూ దూర్వాసుడులాగా శపిస్తున్నాడు మా బాబాయి పిన్నిమీద.

"అవును! మీ కంతా గోలగానే వుంటుంది. ఒక్కసారి ఈ బాధ్యత మీరు వహిస్తే నా బాధ తెలుస్తుంది. మీకు ఎంతకీ ఆఫీసు, రేడియో తప్ప ఇతర విషయాలేవీ పట్టవ్. ఇంటెడు చాకిరీతోను, పిల్లలతోను నేను సతమతమయిపోతుంటే నా బాధని అరంచేసుకునేదెవరు? ఇంత చేసినా సంతోషించేదెవరు? విసుక్కోవటం తప్ప మీకేమీ తెలియదు" అంటూ సమాధానమిస్తోంది పిన్ని.

"అవునవును. ఆఫీసు పనిగాక, మగవాళ్ళకి వంటకూడా చేసే పాపం! మీ ఆడవాళ్ళు రాణీల్లాగా కూర్చుంటారు కాబోలు! ఆఫీసు పని అంటే అంత తేలికగా వుందా? అయితే నన్ను అంట్లు తోమమంటావా? ఇల్లు చిమ్మమంటావా? సంసారాన్ని సరిదిద్దుకోవటం చేతకాకపోతే సరి! ఎదురింటి సరోజ చూడు ఎంత తెలివిగలదో! అటు ఉద్యోగమూ, ఇటు సంసారమూ ఎంత నేర్పుగా, ఓర్పుగా నిర్వహిస్తున్నదో!" అంటూ కళ్ళెర్ర చేసి హుంకరించాడు బాబాయి.

ఇంతలో మూడేళ్ళ పిల్లవాడు ఏడుస్తూ తండ్రి కాళ్ళను చుట్టేసుకుని తల్లి కొట్టిందని ఫిర్యాదు చెయ్యబోయాడు. 'నోర్మూసుకోరా గాడిదా!' అంటూ అవతలికి నెట్టేసి వెనక్కి తిరిగాడు.

పిన్నిని చూద్దామని వాళ్ళింట్లో అడుగుపెట్టిన నేను, దంపతుల వాగ్వివాదాలు విని ముందుకు వెళ్ళలేక, తిరిగి వెనక్కు వెళ్ళలేక ఏం చెయ్యాలో తోచనిపరిస్థితుల్లో నిలబడిపోయాను.

మా బాబాయి నన్ను చూసి తెల్లబోయాడు. పిన్నికూడా నిర్ఘాంతపోయింది. ఇంతలో తమాయించుకొని, ఆహ్వానించారు నన్ను.

మధ్యాహ్నం జరిగిన గొడవగురించి. అందుకావిడ సమాధానం ఇది:

"ఈ గొడవలు మా ఇంట్లో మామూలేనమ్మా! అసలు ఆడదాని బాధలు మగవాడు అర్థం చేసుకుంటేగాని సంసారాలు బాగుపడవు. ఇటు పిల్లలతోను, అటు పనితోను సతమతమయిపోతుంటాను కదా! ఆయన ఆఫీసుకెళ్ళే వాళ్టికి వంట అవ్వాలి. ఈ లోపల పెద్ద పిల్లల్ని తయారుచేసి బడికి పంపాలి. ఒక్క క్షణం తీరదు. ఈసందట్లో చిన్నపిల్లలిద్దరూ వంట ఇంట్లో చేరి నానాగోలా చెయ్యటం, ఆపైన ఏదో కోపంతో యేడుపులు లంకించుకోవటం జరుగుతుంది. ఈ గోలంతా వింటూ ఆయన నాపైన విసుక్కుంటారు తప్ప, ఆ పిల్లలిద్దర్నీ కొంచెం కనిపెట్టి చూడనన్నా చూడరు. నాబాధ ఎవరికిచెప్పుకునేది? నేనేం ఆయన్ని అంట్లు తోమమని గాని, ఇల్లు చిమ్మమని గాని అనేటంతటి హీనురాలిని గాను. నేను ఒక్క క్షణం తీరికలేకుండా పనిలో వున్నప్పుడు పిల్లల్ని ఆమాత్రం కనిపెట్టివుండకూడదా? అనే నాబాధ. పైగా పిల్లలు గోల చేస్తూంటే కోప్పడకుండా, కొట్టకుండా యెట్లా జరుగుతుంది? అందుకే ఆయన ఇల్లు నరకమని విసుక్కుంటూ వుంటారు" అంటూ బాధపడ్డది.

నిజంగా పిన్ని పరిస్థితికి నాకు జాలేసింది. మాపిన్నికి ఐదుగురు పిల్లలు. అంతా ఏడాది, ఏణ్ణర్థం వారలో వున్న చిన్న పిల్లలే. వాళ్ళ పనన్నా వాళ్ళు చేసుకోలేరు. పోనీ అంతపనీ యెట్లాగో నెమ్మదిమీద తెముల్చుకోవచ్చుని అనుకుంటే, బాబాయి ఆమె చేసిన ప్రతిపనికీ వంకలు పెట్టటం, 'ఇల్లు నరకం' అంటూ వాపోవటం జరుగుతోంది.

పిన్ని బాధని అర్థం చేసుకోని బాబాయిని చూస్తే నాకు చాలా బాధనిపించింది.

మగవారంతా మా బాబాయిలాంటి వాళ్ళే అనను గాని, కొంతమంది మాత్రం అంతే. ఇటువంటివాళ్ళకు ఆఫీసు పని మాత్రమే తమ బాధ్యత అయినట్లు, అంతకన్నా సంసారంలో తమకు యెటువంటి బాధ్యతలు లేవని వాదిస్తారు. పైగా, ఆడవాళ్ళ వంటపని చాలా తేలికది అయినట్లు, అసలు కష్టమే లేనట్లు, అందుచేత ఇంటి విషయాల్లో తాము కలగజేసుకోవలసిన అవసరం లేనట్లు మాట్లాడుతుంటారు.

"ఏం మగవాళ్ళం! కుర్చీమీద కాలుమీద కాలేసుకుని కూర్చుంటేనే మా దర్జా", అనుకుని కొందరు మగవారు బజారెళ్ళి కూరలు, వెచ్చాలుకూడ తేవటానికి ఇష్టపడరు. అటువంటి సందర్భాలలో ఆడదే బజారెళ్ళి సరుకులు తేవలసివస్తుంది. లేకపోతే ఎక్కువ ధరలతో ఇంటిదగ్గర చిల్లర కొట్లలోగాని, వాకిలిముందుకొచ్చే వస్తువుల్నిగాని కొనవలసివస్తుంది. ఈపద్ధతివల్ల (ఇళ్ళదగ్గర కొనేపద్ధతి) డబ్బుఖర్చు అధికం. పైగా మంచి సరుకూ లభించదు. పోనీ ఆ ఇల్లాలే బజా

సరళ సలహా

ఆబాలగోపాలం ఆనందించే పండుగ సంక్రాంతి. కలవారి భవనాలే కాదు, లేనివారి కొంపలూ ఈపండుగ రోజుల్లో ఆనందనిలయాలే. అతిథులు అభ్యాగతులు ఆదర సత్కారాలు అమితంగాపొందే కాలమిది. ఈ అన్నిట గృహలక్ష్మిదే ప్రధానమైన బాధ్యత.

మనదేశం దారిద్ర్యానికి కాణాచిగా ఉన్న దుష్కాలమిది. కోరిన మాత్రాన అభాగ్యులస్థితి చక్కబడదు. దానధర్మాలపేరిట ఆధిక్యంతో కాక, అగతికులు అయినవారు తమవారే నన్న ఏకీభావంతో, తమ ఆనందం పంచుకోడానికి వారికీ హక్కు ఉన్నదనే విశాల హృదయంతో సంక్రాంతి పండుగ దినాలలో వారిని ఆదుకొనడం తల్లులందరి కర్తవ్యం కాదా?

క్కువేమీ అవోచ్చు. స్త్రీలు బజారెళ్ళి సరుకులు కొనే అలవాటు ఆ ప్రాంతాల్లో లేకపోవచ్చు. అందుచేతే మగవారు కొంచెం 'నామోషీ'ని, ఆ పైన 'బద్ధకాన్ని' కూడ వదులుకుని బజారెళ్ళి సరుకులు తెస్తే ఇటు ఇల్లాలికి పని తప్పించినవారూ అవుతారు అటు పైన డబ్బును ఆదాచేసినవారూ అవుతారు. మంచిసరుకూ లభిస్తుంది.

ఇంటి బాధ్యత వహించటం అంటే, 'అంట్లు తోమమంటారా? ఇల్లు చిమ్మమంటారా?' అన్న బాబాయిమాటలు చాలా వింతగా వున్నాయి. భర్త ఇంటి బాధ్యత వహించటం అంటే కేవలం అంట్లు తోమటం కాదు. ఆ పనిని భర్తకు పురమాయించటానికి ఏ భార్యా ఒప్పుకోదుకూడ. ఇంట్లో తీరిగ్గా వున్నప్పుడు, శెలవు రోజుల్లో భార్యపని హడావుడిలో వున్నప్పుడు కొంచెం పిల్లల్ని పట్టుకుందాం, వాళ్ళని ఆడిద్దాం! అనుకోవాలి మగవారు. భార్య వచ్చి నీళ్ళు తోడితేనేగాని స్నానంచెయ్యం అని పట్టుబట్టి కూర్చునేకంటే, వీలున్నంత మటుకు స్నానాదులు తామే పూర్తి చేస్తే బాగుంటుంది. మీకోక చిన్నతోట వుంటుం దనుకోండి! రోజూ 'ఆమే' చెట్లకు నీళ్ళు పోస్తుంది. ఒక్కో రోజు బద్ధకించవచ్చు. చెయ్యి తీరుకోకపోవచ్చు. ఆ పని తీరి కంటే మీరు చెయ్యకూడదుటండ! మీ ఇంట్లో పనిమనిషి వుండదు అనుకోండి! అప్పుడు మీ ఆవిడకు పనికూడ అధికంగా వుంటుంది. అటువంటప్పుడు ఆమె ఖర్మానికి ఆమెను వదిలెయ్యకపోతే నీళ్ళు తోడటంవంటి ఘోరాలా పనులే మీరు చెయ్యొచ్చుగా!

కొంతమంది స్వభావం చాలా విచిత్రం. పిల్లల్ని అప్పుడు భలే ప్రేమగా చూస్తారు. కాని వాళ్ళు ఏడ్చినప్పుడు దగ్గరికైనా రానివ్వరు. జబ్బు చేసినప్పుడు మందన్నా తెచ్చివ్వరు. ఆ బాధ్యతంతా 'స్త్రీ' దే అని వదిలేస్తారు. పిల్లలు చదువుకుంటున్నదీ లేనిదీ, బడికి సరిగ్గా వెళ్తున్నదీ లేనిదీ కూడ కనుక్కోని సందర్భాలలో పిల్లల భవిష్యత్తు నాశనమవుతుంది. తండ్రి భయంలేని పిల్లలు తల్లిని లెక్క చెయ్యరు.

పోని, ఇంట్లో పనులు చెయ్యటం 'నామోషీ'యే అవొచ్చు మీ దృక్పథంలో. అటువంటప్పుడు భార్య చేసేపనుల్లో అతిగా లోపాలు ఎంచకండి. కనీసం మీ సానుభూతయినా ఆమెకు అందజెయ్యండి. అంత మాత్రంతోనే ఆడది ఆనందపడుతుంది. భార్య భర్తని ఎంతగా ప్రేమించి, భర్తకోసం, పిల్లలకోసం ఎంతగా పాటుపడుతుందో, ఆమె భర్తనుండి కూడ అటువంటి ప్రేమనే కోరుతుంది. అటువంటి సందర్భాలలో భర్త భార్యకి పనిలో సహాయ పడనక్కరలేదు. కేవలం సానుభూతితో, ప్రేమతో ప్రవర్తిస్తే చాలు. అంతేగాని, చీటికీ మాటికీ భార్యపనిని ఈసడించుకుంటూ, 'ఇల్లు నరకం' న్నంత శోభుండో ఆలోచిస్తే తెలుస్తుంది. అందుచేతే భార్యాభర్తల మధ్య మనస్పర్ధలు విపరీతంగా ప్రబలిపోతుంటవి.

కొందరు మగవారు తమ దర్జా తమదేగాని, ఇంట్లో పిల్లల సంగతీ, పెళ్ళాం సంగతీ అసలు పట్టించుకోరు. ఎంతో ఆవున్న డబ్బులో తమ సోకుళ్ళ ఖర్చులు, సినిమా ఖర్చులే చూసుకుంటారుగాని, భార్యమాట ఏమాత్రం ఆలోచించరు. ఆమె రెండే రెండు చీరల్తో నానా అవస్థపడుతూంటుంది. పిల్లల బట్టలు చిరిగిపోతాయి. స్కూళ్ళకు జీతాలు కట్టాలి. కాని, ఆయనగారు మాత్రం నోట్లో 'కిళ్ళీ' బిగాయించి దర్జాగా తిరుగుతాడేగాని, తన ఖర్చులేమాత్రం తగ్గించుకోడు. పెళ్ళాం బిడ్డలకు ఏమాత్రం బట్టలు కొనివ్వడు. ఒకవేళ ఆ భార్య కొంచెం గడుసరిదే అయి ఆయన మీద ఎదురుతిరిగితే, ఆ బాధ పడలేక ఏం అప్పోచేసి ఇంట్లో,అవుసరాలు గడుపుతాడు. ఆ తర్వాత గండంకూడ భార్యకే! ఆయన అప్పులు తీర్చకపోతే, అప్పులవాళ్ళంతా ఆవిడ పైనే దండెత్తుతారు. వాళ్ళకు సమాధానం చెప్పేటప్పటికి ఆమె అవస్థ దేవుడికే తెలియాలి. అందుచేతే మగవారు తమ ఆదాయాన్నిబట్టి కూడ ఖర్చులు పెట్టాలి. ఒకవేళ భార్య గనుక 'దుబారా' ఖర్చులు చేస్తూంటే భర్త ఆమెను అదుపులో పెట్టాలిసిందే.

ఒక అల్లుడు అనుకుంటాడు ఇకనుండీ తనబాధ్యతీ, తనభార్య బాధ్యతకూడా మామగారే వహించాలని. భార్యకు కావలసిన బట్టలూ అవీకూడ మామగారే ఏళ్ళతరబడిన కొనివ్వాలి. లేకపోతే ఆ భర్త భార్యని హింసిస్తాడు. కాని! ఇటువంటి అల్లుళ్ళకు నాదొక చిన్న సలహా! మగవారు భార్యనీ, పిల్లల్ని పోషించుకునే శక్తి లేనప్పుడు పెళ్ళి చేసుకోవటం మానుకోవటమే వుత్తమం. అంతేగాని, పెళ్ళయ్యాక మామగారి బాధ్యతతోపాటు, అల్లుడి బాధ్యతకూడ మామగారే వహించాలి అనుకోవటం కేవలం ఆ అల్లుడి నీచత్వానికే నిదర్శనం.

అందుచేతే సంసారంలో ఒక్కడబ్బు సంపాదించటమే కాదు, సంసారంయొక్క మంచి-చెడులుకూడ పరిశీలించే బాధ్యత భర్తది. భార్య నిర్వహించే బాధ్యతని అజమాయిషీచేసి ఆ బాధ్యత సక్రమంగా నిర్వహించేటట్లు చెయ్యటంకూడ భర్త బాధ్యతే. సంసార శకటానికి స్త్రీ పురుషు లిద్దరూ రెండు చక్రాలు. ఏ ఒక్క చక్రానికి బాధ్యత ఎక్కువైనా బీటవారినా ఆ బండి నడవటం కష్టం. అందుచేతే 'స్త్రీ' అయినా తలకుమించిన బాధ్యతను నిర్వహించినప్పుడు జబ్బుల పాలవుతుంది.

కాలంతోపాటు మన పద్ధతుల్లోనూ మార్పురావాలి. ఇందిరాగాంధీ ఏమని చెప్పారు? మగవారుకూడ వంట నేర్చుకుని వుండాలని చెప్పలేదూ! (భయపడకండి! ఆడవాళ్ళు మగవారిచేత వంట చేయించేటంతటి పరిస్థితులు రారాదనే నా వుద్దేశం) కొంతమంది మగవారికి భార్య వుద్యోగం చెయ్యాలని వుంటుంది. నానా శ్రమపడి ఆమెకు ఒక వుద్యోగం సంపాదించిపెడతారు. అంతటితోనే వాళ్ళబాధ్యత తీరిపోతుంది. అంతూ దరీ లేని ఇంటిపనితోను, ఆఫీసుపనితోను ఆమె హైరాన పడుతుంది. ఆ భర్తమాత్రం బొత్తిగా కలగజేసుకోడు. అట్లాగాకుండా భర్తకూడ ఇంట్లో వున్నప్పుడు 'సరదా'క్రిందే తీసుకుని చిన్న చిన్న పనులు చేసిపెడితే బాగుంటుంది. నా స్నేహితురాలు సరోజ,ఆమె భర్త ఇద్దరూ వుద్యోగాలు చేస్తున్నారు. ఆయన ఇంట్లో వున్నప్పుడు సరోజకు పనిలో అంతో—ఇంతో సహాయపడతాడు. సరోజ వంటపనిలో వున్నప్పుడు, పిల్లల్ని వంటఇంట్లోకి పోనివ్వకుండా, కబుర్లుచెప్పి నవ్విస్తాడు. తను స్నానంచేస్తూ పిల్లల్నికూడా స్నానం చేయిస్తాడు. తను అఫీసుకెళ్తూ, పిల్లల్ని బడిదాకా దింపివెళ్తాడు. ఇట్లా ఇంట-బయటకూడబాధ్యతతో ప్రవర్తించి, 'మగవాడు లేకపోతే ఆడదానికి ఒక్క నిమిషంకూడ జరగదు' అనిపించేటట్లు ప్రవర్తించే మగవారూ చాలా మంది వున్నారు. అటువంటి వాళ్ళకు నా 'జోహారు' అర్పిస్తున్నాను. 'మగవాడు' అంటే అఫీసుమనిషి మాత్రమే అనుకునే మగవారి దృక్పథంలో రవ్వంత మార్పు గోచరిస్తుందేమో అనే సత్సంకల్పంతోనే ఈ వ్యాసం వ్రాశాను. ఏమీ అనుకోరుగా!

ఆఫీసుపనులు ఎక్కువగా వున్నప్పుడూ, తీరిక లేనప్పుడూ మగవాళ్ళు ఇంట్లో బొత్తిగా బాధ్యత వహించటంలేదని స్త్రీలు బాధపడకూడదు. సమయా సమయాలనెరిగి భార్య భర్తకు అధికమైన బాధ్యతను (అంటే ఇంటి బాధ్యతనుగురించిన విషయాలు) వప్పగించాలి. విశ్రాంతి సమయాల్లో భర్తకూడ, ఇంట్లో తమకుగల ఇతర బాధ్యతను నిర్వహిస్తుండాలి. ఉదా:— పిల్లల చదువునుగురించి శ్రద్ధ తీసుకోవటం లాంటివి. అప్పుడే 'గృహం అంటే నరకం' కాకుండా, 'గృహమేకదా స్వర్గసీమ' అని

ఒకరు— నాటకాల్లో
వేషాలు వేయాలని ఉంది
కాని ఏం లాభం? నాస్వరం
గార్దభస్వరమోయ్!
మరొకరు—స్వరానికితగ్గ
వేషం వేయరాదూ?

పి. హరిగోపాలరావు (తెనాలి)

సంసార జీవితం సుగమంగా సాగాలంటే సూత్రధారులిద్దరూ సమానబాధ్యత పైన వేసుకోవాలి. ఒకరు ఎండకులాగి, మరొకరు నీడకులాగితే సంసారశకటం గతుకులబాట వెంట మందంగా, అతికష్టంలో బాధాకరంగా పయనిస్తుంది. ఆలుమగల పరస్పర సహకారం లేనిదే సంసారజీవితం సుఖమయం కానేరదు. విభిన్న వ్యక్తులమధ్య ఎల్లప్పుడూ భేదాభిప్రాయాలు వుంటూనే వుంటాయి. కాని వారిద్దరూ ఏకరాజ్యాన్ని ఏలవలసి వచ్చినప్పుడు చెరొక దారినిబట్టి రాజ్యాన్ని అల్లకల్లోలం చేస్తారా? అందులోనూ సంసార సామ్రాజ్య నిర్వహణ గురుతరబాధ్యత. ఆలుమగలు అన్నింటిలోనూ ఒకరితో మరొకరు ఏకీభవించలేకపోవచ్చుకాని సంసార జీవితం పూలపాన్పు చేసుకోవటానికి పరస్పర సహాయం అత్యవసరం.


ఈ భారాన్ని సక్రమంగా మోయటంలో భార్యాభర్తలిద్దరికీ సమానబాధ్యత వుంది. అనాదినుంచి పురుషుడు ధనసంపాదనకు, స్త్రీ గృహనిర్వహణకు అలవాటుపడ్డారు. అయితే పురుషుడు గృహనిర్వహణలో స్త్రీకి, ధనసంపాదనలో పురుషుడికి స్త్రీ సాయపడకూడదని ఎక్కడా లేదు. ఆమాటకొస్తే, వారు ఒకరికొకరు సాయం చేసుకుంటూనే వుండాలి.

క్రొత్తగా పెళ్ళయిన వధువుకు అత్తగారి పాలనలోనూ, ఆడబడుచు దండనలోనూ సంసారం సాగించటం ఇష్టం వుండదు. అందుకని అందరినీ అమాంతం వదిలేసి వేరే కాపురం పెట్టుకుందామని పోరుపెడితే భర్త మనస్థితి ఎలా వుంటుందో కాస్త ఆలోచించండి! కట్టుకున్న పెళ్ళాన్ని కాపాడాలో, కని పెంచిన తల్లికి [illegible] మధ్యలోపడ్డ ఎటుకాక కటకటలాడుతూ ఇద్దరిచేత మాటలంటుంటూ 'పెళ్ళి చేసుకోవటం ఎంత పొరపాటు!' అని మనశ్శాంతి లేకుండా మధనపడే అవకాశం వుంది. పుట్టింట్లో అక్కచెల్లెళ్ళు అన్నదమ్ముల మధ్య మసిలినట్టే ఇక్కడా మసలటం నేర్చుకోవాలి గాని అర్థంలేని కోర్కెలతో భర్తనూ తప్ప మరెవరూ వుండకూడదంటే మిగతావాళ్ళంతా ఏమైపోవాలి? మంచి మాటలతో అందరి మన్నన పొందాలి. కలిసి వున్నంతలో గృహాన్ని స్వర్గసీమగా దిద్దుకోవాలి. అంతేగాని ఇరుగమ్మలకూ, పొరుగమ్మలకూ వున్న అదృష్టం తనకులేదని భర్తను ఆడిపోసుకోవటంలో అర్థంలేదు. పెళ్ళికాని ఆడబడుచు తన చదువుకోసం భర్త సంపాదనంతా తినేస్తుందని భర్త ముందు అక్కసు వెళ్ళబుచ్చుకుని రాద్ధాంతం చేస్తే ప్రయోజనం ఏమన్నా వుందా? తన భర్త సంపాదన మీద తనకే హక్కని, మరొకరి మీద కానీ కూడా ఖర్చు చేయటం వృథా అనే భావంతో చీటికీ మాటికీ భర్తను చికాకుపెట్టటం విశాల దృక్పథం కాదు. పెళ్ళిలో కట్నం బాపతు డబ్బు ఇంకా తీసుకురాలేదని, పండక్కి మంచి రిస్టువాచీ ప్రజంటు చెయ్యలేదని లేనిపోని వంకలతో అస్తమానం భార్యను వేధించుకు తినడమూ భావ్యం కాదు.

భార్యలో సంకుచిత భావాలు పొడచూపితే భర్త సున్నితంగా లాలించి సర్దుబాటు చేసుకోవాలిగాని కాపురమంటే కూడలెత్తేలా మోటుగా దండించటం సమంజసం కాదు. భార్య భర్తను అర్థం చేసుకోవటానికి ప్రయత్నించాలి. అంతేగాని అస్తమానం అలకలు సాగించి పుట్టింటికిపోవటం మార్పించే పనేనా? వివాహబంధనం త్రెంచుకుంటే పోయేదికాదు. ఎన్ని భేదాభిప్రాయాలు వచ్చినా వారిలో వారు సర్దుకుపోవాలి కాని ఒడుదుడుకులకు జడిసి, సంసారాన్ని కాలదన్నుకుంటారా? ముళ్ళకు జడిసి గులాబీని ముడుచుకోవటం మానినామా? తొలిరోజుల్లో ఒకరినొకరు సరిగా అర్థం చేసుకోలేకపోతే ఆ జన్మాంతం దాని ప్రభావం అంతో ఇంతో కనబడుతూనే వుంటుంది.

తెల్లవారుఝామున పాలింటికి పాలవాడు కేక వేస్తే మెలుకువ వచ్చినా మరింత ముడుచుకుని పడుకుని పెళ్ళాన్ని లేపాల్సిందే కదా! ఆఫీసు పనితప్ప, ఇంటి పనులేవీ తనవంతు కాదనుకోవటం ఎంతపొరపాటు! పదింటికి ఆఫీసుకు వెళ్ళటంకోసం ఎనిమిదింటికే అన్ని ఆదరువులతో వంట కాలేదని ధూంధాంలు ప్రారంభిస్తే ఎలా? అక్కడికీ భార్య పురుకులు పరుగులతో పని కానిస్తూనే వుంటుంది. ఏ పనిమనిషి రాకనో, మరే కార

సంక్రాంతి ముగ్గు



—ఆర్. ఇందిర (ఖిల్లై)


బంధుజన ప్రియము
SPECIAL HOTEL BLEND
BROOKE BOND
SPECIAL HOTEL BLEND
BROOKE BOND
బ్రూక్ బాండ్
టీ
శ్రేష్ఠమైన తాజా టీ
బ్రూక్ బాండ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్
JWTBB 363 S


ఉంచేగనో ఎప్పుడన్నా కాస్త ఆలస్యమైతే సహనం చూపించలేరు మగవాళ్ళు. అప్పుడే కలహం ప్రారంభం! అతను ఒకటి అనడం, ఆవిడ మరొకటి అనడంతో జడివాన కురుస్తుంది గృహంలో. పనిమనిషి సరిగా రావటం లేదని, మరో మంచి పనిమనిషిని కుదిర్చి పెట్టమని మొత్తుకున్నా అది తనపని కాదన్నట్లు నిర్లక్ష్యంగా వూరుకునే పెద్దమనుష్యులు ఎంతమంది లేరు? కాస్త ఆ మాత్రం చేస్తే పుటి మునిగిపోయిందా? బజారునుంచి ఇంట్లోకి రావల్సిన కూరలుగుతించికొని మరో ఇతర విషయంలోకాని శ్రద్ధ వహించరు. అందుమూలంగా ఏలోపం కనుపించినా పెళ్ళాన్ని సాధించటం మాత్రం మానరు. భర్త ఆ మాత్రం చేదోడుగా వుండవద్దూ? భర్త ఆ వేళంలో ఏవో నాలుగూ అన్నాడని తనుకూడా వేడివేడిగా అప్పుడే నాలుగూ అంటిస్తే కలహం తారాపధాన్నంటుకుంటుంది. సమయం చూసుకుని శాంతంగా భర్తకు తన కష్టసుఖాలు చెపితే అతను అర్థం చేసుకుని సవరించుకోవటానికి ప్రయత్నిస్తాడు.

మగవాడు భార్యకు సమానగౌరవం ఇచ్చి తీరాలి. ఆఫీసులో అధికారమంతా ఇంట్లో పెళ్ళాంమీంగు చూపెట్టాలనుకోవటంలో ఏమన్నా అర్థంవుందా? ఆఫీసరుకు తనెలా భయపడతాడో అంతకు పదిరెట్లు ఎక్కువగా భార్య తనను చూసి హడలుకోవాలని కోరటం సముచితం కాదు. లోపం వున్నా లేకపోయినా చీటికిమాటికి పెద్ద కేకలేస్తూ అర్ధాంగిమీద శివంగిలా దూకటం ఎక్కువమందికి అలవాటు. ఇంట్లో ఆడదాన్ని అణచివుంచాలనే సంకుచిత భావన తప్ప మరేమీ కనపడదు. సాహచర్యం కోరి వచ్చిన చెలువపట్ల ఈవిధంగా నేనా ప్రవర్తించటం! మన్ననతో ఎదురు తిరిగినంత మాత్రాన, మనస్సు భంగపడకుండా వుంటుందా? దాంతో కలతలురేగి సంసార జీవితాన్ని కల్లోలం చేస్తాయి. స్త్రీకికూడా ఒక హృదయం వుందని, సూటిగా రాయి విసిరితే అది గాయపడుతుందని మగవాడు గుర్తించడు. పనిమనిషి, వంటమనిషిలా చూసుకోవాలనే తప్ప అర్ధాంగికి అర్హమైన గౌరవం ఇవ్వాలని ఎందుకు తోచదో!

ప్రతివిషయంలోనూ ఇద్దరూ ఒకరినొకరు సంప్రదించుకోవాలి. ఇష్టమున్నా లేక
పోయినా భార్య తన ఇష్టానుసారమే నడ
లనుకోవటం అహంకారం చాటుతుం
పేరుకు ఇల్లాలేకాని కనీసం దిగబోయే
చూసుకోవటానికికూడా కొంతమంది
వాళ్ళకు అధికారం వుండదు. అదరాబాద
ఏదో ఇల్లు కుదుర్చుకుని వెంట పడమ
నిలుచున్నపాళంగా వెళ్ళితీరాల్సిందే.
ఆ ఇల్లు వూరికి చివరలో ఇరుకుగా ఓమూల
సదుపాయంలేకుండా వుంటుంది. ప్రక
వాటావాళ్లు నీళ్ళ దగ్గ
ర లేట్ల గ్గా తగువులాడు
వుంటారు. వీటన్నిటినీ ఇల్లాలు ఎంతకని
కుని రాగలదు? అసలు ఇంటి సదుపాం
ఇల్లాలికిగాని వుద్యోగం చేసుకునే మగ
డికి ఏం తెలుసుంది? అతను ఇంటిలో
పేవి ఏవో కొద్ది క్షణాలే! ఆ ఇంట్లో మ
వలసినది ఇల్లాలు. మొగవాళ్లు ఆ సాధకబ
కాలు ఆలోచించకుండా, మంచిగా
కోసం ఏ వూరవతలో ఇల్లు తీసుకుం
భర్త ఇంటికి తిరిగి వచ్చేంత వరకూ ఇం
ఆడవాళ్లు బిక్కుబిక్కుమంటూ వుం
ల్సిందేకదా! సదుపాయంగా వున్నదీ, లే
ఎంచుకోవాల్సింది స్త్రీ. మగవారు ముఖ్యం
ఇంటివిషయంలో ఆడవారి సలహా పా
టాలి

ఇది నావంతు, అది నీవంతూ అంట
పని విషయంలో ఎక్కడికక్కడ లెక్క
వేసుకుని ఖచ్చితంగా కూర్చోవటానికి సం
రంలో వీల్లేదు. రాధ ఇంటికి ఓమారు వె
కాలంలో వెళ్లాను. వాళ్ళకుళాయి తె
వారుఝాము మూడింటికి గాని పడ
గ రాధకు రేపో మాపో నీళ్లాడే ప్రొద్దు
అయినా అలారం పెట్టుకుని ఆవేళకు లే
నీళ్ళుపట్టుకునేది. ఒకరోజు గాఢభర ఏ
నాటకానికి వెళ్లి తెల్లవారుఝామున మూ
టికి ఇంటికివచ్చారు. రాధ తలుపు గడి
తీసి మళ్ళీవెళ్లి ప్రక్కమీద బద్ధకంగా ప
కుంది. కాసేప్పటికి ఆయన కుళాయివస్తు
శబ్దంవిని రాధదగ్గరకువచ్చి 'లే, లే' నీళ్లుప
తున్నాయి పట్టుకో' అంటూ లేపారు. రాధ
బద్ధకంతోపాటు కొద్దిగా కోపంకూ
వచ్చింది. అయినా మెల్లిగా "కాస్త రబ్బ
గొట్టం తగిలించేద్దురూ ఎలాగా లేచేవున్నా
కదా?" అంది. దానికి ఆయన మంచమెక్కి
ముసుగుదన్నుతూ 'నీ యిష్టం! పడితేపట్టుక
లేకపోతే మానుకో. నా పనికాదు' అంట
గోడవేపుకు తిరిగి పడుకున్నారు. ఇక చూ
కోండి, రాధకు నసాళానికంటింది. 'ఓహ
మీరు నీళ్ళు వాడుకోరు కాబోలు!
నొక్కరికేనా అవసరం?' అంటూ అం
కుంది. ఈ గందరగోళానికి మెలకువ వచ్చి
నేను ఎందుకొచ్చిన తగవులే అంటూ వె
బోతే నన్ను చెయ్యిపట్టుకుని ఆపింది రా
మరింక ముసురికి తెల్లారేవరకూ నిద్రపడి
ఒట్టు! తెల్లారిచూస్తే నీళ్ళడ్రమ్ములో ఒక

సంక్రాంతి ముగ్గు



—లక్ష్మీకాంతం (తెడువాయి)

క్కా నీళ్ళు లేవు. ఆయన చక్కగా
ల్చీలో వున్న కాసిని నీళ్ళూ పోసేసుకుని
సు కెళ్ళిపోయారు. రాధకు మతింత
ండినా ఏం చెయ్యలేక నానా అవస్థపడి
రింట్లోనుంచి నాలుగు బిందెల నీళ్ళు
సుకొచ్చింది. ఆయన ముఖంలో కనీసం
ధపట్ల సానుభూతైనా కన్పించలేదు. ఆ
త్రం సాయంచేస్తే అరిగిపోతారా? కాస్త
ప్పరు గొట్టం కుళాయికి తగిలించేస్తే
మ్మ అదే నిండి వూరుకుంటుంది. అగు
రైనా నూరుఆరైనా ఆపని రాధ వంతేనని
యనవాదం! ఆ తర్వాత వారిద్దరి మధ్యా
లరేగిన బీభత్సంమాట అడిగేరూ? ఒకరి మీద
రికి గౌరవం వుండి, ఒకరికొకరు సహాయం
సుకుందామనే సదుద్దేశం వుంటే ఈ కలతలు
దుకు వస్తాయి?

మాతగా స్త్రీ నిర్వహించవలసిన పాత్ర
ష్టమైనది. పిల్లల గుణగుణాలను తీర్చి దిద్ద
ంలో తండ్రికన్నా తల్లే ఎక్కువ బాధ్య
లు. పిల్లలు తల్లి సమక్షంలోనే ఎక్కువ
లం గడపాల్సి వుంటుంది. ఆ సమయాన్ని
గా చెయ్యకుండా తల్లి వారికి చక్కని
మశిక్షణ ఇవ్వాలి. స్త్రీ కుండే ఓర్పు,
సం, ఆదరాభిమానాలు మగవారికుండవు.
లను లాలించటంలో స్త్రీకున్న నేర్పు
రుషుడి కేదీ? పిల్లసంరక్షణ స్త్రీల
తు. అలాగని వారి ఆలనా పాలనతో
డికి నిమిత్తం లేదనికాదు. పిల్లలను
ళ్ళో చేర్పించటం దగ్గరనుంచి, వాళ్ళ
ందూ మాకులవటను ఒక్క స్త్రీదే బాధ్యత
సం కేవలం మూర్ఖత్వం! పిల్లలకు రోగా
చ్చినా పట్టించుకోని మగవాళ్ళు ఎంత
ంవో! డాక్టర్ల వెంట తిరగలేక ఆడవాళ్ళు
ంత సతమతమవుతారో భగవంతుడికే
లియాలి? పిన్ని పిఠాపురం వెళ్ళినకొత్త.

ఆలుమగలు

వాళ్ళబ్బాయి రెండు రోజులనుంచి జ్వరంతో పడుకున్నాడు. ఎవరైనా డాక్టరును చూసి పెట్టమని అడిగితే మా బాబాయి 'డాక్టరును చూసేదేముందే? ఎవరిని కనుక్కున్నా పోతుంది. అదేదో నువ్వు చూసుకోలేవు. నన్ను బాధించక! నాకసలే అవతల అర్జెంటుగా పనుంది', అంటూ అవతలకు వుడాయించారు. పిన్ని ప్రక్క ఇంటివాళ్ళ డాక్టరుకు చూపించింది. ఆయనా రెండురోజులు ట్రీట్మెంటు చేశాక, బాబాయికి ఓ మధ్యాహ్నం అబ్బాయి అనారోగ్యం గుర్తుకొచ్చింది. ఇంకా జ్వరం తగ్గలేదని పిన్నిమీద మండి పోతూ, ఆ డాక్టరు ఎం. బి. బి. ఎస్. చదువుకోలేదని, చవకగా వచ్చాడని ఎవరినో ఒకరిని పెట్టుకోవటమేనా అని నానా మాటలూ అని అప్పటికప్పుడు వెళ్ళి ఓ ఎం. బి.బి. ఎస్. చదివిన ఆంగ్లో ఇండియన్ డాక్టరును లాక్కొచ్చారు. ఆయన రాగానే ఒక ఇంజక్షనిచ్చి, మళ్ళా రేపొద్దున్న వస్తానని వెళ్ళిపోయారు. మర్నాడు ఎంత చూసినా జాడలేదు. బాబాయి ఆఫీసు నుంచి ఇంటికి రాగానే, ఆయన ఇంటి చుట్టూ తిరిగి చివరికి ఎలాగైతేనేం మరో రెండు గంటలకు డాక్టరును తీసుకొచ్చారు. అలా బాబాయి కొడుకుని చూస్తుంటే తప్పనిసరిగా రెండురోజులు మొహమాటానికొచ్చి మూడోరోజున 'మరేం అనుకోకండి. నాకు రావటానికి తీరిక చిక్కటంలేదు. మా నర్సింగ్ హోంలో చేర్పించండి' అంటూ తుర్రుమన్నాడాయన. ఆ

తర్వాత నర్సింగ్ హోంలో చేర్పించటం, వారంరోజుల జ్వరానికి వందరూపాయిలు వదుల్చుకోవటం జరిగిందనుకోండి! ఇంతకూ చెప్పొచ్చేదేమంటే ఆ తర్వాత ఇంట్లో ఎవరికి వంట్లో బాగోలేకపోయినా పిన్ని పాత డాక్టరును పెట్టుకోవడానికి జడిసి, ఈ క్రొత్త డాక్టరును పెట్టుకుంటే ఆయన ఒకంతట రాక నానాతిప్పలూ పడేది. డాక్టర్ను కుదిర్చిపెట్టడంతో బాబాయి బాధ్యత తీరిపోయి మరింత పట్టించుకోవటం మానేశారు. అంతేగాని, తనకూ అందులో సమానమైన చేయివుందని కాని, పిన్నికి చేదోడువాదోడుగా వుందామని కాని ఆయనకుతోచదు.

పిల్లల చదువు విషయంలో కూడా ఆడవాళ్ళు యథాశక్తిగా తగుబాధ్యత వహించగలరు. ఆట పాటలద్వారా, కమ్మని కథల ద్వారా వారికి ఇటు చదువును, అటు కాలక్షేపాన్ని కలిగించవచ్చు. అతిథి సేవలోనూ, గృహాన్ని తీర్చిదిద్దుకోవటంలోనూ భార్యకు భర్త అండదండగా వుండాలి. ఇల్లును చూసి ఇల్లాలిని చూడమన్నారు. ఇంటిని శుభ్రంగా అందంగా అలంకరించుకోవటం ఆడదాని వంతు. అందుకు తగిన విధంగా సహకరించటం మగవారి వంతు. ఇంటికి నలుగురు చుట్టాలొస్తే చిటపటలాడుతూ, లేనిపోని జబ్బు నటిస్తూ మంచంఎక్కి పడుకుంటే, గృహయజమానికి ఎంత తలవంపులు! వచ్చినవారిని ఆదరించటం ఇల్లాలి పని కాదా? 'మాకేం పోయింది, చాకిరీ చేయలేక నా నడుం పడిపోతున్నదే' అని భాగవతం విప్పి తనపరువు నడివీధికెక్కించే భార్యపట్ల భర్తకు ఏ విధమైన గౌరవం వుంటుంది? నడిబజారుపాలు కాకుండా ఇద్దరూ సహకరించటమే అన్ని విధాలా శ్రేయోదాయకం.

పోతే ఆర్థిక పెత్తనం ఎవరికుండాలనేది

అంతు తెగని సమస్య! ఇంటి ఖర్చులకు కూడా భార్య చేతిలో కాని పెట్టకుండా, అడిగినప్పుడల్లా విసుక్కోవటం భర్తకు గానీ, నయా పైసతో సహా జీతమంతా అంది పుచ్చుకుని, సిగరెట్లు ఖర్చుకైనా కాస్త విదపక పోవటం భార్యకు గానీ న్యాయం కాదు. పెత్తనం వహించటంలో ఆడదానికి సరదా! అంతే గాని ఆ భారం తాను నిర్వహించగలనా, లేనా అనే ఆలోచనే ఉండదు.

చెరో కాస్తా ఇద్దరూ చేతులో వుంచుకుని, సక్రమంగా గృహ నిర్వహణ సాగించటం మంచిది పోతే పొదుపు విషయంలో ఇద్దరూ జాగరూకత వహించాలి. వచ్చిందంతా ముందూ వెనకా చూసుకోకుండా ఖర్చుపెట్టడం మంచిది కాదు పిల్లల విషయంలో కాని, యాత్రలు చేయటానికైనా గాని, డాక్టరు ఖర్చుకు గాని ఇంతో అంతో వెనకేసుకోకపోతే మహా ఇబ్బంది! చీటికీ మాటికీ చీరలు కావాలని, నగలు కావాలని భర్తను విసిగించే కంటే తాహతుకు తగిన ఖర్చుపెట్టుకోవటం మంచిది. ఆశకంతమేముంది? వున్నకొద్దీ కావాలనే వుంటుంది; అలా అని అర్థంపర్థంలేని ఖర్చులు ఎన్ని పెట్టుకోగలం? సాధ్యమైనంత పొదుపుగా అన్నీ సమకూర్చుకోవాలి మగువలకు అలంకారం మీద మక్కువ. పూలంటే మరింత మనసు పడతారు. రోజూ ఎంతో తగలేసి కొనుక్కునే కంటే, ఇంట్లోనే ఒక మల్లె అంటు వేసుకుంటే తనివిదీర తృప్తిగా పెట్టుకోవచ్చు. అంతగా పెరడు లేకపోతే, ఏ గులాబి మొక్కో, చామంతి మొక్కో కుండీలలో వేసి పెంచుకోవచ్చు. ఈ విధంగా డబ్బు ఆదా చేసుకోవటమే గాక, గృహానికి గృహాలంకరణకు కూడా సొగసులు చేకూర్చవచ్చు. వున్నంతలో కూరగాయలు పండించుకుంటే, ఖర్చు కొంతవరకు తగ్గించవచ్చు. మగవారు కాఫీ హోటల్ కు, సిగరెట్లకు, వినోదాలకు క్రిందూ మీదూ కానకుండా ఖర్చు పెడుతుంటారు. అందుకోసం అనవసరంగా ఘర్షణకు దిగక, వారి దురలవాట్లను సాధ్యమైనంత వరకూ మాన్పటానికి ప్రయత్నించాలి పురుషుడు కూడా తగిన సహకారం ఇవ్వకపోతే లాభంలేదు. తన దురలవాట్లు తొలగించుకోవటానికి భర్త సుముఖత చూపించాలి. అందుకు భార్య కాస్త ఓపికపట్టి వ్యవధినివ్వాలి. ఏదైనా పట్టుబడటం సులభం కాని పోవటం అంత తొందరగా అయ్యేపనా?

పొదుపు విషయంలోనే కాదు, ఇంటిపనిలో పూచికపుల్ల కూడా ముట్టుకోరు కొంతమంది. చంటిపిల్ల ఇల్లు ఎగిరిపోయేలా ఏడుస్తున్నా కనీసం భార్య వచ్చి తీసుకునేంతవరకు ఎత్తుకోవటం కూడా నామోషీ అనుకోవటమే కాక ఆధాటికి ఓర్చలేక పెళ్ళాంమీద ప్రతాపం చూపిస్తారు. సరే ఏనాడైనా ఇల్లుకదిలి



టేబుల్ క్లాత్ కు, రేడియో కవర్ కు రన్నింగ్ బోర్డర్ డిజైన్

—సుహాసిని (రాజమండ్రి)

బయటకు వెళ్ళితే అమ్మకన్న అరడజను మందీ అమ్మచుట్టూ వుండాల్సిందే తప్ప అయ్యగారి దగ్గరకు చేరటానికి వీల్లేదు. పిల్లలంటే సరదా వుండి అప్పుడప్పుడూ ఎత్తుకునే అలవాటుంటే అలుసుతీసుకుని అస్తమానం బంట్రోతులా మోయించే ఆడవాళ్ళూ లేకపోలేదు. ఒకరిమీద మరొకరు పెత్తనం చెలాయించాలనుకునేకంటే స్నేహితుల్లా సమాన గౌరవాలను ఇచ్చి పుచ్చుకుంటూ సంతోషంగా కాలంగడపటం హర్షించదగ్గది.

దాంపత్యజీవితంలో ఒకరి వ్యక్తిగతాభిప్రాయాలను మరొకరు మన్నిస్తూ వుండాలి. భర్త నాస్తికుడైతే భార్య దైవాన్ని కొలవరాదని దండించటం భావ్యం కాదు. ఒకరి హక్కు మరొకరు కాదనటంలో న్యాయమేమన్నా వుందా? అర్థం లేని వాదనలతో ఒకరిమీద ఒకరు దండెత్తటానికి ప్రారంభిస్తే సుఖశాంతులకు దూరమవటం తప్ప మరేముంది?

ఇద్దరూ ఆస్తికులే అయినా కొన్ని సందర్భాలలో కలహం, కల్లోలం తప్పదు. అబ్బాయి టైఫాయిడ్ తో వళ్లు తెలియక పడుకుంటే దడదడలాడుతూ అమ్మ తిరుపతికి మొక్కుకుని, నాన్న సింహాచలానికి మొక్కుకుంటే అనక ఎంత అవస్థను పన్నారు! గుండు చేయించుకోవటానికి ఒకవైపు అబ్బాయి సిగ్గుపడుతుంటే, ఏ వూరెళ్ళాలో ఎటూ తోచక భార్యాభర్తలిద్దరూ కీచులాడుకోవటం ఎంత వెగటుగా వుంటుంది. ఎలాగో రాజీ కొచ్చి తప్పనిసరిగా రెండు వూళ్ళూ తిరిగి రావటానికి వున్నదంతా వూడ్చుకోవాల్సివస్తుంది. పోనీ ఏదో ఈవిధంగానైనా దేశాన్ని చూశారు కదాని తృప్తి చెందటానికైనా ఇలా గుండు గీయించగానే అలా రెండో రైలులో ఇంటికి వచ్చి చేరుకుంటారు కదా! 'అదేమమ్మా' అని అడిగితే 'మాకెక్కడ తీరికమ్మా! వెళ్ళిన పనేదో నిర్వహించుకొచ్చాం' అంటూ సంతృప్తి పడతారు! ఇలాంటి చిక్కు విషయాల్లో ఇద్దరూ సంప్రతించుకుని చేసుకుంటే ఈ కష్టనిష్ఠూరాలన్నీ సహించవలసిన బాధవుండదు కదా?

పోనీ చదువుకున్న ఆడవాళ్ళకు భర్త సహకారం, ఏమైనా లభిస్తుందా అంటే అది అసలే మృగ్యం. చదువుకున్నందుకు ప్రత్యేక గౌరవం వుండదు సరికదా 'ఇదీ ఒకందుకు మంచిదే' అని సంబరపడుతూ వుద్యోగ భారాన్ని కూడా భార్యకు పంచిపెడతాడు. వంటపనితో పాటు వుద్యోగం కూడా నిర్వహించుకుని రావాలి భార్య. రెండూ సవరించుకోలేక సతమతమవుతూ చివరకు సంసారమంటే రోతపుడుతుంది. పిల్లలుంటే, వారి బాధ్యత మరొకరిపై నెట్టి వుద్యోగం చేసుకునిరావటం హర్షించదగ్గ విషయం కాదు. అంటే సంపాదనలో స్త్రీ పురుషుడికి సాయపడకూడదని కాదు. కాని సంపాదనలోపడితే పిల్లలను తప్పనిసరిగా అశ్రద్ధ చేయవలసి వస్తుంది. గవర్నమెంటు ఏవైనా పార్టుటైం పనులు కల్పిస్తే గాని చదువుకున్న ఆడవాళ్ళకు సదుపాయంగా వుండదు. ఒకరిలోపాలను మరొకరు సవరించుకునిపోవాలి గాని ఇద్దరూ పట్టుదలలకుపోయి తెగిందాకా తాడు లాగకూడదు. అలా సర్దుకోకపోతే, ఆ సంసారం కుదుటబడేదెలా?

ఫామిలీప్లానింగ్ విషయంలో భార్యాభర్తల పరస్పర సహకారం ఎంత అవసరమో ప్రత్యేకంగా చెప్పనవసరంలేదు. ఇద్దరికీ ఇష్టమున్నా అవలంబించవలసిన పద్ధతులంటే భయం, అయిష్టం వుండొచ్చు. తమకు భయం వేసి ఎదుటివారిని ఆపరేషను చేయించుకొమ్మని బాధిస్తూవుంటారు మొగవాళ్ళు. ఇలా ఫామిలీప్లానింగ్ అంటూ ఆపరేషను చేయించుకున్న మా పిన్ని ఆదుర్దాతో ఆరురోజుల పాటు మంచాన్నంటుకునిపోయింది. సులువైన సాధారణపద్ధతులు రాగలిగితే భార్యాభర్తలమధ్య ఘర్షణలు కొంతవరకు తగ్గి ఈ సమస్య చాలావరకు చక్కబడవచ్చు.

ఆలుమగలు ఒకరినొకరు అర్థంచేసుకుంటూ పరస్పర సహకారంతో ముందుకు సాగిననాడు "సంసారం ప్రేమ సుధాపూరం." ఆనాడు సంసారసాగరం అవధిలేని స్వర్గసీమగా ఆనందాన్ని ఒలకబోస్తుంది. ★



వనితా వాణి

మనసులూ-మనువులూ: నాడూ-నేడూ

వనితాలోకం శీర్షికలో బోడపాటి సుందరిగారు వ్రాసిన మనసులూ—మనువులూ నాడూ నేడూ ... అనే వ్యాసం చదివి నేను చాలా సంతోషించాను. నిజంగానే ఈ రోజుల్లో సుందరిగారు చెప్పినట్లు బాహ్య సౌందర్యమును చూసి ప్రేమించేవాళ్లే కాని హృదయ సౌందర్యము చూసేవాళ్లు ఎక్కడో ఒకళ్లు.

పి. లక్ష్మీ సుజాత (హైదరాబాద్ 4)

*　　*　　*

ఈ వారము (28—12—60) పత్రికలో వనితాలోకం శీర్షికయందు బోడపాటి సుందరి గారు రచించిన "మనసులూ—మనువులూ: నాడూ నేడు" అన్న వ్యాసం చదివాను. మంచి పదాలతో హుషారుగా నడిచింది వారి కలం. కాని ఆమె వ్యక్తపరచిన అభిప్రాయాలతో నేను ఏకీభవించను. నాకు మటుకూ నేను ప్రేమించి వివాహం చేసుకున్నాను. మా దాంపత్య జీవితం 12 సంవత్సరాల నుంచి ఎటువంటి ఒడుదుడుకులు లేకుండా ఆదర్శ క్షేమతో గడుపుతున్నాం. ఇకనుంచైనా తమ ఇంపైన రచనలను మంచి అభిప్రాయాలతో పొందుపరచి పాఠకలోకానికి సుందరిగారు అందజేస్తారని ఆశిస్తున్నాను.

ఎం. బాలా త్రిపురసుందరి (హైదరాబాదు)

*　　*　　*

దోస ఆవకాయ

16—11—60 ఆంధ్ర సచిత్ర వార పత్రిక వనితావాణిలో రఘునాయకుల రమణిగారు దోస ఆవకాయ తయారుచేయు విధానము వ్రాయమని అడిగారు.

కావలసిన వస్తువులు :

గట్టి దోసకాయలు 1 వీశ

ఆవాలు $\frac{1}{2}$ సవాసేరు ($\frac{1}{8}$ వీశ)

నువ్వులనూనె 1 సవాసేరు ($\frac{1}{4}$ వీశ)

ఉప్పు 1 పాల డబ్బాడు

కారం $\frac{1}{2}$ శేరు

పసుపు 1 చిటికెడు

చేయు విధానము :—

దోసకాయలు బాగుగా కడిగి తుడిచి ఆరవివ్వాలి. ఆవాలు, ఉప్పు, ఎండబెట్టి వేరువేరుగా దంచి జల్లించాలి. మెత్తగా జల్లించిన కారం పైన చెప్పినంతగా తీసుకోవాలి. దోసకాయలు సుమారు కూరముక్క అంతవిగా చెక్కు తీయకుండా తరిగి ఒక పెద్ద సీలు పళ్లెములోగాని, లేక కళాయి పోసిన ఇత్తడి పళ్లెములోకి గాని తరగవలెను. తతర్వాత పైన తెల్పిన పాళ్ల ప్రకారం ఉప్పు, కారం ఆవపిండి మూడు కలిపి ముక్కమీద చల్లి నూనె పోస్తూ కలుపవలెను. అంతా సమముగా కలిసిన తర్వాత జాడీలో పెట్టి (తడి లేకుండా శుభ్రంగా తుడిచినది) మూత పెట్టవలెను. మూడవ రోజున తిరగమోత వేసి బాగుగా తిరుగ కలిపి వాడుకుంటే ఎంతో బాగా రుచిగా ఉంటుంది. తడి తగులకుండా జాగ్రత్తగా వాడుకుంటుంటే సుమారు నెలా, రెండు నెలలపాటు వాడుకోవచ్చు. సెలవు మరి.

గోపినాథం సుబ్బలక్ష్మి (విజయవాడ)

*　　*　　*

డిజైనులు

'సుహాసిని' గారి డిజైన్లు చాలా బాగుంటున్నవి.

పి. సుశీలాదేవి (వాల్తేరు)

*　　*　　*

సగ్గుబియ్యం జంతికలు

కాజ వెంకటకమలమ్మగారు 14 వ తేది ఆంధ్ర సచిత్ర వార పత్రికలో ప్రచురించిన ప్రకారము పెరుగులో సగ్గుబియ్యం కొంత ప్రకారము రెండు గంటలు నానపెట్టి ఉంచితిమి. జంతికల గొట్టములో వేసి చేస్తే బాగా రాలేదు. కనుక మీరు సరిగా తెలిపెదరని ఎదురుచూస్తూ వుంటాము. చంద్రకాంతములు చేసితిమి. బాగుగా వచ్చినవి.

ఎస్. హైమవతి (బాపట్ల)

*　　*　　*

పత్రికలో వ్రాసిన వంటలు చేసితిమి. కొన్ని బాగుగనే కుదిరినవి. ఈసారి కేక్సు చేసే విధము సోదరీమణుల కెవరికైనా తెలిసిన పత్రిక ద్వారా తెలియజేయవలయును.

పద్మ (తుని)

*　　*　　*

శ్రీమతి వంఢూరి రాజ్యలక్ష్మిగారు చెప్పిన పూరీతో స్వీటు చేసి చూశాను. చాలా బాగా ఉన్నది. తిన్నవాళ్ళంతా కూడా బాగుందన్నారు. అతి సులభంగా, అతి రుచ్యముగ ఉన్న యిట్టి వంటకములనే విరివిగ తెలుపగోరుతూ వారికి నా కృతజ్ఞతాభివందనము లందజేయ కోరుచున్నాను.

అఖిలాశంకర్. (హైద్రాబాదు)

*　　*　　*

28—12—60 మీ (మా) ఆంధ్రపత్రికలో ప్రచురించిన "శిరోజాలంకరణ" అన్న శీర్షిక చాల బాగుంది. నేటి నవనాగరిక ప్రపంచములో "హెయిర్ స్టయిల్స్" ఎంతైన అవసరము. ఇక ముందు మరికొన్ని కొత్త డిజైనులు మిగిలిన సోదరీమణులు పంపిస్తారని ఆశిస్తూ యున్నాము.

పంచాళి శుభరత్నం (భిలై)

*　　*　　*

28—12—60 వ తేదీలో వ్రాసిన సరళ గారి సలహా చాల బాగా ఉంది. 'ఏ వయస్సు కా ముచ్చట, ముడి వేసుకొని స్త్రీ తన అందచందాలు దిద్దుకొనడం ఎంతయినా అవసరం" అన్న వారి మాటలు చాల సబబుగా ఉన్నాయి. సరళగారూ, ఇటువంటి మీ అపూర్వమైన సలహా కోసం నే నెప్పుడూ ఎదురుచూస్తుంటాను.

కె. పద్మకుమారి (గంగవరం)

*　　*　　*

4—1—1961 వ పత్రికలోని మగువల నేర్పుతో మగవారి మార్పు అను వ్యాసము చాలా బాగున్నది. అది వ్రాసిన ప్రఫుల్ల కుమారి గారికి నా ధన్యవాదములు తెలుపుచున్నాను. మగవారికి ఎంత అందమున్నప్పటికిని భార్యను సంతోషపెట్టలేని వారున్నారు. అందవిహీనమైన వారి హృదయము మంచిదై ఉండవచ్చును. కనుక మగవారి అందము కంటె ముఖ్యముగా హృదయము మంచిదై యుండినచో స్త్రీ సుఖపడును అని నేటి యువతులు గమనించెదరని తలంచుచున్నాను.

ఈరంకి వరహాలు (తుని)

*　　*　　*

28—12—60 తేదీ వారపత్రిక వనితాలోకం శీర్షికయందు "బోడపాటి సుందరి" గారు వ్రాసిన మనసులూ—మనువులూ : నాడూ—నేడూ వ్యాసం చాలా బాగుంది. (అల) నాటి (ఇల) నేటి నాయకీ నాయకుల (ప్ర) భావములను విడమర్చి చూపి నేటి యువతీ యువకులను సంస్కరింప చేయుచున్న రచయిత్రికి నా అభివందన లందజేయుచున్నాను.

ఎరమురెడ్డి నిర్మల (బిజ)

*　　*　　*

28—12—60 వ తేదీ పత్రికలో బోడపాటి సుందరిగారు వ్రాసిన "మనసులూ—మనువులూ" అన్న వ్యాసము చాలా బాగుంది. నిజానికి తల్లిదండ్రులు ఆలోచించి తగినవాడైతేనే వివాహము చేస్తారు. వాళ్ళకి మాత్రం పిల్లను మంచి పిల్లవానికి ఇవ్వాలి, సుఖపడాలి అని ఉండదా? అల్లా అని ప్రేమ వివాహాలు చెడ్డవని అనడం లేదు. ఎట్లాగైనా తల్లిదండ్రులు ఆలోచించి చేసిన వివాహాలే మంచివి.

కుమారి కొండేపూడి ఆశాలత (ఏలూరు)

★


సొగసైన రూపము
"HAZELINE' SNOW"
"హేజ్‌లైన్' స్నో"

పాకశాల

పండుగ పిండివంటలు: రవ్వలడ్డు, చంద్రకాంతలు

కావలసిన సామానులు: గోధుమరవ్వ (బొంబాయిరవ్వ) ½ వీశ. పంచదార 1/4 వీశ నెయ్యి ⅛ వీశ.

జీడిపప్పు, ఏలక్కాయలు, కిస్‌మిస్ పళ్లు.

చేయువిధము: ముందర గోధుమరవ్వ పురుగులు లేకుండా ఏరిపెట్టుకోవలెను. తరువాత గోలు, గోకలి తడిలేకుండా తుడిచిపెటుకోవలెను. ఏలక్కాయలుతొక్కుతీసి మెత్తిగా పొడిచేసి పెట్టుకోవలెను. ఇవి అన్నియు సిద్ధమైన తరువాత కుంపటిఅంటించి గిన్నె కాలేసి తడిలేకుండా పోయినతరువాత ఒక చిన్న నేతిగరిటె నెయ్యిపోసి ఎంత కావలయునని అనుకొంటే అంత జీడిపప్పు వేయించి తీగవలెను. తరువాత అమిగిలిన నెయ్యిలో ఇంకొగరిట నెయ్యిపోసి అందులో గోధుమరవ్వపోసి కమ్మటి వాసన వచ్చువరకు వేయించి తీయవలెను. రోటిలో 1/4 వీశ పంచదారపోసి మెత్తగాకొట్టి ఒక కళాయి పళ్లెములోకి తీయవలెను. అప్పుడు వేయించిన గోధుమరవ్వపోసి మెత్తగా దంపవలెను. మెత్తగా అయిన తరువాత దంపిన పంచదార కూడపోసి ఏలకుపొడి, వేయించిన జీడిపప్పు, కిస్‌మిస్‌పళ్లు పోసి అన్నీకలిసేటట్లు ఒకటి, రెండుసార్లు దంపి, మరగబెట్టి వేడిగాఉన్న నెయ్యినిపోసి మినపసున్ని ఉండలుకట్టేలాగ కట్టవలెను. చాలారుచిగా ఉండును. అంత కష్టపడనక్కరలేదు.

రవ్వచంద్రకాంతలు

కావలసిన సామానులు: పెసరపప్పు పావుశేరు. (సోల) బొంబాయిరవ్వ (గోధుమరవ్వ) 1/4 వీశ. పంచదార ½ వీశ. ఏలక్కాయలు ½ తులం.

చేయువిధము: ఇంకొగంటకు చేస్తామనగా పావుశేరు పెసరపప్పును రాళ్లు, రప్పాలేకుండా శుభ్రముగా బాగుచేసి నానబెట్టవలెను. 1/4 వీశ గోధుమరవ్వకూడ నానబెట్టి వేరువేరుగా పెసరపప్పు,రవ్వ మెత్తగారుబ్బి కలుపవలెను. తరువాత ఒక కళాయిగిన్నెలో ½ వీశ పంచదార పాకంపట్టి గట్టిపాకం రాగానే రుబ్బినపిండిని, ఏలకులపొడిని వేసి బాగాకలిపి ఒకపళ్లెమునకు నేయిరాసి అందులోపోసి డైమన్లుగా ముక్కలుకోయవలెను. తరువాత పొయ్యిమీద బాణలిపెట్టి నెయ్యిగాని, వనస్పతినిగాని పెట్టి కోసినముక్కలను వేయించి తీయవలెను. ఇది రెండు, మూడు రోజులు నిలవయుండును. అంతకంటె ఎక్కువ ఉండదు. చాలబాగుండును.

కిళాంబి సత్యవతీదేవి

వైజాగ కేక్

కావలసిన సామాన్లు: అర్ధశేరు బియ్యానికి పావుశేరు మినపప్పప్పు పొట్టులేకుండా శుభ్రం చేసి ఈ రెండూ కలిపి కొంచెం మెరుంగా విసురుకోవాలి దీన్ని ఒక స్టీలుగిన్నెలో ఉంచి కొంచెం మజ్జిగ, దానికి తగినట్లు పచ్చి మిరపకాయలు, రెండు, లేక మూడు టీస్పూన్ల కారపుగుండ, తగినంత ఉప్పు వెయ్యాలి

అల్లం, ఇంగువ, కొత్తిమీర, పచ్చిమిరపకాయలు దంచి వేయవలెను. వేడినీళ్ళతో కలిపి కొంతసేపు నానిన తరువాత, కర్రబొగ్గుల కుంపటిమీద ఒకటే లెవెల్ లో వున్న మూకుడుపెట్టి, కొంచెం బాగా నూనెగాని, వనస్పతిగాని వేసి మరిగాక ఈ కలిపి వుంచుకున్న పిండి దానిలో పొయ్యవలెను. దానిమీద తావామూత పెట్టి కొంత నిప్పు దానిమీద వెయ్యవలెను. కిందని మట్టుకు ఎక్కువ నిప్పు ఉంచితే మాడుతుంది. మాడితే రుచిగా ఉండదు. కనుక జాగ్రత్తగా కాల్చవలెను. బాగా కాలినఎడల కరకరలాడుచూ తినుటకు చాలా రుచిగా యుండును.

జి. సరోజ

పాపొడి కూర

కావలసిన సరకులు: సెనగ బేడలు 1/8 శే (చటాకు) కందిబేడలు 1/8 శే (చటాకు.)

ఒకగంట ముందు నానపోయవలెను. శుభ్రముగా కడిగి రాళ్ళు లేకుండా స్టీలుగిన్నెలో పెట్టవలెను. రుబ్బురోలు శుభ్రముగా కడిగి కందిబేడలు, సెనగబేడలు రుబ్బురాయితో మెత్తగ కాకుండ, గరుకుగా కాకుండా రుబ్బవలయును. అముద్దతీసి, స్టీలు గిన్నెలో పెట్టవలయును. తరువాత పొయ్యి మీద బూరెల మూకుడు పెట్టి 10 తులముల వనస్పతి లేక నూనె పోసి బాగా కాగనిచ్చి కొన్ని ఆవాలు, ఒక చెంచా వుద్ది (మినపపప్పు) బేడలు, కొంచెము ఎఱ్ఱగా వేగిన తరువాత, తరిగి పెట్టిన ఎఱ్ఱగడ్డ ముక్కలు, ఆవుద్దిబేడల్లో వేయించి ఈ రుబ్బిపెట్టిన సెనగబేడల ముద్ద తిరగమోత నూనెలో వేసి, రెండు చెంచాలు మిరపపొడి దానికి సరిపోయినంత ఉప్పుపొడి వేసి శుభ్రమైన అట్లకాడతో కలుపవలెను. కలిపిన తరువాత శుభ్రమైన పళ్లెము మూత పెట్టవలెను. పొయ్యికి చిన్నసెగ పెట్టవలెను. ఐదేసి నిమిషములకు దానిని కలియపెట్టవలెను. ఆ పిండిముద్ద వుడికిన తరువాత పొడి, పొడిగా అగును. ఆకూరను అట్లకాడతో కలియపెట్టి స్టీలు గిన్నెలో పెట్టవలెను. అది చాలా రుచిగా నుండును. నేను చెప్పినట్లు చేసినను రెండురోజులు చెడిపోకుండా వుండును. ఇది దక్షిణాదిని ఎక్కువగా చేయుదురు. ★

ఎమ్. సుజాత



చిత్రకారుడు: చెరుకూరి గురవయ్యానాయుడు (పాకాల)

స్త్రీ ...

సరళ

స్త్రీ జీవితవలయంలో అనేక ఆవర్తాలు ఉన్నాయి. అందులోకెల్లా మాతృత్వం మహత్తరమైంది. మధురమైనది – బాధ్యతాయుతమైనది. అంతేకాదు బాధాకరమైనది.

ఆ యీ మాతృత్వం స్వార్థత్యాగానికి మరో పేరు. పరహిత చింతనకు పర్యాయపదం. అమృత హృదయానికి ఆలవాలం.

స్త్రీ జీవితం కేవలం పరుల కోసమే—అంటే తనుగాక మిగిలిన తన బిడ్డా, భర్త వీరికోసమే అనే అభిప్రాయం ఈ మాతృత్వం వంటి మహత్తర దశనుంచే స్త్రీపట్ల ధృవపడింది.

సంసారమరుభూమికి మధ్య మప్రప ఇల్లాలని, కల్పతరు నీడ ఆమె జాడ అనీ, సంసార సాగరం గతులైన వారికి ఆమె ధృవతార అని—త్యాగమంతా ఆమెదీ, ఫలం తక్కినవారి దనే ప్రథ మన దేశంలో వ్యాపించిఉంది.

అది స్త్రీని గౌరవించడం కాదనం. ఆరాధించడం కావచ్చు గాక. ప్రేమదేవతగా పరిగణించడమే అవును. అయినా అందువల్ల స్త్రీ పొందుతున్న ఆనందం, ఆమెకు చెందుతున్న అవకాశం ఏమిటి ? వ్యవహారప్రపంచంలో ఆమె కోరుతున్న భావ, వృత్తి స్వాతంత్ర్యాలకు ఏమాత్రం విలు కలిగింది ? అసలు కలిగిందా ?

ఆ ప్రశ్నలకు సమాధానం ఆశాజనకంగా ఉండదు.

కారణం ఒక్కటే. స్త్రీ కూడా ఒక వ్యక్తి అనీ, స్వార్థం ఉందనీ, తన స్వార్థంకోసం పాటు పడవలసింది ఎంతో ఉందని గ్రహించేవారు ఆమెను కేవలం త్యాగిగా అభివర్ణించి ఆనందించరు. ఆమె స్వార్థత్యాగి అంటే స్వార్థం ద్వారా త్యాగం చేయవలసినదనే భావన మనకు రావాలి. కాదా?

భార్యగా భర్తను, తల్లిగా బిడ్డలను సంతోషపరచే యంత్రంగా, పోషించే దాదిగా, అనాదిగా స్త్రీ జీవితం వెళ్ళిపోతున్నా, అటు మరీ ప్రాచీన కాలం చూసినా మధ్యయుగంనాటి చారిత్రక నిదర్శనాలు పరికించినా స్త్రీ ఒక వ్యక్తిగా తగు స్వతంత్రంతో జీవించినట్లు తెలుస్తుంది. గార్గి, మైత్రేయి—నుండి, దీక్షితదుహిత వరకు, రుద్రమదేవి, ఝాన్సీ లక్ష్మి, ఇట్టివేవలి స్వాతంత్ర్య సమరంలో ముందంజ వేసిన కస్తూర్బా, సరోజినీ నాయుడు, విజయలక్ష్మి వంటి నారీమణుల వరకు తగు సాక్ష్యం కనిపిస్తుంది. అయితే సాంసారికంగా మనం ఆలోచించే మధ్య తరగతి సంప్రదాయకుటుంబికుల విషయం వేరు.

ఇప్పుడు స్త్రీ .... మధ్య తరగతి కుటుంబిని .... సంప్రదాయిక సంసార స్త్రీ .... పై చెప్పిన రీతిగా భార్యగా, తల్లిగా, స్వార్థత్యాగిగా ఉంటూ వచ్చిన స్త్రీ .... అలాంటి వ్యక్తిత్వం నిలబెట్టుకోవాలంటే, మార్గం ఉందా ? ఉంటే ఏది ?

ఉన్న మార్గాలు పరిమితం. అవి ఉభయ తారకమైన ఉద్యోగం రీత్యా ఉన్నాయి. ముందు స్త్రీ అభిరుచిని బట్టి విద్య—దానిని బట్టి ఉద్యోగం. వృత్తి ఎన్నుకొనడంలో స్త్రీ తన ప్రవృత్తికి అనుగుణంగా వెళ్ళినా, అది ఆర్థిక సమస్యల నివృత్తికి దారితీసి ఉభయతారకంగా ఉండాలి. సమాజంలో సాటి సంసారాలకు చేదోడు వాదోడుగా వుండే వైద్యం, ఉపాధ్యాయ వృత్తి వంటివి స్త్రీకి అలంకారం. నిత్యజీవితంలో స్త్రీ వైద్యుల అవసరం ఎంతటిదో తెలియని దెవరికి ? స్త్రీకి స్త్రీ తోడునీడగా, చేదోడు వాదోడుగా ఉండడాని కిది విలు—మేలు. ఇక ఉపాధ్యాయినిగా ఆమె తన స్వాతంత్ర్యకాంక్ష సాటి పాపలకు మారి పోసినా వ్యక్తిత్వం స్త్రీ లోకానికి పరిచయం చేసినదే అవుతుంది. వైద్యం శారీరకంగాను, అధ్యాపనం మానసికంగాను స్త్రీ లోకానికి ఉత్తేజం కలిగిస్తాయి. ముఖ్యంగా 'గృహిణీ గృహముచ్యతే' అన్న సూక్తికి, 'గృహనీతి విద్యకు గృహము' అన్న మాటకు తార్కాణంగా ఆమె జీవితం మహత్తరమే అవుతుంది.

1918 ప్రాంతంలో ఇంగ్లండులో శ్రీమతి పెథిక్ లారెన్సు వంటి మహిళామణుల ఆధ్వర్యంలో మొదటిసారి స్త్రీలకు వోటు హక్కు కావాలనే ఉద్యమం బయలుదేరింది. అది ఆధారంగా స్త్రీ స్వాతంత్ర్యానికి ఉద్యమాలు మొదలయినాయి. ముందుకు సాగాయి.

పురుషుడు ఏవృత్తికయినా అర్హుడే—స్త్రీకాదు దీనిమీద తర్జనభర్జనగర్జనలు అనవసరం. అది హాస్యం!

ఏది ఏమైనా స్త్రీ స్వాతంత్ర్యం అంటే పురుషుని స్వాతంత్ర్యం వంటిది కాదు. అది ఆమె పరిధిని మరింత దృఢతరం చేస్తుంది. ఆమె జీవితం మరింత ఉపయుక్తమూ, మహత్తరమూ అవుతుంది. ఇంటికి దీపమైన ఇల్లాలు సమాజానికి చలువ పందిరి అవుతుంది.

సంక్రాంతి

పి. ఎస్. గోపాల్

వచ్చెను వచ్చెను సంక్రాంతి
సిరులను తెచ్చే సంక్రాంతి॥
భోగిపళ్ళ మిలమిలలు
భోగీపాపల కిలకిలలు
కాసారంలో చిరు అలలు
కలువారేకుల తళతళలు!
పుత్తడిబొమ్మల కొలువుల్లో
పులగం ఆరగింపులు
ఊళ్ళో ఊరేగింపులు
బొమ్మల పాలారింపులు॥
మకరరాశిలో సూర్యుడు
భాగ్యాలిస్తా డీ యేడు
శార్వరి వత్సర పుష్యము
ప్రజలకు దీర్ఘాయుష్యము॥



ముగ్గులు పెట్టే ముదిత


వచ్చెను సంక్రాంతి

శుభశ్రీ

వచ్చెను సంక్రాంతి-మా
కిచ్చె సుఖం, శాంతి.
బసవని మెడ గంటలతో
బనంగిపళ్ళ పంటలతో
ఏటిపాటు పండగ ఈ
నాటికి పెనుపండువుగా-
రేగుపండ్ల పగరు తీపి
రేగు కొత్తరుచులతో
గొబ్బెమ్మల గోములతో
కోడిరేడు పోరులతో-
ముద్దరాలి ఒద్దికతో
ముద్దబంతి మురిపెంతో
జగమును బొమ్మలకొలువుకు
దిగివచ్చిన ముత్తయిదువు
వచ్చెను సంక్రాంతి-మా
కిచ్చె సుఖం, శాంతి.







చాటుకథామంజరి

తిక్కన అనగానే భారతం రాసిన తిక్కన జ్ఞాపకం వస్తాడు. ఆయనతో పాటు ఆయన పెద్దతండ్రి కుమారుడు మరొకాయన కూడా జ్ఞాపకం వస్తాడు. ఆ 'మరొకాయన' పేరే రణ తిక్కన. ఈయన పదమూడవ శతాబ్దంలో విక్రమసింహపురం రాజధానిగా చేసుకుని తెలుగు నేలను పాలిన మనుమసిద్ధిమహారాజు సేనాని.

అప్పటి విక్రమసింహపురమే ఇప్పటి నెల్లూరు. ఆరణ తిక్కననే ఖడ్గ తిక్కన అని కూడా అంటారు. తిక్కన వంశీకులు మొదటినుండీ గ్రామకరణాలు, మంత్రులు, సేనానులు. అన్నిటికీ మించి మంచి పండితులు.

ఒకప్పుడు మనుమసిద్ధికి కాటమరాజుకు బ్రహ్మాండమైన సమరం జరిగింది. మనుమసిద్ధిరాజు మేతబీళ్లలో తన పశువులను మేపుకొని పుల్లరి [illegible] కాటమరాజు తాను మనుమసిద్ధికీయవలసిన పుల్లరి ఎగగొట్టాడు. ఎర్రగడ్డపాటి పలికకాటమరాజుకూ అతనికీ ఈ చిన్న కారణంతో రణం ప్రారంభమై నిష్కారణంగా దారుణం జరిగింది. ఆయుద్ధంలో కాటమరాజు [illegible] లేక మనుమసిద్ధిరాజు సైన్యం చెల్లాచెదరై పరుగెత్తింది. సేనాని రణ తిక్కనకూడా ఓడిపోయి ఇంటికి తిరిగివచ్చాడు.

రణ తిక్కన కుటుంబీకు లంతా

రణ తిక్కన

ఆనోట ఈనోటా ప్రతి పూటా ఏ చోటో ఓ నోట వినిపిస్తూ కమ్మని కథలుచెప్పే పద్యాలను చాటుపద్యాలంటారు. ఈ చాటు పద్యాలచాటున చక్కని చరిత్ర విషయాలు, కథలు ఎన్నో ఉన్నాయి. రణతిక్కన కథ అందరూ ఎరిగిందే. ఆకథను గురించీ ఎన్నో చాటువులు ఉన్నాయి. ఇటువంటి చాటువులు నోటికి రావడం ఎంతో అవసరం.

దెబ్బతిన్నట్లు తల్లి, ఇల్లాలు అవమానపడ్డారు. స్నానానికి వెళ్లిన తిక్కనకు నులకమంచం అడ్డువేసి, పసుపుటుండలు ఇచ్చి ఇల్లాలు, తల్లి ఇలా వెక్కిరించారు.

పగఱకు వెన్నిచ్చినచో
వగరేనిను మగతనంపు నాయకులెందున్
ముగురాడువార మైతిమి
వగపేటికి జలకమాడ వచ్చినచోటన్.

ఈ అవమానం భరించలేక పోయినాడు తిక్కన సేనాని. తన

బెజవాడ సదానందం



అసహాయస్థితికి పౌరుషాన్ని లోలోపలనే అణుచుకున్నాడు. తీరా అన్నానికి వెళ్లాడు. అక్కడ కన్నతల్లి వెక్కిరింత మరింత దారుణంగా ఉంది. అన్నంలో విరిగిన పాలు పోసింది తల్లి. " వీరాధివీరుడవు నువ్వు రణరంగంలో విరిగి వచ్చావు. మేతకు వెళ్లిన పశువులూ విరిగివచ్చినాయి. దాంతో వాటి పాలూ విరిగిపోయినాయి.

అసదృశముగ నరివీరుల
మసిపుచ్చక విఱిగివచ్చు మగపంద క్రియున్
కసవుఁజ మేయగబోయిన
పసులున్ విరిగినవి తిక్క! పాలును విరిగెన్

ఇన్నివిధాలుగా ఇల్లాలు, తల్లి ఈసడించి ఏవగించగానే ఈ ఖడ్గ తిక్కన పౌరుషం దెబ్బతిన్న త్రాచులాలేచి తగుగుండెబలంతో కండగల దండుబలంతోసహా ఉద్దండంగాదండయాత్రకు బయలుదేరింది. రణ తిక్కన వీరస్వర్గమంది జాతి గౌరవం నిలబెట్టాడు.

యుద్ధంలో నిలువలేక గెలువలేక పారిపోయివచ్చిన తిక్కన సేనానిని ఎన్నివిధాలుగా దేశం హేళన చేసిందో చూడండి.

రణరంగమున మోహరంబుల బొడగని
ప్రాణంబు వాసిన పందగజము!
విజయాధిపుని దాడి వెనుకొని తగులంగ
దెనతప్పి పోయిన దిగ్గజంబు!
చేరజాతిక తిర్గి చేమడ మళ్లించి
మందాసకందని మదగజంబు!
వెనుజల్లపల్లతో విరుదులన్నియు వైచి
పరుగెత్తివచ్చిన పోటుబోతు!

అనుచు ఆర్వేలవారు నిన్న పహసింప
ధరణి నెల్లూరిలో నెట్లు తిరుగగలవు?
వైరులను గెల్చి సత్కీర్తి వరలుమయ్య
మంత్రి కులహేళి! తిక్కనామాత్యమౌళి!

అందుకే కవి తిక్కన కూడా 'నిల్చి గెల్చిన సత్కీర్తి నెగడుగాక' అన్నాడు భారతంలో. రణతిక్కన గుణపాఠం నేర్చుకున్నాడు.

అందుకే అటు కవనానికి ఇటు కదనానికి తిక్కన వంశం పేరు పొందింది.

'కవితారసపు జల్లు
ఖడ్గాల ఘలుఘల్లు
శరణాలకే చెల్లు
ఓ కూనలమ్మా'

అనే జానపదగీతం పూర్వాం ఇటువంటి మహా వీరుల కథలనే కడుపులో పెట్టుకొని 'కూన' రాగంగా నేటికీ వినిపిస్తుంది.

రణతిక్కన లేని విక్రసింహాపురం వెన్నెలలేని రాత్రి.

వెన్నెలలేని రాత్రియు రవిప్రభలేని దినంబు
నీరు లే
కున్న సరోవరంబు కడు నొప్పగు దీపము
లేని యిల్లునై
విన్నదనంబు నొందె మన విక్రమసింహ
పురమ్ము చూడగా
పున్నమచంద్రు బోలు మన పోలమ
తిక్కడు లేమి నక్కటా!

నెల్లూరు మండలంలో పెన్నా నది ఒడ్డున తిక్కన పాడు అనే ఊరు వున్నది. అక్కడ ఖడ్గ తిక్కన గుర్రంమీద యుద్ధసన్నద్ధుడై ఉన్నట్లు చెక్కిన శిల్పం ఒకటి ఇప్పటికీ ఉంది.

ఆ శిల్పంతోపాటు ఈ చాటు కథలూ రణతిక్కన చావలేదని చాటుతునే ఉంటాయి. ★







పూర్వం ధారానగరాన్ని 'ధాశ' అనే మహారాజు పరిపాలించేవాడు. అతనికి అందాలుచిందే చందమామలాంటి కుమార్తె వుండేది. ఆమె పేరు సుశీల. పేరుకు తగ్గట్టుగా సుశీల సకలకళావిశారదయై, సౌశీల్యవతియై పదహారేండ్ల బాలా కుమార్తె అయ్యింది. కుమార్తెకు యుక్తవయస్సు వచ్చేసరికి మహారాజువరాన్వేషణకుపూనుకున్నాడు. కాని సుశీల సుగుణసంపత్తికి, సౌకుమార్యానికి, తగ్గ సుగుణశీలుడు దొరకటం చాల కష్టసాధ్యం అయింది.

చివరకు ఒకరోజున మహారాజు మహారాణితో ముచ్చటలాడుతూ "రాణీ! నిజం చెప్పాలంటే, సుశీలకు తగినవరుడు ఈ ప్రపంచంలోకల్లా ఒక్కడేనని తోస్తోంది!" అన్నాడు.

"ఎవరంటారు మహారాజా! ఆ

రాజగోపాల్

అందాల సుందరాంగుడు?" అంది మహారాణి.

ఎవ్వరేమిటి! మహారాణీ, నా మేనల్లుడూ, నాసహోదరికి స్వయానకుమారుడున్న "శూరసేనుడు! నువ్వెరగవూ?" అన్నాడు మహారాజు.

ఆ మాట వినగానే మహారాణి ముఖారవిందంలో మందహాసం మటుమాయమైంది. అమావాస్యచీకట్లు ఆమె ముఖాన అలుముకున్నాయి. ఒక్కసారిగా ఆమెలో గల్గిన ఈ మార్పుకు మహారాజు చకితుడయ్యాడు.

"ఏం? అలా వాడిపోయిన మల్లెపూవులా మారిపోయావ్ మహారాణీ," అన్నాడు.

"మరేమీ లేదు మహారాజా!

విధివిలాసం

"శూరసేనునికంటె మించినవారు ఈ లోకంలోనే లేరా?" అంది మహారాణి ప్రశ్నార్థకంగా!

"ఉంటే చెప్పరాదు! నీమనసులో మాట మరుగుపరుస్తావేం" అని తిరిగి ప్రశ్నించాడు మహారాజు.

"మా అన్నకుమారుడు సుకుమారుడు సుశీలకు అన్నివిధాలా తగినవరుడు ఏమంటారు?" అంది మహారాణి. అప్పుడు ఆమె వదనంలో నవవసంతం తొంగి చూచింది. కాని మహారాజు ముఖాన పూర్తిగా జేగురురంగు అలుముకుంది.

"సుతరాము నాకిష్టంలేదు! సుకుమారుడు సుశీలకేమాత్రం తగిన వరుడు కానేరడు" అన్నాడు బిగ్గరగా! మహారాణికి మతిపోయినట్లయింది. వారిరువురి మధ్యా మాటపట్టింపు మూటకట్టుకుపోయింది.

ఆరు నూరైనా, నూరు ఆరైనా మహారాజు తన పుత్రికను శూరసేనునకే ఇవ్వవలెనన్నాడు! అటు సూర్యుడు ఇటు పొడిచినా! చుక్కలు పగలే మొలచినా., సుశీలను తన అన్నకుమారుడు సుకుమారునికే ఇవ్వాలన్నది మహారాజ్ఞి. ఏది ఏదైనా ఎవరి ప్రయత్నం మీద వారు సతమతమౌతున్నారు.

* * *

ఒకానొక శుభోదయాన మహారాజు శూరసేనుణ్ణి పిలిపించి, రాజకుమార్తె భవనాని కెదురుగావున్న వసంతమందిరంలో విడిది వుంచాడు.

బహిరంగంగా మహారాజును ఎదిరించలేక మహారాణి రహస్యంగా సుకుమారుని పిలిపించి, ఒక అజ్ఞాత సౌధంలో దాచివుంచింది. కాబోయే ఆ యిద్దరు పెండ్లికుమారులూ మాత్రం రాబోయే తమ అదృష్టాన్నిగూర్చి కలలుగంటూ హాయిగా కాలం గడుపుతున్నారు.

* * *

ఆ రోజు పున్నమి. పుచ్చపువ్వులా, పిండారబోసినట్లుగా పట్టణాన్నావరించుకుంది వెన్నెల. ప్రజలంతా పనులు చేసి వున్న మీదట అలసి సొలసి నిద్రాదేవత వడిలో వడలు తెలియక ఒరగిపోయారు. వెన్నెలహాయిని కమ్మగా అనుభవిస్తూ బ్రహ్మ, విష్ణూ, మహేశ్వరులు ముగ్గురూ ఆకాశమార్గాన అలా పయనం చేస్తూ లోకంలో వింతలూ విశేషాలు పరికిస్తున్నారు.


సరిగా పట్టణం నెత్తిమీదకి వచ్చేసరికి సుగంధ పరిమళాలు మిన్నుముట్టినాయి. పరమేశ్వరుడు సంగతంతా దివ్యదృష్టితో గ్రహించి,

"స్రష్టా! ఏమయ్యా నీ సృష్టి? ఇంతకూ ఈ సుకుమార రాజకుమారి సుశీల ఈ ఇద్దరిలో ఎవ్వరిభార్య కానున్నది?" అన్నాడు అనుమాన నివృత్తికై.

అప్పుడు బ్రహ్మదేవుడు మందహాసంతో "పశుపతీ! వీరిద్దరిలో ఎవ్వరూ ఆమెకు భర్త గాజాలరు! మరొకరితో ఆమెకు వివాహము గానున్నది!" అన్నాడు.

"ఎవ్వరా అదృష్టవంతుడు? ఏమా కథ!" అన్నాడు విష్ణుమూర్తి ఆశ్చర్యపడుతూ!

"అదుగో అటుచూడండి! వెన్నెలలో హాయిగా ప్రపంచాన్నే మరచి., గొఱ్ఱెపిల్లను వెచ్చగా కౌగలించుకొని వేణుగానలోలుడై యున్న ఆ గోపబాలుడే!



చిత్రకారుడు: ఎర్గోని శ్యామసుందర్ (గుత్తి)

విధి విలాసం

ఆమెకు కాబోవు భర్త!" అన్నాడు బ్రహ్మ మందస్మితవదనంతో!

"ఏమిటీ! ఈ కుంటివాడా ?" ఆశ్చర్యాన్ని దాచలేకపోయాడు శంకరుడు. "అవును" నన్నట్లు తల నూపాడు బ్రహ్మయ్య.

వెంటనే శంకరుడు "ఈతని విధి విలాసం ఎంతవరకూ నిజమగునో చూతము!" అన్నట్లు చూచాడు విష్ణుమూర్తి వంక.

అచ్యుతుడు వెంటనే తన గరుడ వాహనాన్ని బిలిచి! "ఆ గొల్లవానిని కారడవులపాలు చేసిరమ్మని" ఆజ్ఞాపించాడు. గరుత్మంతుడు వాయువులో లీనమైపోయాడు.

* * *

ఉన్నట్లుండి ఆకసమంతా చీకటిమయమయింది. గొల్లవాని వేణువు మూగపోయింది. భయకంపితుడై గోపాలుడు గొంగళి కప్పుకు పడుకున్నాడు. గరుత్మంతుడు తన విధి ప్రకారం అతనిని తన్నుకొనిపోయి, చీమలుదూరని చిట్టడవిలో వదలివేశాడు.

"ఇప్పుడు ఈతని విధివ్రాత ఏమౌతుందో చూతాము!" అన్నట్లు విష్ణుమూర్తి శంకరునివంక కొంటెగా చూచాడు.

అక్కడ గోపాలుడు నిద్ర మేల్కాంచి, తాను చిట్టడవి నడుమ నున్నట్లు గ్రహించి, మిక్కిలిగా చింతించాడు!

"అంథా! ఆసాములోరి కుప! ఏనాడు ఏ పాపంసేసానో ఈనాడు నన్నిట్టా కట్టపెడుతుండాడు బగమంతుడు!" అనుకొని భగవంతుని స్మరించుకొని, బిక్కు బిక్కు

మంటూ కూర్చున్నాడు.

మర్నాడు సూర్యుడు సరిగా నడి నెత్తికి వచ్చాడు. గొల్లవాడు ఆకటి బధకు అలమటించిపోయాడు. "అరి భగవంతుడా! నేనేం పాపం సేసుంటిని? నాకింత కష్టం తెచ్చిపెడితివి! మా వూళ్లో నా మానాన నేబతుకుతుంటినిగందా నాలిగిళ్ళకు తిరిగి నాలుగు గెదల్ని కాసుకుంటే బుక్కెడు బువ్వదొరికేది! ఈకోనలో నాకేడ దొరకుతాదిబువ్వ! నాకెవడు దిక్కు అంతా ఆ నల్లనయ్య కృప అంటూ గొల్లవాడు భగవంతుని ప్రార్థించాడు. గొల్లవాని ప్రార్థనలు విష్ణుమూర్తి చెవిన పడ్డాయి. ఆపద్బాంధవుడు అతనికి మంచి ఆహారం ఏర్పాటుచేయమని గరుత్మంతుని నియమించాడు.

గరుత్మంతుడు ఆహారం కొరకు వెతికి వెతికి చివరకు రాజోద్యానవనంలో ఒక మామిచెట్టుక్రిందనుండి మంచి పక్వాహారపు సువాసనలు రావటం గమనించాడు. ఆ మామి మొగదం వ్రాలాడు. అక్కడ ఒక పెద్ద కావిడిపెట్టె కనుపించింది. బహుశా అందులోనే ఆహారపదార్థము లుండివుండవచ్చు ననుకొని ఆ పెట్టెను కాస్తా తన బలమైన కాళ్ళతో తన్నుకొనిపోయి కన్నుమూసి తెరచేలోపల చిట్టడివిలో గోపాలుని ముందుంచి ఎగిరి చక్కాపోయాడు గరుత్మంతుడు.

> ఒకరు — మీది చాలా పెద్దతలండీ!
>
> మరొకరు — మరే... శరీరం వర్షానికి తడవకుండాను, ఎండకు నీడగానూ ఉపయోగిస్తుంది.
>
> శ్రీరంగం సూర్యనారాయణ (విజయవాడ-2)

"దయామయా! నల్లనయ్యా! నా మొర ఆలకించినావా సిన్నకృష్టయ్యా!" అంటూ సంబరంతో గోపాలుడు ఆ పెట్టె మూతను తెరచాడు. అందులోంచి ఓ అందాల సుందరి పైకిలేచి, ఒక ముత్యాల హారాన్ని అతని మెడలో వేసింది. ఆతర్వాత పెట్టెలోంచి బయటకు వచ్చి, సాష్టాంగనమస్కారం చేసింది. అనేక తినుబండారాలు దగ్గర కూర్చుని తినిపించబోయింది. ఇదంతా ఆగోపాలునికి చాలా ఆశ్చర్యమనిపించింది.

"ఇంతకూ నువ్వోరమ్మా య్యా!" అన్నాడు.

"నేను ఈ దేశపు రాజకుమార్తెను!" రాజకుమార్తె మాటలలో సిగ్గు తొణికిసలాడింది. ఈ మాట వినగానే, గోపాలుడు "హాం!" అంటూ తెరచిన నోరు అట్టేవుంచి, జాగింబడి రాకుమారి పాదాలమీద పడి, దండాలమ్మగారూ దండాలు! యియ్యాల దిక్కుమాల్ని బూతం ఏందో నన్ని డిసిరిపారేసినాది! గొడ్డను తోలుకుపోటానికి రానేకపోయాను! చమించండమ్మగోరూ!" అంటూ మొత్తుకున్నాడు. రాకుమారి అతనిని లేవదీసి మీరట్లా అనకూడదు నేను మీ భార్యను! అన్నది వినయంగా!

"ఇదిగో నాకిదంతా సాల యిచ్చింద్రంగా వుండాదే! నువ్వీడకెట్టొచ్చావ్? నువ్వు నాకు పెల్లాని వేటి? ఏటి యింతకీ కతా! అంట! అన్నాడు వెర్రిగా గోపాలుడు.

అప్పుడు రాజకుమారి తన కథనంతా వెల్లడించింది. చివరకు మా తండ్రిగారు పెండ్లికి కావలసిన యేర్పాటులన్నీ చేశారు. మా అమ్మగారు నన్ను పెండ్లికూతుర్ని చేసి, ఈ పెట్టెలో కూర్చోబెట్టి "తల్లీ,

పెట్టె తెరవగానే ఎవరుకనబడితే వారి మెడలో నీవు ఈ ముత్యాలహారం వెయ్యి! ఆతడే నీ భర్త కాగలడు!" అని చెప్పింది. అదేప్రకారం నేను ఈ పెట్టెలో కూర్చున్నాను. ఆతర్వాత ఏం జరిగిందో నాకు తెలీదు!" అంటూ వివరించి తెలిపింది.

"ఎట్టెట్టా!" అన్నాడు గోపాలుడు నోరు తెరుచుకొని.

హాయిగా కడుపునిండా తిని గొంగళిపరుచుకొని కులాసాగా కబుర్లు చెప్పుకుంటూ పడుకున్నాడు గోపాలుడు. ఇంతలో వయోభారంతో నడుంవంగిన ముగ్గురు వృద్ధబ్రాహ్మణులు వారిదగ్గరకు వచ్చారు. "తల్లీ! చాలకాలంగా భోజనం లేక బాధపడుతున్నాం! అన్నపూర్ణ తల్లికి మల్లె అగుపించావు! మహాతల్లీ! కాస్త ప్రసాదం వుంటే పెట్టమ్మా!" అంటూ ప్రాధేయపడ్డారు.

సుశీల తనభర్తతో కలిసి వారి ముగ్గురికి అతిథి సత్కారాలు చేసి, తృప్తిగా భోజనం పెట్టింది.

"అమ్మా! నీచేయి చల్లగా వెయ్యి కాలాలపాటు కడుపెడు బిడ్డలతో కలకలలాడుతల్లీ!" అని దీవించాడు ఒక బ్రాహ్మడు.

"పరులకష్టాలు తమ కష్టాలుగా భావించే మీలాంటివారే లోకానికి కావలసినవారు తల్లీ! మీరు చేసిన ఈ సహాయానికి మేం చేయగల సహాయం ఇదొక్కటే తల్లీ! అంటూ ఇంత విభూది తీసి గోపాలుని మీదకు

విధివిలాసం

వూదాడు రెండవ బ్రాహ్మడు. మరుక్షణంలో గోపాలుడు అంగవైకల్యం మటుమాయమయ్యింది. సరస్వతి ప్రసన్నమయింది. సకలవిద్యాపారంగతుడు, మహాజ్ఞానిఅయ్యాడు. అంతేకాదు. అతిథులుగా వచ్చిన ముగ్గురు వృద్ధబ్రాహ్మలు త్రిమూర్తులుగా ఎరిగి స్తోత్రపారాయణం చేసాడు.

"బ్రహ్మదేవా! నీవే నెగ్గావయ్యా! అయినా మా వెర్రిగాని విధివిలాసం తప్పించటానికి ఎవరి సాధ్యం!" అంటూ విష్ణుమూర్తి బ్రహ్మదేవుని మెచ్చుకున్నాడు.

త్రిమూర్తులు ముగ్గురూ తమ నిజస్వరూపాలను వారికి చూపించి, దీవించారు. అంతేకాదు. ఒక పుష్పక విమానం ప్రసాదించి అదృశ్యమయ్యారు.

సుశీలకు ఇదంతా ఒక కలగా తోచింది. "ఇక మన ఇంటికి పోదామా?" అని గోపాలుడు అనేవరకూ ఆమె ఈలోకంలోకి రాలేకపోయింది.

"ముందు మా నగరం పోదాము! అక్కడ అంతా కంగారు పడుతూవుంటారు." అన్నది సుశీల.

తర్వాత ఇద్దరూ పుష్పక విమానంలో తరలిపోయారు.

* * *

లగ్నం వేళ ముంచుకువస్తోంది. పందిరిలో బ్రాహ్మలు గొడవచేస్తున్నారు. మహారాజు వడివడిగా మహారాణి అంతఃపురానికి బయలుదేరాడు. ఇంతలో "రాజకుమారి కనపడటం లేదు." అన్న వార్త గుగ్గిలం పొగలాగా పట్టణం మంతా వ్యాపించింది.

మహారాజు మండిపడ్డాడు. మహా

"ఇదంతా నీ పనే! ఎక్కడ దాచావో చెప్పు! లేకపోతే నరికిపారేస్తాను!" అంటూ కత్తి ఎత్తిపట్టాడు. మహారాణి నెత్తీ నోరూకొట్టుకుంది తనకు తెలియదని కాని మహారాజు మాట వినకుండా మార్తాండు డల్లే మహా ప్రళయం చేస్తున్నాడు.

ఈ గడబిడలో ఈపెళ్లి లేకుంటే పీడాబోయిరి! బ్రతికుంటే బలుసాకు తినవచ్చుననుకుంటూ శూరసేన సుకుమారులు వారివారి త్రోవలు వెతుక్కున్నారు.

ఉన్నట్లుండి ఆకాశం ఒక్కసారి మబ్బు పట్టినట్లయ్యింది. ఒక పెద్ద పూలవిమానం క్రిందకు రావటం ప్రజలంతా నోరు తెరచుకు చూచి ఆశ్చర్యపోయారు.

ఎక్కడనుండో "నాన్నా!" అన్న కేక మహారాజు చెవినబడింది. వెనువెంటనే ఆతనిచేత కత్తి నేల జారింది. ఆశ్చర్యంగా ఆ కేకవచ్చిన వైపు తిరిగాడు ఆశగా మహారాజు. నూతన వధూవరులు పూలవిమానంనుండి దిగివచ్చి తన పాదాలకు నమస్కరించటం వింతగా కండ్లప్పగించిచూచాడు మహారాజు. మంత్రముగ్ధుడల్లే ఆ యిరువురి దంపతుల్నీ లేవదీసి కావలించుకున్నాడు.

మహారాజు కనుకొలకుల్లోంచి రెండు అశ్రుబిందువులు నేలరాలాయి! ఆనందంగా "తల్లీ! నా సుశీలా! విధివిలాసం తల్లీ! బ్రహ్మ నొసట వ్రాసిన వ్రాత మానవ మాత్రులం మా చేత నేమవుతుంది తల్లీ తప్పించటానికి?" అంటూ కథంతా విన్నాడు.

బ్రహ్మానందం పొందారు ప్రజలు. ఆకాశమంత పందిరి భూలోకమంత అరుగూ వేసి అంగలో సుశీలా గోపాలుర పెండ్లి చేశాడు మహారాజు. దేవతలు పూలవాన కురి



దైవజ్ఞ పాతూరి శ్రీరామమూర్తి

18-1-61 బుధవారం మొదలు

24-1-61 మంగళవారం వరకు.

మేషం :

(అశ్విని, భరణి, కృత్తిక 1 పా.)

ఈవారం మీరు ఉత్సాహంతో ముందుకు పోగలుగుతారు. ఇంతకుముందు ధన విషయంలో కలుగుతున్న ప్రతి బంధకాలు తొలగిపోతవి, స్థిరాస్తులు కొనటం వంటి పనులు అనుకూలంగా జరుగుతవి. శుభకార్యాలలో పాల్గొంటారు. వృత్తి ఉద్యోగాలకు సంబంధించిన ప్రయాణాలు సకాలంలో సుఖంగా జరుగుతవి. మీ తొందరపాటువల కలహాలు వచ్చే సూచన లున్నవి. బంధుమిత్రులవల్ల ఖర్చులు పెరుగుతవి పైత్య ఉష్ణ ప్రకోపాలవల్ల మీ ఆరోగ్యం పాడేఅవకాశా లున్నవి. ఇతరుల వ్యవహారాలలో జోక్యం కలిగించుకోవలసి వస్తుంది. వారాంతంలో ఆదాయం పెరుగుతుంది. ఆందోళనను కలిగించే వార్తలు తెలుస్తవి. 18, 19 తేదులలో సుఖభంగం, వృథా ఖర్చులు, ఇష్టంలేని పనులు.

* * *

వృషభం :

(కృత్తిక 2, 3, 4 పా, రోహిణి, మృగశిర 1, 2 పా.)

ఇంతకు ముందుకన్నా ఎంతో అనుకూలమైన కాలం. కోర్టు కచేరీలలో మీమాటను నెగ్గించుకో గలుగుతారు. సంఘంలో పలుకుబడి బాగుంటుంది. మీ విరోధులు ఒకరిద్దరు మీ వృత్తి వ్యాపారాలలో చిక్కులు కలిగించటానికి ప్రయత్నించినా దైవబలం వల్ల జయం పొంద గలుగుతారు. కుటుంబంలోని వారికి తాత్కాలికంగా అనారోగ్యం చేస్తుంది. విలువగల వస్తువులు కొంటారు. అయితే మీరు అనుకున్నంత ఉపయోగం పొందలేక పోతారు. ఆదాయం క్రమక్రమంగా పెరుగుతుంది. మీకు ఆశను కలిగించి సాహస కార్యాలకు దింపే మాటలను నమ్మవద్దు. బంధువులు మిమ్ములను కలహాలకు లాగే అవకాశాలున్నవి. జాగ్రత్తగా ఉండండి. 23, 24 తేదులలో సంచారము, శక్తికిమించిన ఖర్చులు.

* * *

మిథునం :

(మృగశిర 3, 4 పా, ఆరుద్ర, పునర్వసు 1, 2, 3 పా.)

ఒకపని కలసివచ్చే సమయంలో సందేహాలు అడ్డువస్తూ ఉంటవి. పైకి ప్రీతిగా మాట్లాడుతూ మిమ్ములను ఇబ్బందులలో దింపే మనుష్యులు ఉంటారు. జాగ్రత్తగా ఉండటం అవసరం, బుద్ధిబలంతో మీ వ్యవహారాలను సక్రమంగా నడుపుకో గలుగుతారు. వృత్తి ఉద్యోగాలలో కొంతవరకు పోటీ కనుపించినా మీకు ఎంత మాత్రం చిక్కు రాదు. ధనాదాయం మామూలుగానే ఉంటుంది. పిల్లల మూలంగా సుఖ సంతోషాలు లభిస్తవి. లోగడ చేసిన వాగ్దానాలవల్ల ఈ సమయంలో చికాకు కలుగుతుంది. మృదువుగా కార్యం సాధించుకోవటానికి ప్రయత్నించండి, వారాంతంలో పొరపాట్లు చేస్తారు. 21, 22 లలో గౌరవప్రాప్తి, వృత్తిలో అభివృద్ధి.

> **గ్రహస్థితి**
>
> మిథునంలో అంగారకుడు, సింహంలో రాహువు, ధనుస్సులో గురు శనులు, మకరంలో సూర్య బుధులు, కుంభంలో శుక్ర కేతువులు, మకర కుంభ మీన మేషాలలో చంద్రుడు.

కర్కాటకం :

(పునర్వసు 4 పా, పుష్యమి, ఆశ్లేష)

అధికారుల స్నేహం, ఆదరాభిమానాలు సంపాదించగలుగుతారు. బంధువర్గంలో మీ యందు మంచిఅభిప్రాయం ఏర్పడి అన్ని విధాలా సహాయం చేస్తారు. లోగడ ప్రయత్నించి లాభంలేదనుకున్న కార్యక్రమాలు అకస్మాత్తుగా నెరవేరుతవి. కుటుంబంలో అనారోగ్యాలు, అందువల్ల ఖర్చులు మిమ్ములను నిరుత్సాహపరుస్తవి. భారమైన పనులు పైనవేసుకుని సకాలంలో నిర్వహించ గలుగుతారు. ప్రస్తుతం మీరు అనుకున్నప్రకారం ఆదాయం పెరిగే సమయం కాదు. వ్యవహారరంగంలో పొరపాట్లుచేసి సర్దుకోనవలసి వస్తుంది. నీచులతో కలహాలువస్తవి. క్రొత్తగా పెట్టుబడి పెట్టవలసిన పనులలో నిదానము, ఆలోచన అవసరం. 19, 20 లలో కారణంలేని భయము, పనులలో శ్రమ, నిరుత్సాహం.

* * *

సింహం :

(మఖ, పుబ్బ, ఉత్తర 1 పా.)

శ్రమపడి న్యాయప్రకారంగా విజయం సాధించగలుగుతారు అయితే తొందరపడకుండా నిబ్బరంతో ఉండటం అవసరం. శుభ పుణ్యకార్యాలు సకాలంలో అనుకూలంగా జరుగుతవి. కలహప్రసంగాలలో మీ మాటకు విలువ పెరుగుతుంది. ఎదురుచూస్తున్న లాభ వార్తలు సమయంలో వస్తవి. బంధుమిత్రుల రాకపోకలు ఎక్కువ. ఆదాయంకన్నా ఖర్చులు మితిమీరటంవల్ల ఇతరుల సహాయం ఎదురుచూడవలసి రావచ్చు. సమయానుకూలంగా ఇష్టంలేని వ్యక్తులతో కలసి పని చేయవలసి వస్తుంది. ప్రయాణాలు చేస్తారు. రాజకీయాలలో శ్రమతో చిన్నా కార్యం సాధించగలుగుతారు. 21, 22 లలో ధర్మకార్యాలు, వృత్తిలో అనుకూలత.

* * *

కన్య :

(ఉత్తర 2,3,4 పా, హస్త, చిత్త 1, 2 పా)

ఈవారం మీ ప్రయత్నాలు అనుకూల మార్గంలో ఉంటవి. మిమ్ములను ముందుకు పోకుండా చేస్తున్న వ్యవహారాలు, ప్రతిబంధకాలు తొలగిపోతవి. మీ రహస్యకార్యక్రమాలలో ఇతరులు జోక్యం కలిగించుకోకుండా చూచుకోండి. ధనసంబంధమైన లావాదేవీలలో తాత్కాలికంగా కలహాలు రావచ్చు. అకస్మాత్తుగా అదుర్దాకలిగే వార్తలు తెలియటంవల్ల మీ వృత్తి ఉద్యోగాలకు సంబంధించిన పనులలో మార్పులు చేయవలసివస్తుంది. ఇతరులకు సహాయం నిమిత్తం శ్రమ, ఖర్చులను భరించవలసి

వస్తుంది. పిల్లలకు అనారోగ్యం చేస్తుంది. వారాంతంలో మిమ్మల్ని సందిగ్ధావస్థలో పెట్టగల సమస్యలు ఏర్పడుతవి. నిగ్రహపూరంగా వ్యవహరించవలసి వస్తుంది. 18, 19 లలో ధనలాభం, అభివృద్ధికరమైన మార్పులు.

*　　　*　　　*

తుల :

(చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు)

ప్రతి విషయంలోను శ్రమ అధికంగా ఉంటుంది. మొదట మిమ్మల్ని ప్రోత్సహించిన మిత్రులు సమయంలో తప్పుకొంటారు. కార్యభారం పెరుగుతుంది. విలాస వినోద కార్యాలనిమిత్తం ధనవ్యయం పెరుగుతుంది. అనుకోకుండా కలహప్రసంగాలు వస్తవి. వృత్తి వ్యాపారాలలో శక్తి సామర్థ్యాలతో చిక్కులనుంచి తప్పించుకోగలుగుతారు. ముందుముందు బాగా లాభించగల పనుల నిమిత్తం ఈ సమయంలో ప్రసంగాలు, ప్రయత్నాలు జరుగుతవి. వ్యవహార రంగంలో మీ మాటకు విలువ తగ్గుతుందేమోనని భయం ఏర్పడుతుంది. అనుకున్న ప్రయత్నాలు సక్రమంగా జరుగుతవి కాని ఫలితం సాధారణంగా ఉంటుంది. కుటుంబంలో అభిప్రాయ భేదాలు వస్తవి. 23, 24 లలో శుభవార్తలు, స్నేహితులవల్ల కార్యసిద్ధి.

*　　　*　　　*

వృశ్చికం:

(విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ)

వృత్తి ఉద్యోగాలలో మీ బాధ్యతలను నెరవేర్చుకుంటున్నా పైవారిని తృప్తిపరచటం ఒక సమస్యగా తోస్తుంది. కార్యభారం పెరిగే సమయం. మీవద్దనుంచి ధనసహాయం ఎదురుచూచే మనుష్యులు ఉంటారు. ఇతరులతో కలిసి చేయు పనులు నిదానంగా జరుగుతూవుంటవి. కలహ ప్రసంగాలు రాకుండా చూచుకొనటం అవసరం. క్రొత్త మనుష్యులతో స్నేహం లభిస్తుంది. ముఖస్తుతి మాటలను నమ్మి శక్తికి మించిన భారం పైనపెట్టుకోవద్దు. ధనాదాయం మామూలుగా ఉంటుంది. త్రిప్పట అధికంగా ఉంటుంది. పుణ్య కథాకాలక్షేపాలయందు ఆసక్తి పెరుగుతుంది. వారాంతంలో నౌకరులు మొదలయిన వారితో కలహాలు వస్తవి. 21, 22 లలో సంఘ కార్యాలు, వినోద కాలక్షేపం.

*　　　*　　　*

ధనుస్సు :

(మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1 పా.)

ఇంతకుముందు ఉంటున్న నిరుత్సాహం తొలగిపోయి మీ పనులయందు శ్రద్ధాసక్తులు పెరుగుతవి, అప్పులుచేసి ఆడంబరంతో వ్యవహరించటం మాత్రం మంచిదికాదు, అనేక సందర్భాలలో మీ మాటను చలామణి చేసుకోగలుగుతారు. ఆరోగ్యం బాగుండక పోవుటవల్ల కొన్ని పనులు తాత్కాలికంగా నిలుపుకోవలసివస్తుంది. ఈ సమయంలో స్నేహితులు బాగా సహాయం చేస్తారు. ధన సంబంధమైన లావాదేవీలలో అభిప్రాయ భేదాలు రాగల అవకాశాలున్నవి. సంఘంలో పేరు ప్రతిష్ఠలు పెరుగుతవి. భూములు, ఇండ్లు మొదలయినవి కొనే ప్రయత్నాలు అనుకూలిస్తవి. 21, 22 లలో బంధువుల రాక, వృత్తిలో అభివృద్ధి.

మకరం :

(ఉత్తరాషాఢ 2, 3, 4 పా, శ్రవణం ధనిష్ఠ 1, 2 పా)

ఏపని చేదామనుకున్నా ఆర్థిక సమస్య అడ్డువస్తూ ఉంటుంది. కుటుంబంలో ఖర్చులు పెరుగుతవి. తలవని తలంపుగా అధిక బాధ్యతలు పైనపడే అవకాశాలున్నవి. అధికారులవల్ల జరుగవలసిన పనులు అనుకూలంగా జరుగుతవి. దూరమందున్న బంధు మిత్రులవద్దనుంచి శుభవార్తలు తెలుస్తవి. వృత్తిలో మీరు అనుకున్నంత ఫలితం పొందలేకపోయినా ఆయా సమయాలలో జరుగవలసిన పనులు సక్రమంగా జరుగుతూ ఉంటవి. భయము, ఆందోళన క్రమంగా తొలగిపోతవి. ఉష్ణ సంబంధమైన అనారోగ్యం చేయగల అవకాశాలున్నవి. ఉత్తర దిక్కునుంచి ధనలాభం ఉంటుంది. ధర్మకార్యాలకు ఆటంకాలు వస్తవి. 18, 20ల్లో కుటుంబ చిక్కులు, పనులలో శ్రమ.

*　　　*　　　*

కుంభం :

(ధనిష్ఠ 3, 4 పా, శతభిషం, పూ. భాద్ర 1, 2, 3 పా.)

స్వబుద్ధితో చేసే పనులు చాలావరకు అనుకూలిస్తవి. ధనయోగం పెరుగుతుంది. వ్యాపార వ్యవహారాలలో ఇతరుల సహాయం లభిస్తుంది. ఈ సమయంలో ఇతరులచేతికి వెళ్లిన వస్తువులుగాని, ధనంగాని సక్రమంగా తిరిగి వస్తవని ఎదురు చూడవద్దు. కుటుంబంలో అభిప్రాయభేదాలు వచ్చి ఆరంభించిన పనులకు ఆటంకం ఏర్పడుతుంది. విలువగల వస్తువులు కొంటారు. శరీర సౌఖ్యం లోపించగల సమయం. దుర్వార్తలు తెలుస్తవి. ఈ సమయంలో మీ సలహా ఇతరులకు బాగా ఉపయోగిస్తుంది. సాహస కార్యాలయందు ఆసక్తి కలుగుతుంది. వాహనాలు ఉపయోగించే సందర్భాలలో జాగ్రత్తగా ఉండండి. నిష్కర్షగా మాట్లాడటంవల్ల విరోధాలు వస్తవి. 23, 24 లలో సందేహాలు, అనారోగ్య సూచనలు.

*　　　*　　　*

— ఈ వారము ధరలు —

బంగారు ధరలో తేజీ సూచనలున్నవి. వెండి ధరలోకూడా పెరుగుదల వస్తుంది. అయితే 23 నుంచీ మందీ సూచనలున్నవి.

వేరుశెనగ పప్పుధర తేజీ అవుతుంది. నూనెధరలో పెద్దమార్పులు కనుపించవు. నూవుల నూనెధర కొద్దిగా మందీవచ్చి నిలుస్తుంది.

నూలుధరలో తేజీవచ్చి నిలుస్తుంది. ప్రత్తిధరలో కొద్ది మందీవచ్చి తేజీ వస్తుంది.

మిర్చి ధరలో తేజీ ఆరంభించి తిరిగి మందీవచ్చి నిలుస్తుంది. మినుములధరలో కొద్ది తేజీ వస్తుంది. చింతపండు ధరలో మందీ కనుపిస్తుంది.

మీనం:

(పూ. భాద్ర 4 పా, ఉ. భాద్ర, రేవతి)

ఒక బాధనుంచి విముక్తి పొందుతున్నామనుకునే సమయంలో మరొకభారం పైనపడుతూ ఉంటుంది. కుటుంబంలోని మనుష్యులను సంతృప్తిపరచటం శ్రమకరంగా తోస్తుంది. ఆదాయాన్ని మించి ఖర్చులు చేస్తారు. బాహ్య విషయాలలో శ్రమ తగ్గిపోతుంది. ఫలితంకూడా బాగానే ఉంటుంది. అయితే సహాయం చేస్తామని చెప్పినవారు సమయంలో చేయలేకపోతారు. వృత్తి ఉద్యోగాలలో మీ హోదా పెరగగల అవకాశాలున్నవి. పైవారివల్ల ఆదరణ లభిస్తుంది. విశ్రాంతిలేని కార్యక్రమాలు ఉంటవి. ప్రయాణాలు చేయవలసివస్తుంది. వారాంతంలో కలహాలు వస్తవి. 19, 20 తేదులలో వృథా ఖర్చులు, వస్తునష్టము. ★

నా అభిమాన పాత్ర — రావణ —

ఎన్.టి.రామారావు



నేను పుష్కరంగా నటుడుగా ఉన్నాను. మీ అభిమానం చూరగొన్నాను. వెండి తెరమీద నేను ఇలా నిలిచి వుండడానికి మీ అభిమానం సంపాదించగలడానికి కారణం నేను ధరించిన పాత్రలేనని నా విశ్వాసం.

అభిమానపాత్ర ధరించి అభిలాష తీర్చుకొనడంకన్న ఏ నటుడూ ఆశించేది మరొకటి లేదు. నటనకు చోటుదొరికే బలమైనపాత్రలంటే నాకు చాలా అభిమానం. కాలేజి రోజుల్లో నాటకాలు వేసేటప్పుడుకూడా అంతే. ఆడవేషం వేయమంటే ఎక్కడలేని పౌరుషమూ వచ్చేది. వేడి, వాడిగల పాత్రలు నాకు చాలా ఇష్టం. బెజవాడ కాలేజిలో మా మాష్టారు కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణగారు నాచేత ఆడవేషం వేయించాలని పట్టుపట్టడం — అదో గమ్మత్తు కథ! రాచమల్లుని యుద్ధకాండంలో నాగమ్మపాత్ర నాకు ఇచ్చారు. పౌరుషానికి కావాలంటే మీసం తీయకుండానే ఆ పాత్ర ధరిస్తానని నేను భీష్మించాను.

అలా భీష్మించుకునే అలవాటు అప్పటికీ, ఇప్పటికీ నాలో ఉంది. భీష్మునివంటి గంభీర పాత్రలన్నా వీరగాంభీర్యాలు, ఔదార్యం ఉట్టిపడే పాత్రలన్నా నాటికీ నేటికీ నాకు మక్కువ. తొలిసారి 'భూకైలాస్' చిత్రంలో రావణపాత్ర ధరించినప్పటి నుండీ నాకు అదో విశిష్ట పాత్రగా గోచరించింది.

'రావణ'— అనగానే స్ఫురించేది వికృతమైన ఏదో భయంకర స్వరూపం, స్వభావం. సామాన్యదృష్టికి 'రావణుడు' ఉగ్రకోపి, క్రూరుడు అయిన రాక్షసుడుగా కన్పిస్తాడు.

కాని — రామాయణం తరచిచూసినా, పూర్తిగా అర్థంచేసుకున్నా మనకు తోచే, కనుపించే ఆకృతి వేరు! శ్రీమహావిష్ణువే అతని అంతానికి అవతారమెత్తవలసివచ్చిందంటే ఆ పాత్రలో ఎంతో అసామాన్యమయిన గొప్పతనం ఉండి ఉండాలి. దానికితోడు అతని వంశం సామా



తి — బ్రహ్మవంశం. పులస్త్యబ్రహ్మ పౌత్రుడు. విశ్వవసువు పుత్రుడు. పుట్టుకచేత అతడు పుణ్యాత్ముడు. అంతే అని కొట్టివేయడం సాధ్యంగాదు. సద్బ్రాహ్మణవంశసంజాతుడయిన దశకంఠరుడు పునీతమైన జీవితం గడిపినవాడు.

సూర్యోదయాత్పూర్వమే సహస్రకోటి శివలింగాలను స్వకల్ప మంత్రోచ్చారణతో పూజించే శివపూజాధురంధరుడు రావణుడు. తలచినదే తడవుగా కైలాసవాసిని ప్రత్యక్షం చేసుకొనగల్గిన మహాతపస్వి.

ఇందుకు తగిన పురాణకావ్యనిదర్శనాలు జనశ్రుతులు ఎన్నో ఉన్నాయి.

దశకంఠరావణ విరచితమైన 'మహాన్యాసం' వల్లించనిదే మహాదేవుని అర్చన పూర్తికాదు. అతడెంత సంస్కృతీ పరిజ్ఞానం కలవాడో చూడండి.

అతని పాండితిలో లౌకిక పారలౌకిక శిఖరాలు మహోన్నతమైనవి. ఆధ్యాత్మిక చింతన, తనకు అతీతమైన దైవత్వం పట్ల భక్తి విశ్వాసాలు అతనిలో ఉన్నాయి.

రసజ్ఞుడుగా, కళాప్రపూర్ణుడుగా రావణుడు అద్వితీయుడు. త్రిలోకాలలోనే సాటిలేని వైణికుడు. సామవేదకర్త. తనపై అలిగిన శంకరుని ప్రీతికి పొట్టచీల్చి ప్రేగులతో రుద్రవీణకట్టి వీణవాయించడంతో పార్వతీపతిని తన ముందుకు రప్పించుకొనగల్గిన సంగీత కళాతపస్వి.

ఇక శాస్త్రజ్ఞుడుగామాత్రం రావణుడు సామాన్యుడా? ఈనాడు మన శాస్త్రజ్ఞులు చేరాలని కలలుకనే నభోమండలాలన్నీ ఏనాడో చూచిన శాస్త్ర పరిజ్ఞాని. వాతావరణాన్నీ, ఋతుక్రమాన్నీ హస్తగతం చేసుకుని తన రాజ్యాన్ని సుభిక్షంచేసుకున్న స్థితప్రజ్ఞుడు. అనేక మారణాయుధాలను, మంత్రతంత్రాలను, క్రియా కల్పవిద్యలను ఆకళించుకున్న శాస్త్రవేత్త. పుష్పకవిమానంలో వాయుగమనం చేశాడని, త్రిభువనలోకాలమీద దండెత్తి అష్ట దిక్పాలకులను తన పాదాక్రాంతులుగా చేసుకున్నాడని వర్ణించారు.

మేఘనాధుని జననకాలంలో వక్రించిన శనిపై కినిసి గదాఘాతంతో కుంటివానిని చేయడమే అతని జ్యోతిషశాస్త్రప్రజ్ఞకు నిదర్శనం.

ఆ వేళంలో ముక్కోటి ఆంధ్రులను తలపించే ఈ రావణబ్రహ్మ ఐరావతాన్నే ఢీకొనడం, అలిగినవేళ కైలాసాన్నే కంఠాలపై మోయడం అతని భుజబలదర్పానికి గుర్తులు.

రావణుడు కారణజన్ముడైన మహనీయుడు. పట్టినపట్టు విడువని కార్యసాధకుడు. అభిమానాన్ని ఆరాధించే ఆత్మాభిమాని. విపరీతస్థితులకు తలఒగ్గని ధీరుడు. అతన్ని ఈరూపేణ తలచుకొనడం పుణ్యసంస్మరణమే.

ఈ రామాయణస్థమైన నిదర్శనాలవల్ల మనకు కనుపించే వ్యక్తి ఎటువంటివాడు? అగుపించే రావణుడు ఎటువంటివాడు? బ్రహ్మతేజస్సుతో నిర్వక్ర పరాక్రమ బలదర్పితుడై, మహాపండిత ప్రకాండుడై, శివపూజాధురంధరుడై, శాస్త్రవేత్త అయిన మహాతపస్వి. కాని—

ఇంతటి మహోదాత్తుడు రాక్షసుడుగా, శత్రుడుగా పరిగణింపబడటానికి గల కారణమేమిటి?

అతని వైష్ణవద్వేషం ముఖ్యంగా ఒక కారణం. తాను శైవుడు కావడంలో తప్పులేదు. ఇష్టదైవాన్ని నమ్మి కొలవడంలో అపకారమూలేదు. కాని తన మతాన్ని ఇతరులమీద రుద్ది పరమతద్వేషంతో వైష్ణవపూజలాటంకపరచి విష్ణుద్వేషిగా హింసాకాండకు ఉపక్రమించడమే అతడంటే మనం భయభ్రాంతులమయ్యేటట్లు చేసినది. పరనారీ వ్యామోహమే నలకూబరుని శాపానికి దారితీసింది. అతని పతనానికి కారణమైనది. ఈ రెండూ అతనిపై దెబ్బతీసినట్లు మరేవీ తీయలేదు. అహంభావంలోకూడా అతని కతనే సాటి. తనలో తనకు ఎంత నమ్మకమున్నా, ఇతరులంటే నిర్లక్ష్యం. చులకన చేయడం, నందీశ్వ

నాశనానికి దారితీసింది. అతని సంకల్పంతా పాపరబలంతో పాతమైనది.

లక్ష్మీ అవతారమూర్తి అయిన మాతులుంగిని చెరపట్టబోయినప్పుడు పరాజయం పొందడం. వేదవతిగా ఉన్న ఆమెను తాను దక్కించుకొనలేకపోవడం, సీతగా జన్మించిన ఆమెను స్వయంవరంలో సాధించలేని పరాభూతుడు కావడం, కడకు సీతను లంకలో చెరపెట్టేవరకు అతడు మూర్ఖించడం— ఇవన్నీ పై మహాతర గుణాలతో శోధించిచూస్తే రావణుడు ఎటువంటి వాడుగా మనకు కనిపిస్తాడు? నాకు అతడు దుర్మార్గుడుగా కనిపించడు. పట్టుదలగల వాడుగా కనిపిస్తాడు. అతనిలో లేని రసం లేదు. కావలసినంత సరసం, ఉండరానంత విరసం ఉన్నాయి. శీతన్నటులలో మేటి. అటువంటిపాత్ర అపరూపమైనదని నా నమ్మకం. అలాంటి పాత్ర ధరించాలని నా అభిలాష. అదే నన్ను ఈ పాత్రధారణకు ప్రోత్సహించింది.

రావణుడు వికృతాకారుడు కాదు. పెద్ద పొట్టతో, ఉగ్ర మీసాలతో, అనవసర హుంకారాలతో వికట ప్రవృత్తిగలిగిన మదోన్మత్తుడు, అలక్షణుడు కాదు. మానవాతీతుడైన ఒక మహత్తర వ్యక్తి, శక్తి. కుండెడు పాలలోనయినా ఒక విషం బొట్టు పడితే పాలన్నీ విషం అయినట్లు ఇన్ని సద్గుణాలు కలిగినా, సద్బ్రాహ్మణవంశ సంజాతుడయిన రావణునిలో ఒక్క దుర్గుణమే అతని నాశనానికి దారితీసింది.

రావణపాత్ర సర్వావేశ సంకలితం. ఆనందం, ఆవేశం; అనుగ్రహం, ఆగ్రహం; సహనం, అసూయ; భక్తి, ధిక్కారం — ఇన్ని ఆవేశాలు కావేషాలు రావణుని తీర్చిదిద్దాయి. ఈ పాత్ర సజీవం కావడంవల్లనే నన్నింతగా ఆకర్షించింది.

ఈ మహాపాత్ర ధరించగలిగినందుకు ధన్యుడననుకుంటాను. రావణుని పరస్పర విరుద్ధప్రవృత్తులన్నీ వ్యక్తీకరించడానికి ప్రయత్నించాను. ఎంతవరకు సఫలుడనైనదీ అభిమానులు, పాఠకులు నాకు తెలియజేస్తే సంతోషిస్తాను.

పౌరాణికగాథలలో కనుపించే అద్భుతమైన సజీవపాత్రలలో రావణపాత్ర ముఖ్యమైనది అది నా అభిమాన పాత్ర. ★



"మమ్మీ! మనం తప్పుచేస్తే దేవుడు దండిస్తాడుకదూ?" అని అడిగింది మా పెద్దమ్మాయి ఉజ్జి. "అవునమ్మా" అన్నాను.

"మనం తప్పుచేసినా, ఒకవేళ దేవుడు దండించకపోతే?" అన్నది మళ్ళా అమాయకంగా. "అప్పుడు మనల్ని మనమే దండించుకుంటాం." ఈమాటకి ఆశ్చర్యం వేసింది కాబోలు, కాసేపు ఏదో ఆలోచించి, "మనల్ని మనమే యెలా దండించుకుంటాం?" అని అడిగింది. "మరికొన్ని తప్పులు చేసి బాధపడతాం .... మనల్ని మనమే నిందించుకుంటాం ... అదే దండన."

"అసలు తప్పులంటే యేమిటి మమ్మీ? ఇవి తప్పులు అని వేరే యెక్కడైనా వ్రాసి ఉంటాయా—నాకు కొన్ని పనులు చేస్తే తప్పని తెలుసు. అవేనా? లేకపోతే యింకా ఏవయినా ఉన్నాయా?"

"నీకు తెలిసిన వేమిటో చెప్పు చూద్దాం."

"పెద్దవాళ్లను యెదిరించడం తప్పు. ఒకళ్ళు మాట్లాడుతూ ఉంటే, వాళ్ల మాటకు అడ్డువచ్చి మనం మాట్లాడటం తప్పు, అబద్ధం చెప్పడం తప్పు ...."

"ఇవన్నీ నిజమే ననుకో ... కాని యిందాక అడిగావు చూడు బేబి! తప్పులంటే యేమిటని, దానికి యెవరూ సరైన సమాధానం చెప్పలేరు. నీకు తప్పని తోచిన పని, ఇతరులకి చాలా కరెక్టు గానూ, గొప్పతిగానూ తోచవచ్చు. నీకు మంచిదని పించిన పని మరొకరికి మహాపరాధంగానూ, క్షమించరాని తప్పుగానూ కనిపించవచ్చు—అందుకని మన మనసుకి యేది మంచిదని తోస్తుందో, యేది తప్పని తోస్తుందో దాని ప్రకారం నడుచుకుంటే మంచిదంటాను."

ఒక్కొక్కసారి, ఇది తప్పొ .... రైటా అని మనకు మనమే డిసైడ్ చేసుకోలేం. అలాంటప్పుడు మనకంటే పెద్దవాళ్లని అడగవచ్చు—వాళ్ళు యిచ్చిన సలహాను కూడా మనసులో పెట్టుకుని మరొకసారి ఆలోచించి ఆ తరువాత యేది సరియైనదని తోస్తుందో అదే ఫైనల్ అన్నమాట."

"మరి ... నాకు మంచి అనిపించిన పని ఒకటి చేశా అనుకో ... దానివల్ల యెవరికైనా బాధ కలిగితేనో?"

"కావాలని నీవు బాధపెట్టలేదని నీకు తెలిసినప్పుడు, వాళ్లను అకారణంగా నొప్పించానన్న ఫీలింగ్ నీలో కలిగినప్పుడు "క్షమించు" అని అడగడంలో యేమీ తప్పులేదమ్మా" అన్నా. ఇంతలో మా అబ్బాయి, మా ఆఖరి అమ్మాయి వచ్చారు.

"చూడు మమ్మీ పీడిని .... చీకటి పడిన తరువాత దయ్యాలు, భూతాల కథలు చెప్పి నన్ను భయపెట్టి నిద్రపోనివ్వకుండా చేస్తూ బెదిరిస్తున్నాడు—ఇప్పుడేం చేస్తావురా? మమ్మీతో చెప్పే కామగా?" అన్నది అమ్మలు.

"తమ్ము కంటె అమ్మలు చిన్నది కదా, వాడికి ఏమిటరా! రారా—పోరా అంటుంది అమ్మలు అలా అనవద్దని చెప్పు మమ్మీ" అన్నది పెద్దమ్మాయి సీరియస్‌గా.

"చూడు మమ్మీ! తనుమాత్రం తమ్ముని ఒరేయ్ అని పిలవవచ్చా? పెద్ద, నామీద దాడీలు చెప్తోంది' అని కొంచెం ఏడుపు మొదలుపెట్టింది అమ్మలు.

"నీకంటే చిన్నవాడని, తమ్ముని నువ్వు రారా - పోరా అనే అంటావు. నిన్ను చూచి అమ్మలు నేర్చుకుంది బేబీ!" అన్నాను.

"నేనంటే తనూ అనాలా? నేను తమ్ము కంటె పెద్దదాన్ని కాబట్టి వాడిని ఒరేయ్ అంటె తప్పు లేదు."

"తప్పు లేదనుకో—అమ్మలు అంటే తప్పని నువ్వే అన్నావు— మరి యికమీదట అమ్మలు తమ్ముని ఒరేయ్ అనకూడదని కూడా నువ్వే అన్నావ్. అమ్మలిని నువ్వే కరెక్టు చెయ్యాలి."

సినిమా



శంతేరపుంబి జానకి



భరణీవారి 'బాటసారి' నాగేశ్వరరావు- జానకి.

ఆదివారం...ఆదివారం

"దాన్నా ? అమ్మయ్యో ! కొంతేమయినా తెలిసి వస్తున్నది."

"మన్నేమీ చెప్పొద్దు. తమ్ముడ్ని మెచ్చుకోవాలా గాదా ... లేదా అని అనడం మానేసి చూడు— అమ్మకి నా అలవాటు దానంతటదే తప్పిపోతుంది" అని నవ్వుకున్నాను.

"అలాంటి పిల్లిద్దరిని నన్ను ఒకేసారి రారా ! అని అనొద్దని చెప్పు మమ్మీ. నాకు సిగ్గుగా ఉంది" అన్నాడు. మా అబ్బాయి—"ఇకమీదట అలా పిలవనులే పిల్లి ఆడుకోండి. నేను మీటింగ్‌కి వెళ్ళాలి" అన్నాను.

"ఏమిటి మమ్మీ ? ఆదివారం కూడా మీటింగ్‌కి వెళ్ళిపోతావు, ఈ ఒక్కరోజయినా మాతో ఆడుకోకూడదు ?" అన్నది అమ్మలు మూతి యింత పొడుగు చేసి.

"ఇకమీదట ఆదివారాలు మీతో గడపడానికి ప్రయత్నిస్తాను" అంటూ కారెక్కాను.

ప్రతి తల్లికీ, తన పిల్లల్ని ముద్దుగా పెంచాలనీ, మంచి పద్ధతులు నేర్పాలనే ఉంటుంది. ఆర్థిక పరిస్థితులవల్ల నయితేనేమి, కుటుంబం పెద్దది కావటంవల్ల నయితేనేమి, భర్త నిరుద్యోగి అయి, సంపాదించే భారం భార్యపై ఉండడంవల్ల నయితేనేమి అనుకున్న ప్రకారం పిల్లల్ని పెంచగలిగే అవకాశం అదృష్టం అందరికీ ఉండదు. అన్ని అవకాశాలు ఉండి కూడా, పిల్లల్ని కని, ఆయాలమీద వదిలేసి, తమ సౌందర్యాన్ని ఎక్కువ చేసుకోడానికి తగినంత శ్రమ లేదని కంప్లెయింట్ చేసే ఆడవాళ్ళు కూడా లేకపోలేదు లెండి. కాని అలాంటివారిని ఆడవాళ్ళ జాబితాలో వెయ్యడం ఏమంత సమంజసం కాదు. పైగా వాళ్ళను తల్లులంటే మరీ చిన్నబుచ్చుకుంటారు కూడాను. నేను చెప్పేది కూడ, ప్రేమ, మమకారం అనే పదాలకు అర్థం, విలువా తెలిసిన ఆడవాళ్ళను గురించే లెండి.

కొంతమంది పిల్లలు, వాళ్ళ వయస్సుకి మించిన మాటలు మాట్లాడుతూ ఉంటారు. అలాంటి పిల్లల్ని మావాళ్ళ యింట్లో యిదరు ముగ్గురిని చూశాను. పెదపెద్ద మాటలు మాట్లాడే తమ పిల్లల్ని చూసుకుని మురిసిపోయేవారు ఆ తలిదండ్రులు—నిజం చెప్పొద్దు.... అలాంటిపిల్లల్ని చూసినప్పుడు నాకు మహా అసహ్యంవేసి, పెంపకం సరిగ్గా లేక అలా తయారయ్యారు అన్నాను "అబ్బో, నీ పిల్లల్ని యెంతలక్షణంగా పెంచేతావో చూస్తాంగా" అని నవ్వు యెగతాళి చేశారు కూడా వాళ్ళు.

"తల్లిదారి తప్పి, పెరవు తెచ్చిన సంసారాలతో స్టూడియోలో కాలం గడిపే మాలాంటివాళ్ళం, తీరా యింటికి వచ్చి "మా" పిల్లంతో అయిదు నిమిషాలపాటు తీరిగ్గా కూర్చుని మాటాడే అదృష్టానికి నోచుకోలేదంటే ... అది కేవలం మేము పొందిన శాపం అనే అనాలి.

మాతృత్వం ఉట్టిపడే ప్రేమతో యెవరి పిల్లనో యెత్తుకుని, ముద్దాడి, అన్నం తినిపించి, జోలపాట పాడి నిద్రబుచ్చి అంటూ, తోముకోడానికి వెళ్ళే నేను సినిమాలో చూసి "ఆహా ! ఏమితల్లండీ ! తల్లంటే అలా ఉండాలి" అంటారు.

గతిలేక తన పిల్లవాడిని యే అనాథశరణాలయంలోనో చేర్పించి పిల్లవాడి తల్లినన్న సత్యాన్ని దాచిపెట్టి తనూ అక్కడే ఆయాగా పనిచేసే దృశ్యం చూసి "పాపం ... చదువు తీసి మరీ. ఆఖరికి దాసీదానిలా పడుంది చూడు ఆ పిల్లాడికోసం" అని కన్నీళ్ళు కారుస్తారు సానుభూతితో—కారణాంతరాల వల్ల ఒక తల్లి తన పిల్లవాడికి తండ్రి యెవరో కూడా తెలియకుండా పెంచుతుంది. పిల్లవాడు

పెద్దవాడయిన తరువాత "అమ్మా ! మా నాన్న యెవరు ? .... చెప్పమ్మా."

"వద్దు నాయనా ! ఆ విషయం నన్నడగకు, నీవు తెలుసుకోకూడదు."

"ఎందుకు తెలుసుకోకూడదు ? బడిలో పిల్లలు నన్ను "వీడికి తండ్రి లేడురా" అని గోల చేస్తున్నారు, చెప్పమ్మా ... మా నాన్న యెవరు ?" తల్లి చెప్పదు. "సరే నువ్వు చెప్పకపోతే ... నేనే తెలుసుకుంటాను" అంటూ గంభీరంగా నడిచి వెళ్లిపోయే తన కొడుకును చూచి "అంతా ఆ తండ్రి నడకే" అనుకుని, తనను వంచించిన భర్తను ఒక్కసారి జ్ఞాపకం చేసుకొని గుండె పగిలిపోయేటట్లు యేడుస్తుంది. కొంతకాలానికి తన తండ్రి ఎవరో తెలుసుకుని యిద్దరు భటులతో తండ్రిని తీసుకు వచ్చి తన తల్లి కాళ్లమీద పడేసి "అమ్మా నీకు ద్రోహం చేసిన మగవాడు వీడేనా ? నీ కాళ్లమీద పడేసి తరువాత చంపుదామని తీసుకువచ్చాను. చెప్పమ్మా."

"ఆ .... తప్పు నాయనా ! అలా అనకూడదు. ఆయన మీ తండ్రిగారురా" అంటూ కొడుకు చేతులు పట్టుకు ప్రాధేయపడుతుంది. "తండ్రిగారట ... తండ్రిగారు ... ఇన్నేళ్లూ ఎక్కడున్నారు యీ తండ్రిగారు ? నిన్ను అవస్థలపాలుచేసిన యీ పాపాత్ముడు నాకు తండ్రే కాడు, నీకు భర్తా కాడు. ఇటువంటి ద్రోహులు బ్రతికి ఉంటే ప్రపంచంలో పాపాలు ఎక్కువైపోతాయి" అంటూ తన చెయ్యి విదిలించుకుని తండ్రిని కత్తితో పొడిచి చంపడానికి ముందుకు వెళ్లే కొడుకునూ, ఆముదం తాగిన ముఖంపెట్టి దీనంగా, సహాయం కోసం చూచే భర్తనూ చూసి నరకవేదన అనుభవిస్తూ వా రిద్దరి మధ్యకూ వచ్చి నిలబడి "కుమారా ! ఆగు. ఇంతటి కసాయివాడి వయిపోయా వనుకోలేదు. ముందు నన్ను చంపి, తరువాత వారిని హతమార్చు" అంటూ ఒక లెక్చర్ యిస్తుంది. ఆ తల్లి యిచ్చిన గంభీరోపన్యాసంతో చిత్తయిపోయి కత్తి క్రింద పడవేసి "క్షమించు తండ్రీ! తల్లీ ! నాకు జ్ఞానోదయ మైనది." అని ఒక అవున్సు గ్లిజరిన్ వృధా చేసి యేడ్చే సీను చూచి, ఆహా ! పిల్లవాడు భలేవాడండి. ఇలాంటి సుపుత్రుడు ఒక్కడున్నా చాలు జన్మ తరించి పోతుంది."

"పిల్లవాడిదేముందండీ ! ఆ తల్లి చూశారు—అన్ని అవస్థలపాలు చేసినా ఆ భర్తంటే ఎంత భక్తి, ఎంత ప్రేమ ... ఆడదంటే అలా ఉండాలి. అంటారు.


నిత్యజీవితంలో యిలాంటి మెలోడ్రమెటిక్ సిట్యువేషన్స్ లేకపోయినా, యింతకంటే టచ్చింగ్‌గాను, హృదయాన్ని కరిగించేవిగాను ఎన్నో సంఘటనలు జరుగుతూనే ఉంటాయి. వాటిని తెరమీద చిత్రించలేం ... ఒకవేళ చిత్రించినా "అబ్బబ్బ ! ఎంత అసహజంగా ఉందో చూశారా !" అని మనమే అంటాం.

ఒక **ఆదివారం** పిల్లలతో గడపటానికి నిర్ణయించుక**న్నాను. ఆ** ఆదివారం అందరం కలిసి ఒక **చిన్న వూరికి వెళ్లా**మని ప్రోగ్రాం వేశారు పిల్లలు—"మమ్మి చాలా మంచిది. మనం అడగగాన ఆదివారం సెలవు పెట్టింది చూశావా ?" అన్నది అమ్మలుం వాళ్ల సంతోషానికి అంతులేదు. శనివారం సాయంత్రానికే పూర్తికావలసిన పని, పూర్తికాకపోవడం చేత, మిగిలిపోయిన సీను మరునాడు అంటే "ఆదివారం" కూడా పనిచేసి పూర్తి చెయ్యడానికి మిగతా ఆర్టిస్టులంతా ఒప్పుకోవడం చేతా, నేనూ సరే అనాల్సి వచ్చింది. పిల్లల్ని నొప్పిస్తానన్న భయంతోనే యింటికి వచ్చాను. ప్రయాణానికి కావలసిన ఏర్పాట్లన్నీ చేసుకుని అలసిపోయి నేను వచ్చే టప్పటికే నిద్రపోతున్నారు— "వాళ్లను లేపడం దేనికిలే. పైగా ఓపిక కూడా లేదు" అనుకుంటూ మెట్లెక్కుతున్నాను. మా మేనత్త వచ్చి "జానకి ! పిల్లలు బట్టలూ అవీ సర్దుకున్నారు. "రేపు త్వరగా లేవాలి. మేం నిద్రపోతాం గాని, మమ్మి వస్తే మా తరఫున గుడ్‌నైట్ చెప్పు" అని పడుకున్నారునే అన్నది. నాకు ఏం చెప్పాలో తెలియలేదు. ప్రోగ్రాం లేదని అత్త చెప్తే పిల్లలు బాధపడతారేమో—నేనే చెప్తే మంచిదని ఏమీ మాట్లాడకుండా పైకి వెళ్లిపోయాను. ఆదివారం ఆరు గంటలు కొట్టక ముందే గంతులు వేసుకుంటూ ముగ్గురూ నా గదిలోకి వచ్చారు. "లే ... మమ్మి ఆలశ్య మయిపోయింది. మేం ఎప్పుడో రెడీ" అన్నది బేబి.

"మమ్మి ! వీళ్లందరిని లేపింది నేనే ... మొదట నిద్ర పోతున్నారు" అని వాళ్లను చూచి నవ్వింది అమ్మలు. "మహా లేపావులే. ఇంకా తెల్లవారకుండా



అన్నపూర్ణా వారి 'వెలుగునీడలు'లో సూర్యకాంతం, రంగారావు, రేలంగి.



శ్రీ వెంకటసాయి ఫిలిమ్స్ "మాయామశ్చీంద్ర"లో మచ్చీంద్రుడు (మనోహర్ దేశాయి) తిలోత్తమ (రిమూ సాగాయ్)

ముసలమ్మలా లేచి కూర్చొని మమ్మల్ని వూరికే గొడవ చేస్తుంది అమ్మలు'' అన్నాడు మా అబ్బాయి వంకర్లుపోతూ. అవున్రా ! చాలా ఆలశ్యమయింది. నేను స్టూడియోక్కు వెళ్ళాలి. లక్ష్మిని (నాతో వచ్చే అమ్మాయి) పిలవండి అన్నాను.

"ఏమిటి మమ్మీ ? స్టూడియోకి వెళ్తావా ! మరి మేం వేసుకున్న ప్రోగ్రాం లేదా'' అని అడిగింది బేబి దీనంగా.

వాళ్ళను కూర్చోబెట్టి తప్పనిసరిగా పని చెయ్య వలసి వచ్చిందని, ఈసారి తప్పకుండా ఆదివారం యింట్లోనే ఉంటానని నచ్చచెప్పి వాళ్లను ఆరోజు మ్యూసియంకు తీసుకువెళ్ళే ఏర్పాట్లు చేసి స్టూడియోకు వెళ్ళిపోయాను. మామూలుగా నేను స్టూడియోకి వెళ్ళే సమయానికి పిల్లలింకా నిద్రపోతూ ఉంటారు—ఒంటి గంటకు భోజనానికి వచ్చినప్పుడు వాళ్ళు స్కూల్లో ఉంటారు— ఇక రాత్రి ఎంత ఆలశ్యమయినా ముగ్గురూ గేటుదగ్గర నిలబడి నేను కనిపించగానే "మమ్మీ గుడ్‌నైట్'' అని కోరస్ పాడి లోపలికి వెళ్ళిపోతారు. కనీసం రాత్రి యింటికి వచ్చాకయినా వాళ్లతో కాసేపు మాట్లాడి ఏం తిన్నారో, ఏం పాఠాలు నేర్చుకున్నారో అడుగుదా మన్న ఆదుర్దా మనసులో ఉండి "ఏమర్రా ! నా ముఖం చూడగానే మీకు నిద్ర వస్తుందా ? లోపలికి వచ్చాక కాస్సేపు కబుర్లు చెప్పి తరువాత వెళ్లి పడుకోరాదు'' అని విసుక్కున్నాను కూడా ఒకరోజు. ముగ్గురూ ముఖాలు చిన్నబుచ్చుకుని "అదికాదు మమ్మీ ! మాకు యిందాకే నిద్ర వచ్చింది. ఎలాగో ఆపుకున్నాం నీకు గుడ్‌నైట్ చెప్పి పడుకుందామని'' అన్నారు. గడియారం వైపు చూశాను 10—45 అయింది. ఆ వయస్సు పిల్లలు, అంత పొద్దుపోయేదాకా మేలుకోవడం తప్పే. నా చిన్నతనంలో ఎనిమిది గంటలకే నిద్ర పోయేదాన్ని. అయాం సారీ. నేను రావడం ఆలశ్యమయింది. యిక వెళ్లి పడుకోండి అని ముద్దుపెట్టాక నవ్వుతూ వెళ్ళిపోయారు.

ఆదివారం...ఆదివారం

వచ్చే నిద్రను బలవంతంగా ఆపుకుని ఒక్కసారి నాకు గుడ్‌నైట్ అయినా చెప్పి నిద్రపోదాం అని కాచుకు నిలబడే పిల్లల్ని అర్థం చేసుకునే వోపిక కూడా పోతున్నందుకు నన్ను నేనే నిందించుకున్నాను. ఇకమీదట పిల్లలు ఎనిమిదిన్నరకే నిద్ర పోవాలని ఆయాతో చెప్పి కాళ్లీడ్చుకుంటూ మేడ మీదికి వెళ్లిపోయాను.

ఒకరోజు షూటింగ్‌కు వెళ్లాలని రెడీ అవుతున్నాను. ఆయా వచ్చి "అమ్మా ! మీ కోసం ఎవరో వచ్చారు. చాలా అర్జెంటు పనట.'' అన్నది. "ఇంతపొద్దున్నే ఏమిటా అర్జెంటు, నాకు యిప్పటికే ఆలశ్యమయింది. ఆ అలారం మోగలేదు యివేళ—వాళ్లను దయచేసి తరువాత వచ్చి కలుసుకోమను'' అన్నాను. "మేమూ అదే చెప్పాం అమ్మా ! కాని వినలేదు. ఏమయినా సరే మీతోటే మాట్లాడి వెళ్తామని మొండితనంగా కూర్చున్నారు''. "సరే .... ఎలాగూ యింకో అయిదు నిముషాల్లో నేను కిందికి వస్తానుగా కూర్చోమను'' అన్నాను ఆలశ్య మయిందన్న చిరాకుతో—డ్రాయింగ్ రూమ్‌లోకి వెళ్లబోయే ముందు కాస్త పమిట సర్దుకున్నాను. ముగ్గురు పెద్దమనుష్యులు సోఫాలో కూర్చున్నారు. నన్ను చూడగానే "నమస్కారమండి ! మిమ్మల్ని చూడాలని చాలా దూరం నుంచి వచ్చాము. మీ దర్శనం కలుగడమే కష్టంగా ఉన్నది'' అన్నది ఒక పెద్ద ముత్తయిదువు. ఒక ముసలాయన లేచి "మీ యింటిముందు గూర్ఖా, పెద్ద కుక్కా, కనిపిస్తే అటునుంచి అటే వెళ్లిపోదా మనుకున్నామండి— మా అదృష్టం బాగుంది. అలాంటివేమీ కనుపించలేదు. కాని మీ యింట్లో ఉన్న మనుష్యులు మిమ్మల్ని చూడ్డానికి వీల్లేదు వెళ్లిపొమ్మంటున్నారండి. మీకు కోపం చాలా త్వరగా వచ్చినా, మీరు చాలా మంచివారని విన్నామండి'' అన్నాడు. వెంటనే యింకొకావిడ లేచి "మీరు వేసిన సినిమాలన్నీ చూస్తూఉంటావండి— నాకు సినిమాలో వేషాలు వెయ్యాలని చాలా సరదాగా ఉందండి. మా అమ్మగారేమో సినిమాలే చూడకూడ దంటారండి. సినిమాలు చూస్తే పిల్లలు, పెద్దవాళ్ళు చెడిపోతారంటారు—మీరేమంటారండి'' అని అడిగింది.

"ఏమిటర్రా పిల్లలూ ! పొద్దుటే యీ అల్లరి! ఎన్నాళ్లనుంచీ యీ డ్రామా రిహార్సల్స్ అన్నాను.

"డ్రామా కాదు మమ్మీ ! నిన్ను చూడ్డానికి వచ్చేవాళ్ళు అనే మాటలేగా యివి. నేను చాల సార్లు విన్నాను'' అన్నది బేబి కొంటెగా. 'తప్పమ్మా ! యిలాంటి పెద్ద పెద్ద మాటలు యికమీదట మాట్లాడకూడదు అన్నాను నవ్వు ఆపుకుంటూ.

"ఓ ! ప్రామిస్‌గా ! యికమీదట మాట్లాడ్డం మానేస్తాం. నువ్వు ఆదివారాలు షూటింగ్‌కి వెళ్లడం మానేస్తే.''

"ఓ ! అలాగే మానేస్తాను.''

"మరి యివేళ ... ఆదివారం మానేసెయ్యి చూద్దాం !''

"ఇవేళ ఆదివారం అని కూడా జ్ఞాపకం లేదు నాకు. ఇప్పుడు వెళ్లకపోతే నావల్ల షూటింగ్ ఆగిపోదూ ? అందుకని వచ్చే ఆదివారం ఎలాగైనా మీతో ఆడుకుంటాను. సరేనా ?

"పో మమ్మీ ! నీ మాటలు మేం నమ్మవ్— నువ్వెప్పుడూ యిలాగే ఉత్తమాటలు చెప్తున్నావ్'' అన్నది అమ్మలు.

"తప్పు అమ్మలు! మమ్మీని అలా అనవచ్చా. ముందు పని, తరువాత ఆడుకోవడం'' అని మందలించాడు మా అబ్బాయి.

ఒకసారి మా తోటికోడలితో "పిల్లల్ని నే ననుకున్న పద్ధతుల్లో పెంచలేకపోయానని, విచారంగా ఉం దని అన్నాను.

"ఆ ... పోనిస్తూ అలా ఎందు కనుకోవాలి ? యిప్పుడు నీ పిల్లలి కేం తక్కువ ? వాళ్లకు కావలసిన సౌకర్యాలన్నీ ఉన్నాయి. అంతకంటే ఏం కావాలి ? వూరికే పిల్లలిమీద ఆపేక్షలు, ప్రేమలు ఉంటే మాత్రం ఏం వూడిపడిపోతుందిలే డబ్బు లేకపోయాక.—అన్నది. మనిషి జీవించడానికి డబ్బు చాలా అవసరం అనుకోండి. కాని దానికంటే అవసరమైనది విలువైనదీ అనురాగం .... ఆదరణా ....

బహుశః యీ అనురాగం ... ఆదరణ అనే వెలబోసి కొనుక్కున్నవే యీ పేరుప్రఖ్యాతులనుకుంటా.

తమవారికి దగ్గరగా ఉండి ప్రేమానురాగాలను రుచిచూస్తూ చూపిస్తూ ఉండే స్త్రీలు సినిమాలలో నటించాలని ఎలా కుతూహలపడతారో, అసహజమైన వాతావరణంలో జీవించి, యంత్రాల్లా పనిచేసే మేం కూడా, వాస్తవిక జీవితానికి దగ్గరగా, మామూలు మనుష్యుల్లా జీవించాలని కలలు కంటూ ఉంటాం.... ఏది ఎలా ఉన్నా, ముందు నా సంక్రాంతి నిర్ణయం ఆదివారం, ఆదివారం ఇంట్లోనే ఉండి పిల్లలకు తెలియనివిషయాలు తెలియజెయ్యడానికి ప్రయత్నిస్తూ, నాకు తెలియని విషయాలు పిల్లల దగ్గర నేర్చుకోవడమే నుమండి !'' ★



ఫిల్మ్ యుగ్ వారి "ఆన్‌కా పంఛీ" చిత్రంలో వైజయంతీమాల, రాజేంద్రకుమార్.

సంక్రాంతి చిత్రతోరణం

లోకులతోపాటు సినీ లోకులకు సంక్రాంతి పండగ పెను పండగే. కాయకష్టం పండి, కమ్మని తలపులు పిండి కళ్యాణ కింకిణిలా వస్తుంది ఈ పండగ పండేది కాయకష్టం గనుక, పిండేది కమ్మని తలవు గనుక ఈ పండగ దండగ కాదని అనుభవం

రెండేళ్ల శ్రమతో పరిశ్రమతో అన్నపూర్ణా వారు నిర్మించిన 'వెలుగు నీడలు' జనవరి 7 వ తేది తెలుగునాట విడుదల అయింది నిర్మాత మధుసూదనరావు సమర్పణ సంక్రాంతికి తెలుగు వారి కమ్మని పండుగ అక్కినేని నాగేశ్వరరావు, జగ్గయ్య, రంగారావు, రేలంగి, సావిత్రి, గిరిజ, సూర్యకాంతం, రాజసులోచన నటించారు దర్శకుడు ఆదుర్తి సుబ్బారావు సంగీతం . పెండ్యాల నాగేశ్వరరావు. సంభాషణలు ఆత్రేయ, కళ కృష్ణరావు, సుబ్బారావు

సంక్రాంతిలోగానో సరిగా అనాటికో విడుదల కాబోతున్నది శ్రీ రాజరాజేశ్వరి వారి 'ఉషా పరిణయం' కడారు నాగభూషణం దర్శకుడు సంగీతం పిలూరు హనుమంతరావు జమున, కాంతారావు, రంగారావు, రేలంగి, రఘురామయ్య, సూర్యకళ, మారిబాబు, నటీనటులు

* * *

ఎస్ ఎ టి. వారి 'సీతారామకళ్యాణం' జనవరి 6 వ తేదీన విడుదల అయింది గాలిపెంచల సంగీతంతో రసమయంగా ఉన్న ఈ చిత్రంలో రావణుడు రామారావు బి. సరోజాదేవి, మణి, స్వర్ణ, కాంతారావు, గుమ్మడి, హరనాథ్, నాగయ్య, మిక్కిలినేని, ఎ వి సుబ్బారావు వగైరా నటించారు నిర్మాత నందమూరి త్రివిక్రమరావు.

* * *

ఆర్. ఆర్. పిక్చర్స్ వారు సరసమైన సాంఘికం నిర్మించారు. 'ఇంటికి దీపం ఇల్లాలే' అనే మంచి పేరు పెట్టారు జనవరి 26 వ తేదీ విడుదల చేస్తారు. ఎన్. టి రామారావు, జగ్గయ్య, రేలంగి, బి సరోజాదేవి ప్రధాన పాత్రధారులు. దర్శకుడు ఛాయాసేతు. శరత్ సం గీ త ని ఎస్ రెడ్డి

ఫిల్మ్‌యుగ్‌వారి 'ఆన్‌కా పంఛీ' లో రాజేంద్రకుమార్, వైజయంతీమాల నటిస్తున్నారు సంగీతం శంకర్ జైకిషన్ ఇది త్వరలో తెలుగునాట విడుదల కాబోతున్నది

వీణాపాణి

వీణఅంటే మనోవీణఅని మన లో 'మనం' భ్రాంతిపడి నిజమనుకుని అపశంగా అనందిస్తుంది. వీణ అంటే వీణే అనుకుని మనలో మనం అది వింటే బావుంటే బావున్నా అనుకుంటాము.

తన సుఖవీణా స్వర సంగతితో ఆ మొదటి తరగతి నే గాక ఈ రెండో తరగతిని కూడా సంతోషపెట్టి కావలంటే ఇంకా స సుఖానుభూతి కూడా కల్గించే వీణాపాణి శ్రీ చిట్టిబాబు

తెలుగు జిలుగుమీరిన తెలుగువాడు. పాటల కోటకు అమని అయిన ఈమని శిష్యుడు మొన్న డిసెంబరు 18 వ తేదీ దక్షిణాది రసవశు అన్నప్రాశన కొత్త కీతిలో చేశారు,



డాక్టర్ టి రాజరత్నంగారి
బేబి గీతా ప్రసాదిని, ఖాడీపత్రి
(ఢిల్లీలో చేసేప్పుడు తీసిన ఫోటో)

సినీజనమనోభిరామం

ఒకడు—1

'వచ్చిందోయ్ సంక్రాంతి
తెచ్చెను నూతన క్రాంతి'

యమగా ఉందిరా పాటేటి బల్ మంచిపాట—పాటంటే ఇద్దిదేపాట. దేశమ్మైనఈ సినిమాలకే చెల్లింది ఆ గంటసాలాయనకే చెల్లింది ఏ ంకంటం యమకంటం!

ఒకడు—2

అహాహాహా!

పోర్నీ పైత్యంగూల! ఇదో పాటేంటసలు—సంకురేత్రిపాటంటే అద్దదీపాట—ఈ పాట్లన్నీ దానికింద హుఁ!

ఒకడు—1

ఏంటసే యింతకీ అపాటు.

ఒకడు—2

ఓరి దద్దమ్మా, మీ అమ్మనసాల్లా—నిన్నుగాదు—నీబోటి దద్దమ్మను కన్నందుకు నన్నానినన్నాసీ—వినసే యాంపాటంటావు సంకురాత్రి సినిమా రాలేదంటావా! అందులో సావిత్రి పాడుద్దినాడూ—'వచ్చిందమ్మ వచ్చిందీ సంక్రాంతిపండగ వచ్చిందీ! ముత్యాలమ్మ ముగ్గులతోనా వచ్చిందమ్మ' ఇన్నీలేదేంటే! ఓర్నీ చెవుల్లో పాటిదిబ్బలు పుట్ట. ఆ పుట్టమైన చెట్లు పుట్టి పిట్టగుడ్లు పెట్ట—

ఒకడు—1

తాతల్నాటి సినిమా పల్నాట్లో చూశావుగాని మూలావు—మొన్నటి సినిమా చూడు అదేందబ్బా...ఆఁ-అదీ 'నాయిల్లు'-ఎవకటి ఈగో లేదంట్రా నాగయ్య, ఆయనగారు చివరిసారి ఈగో ఏసిన సినిమా అదేగంద—అందులో ఏంకమ్మగా ఉందనుకున్నావ్ పాట.

'గొబ్బిళ్లో గొబ్బిళ్లో—
దోసిళ్లో రేగుపళ్ల దోసిళ్లో
—భోగిపళ్ల దోసిళ్లో'

ఒకడు—3

'ఏంద్రరాగోల పాటూ పదాలూ—సంకురేత్రి సంబరాలు మాజోరుగా తేజాలుగా సాగిత్తున్నారల్లే ఉండే.

ఒకళ్లు—1, 2

రా బాబాయ్ రా ఇగోళసందట్లో నీతో పనొచ్చిపడ్డది. మా చెడ్డపని—అద్సరేగాని.

ఒకడు—3

ఎవురో ఓకు చెప్పండ్రా సంగతేంటో—అయ్యో...ఇదెక్కడిగోల ఇసయం అర్థంగా కూడా, ఆఁ,

ఒకడు—1

అదిగాదే మావయ్యా.

ఒకడు—3

ఛఁ. మావయ్యేందిరా అన్నకొడకా—నీ కడుపుడకా—ఈ బూతిపట్టెల్ జూసి ఇష్టమూర్తను కున్నావాంజినీలువుటోయి రొంకటేశరూ అన్నాట్ట యవకంటికి నీబోటి దద్దమ్మలో అమ్మమ్మ.

ఒకడు—2

మరీ అలాగని కోప్పడితే యెట్టాబాబాయ్ ఏదో నోగుగంటా జారుతూ జారుతూలేస్తూ కూతూ-కొత్తనువ్వు కని పెట్టకపోతే యెట్టా అది సరేగాని ఇంతకీ నే చెప్పొచ్చేమాట—'నాయిల్లు'లో సంకురేత్తిరి పాట బావుందన్నెను మగోటేటో బావుందని వాడూ నువ్వెరిగి నోడివి నువ్వే చెప్పు. సంకురేత్రి పాటెందులో బావుందో.

ఒకడు—3

(క్షణం నిట్టూర్చి; తనలో తనే నవ్వుకొని ఇద్దరు ఒకళ్ళనీ ఇరకాటాన పెట్టినట్టు చూసి, చూపుతో నవ్వి)

ఓ రబ్బలారా-కండలున్నా గుండెలేని బక్కాద్దాయిలారా. సంకురేత్రిపాట తెరమీద లేదురా. తెరమీద్ది సంకురేత్రి కారాదురా. కాలేదురా. సంకురేత్రిపాట అదికాదురా, అదదో ఆ తూరుపు దిక్కు చూడు. సూర్చుకుప్పల్ని చూడు. ఏటిపాటు పండి మనకు పండగైనవైనం చూడు. నడుంవంచి, కడుపుకట్టి, చెమటలోడ్చి అమ్మతల్లి భూదేవిని నమ్మిచెడక బతికిచెడక ఏకబిగిన బసవయ్యల బుసల్తోన శ్రుతులుకలిపి బుజంకలిపి దుక్కిదున్ని కంటికి చేనేరెప్పగ రెప్పకింది కనుపాపగ కన్నపాపగ తిన ఓపిక ధారపోసి నాగుపోసి నీరుపోసి పైరుజేసి పంటతీసి కంటజూసి సంబరాన సందడిలో సంకురేత్రి పంజవెలుగు తెరసిల్ల ఉల్లమెల్లగుల్లమనంగా.

పనిపాటలలో పాటలు, ఆ పాటలలో తేటలు, తేటలలో మనబాటలు ; బతుకు తెరకు సినిమాటలు.

ఈ సినిమా చూడనేర్చి, ఈ పాటలుపాడనేర్చి, ఈ ; బతుకుల నాడనేర్చి చూడండీ సినీగాలు, సంకురేత్రి సంబరాలు.

ఒకళ్ళిద్దరూ ఒక్కటై:

నిజం నిజం బాబాయ్,
బతుకు నిజం బాబోయ్
సినిమాలో లేదు నిజం
జాలమే సినిమా నిజం.



గాయత్రి ఫిలిమ్స్ కృష్ణకుచేలలో అనూరాధగా రాజశ్రీ

హరి వంశము

మధురా పర్వము-17

దూరాద్దదర్శ నృపతిర్దేవీం
దేవసుతోపమామ్
క్రీడమానాం సఖీభిశ్చ
పుష్పం చైవ వితన్వతీం॥
తతశ్చరంతీం సుశోణీం
సఖీభిః సహ సంవృతాం
దృష్ట్వా సౌభపతిర్దూరాత్
న్మయసూనత మబ్రవీత్॥

—హరివంశం.

నారదుడు తిరిగి తన చూపులను శ్రీ కృష్ణదేవునిపై బరపినాడు." "ప్రభు! అనుజ్ఞా!" అని అర్థిస్తున్నట్లు ఆయన చూపులతో తన చూపులను కలిపినాడు. భగవంతుని ఆ చూపులలో దుఃఖం వున్నదో! సానుభూతి వున్నదో! ప్రేమవున్నదో! అయన అన్నాడు:

"నారదా!"

"దేవకీనందన!"

"ఆగినావేమి! కంసమాత వృత్తాంతమేమో పూర్తిచేయలేదు. అందరు అందుకే వేచివున్నారు. కంసుని జన్మవృత్తాంతమేమో వినగా అంతా కుతూహలం పడినారు. ఉగ్రసేనుడుమాత్రము ఉస్సురని నారదుని దిక్కై ఇట్లా అన్నాడు: "దేవర్షీ! నేనేమో ఈ కంసుని చేతులలో బహుబాధలు పడినాను. నేను ఒక్కడనని యేమి! వసుదేవుడు పడినాడు. దేవకిపడ్డది. సర్వయాదవులుపడినారు. నాకు ఇదే విచిత్రముగా వున్నది. ఆకంసుడు సంహరింపబడగా నాకు దుఃఖం కలిగినది. కోపమూ వచ్చినది. ఆకోపము దేవకీనందనునిమీద. అది ఆ కంసుని పశువునువలె వధించినందుకు. మరి కంసుడు నాకు జౌరసుడు కాడు గదా! ఈ ప్రేమమునకు, ఈ దుఃఖమునకు కారణం ఏమిటి? దేవర్షి! కారణం ఏమిటి?"

నారదుడు: ఉగ్రసేన! భ్రమ అందుకు కారణము. కంసుడు నీకు పుత్రుడు అని నీవు అనుకున్నావు. పుత్రుడు కానివానియందు ఆ పుత్రభావమును అధ్యారోపము చేసుకున్నావు. వాడు పుత్రుడని భ్రమసిపడినావు. దుఃఖమునకు కారణము ఆ భ్రమ. ఎప్పుడూ అంతే.

ఉగ్రసేనుడు: ఆ భ్రమ తొలగితే!

నారదుడు: యదార్థమేమో తెలుస్తుంది. దుఃఖానికి ఇక్కడ కారణం లేదని తెలుస్తుంది. ఆత్మకు శాంతిచేకూరుతుంది.

ఉగ్రసేనుడు: సరే కానీ! నారద! కాని ఆత్మవధువు శీలభంగకారి వృత్తాంతం వెట్టిదంగా వుంటుంది.

నారదుడు: సత్యం ఎప్పుడూ వెట్టిదంగానే వుంటుంది.

నారదుడు తిరిగి కంసునియొక్క జన్మాదివృత్తాంత కథాన కాన్ని ప్రారంభం చేసినాడు: "ఉగ్రసేన! ఆ రోజులు ఎట్టివో నీకు జ్ఞాపకం వుండే వుంటుంది. అది మేఘారంభ సమయం. నేటులేమో కడుపపూదేనియలను కడుపారగా గ్రోలి మోస్తూ తిరుగుతూవున్నాయి. ఉరుములు ఎడతెగకుండా మొరస్తూ వుంటే, ఆ మొరయు సవ్వడుల యింపును అనుకరిస్తూ నెమళ్లు పురులువిప్పి సొంపుమిసలగా నంపులు పోతున్నాయి. పరుషమైన వానచినుకుల పసవలన క్రొవ్వు కొని వాన కోయిలలు తేలగిల బడుతున్నాయి. లేత పచ్చికలను తి ఇచ్చకు వచ్చినట్లుగా కైకొని లేటిగములు ఆము కలిసి పెల్లుగా త్రుళ్లుతున్నాయి. కొడిసె విరుల కమ్మదనాన్ని కొలిలి, కొండ సెలల జారుతుంపురలమోచి, గాలులు మెలగుతున్నాయి. ఆసమయం, ఉగ్రసేన, ఎల్లవారి మనసుల వేడ్కను మూరి పోయునదిగావుంది. కంసమాత యమున విహారానికి ఒంటరిగా, చెలులతో కూడి, పోయిన సమయం అట్టిది. అక్కడ ఆమె రమణీయములయిన రుచిరద్రుమసానువులలో సంచరించింది. నదీ తీరాలలో, నగశృంగాగ్రములలో, పర్వతకందరములలో సంచరించింది. యమునపర్వతంకిన్నరోద్గీతమధురం; ప్రతిశ్రుత్యభినాదితం; అక్కడ నెమళ్ళు విరుతాలు చేయగా, ఖగములు కూజితములు చేయగా కంసమాత చల్లనిగాలులలో తేలి ఆడింది. పక్షుల సంగీతములు ఎట్లా వున్నాయంటావు! కామజననులను పోలివున్నాయి. ఆసంగీతములను, ఉగ్రసేన! కంసమాత విన్నది. అక్కడ అంతావనం; అడవి. తరురాజివినిస్సృతమైన గాలి; అది కుసుమగంధాఢ్యమై, మన్మథబోధకంగా వీస్తున్నది. తుమ్మెదలను కడిమిపూలు ఆభరణాలుగా ధరించాయి. ఆవాయువుపోయి వాటిని మెల్లని తన కల్పించని హస్తాలతో చక్కలిగింతలు పెడుతున్నది. వచ్చి కంసమాతను తాకుతున్నది. ఆమెకు ఆగాలి తనకుగూడ చక్కలిగింతలు పెడుతున్నట్లు వుంది. పుష్పములు పూవుదుమ్మను వర్షం కురిపిస్తున్నాయి. ఆదుమ్ము శరీరాన్ని అంటితే, మదనబోధనంగా వుంటున్నది. అక్కడ భూమి నవతృణచ్ఛన్నమై, శక్రగోపవిభూషితమై, పచ్చనికంబళ్ళు, ఎరుపుముగ్గులు దిద్ది పరిచినట్లు వుంది. యౌవనస్థయైన చక్కవనిత, ఆ ర్తనాన్ని పొందినట్లు భూమియొక్క వపువు పులకాంచితమైనట్లు గోచరిస్తున్నది. కంసమాతయు యౌవనస్థ. ముగ్ధప్రణయిని. అట్టి ఆమెను ద్రమిళుడు చూచినాడు.

నారదుడు ఈ కథను ఏదో కావ్యమునకు వలె చెప్పుచున్నాడేమని విసుగుకొనినవారు అక్కడ చేరినవారిలో లేకపోలేదు. అసలు విషయమేమిటో తేలికగా చెప్పివేయవచ్చును గదా! ఇది యంతయు దేనికని వారి భావము నారదునికష్టము నారగునిది. కంసమాత యేల ద్రమిళునకు లొంగినది? ఎందువలన కామరూపియైన అతనిని, పతివ్రత అయిన ఆమె గ్రహించలేకపోయినది? ఆమె అప్పటి స్థితి యెట్టిది? ఎట్టి పరిసరములలో ఆమె విహారము సలుపు

హరిత శివశర్మ

హరివంశము

పన్నదో? ఆమె మనస్సు, అమనస్సును ప్రకోపింపచేయు ప్రకృతి, ట్టివో ఇవి అన్నియు తెలిసిన గాని, కంసమాతకు సంప్రాప్తమైన సుభవముయొక్క పరమార్థము అర్థముకాదు. అక్కడి ఆ కొందరి వములను పసికట్టినవానికి పోలెనారదుగు ఆ కంసమాత ప్పటి స్థితి అప్పుడు వివరించినాడు: "కంసమాత దేవసుతనుపోలి వన హారం చేస్తున్నది. సఖులతోకూడి పుష్పాపచయం చేస్తున్నది. ంతలో వారితోకలిసి ఆడుకుంటున్నది. ఆమె సుశ్రోణి. మనస్విని, ంటరిగావున్నది. తక్కిన యాదువృష్ణి భోజ అంధకాది స్త్రీలు. త్మపురుష సహితలై వనవిహారం, నగవిహారం చేస్తున్నారు. ఆమె మనస్సులో మన్మథుడు పూలములుకులు విరిసినాడు. అవి కన్పించవు. న్పించక మనస్సును గుచ్చుకుంటాయి. హృదయాన్ని బాధపెడ తాయి. ఆమె పతివ్రత చిత్తం ఏమోగాని గాయితం అయిపోయి వుంది. ప్రకృతి సర్వము అందుకు దోహలంగా వుంది. ఆమెకు భర్త మీద అప్పుడు మనస్సు కల్గింది. మరి ఆయన రాచకార్య నిమగ్ను యి తనతో రాలేకపోయినాడు. తానేమో ఉద్వృత్త మదనకేళీ తుకమతి అవుతున్నది. ఆమెకు అక్కడ ఆ పర్వతం, ఆవనం, నది, ఆగాలి, ఆచెట్లు, ఆ పువ్వులు, అన్నీ విరోధవర్గంలో చేరి ట్లు అవభాసిస్తున్నవి. ఈ అన్నీ తన్ను బాధపెడుతున్నట్లు ఆమె బాధపడుతున్నది. అట్టి ఆమెను ద్రమిళుడు చూచినాడు.

ఉగ్రసేనుడు: దేవర్షీ! ఈ ద్రమిళుడు ఎవరు?

కంసమాత తాను చాటుచేసుకొనివున్న తమాన్ని దాటి మరి ంత ఈవలకు వచ్చింది. అక్కడ మరియొక తమాన్ని చాటుగా చేసుకొని నిలబడింది. ఆమెను అప్పుడు శ్రీకృష్ణదేవుడు తిరిగి చూచినాడు. ఆమె పాలిపోయివుంది. ఆమె ముఖం వెలవెలపోతు న్నది. మనిషి ఊరికే కదిలిపోతున్నది. ఒక్క చోట నిలబడలేకపోతు న్నది. ఆమెను చూడగా భగవంతునకు జాలివేసింది ఆమె తనకళంక చరిత్రాన్ని గూర్చి వినగా వచ్చింది. ఆమెలో ధైర్యం వుంది.

నారదుడు: ఉగ్రసేన! ద్రమిళుడు రాక్షసుడు. సౌభపురాధి పతి. కామరూపి. కామచారి. వాణ్ణి బ్రహ్మ అక్కడికి తీసుకువచ్చి నాడు. భవిష్యద్దైవ యోగాన్ని ఆలోచించి, వానికి ఈ ఆలోచనను కల్పించినాడు. వాడును రథి, ససారథి, సుయామున శైలవిహారా నికి బయలుదేరినాడు. వాడు దైవబోధితుడు. వాని వీర్యమును కాల నేమి ప్రాణములు ఆవేశించివున్నవి. అందుకు తగిన క్షేత్రము కంస మాతనుగా దేవతలు నిర్ణయించినారు. వానికి ఇది తెలియదు. వాని బుద్ధి దైవ చోదితమై నాడు సుయామున ప్రాంతారణ్యముల యందు విహారవాంఛను బలిసికొన్నది. వానికి సుయామున దిదృక్షు కల్గినది. వాడును సామాన్యుడు కాడు. తరుణ ఆదిత్య వర్చస్సు. వానిరథం ఆశుగమనం కల్గింది. కామగమం. ఆకాశంలో మనోవేగంతో అది సంచరిస్తుంది. ఆ రథంలో వాడు సుయామున పర్వతాన్ని చేరుకున్నాడు. పర్వతోపవనాలలో సంచరించినాడు. సూతసహితుడై నగమూర్ధం అంతటా కలయతిరిగినాడు. ఎన్నో కాననములు, వనాలు, క్రుమ్మరిల్లినాడు. ఎన్నో కాననములు, వనాలు చూచినాడు. ఆ కాననములు, ఆ వనములు వానికి సర్వర్తు గణ సంపన్నములైనట్లు కన్పించినవి. అనేక నందనవనాలు భూలోకానికి దిగివచ్చినట్లు వున్నవి. వాడు ఆవనాలలో క్రుమ్మ రిల్లినాడు. నదుల తీరములలో సంచరించినాడు. పర్వత శృంగములను అధిరోహించినాడు. ఆ నగశృంగములు నానా ధాతుపినద్ధములు, బహు ఉచ్ఛ్రితములు, నానారత్న విచిత్రములు, కాంచనాంజన రాజితములు, వాని మనస్సును ఆకర్షించినవి. అక్కడి వనాలు

నానా కుసుమగంధాఢ్యములు, నానా వర్ణగరుద్యుతములు; నానా విహగకల స్వనములు; నానా పుష్ప ఫలద్రుమయుతములు; అతని మన స్సునకు ఆహ్లాదాన్ని కల్పించినవి. అట్టి స్థితిలో వానికి దేవకు తోపము, కంసమాత కన్పించినది. ఆమె కన్పించగా ద్రమిళుడు మన స్సులో ఉవ్విళ్ళూరినాడు. విస్మయంపడినాడు. సూతుణ్ణి సంబో ధించి ఇట్లా అన్నాడు.


“సూత! ఆ మృగశాబాక్షి నీకు కన్పించుచున్నదా? ఆ సుశ్రోణిని నీవు చూస్తున్నావా? ఆ కాననాంతర విహారిణిని దర్శించి నావా? సూత! ఆమె రూపం ఉదారంగా వుంది. మన్మథుని రతి భూమికి దిగివచ్చినట్లు వుంది. లేక ఈమె శచీ దేవియా? పురుహూ తుణ్ణి వదిలి సుయామున విహారానికి వచ్చిందా? అహో! లేక ఈమె తిలోత్తమయా! నారాయణదేవుని ఊరువు నిర్భిన్నంకాగా ఉద యించిన సౌందర్యమహారాశి, బలపత్ని, ఊర్వశియా, ఈమె బలదయిత, రూపిద్రత్నం, దేవి, ఆమెయే ఈమె అయివుంటుందా? పూర్వం దేవతలు, రాక్షసులు, మందరం మంథానంగా పాల సము ద్రాన్ని అమృతంకోసం మథించినారట; ఆ అమృతం ఇట్లా స్త్రీ రూపధారిణియై, ఈ కాననంలో ఇక్కడ సంచరిస్తున్నదా? లేక ఆ అమృతంతో పాటు, ఆ పాలసముద్రంలో లోకభావినియైన లక్ష్మి ఉద్భవించినదట! ఆమెయా ఈమె! ఆమెలక్ష్మి నారాయణాంక కలిత. ఆమెనే ఈమెయా? సూత! ఈ వరాంగన మెరుపు తీగను పోలివుంది. నీలమేఘాంతగతమైన అచిరప్రభను పోలివుంది. చెలులమధ్య తటిల్లతవలె ప్రకాశిస్తూ, ఈ వనాన్నంతా తన సౌందర్యపు కాంతి చేత వెలిగించి వేస్తోంది. ఈమె సుకుమారాంగి. సుప్రభేందునిభానన. అనింద్యరూప. నాకు విభ్రాంతి కలుగుతున్నది. ఇంద్రియములు వ్యాకులంచెందుతున్నాయి. నేను కామవశుణ్ణి అయి పోతున్నాను. మనస్సు, నాడి, విహ్వలిస్తున్నది. కుసుమా యుధుడు నా యీ శరీరాన్ని పూములుకుటమ్ములచేత చిల్లులు పొడుస్తున్నాడు. నా హృదయాన్ని ఛేదిస్తున్నాడు. నిర్దయుడై నామనస్సును కలచివేస్తున్నాడు. ఆజ్యసిక్తమైన అనలాన్ని పోలి నా హృదయం కామాగ్ని జ్వాలాజాలంగా మండిపోతున్నది. ఇప్పుడు నేను ఏమి చేయను! ఏమిటి వలన ఈ మన్మథాగ్నిని చల్లార్చుకోను! ఏ ఉపాయం చేత ఈ మత్తగామిని నాకు దక్కుతుంది?”

సూతునకు ఏమి ఉపాయము తోచలేదు. ద్రమిళునకు ఏమి ఉపాయము తోచలేదు. అసలు ఆమె ఎవ్వరు? అది తెలియలేదు. దానవుడు, ద్రమిళుడు బహువిధాలుగా చింతచేసి చూసినాడు. వాని మనస్సుకు నిలకడ అన్నది చిక్కడంలేదు. ఆమె యెవ్వరో తెలియడం లేదు. మనస్సును చిక్కబట్టుకునే ధైర్యంలేదు. ఆమెనుదరిసే వీలు కన్పించడంలేదు. సూతునకు దానవుని ఈ దురవస్థ దయనీయంగా వుంది. ఆ దానవుడు తనకు రాజు. వాడు వానికి సారథి. వాడు రాజుతో అన్నాడు: ప్రభూ! మీ మనస్సు నిలువపడంలేదు. మీరు ఇక్కడ కొంచెంసేపు వుండండి. నేను ఆమె యెవ్వరో చూచివస్తాను. అది ఎవ్వరి భార్యయో తెలుసుకు వస్తాను. నేను తిరిగి వచ్చేదాకా మీరు ఇక్కడనే ముహూర్తం పాటు వేచి వుండండి.”

దానవుడు, ద్రమిళుడు మందహాసం చేసినాడు. “సూత! నీవు చెప్పినట్లే చేస్తాను” అన్నాడు.

సూతుడు రాజును వదిలి యమునను దరిసినాడు. యమునా జలములలో బాహ్యాభ్యంతరశ్శుచిగా స్నానం ఆచరించినాడు. యమునా పవిత్రతోయములను ఉపస్పర్శించి ధ్యానగతుడైనాడు. అప్పుడు వానిలో జ్ఞానబలం అధికమైంది. ఆ జ్ఞానబలంతో వాడు ఆమె యెవ్వరో విచారణ చేసినాడు. వానికి అప్పుడు తెలిసిన విషయం ఇది. ఆమె ఉగ్రసేనుని భార్య: ‘పతివినా వనవిహారం వచ్చింది. పతినివిష్టబుద్ధియై ఇప్పుడు కాముని బాణములకు అగ్గం అవుతున్నది.” అది తెలియగా వానికి హర్షం కలిగింది. వాడు ధ్యానాన్ని చాలించి రాజుదగ్గరకు వచ్చినాడు. “ప్రభూ! ఈమె ఉగ్రసేనుని పత్ని. పతివిరహిణియై పరితపిస్తున్నది. కాము...”

ద్రమిళుడు “అహో”! అన్నాడు. అన్నంతలో కామ రూపి వాడు మారి పోయినాడు. ఇప్పుడు వాడు ద్రమిళుడు కాడు.


చిత్రకారుడు : యార్లగడ్డ పూర్ణచంద్రరావు (విజయవాడ)

ఉగ్రసేనుడు. వాడు తన్ను దరియగా ఉగ్రసేన మహిషి అతనిని గ్రహించలేకపోయింది. అప్పటి ఆమె మనోవృత్తం అట్టిది. ఒక్క ఉగ్రసేనుని రూపం తప్ప మరోరూపం ఆమెకు కన్పించక మరుగున పడిపోయింది. ఆమె పాతివ్రత్య ధర్మనిష్ఠమైన కామంచేత హతమై పోయింది. ఆ వచ్చినవాడు స్వీయపతియేనని అనుకున్నది ఉగ్ర సేనుని వధువు. మరి ద్రమిళుడు, ఆమెను మెసలనీయలేదు. “నీవును, చెలులును ఈ వసుధాధరము మీదికిరాగా నేను అక్కడ నిల్వలేక పోయినాను. భావంలో నైపలేక పోయినాను. ఇట్లా వచ్చినాను” అనినాడు. కంసమాత ఎంత సంతోషించింది! ఎంత ఆనందాన్ని పొందింది. ఆత్మపత్ని విరహతీవ్రతను ఎరిగినవాడు తననాథుడు అనుకొన్నది. ఆ వచ్చినవాడు తననాథుడే అను కొన్నది. ఆమె మనస్సులోనేకా ఆమెముఖంలో, కన్నులలో, సర్వశరీర విన్యాసములో కన్పిస్తూ వున్నది. వాడు ఆమెచేయిని పట్టుకొన్నాడు. ఆమె అతని కౌగిలిలో పరవశమై ఒదిగిపోయినది. చెలులు సర్వ్యలుగా తొలగిపోయినారు. పక్షులు రొదచేసినవి. వృక్షములు రాక్షసునిమాయ తెలిసినవిపోలె ఫలపుష్పనిర్యాసా యాసంగా కూలినవి. అంతవరకు పూవులను అంటి వదలని తుమ్మెదలు రొదగా, విరుత రుదితంగా చెదిరిపోయినవి. గాలి కర్కశమై వీచింది. కానన వృక్షములమీదగా పెనురొదగా కదిలిపోయి, యమునా తరంగ సంఘట్టితంగా విపరీత విరావ బంధురమైపోయింది. వానకోయిలలు మూగవోయి, కంసమాతను తిలకించినవి. భావోప సర్పిత, కంసమాత, ఆ పులుగులను తిలకించినదా! ఆ తుమ్మెదల చూచినదా! ఆ గాలియొక్క తీవ్రతను, ఆ వృక్షములయొక్క హెచ్చరికలను పాటించినదా! దానవుని హృదయాన్ని హత్తుకుని పోయిన ఆమెకు ఇవియేమియు కన్పించుటలేదు. ఆ రాక్షసుని ఆమె శంకించలేదు. తన చరిత్ర ఇట్లా కళంకితం అయిపో తున్నది అనుకోలేదు. పతిశీలకు ఆమెకు అప్పుడు ఇంకో ఆలో చనలేదు. అంతా మునిగిపోయిన తర్వాత ఆమె “అయ్యో! ”అన్నది.

రాక్షసుడు పెల్లున నవ్వినాడు.

కంసమాత తమగమును పెట్టుకొని నిలబడినది ‘అయ్యో’ అని మూర్ఛ వాలినది. ★





పత్రాయి కొంచెం తాను! లేకా— మళ్ళీనానా!!!!!

వ్రేయ్ ! ఆగరా కుంచెం. ఎవ్రడా నువ్వు. నన్నె ఎక్కడో చూసినట్టున్నావే. ఎందుకలా హాచ్చెరపడిపోతావు !— లాపోతే బయపడిపోతావు ?—భయమంటే నాకు తెలీదులే. హచ్చెరం అంటే కూడా తెలీదనుకో. బాబాయి చెప్పాడు. చిన్నపిల్లలు ఉత్తినే కిందపడి పోతారట కాని పెద్దాళ్ళు మాత్తరం ఉత్తినే పడరు. ఎప్పుడూ హచెరపడి పోతారు. లాపోతే బయపడి పోతారుట. లాపోతే విచారపడిపోతారుట. అలాంటే కూడా మనికి తెలీదనుకో. మనికి తెలీపోయినా మాటాడచ్చు. ఇలాని బాబాయి చెప్పాడులే. ఇప్పుడు రెండు జెళ్ళ సీతలుంటాయా,—ఒక్క జెళ్ళ సీతలేనా సరే. బాబాయికి అస్సలు తెలీవు గదా. అయినా యిలా చూసి నవ్వేస్తాడు బాబాయి. నన్ను కొంచెం ఈలవేసి పెట్టమ) కూడా అంటాడు. నేను మంచివాణ్ణిగదా పాపం. నాకు జాలి ఉందిట. ఇలాని బామ్మ అంటుందిలే. అందుకని ఈలవేసిపెట్టుతానా. రెండు జెళ్ళ సీతలా ఒక్కజెళ్ళ సీతలా నన్ను చూసి యిలా నవ్వితే అప్పుడేమో బాబాయి హాచ్చెరపడిపోతాడు.ఇలాఖోపంగా చూసి హన్నా అని గాఠిగా (ప్రెవేటు చెప్పేస్తే బాబాయి బయపడి పోతాడు.అస్సలు ఏమీ అనకుండా పోయారనుకో అప్పుడేమో యిలా విచారపడిపోతాడు. బాబాయి మన్ని ఎత్తుకొని ఉంటే మన్నికూడా పడేస్తాడు. అందు కనే రోడ్డుమీద సీతలు నడుస్తున్నపుడు బాబాయి మనని ఎత్తుకుంటానన్నా సరే మనం ఒద్దనాలి తెలిసిందా.

మనం అంటే నువ్వు కాదులే. నువ్వు బెద్దవాడివి గదా. లావుగా వున్నావు. అందుకని బాబాయి నిన్ను ఎత్తుకోలేడు. ఎత్తుకుంటే కాలిమీద పడేసుకుంటాడు గదా. కాలు నలిగిపోయి యేడుస్తాడు. ఏడిస్తే బామ్మ రూపాయిస్తుంది. సినిమా కెళ్ళొచ్చు. మనక్కాదులే. నేను ఏడిస్తే జీళ్ళ ముక్క పెట్టుతుంది. లాపోతే కాణీ యిస్తుంది. బాబా యేడిస్తే రూపాయిస్తుంది. లావుపాటి పక్కింటి పిన్నిగారు ఉందా. వాళ్ళముగుడు దానికి (ప్రెవేటు చెప్పెస్దాడా. అప్పుడేమో అది యిలా యేడుస్తు బామ్మదగ్గరికి వస్తుందా. బామ్మేమో యేడవకమ్మా అని, దానికి ఆవిడికి కాఫీ యిస్తుంది. అప్పుడేమో వాళ్ళ ముగుణ్ణి పిలిచి (ప్రెవేటు చెప్పేస్తుంది. తరవాతేమో ఇంకుంచెం కాఫీఉంటే కుంచెం నీళ్ళు పోసి యిస్తుంది వాడికి. లావుపాటి పక్కింటి పిన్నిగారు ముందస్తుగా వచ్చేసి ఏడిచి బోల్డు ఖాఫీ తాగేస్తుంది గదా.అందుకు. తాగేసి ముక్కు చీదుకుని వెళ్ళిపోతుందిగదా. అప్పుడేమో నాన్నా లావుపాటి పక్కింటి పిన్నిగారి ముగుడూ ఇంగ్లీషులో మాట్లాడుకుంటారు. నవ్వుతారు. ఇందాకా ఏడుస్తాడు గాని ఇప్పుడు నవ్వుతాడు తెలుసా ? అసలు వాళ్ళింటో కాఫీ పొడుం అయిపోతే లావుపాటి పక్కింటి పిన్నిగారు ముందస్తుగా బామ్మ దగ్గరికి ఏడుస్తూ వచ్చి కాఫీ తాగేస్తుందిట. అపుడేమో వాళ్ళ ముగుడూ కూడా వచ్చి కొంచెం కాఫీ తాగుతాడట్ట. తరవాత నాన్నతో— అంటే మా గోపాలంతే ఇంగ్లీషు మాట్లాడి ఫది సిగరొత్తులు కాల్చి వెళ్ళిపోతాట్ట. ఇలాని బాబాయి చెప్పాడులే.


అందికనే రేపో నిన్నో వాళ్ళు మనింటి కొస్తే నేను అడిగాను గదా. ఏవండీ పాపం మీ యింటో కాఫీ పొడుం అయిపోయిందా అందికే ఏడుస్తూ వచ్చారా అని. అప్పుడేమో అమ్మ, బామ్మ, నాన్నా అంధరూ గా. గా హో అని అరిచేశారు. నామాట లావుపాటి పక్కింటి పిన్నిగారికి వినబడనే లేదు. తరవాతేమో నాన్న అల్లరి వెధవకానా రవుడీ అలానేసితిట్టాడు— వాడి క్కోపం రాలేదులే. దొంగ. ఇలా కోపంగా చూసి తిట్టుతాడా, కుంచెం నవ్వుతాడు కూడా రాదేనా అంతే. రాదంటే అమ్మలే. కుంచెం కోపంగా చూసి కుంఛెం నవ్వుతుంది.

అసలి పెద్దవాళ్లతో ఇదే చిక్కు. వీళ్లతో వేగడం చాలా కష్టం అనుకో. కష్టం అంటే ఏవిటో నాకు తెలీదు. అప్పుడుప్పుడు అలా అనమని బాబాయి చెప్పాడు. ఇపుడు నాతో వేగలేమంటే, నేను మూ(డోలో, ఫది నెల్లో అల్లరి ఛాలా మానేశాను గదా. చిక్కుడుపాదు మీద గొంగళిపురుగులు మూడు కూడా తీసుకెళ్ళి లావుపాటి పక్కింటి పిన్నిగారిమీద పడెయ్యలేదు కదా. వాళ్ల ముగుడు, వాళ్ళ ఆఫీసులో విగ్గులేని ఎముడితో — ఇలాంటే మేనేజరులే — మాట్టాడుతున్నపుడు భోయ్‌మని అరిచి భయపెట్టటం లేదుగదా. బాబాయి రూపాయో, ఫ్ఫద కాలో ఇచ్చినా రెండు జెళ్ళ సీతల్ని, ఎదురింటి సుబ్బలక్ష్మి ముక్కునీ చూసి ఈల వెయటం లేదుగదా. ఏయ్ పిల్లా అనటం లేదుగదా. మా గోపాళం ఆఫీసు కాయితాలమీద చాలా బొమ్మలు వెయ్యటం లేదు గదా. రోజూ ఫదిసార్లు కూడా బామ్మ పిలిచిందని చెప్పి జెటాకాలు పిల్చుకురాటం లేదుగదా. ఒక్కణ్ణీ ఏడుసార్లు కూడా జెటకా తోల్టం లేదుగగా. బామ్మ పత్తుల పెట్లో ఫది బీడీలు కూడా దాచటం లేదు గదా. మరి నేను రేపు బెద్దవాణ్ణయాక జెటకా రైలింజను తోలుతానుగా. అందుకు దాచుకోటమే లేదు.

మనం అల్లరిచేస్తే ఒద్దురా అని తిట్టుతారు. సరే పోనీ పాపం అని జాలిపడి ఇప్పుడు మూ(డోలో ఫది నెల్లో అల్లరి మానేశానా. నాన్న హడ్డిలి పోయారు. బయపడిపోయాడు.

వాడు అస్సలు అల్లరి చెయ్యటంలేదే దాదా. ఒంటో బావులేదా అంటున్నాడు అమ్మతో. దిష్టి తగిలిందేమోనండీ అంది అమ్మ. దిష్టంటే నాకు తెలీదు. ఒంటో బావులేదనడం అంటే జెరం రావడంట. నాన్న ఆఫీసులో విగ్గులేని ఎముడితో యుద్ధం చేస్తాడనుకో. అప్పుడు నానకి ఒంటో బావుండలేదడం వస్తుంది. సుబ్బలక్ష్మి నంకురాంతిరి ముగ్గేసినపుడు ముగ్గుచూసి నీ ముక్కు బావుందీ అంటా డనుకో అరుగుమీద నించుని. అప్పుడేమో బామ్మేనా, సుబ్బలక్ష్మి నాన్నేనా విని హోయ్ పోకిరీ అంటారుగదా. అపుడు బాబాయికి ఒంట్లో బావుండలేదడం వచ్చేస్తుంది. సీగాపెనూనాంబనా జట్టు లేకపోతే నాక్కూడా కుంచెం వస్తుందనుకో.

యేం, అదీ సంగతి. అల్లరిచేస్తే ఒద్దురా అంటారు. చెయ్యకపోతే మనం లేకుండా రాదతో చెప్తారు. అసలు మనం అల్లరి చేస్తేనే వాళ్ళకి చాలా యిష్టం అని నాకు ఆవమానం. ఎందుకంటే! వాళ్ళు బాబిగాడి అమ్మొస్తుందా. అబ్బా మావాడిఅల్లరి ఎక్కువండీ అంటుందా. అమ్మేమో హయ్యో మా బుడుగు అల్లరి చూళ్లేదు మీరు అంటుంది. అంతెందుకు ఓసారి చుట్టాలొచ్చారుగదా బోల్డుమంది. బామ్మా రాదా అందరూ నేను బాగా అల్లరి చేస్తానని చేప్పేశాడు. వాళ్ళ ముగుడేమో ఏదమ్మా బుడుగ్గా కుంఛెం అల్లరి చెయ్యి చూదాం అన్నాడు. అంధర్నా



"అప్పుడేమో లావుపాటి పక్కింటి పిన్నిగారి ముగుడూ, మాగోపాళం ఇంగిలీషులో మాటాడుకున్నారు. నవ్వారుకూడా"

నా చుట్టూరా కూచుని అల్లరి చెయ్యీ, అల్లరి చెయ్యీ అని ఒకటే అల్లరి చేశారులే. ఎలా చెప్పు. ఎంత గొప్ప అల్లరివాడికేనా కష్టంగదా. సిగ్గేస్తుంది గదా. సిగ్గంటే నాకు తెలీదనుకో. కాని వేస్తుందిట. అప్పుడు నాకు ఛాలా బోల్డు సిగ్గేసింది. నేను చెయ్యనుఫో అన్నాను. నానకి ఖోపం వచ్చేసింది. చెప్పి నట్టు విని అల్లరి చెయ్యి అని గాఠిగా అరిచాడు. నేను చెయ్యనుఫో అన్నాను. చిన్నపిల్లలు అని జాలికూడా లేదుగదా.

ఉట్టి అల్లరి వెదవమ్మా చెప్పినమాట వినడూ అంది బామ్మ.

అంతలోకే ఫది బండివాళ్లు బోల్డు పెట్టెలు పరుపులు తెచ్చిపెట్టేశారు. బోల్డు లావుపాటి చుట్టాల పిన్నిగారులూ, మూడు వాళ్ళ ముగుళ్లూ, రెండు రెండు జెళ్ళ సీతలూ, వాళ్లకేసి చూసి నవ్వుతూన్న మూడు బాబాయిలూ, రెండు బామ్మలూ ఐదుసీగానపెసూనాంబలూ, ఒక బుడుగూ లోపలికి వచ్చేశాయి.

సుబ్బులూ అన్నాయి బామ్మలు. సూరమ్మబామ్మా అన్నాయి గుండున్న పిన్నిగారి ముగుళ్లు. గుండు ముగుళ్లదిలే.

బామ్మ రాదా గోపాలం, చుట్టాలూ అందరూ హడ్డిలిపోయారు.

సుబ్బులెవరు ? సూరమ్మెవరూ, బామ్మెవర్, పిన్నెవరు అన్నాడు గోపాళం హాచరవడిపోయేసి.

ఎవరండీ మీరు అంది బామ్మ.


ఇది సుబ్బారాయుడిగారి ఇల్లు కాదాండీ అన్నాయి చుట్టాల బామ్మలు.

అబ్బే. అది పక్కవీధిలోనండి. కొత్తగా దిగారు వాళ్లేనా ? అంది అమ్మ.

అవునండీ. ఈ యిల్లేనని చెప్పారే అన్నాయి చుట్టాల బామ్మలు.

ఎవరో తప్పు చెప్పారు అన్నాడు నాన్న.

ఎవరేమిటి. అదిగో ఆ పిల్లాడే. ఇందాకా వీధి



చివరకొట్టుదగ్గిర కనబడి, మా యిల్లే రండ రండి అని చెప్పి పరిగెత్తుకొచ్చేశాడు మీ యింటోకి. సరేగదాని మేం ఇక్కడికొచ్చి సామాన్లింపించేశాం అన్నాయి బామ్మలు.

అవును ఆ పిల్లాడే. అన్నాయి సీతలూ, బాబాయిలూ, బుడుగులూ, గానపెసూనంబలూను.

అప్పుడేమో—

అంంధరూ నాకేసి చూశారు. బలే బయం వేసిందనుకో. కాని పాపం అంతలోకే నవ్వేశారు హహ హహ అని. హారి భడవా అంది బామ్మ. అమ్మ కూడా గాఠిగా నవ్వేసి ముద్దు పెట్టేసుకుంది. నేను అల్లరి చేసే అమ్మ అస్తమానూ నవ్వదుగదా. నేను అలా వెళ్లి దాంకున్నాక నవ్వుతుంది. నవ్వితే అమ్మ ఎంతో బావుంటుంది. నాన్నకన్నా, బాబాయికన్నా, సీతకన్నా, సీగానపెసూనాం కన్నా, లావుపాటి పక్కింటి పిన్నిగారి కన్నా, నాకన్న బావుంటుంది.

యేం. అప్పుడు బామ్మ లేచి బోల్డు యింత పెద్ద డేగిసా నింఢా కాఫీ చేసి అంధరికీ పంచిపెట్టింది.

డబ్బులు వాడి దగ్గిర పుచ్చుకో అన్నాడు నాన.

అవును రేపు బోఘి పండక్కిడబ్బు సంపాదిస్తాడుగా అంది అమ్మ.

సంపాదించడం అంటే మనకి తెలీదు. కాని బోఘి పండక్కి దంబిడీలు, కాణీలూ ఏరి దాచుకోడం సంపాదించడం అని నాన్న చెప్పాడు. బామ్మకి అమ్మకి ముద్దిచ్చి కాణీ తీసుకోడంకూడా సంపాదించడమేనుట. మీచిలో సీతలకేసి చూసి బాబాయిలకి ఈలవేసిపెట్టి ఏయ్ పిల్లా అనీ, అత్తయ్యా అనీ పిలిచిపెట్టి బాబాయి లందరి దగ్గర ఫదణాలు తీసుకోడం కూడా సంపాదించడమేనుట. కాని పండగే బెస్టు. పిల్లలకి డబ్బు లొస్తాయి.

పండగంటే—అవి చాలా రకాలు. బాబాయికి సీత కనిపిస్తే ఓ పండగట. నవ్వితే రెండు పండగలు. ఆఫీసులో విగ్గులేని ఎముడు ఊరెళ్తే నాన్నకి



గంగి రెద్దుల హంగు రంగవల్లి హొరంగు
పండుగంటే పల్లెపట్టు హాయిచెలంగు



"కుంచెం అల్లరి చెయ్యమ్మా" అని అల్లరిపెడతారు పిల్లల్ని. ఈ పెద్ద వాళ్ళతో వేగడం ఛాలా కష్టం అనుకో.

పండగ. లావుపాటి పక్కింటి పిన్నిగారు కాసేపు సినిమాకెళ్తే వాళ్ల ముగుడికి పండగట. ఇలాని నాన్న చెప్పాడులే. అప్పుడు అమ్మకి కోపం వచ్చింది కూడాను. కాని అన్నిటిలోకీ బోఘి పండగే బెస్టనుకో.

బుడుగు

అయినా ఈ కాలంలో బాగుండడం లేదుట. బోఘి పళ్లలో కల్తీ ఎక్కువ అయిపోయిందని మొన్న బాబీ గాడు అన్నాడు. కల్తీ అంటే పాలలో నీళ్ళు కలవడంటః లాపోతే నాన్న ఆలీసెంగా వచ్చి అమ్మకి కొంచెం నిజం కొంచెం అబద్దం చెప్పడంట.

ఇప్పుడు రేగివళ్ళు దంబిడీలు కలిపితే బోఘిపళ్లే గదా. కాని ఇపుడు దంబిడీలకన్న రేగిపళ్లే ఎక్కువ కలిపేస్తున్నారుట. దంబిడీలు, కాణీలూ అయి పోయాయి గదా. ఇపుడు నయాపైసాలు. ఇవి చాలా ఖరీదని నాన చెప్పాడులే. అందుకని బోల్డు రేగిపళ్లు ఒకటో మూడో నయాపైసాలూ వేస్తున్నారు.

ఇలా చేస్తే చిన్నపిల్లలు పాపం డబ్బు ఎలా సంపాదిస్తారు ? అందుకని ఈపండక్కి ఎక్కువ నయాపైసాలు వేసి కుంచెం రేగిపళ్లు వెయ్యాలి అందరూ.

ఇదిగో ఇది రాసిపెట్టినవాడు ఇందాకనించి నా చెయ్యిగోకుతున్నాడు నా పేర్ను చెపురా, నా పేరు చెపురా అని. ఇపుడు నేను చెప్పిన దంబిడీలు ఎక్కువ కలపడంసంగతి సరిగ్గా రాశాడా నువ్వు కుంచెం చదివి చెప్పు. మనకింకా తెలుగు చదవడం రాదు గదా. ఇంగిలీషు చదవడంకూడా రాదనుకో.

యేం ? సరిగ్గా రాశాడా ? అయితే సరే.

ఇది రాసిపెట్టిన వాడిపేరు ముళ్ళపూడి వెంకట రమణ.

అయిదేళ్ళ రాష్ట్ర రాజకీయ పరిణామాల సమీక్ష

నాటి కురుక్షేత్ర సంగ్రామం నేటి గయోపాఖ్యానానికి నాంది!

అయిదేళ్ళ ఆంధ్రప్రదేశ్ రాజకీయాలకు నిజమైన కథానాయకుడు శ్రీ నీలం సంజీవ రెడ్డి. ఉపనాయకుడు శ్రీ అల్లూరి సత్యనారాయణరాజు. అయిదేళ్ళలోను నాలుగేళ్లు ఈ నాయక ద్వయం "కృష్ణార్జునుల" వలె రాష్ట్ర రాజకీయ రణరంగంలో వీర విహారం చేశారు. అయిదో సంవత్సరంలో "గయోపాఖ్యానం" ప్రదర్శిస్తున్నారు.

శ్రీ సంజీవ రెడ్డి సర్కారు జిల్లాల కాంగ్రెసు నాయకులు రాయలసీమలో పెంచుకున్న ముద్దుబిడ్డ. డాక్టర్ పట్టాభి పొత్తిళ్లలో పెరిగి, శ్రీ కళా వెంకటరావు ద్వారా ఆటపాటలు నేర్చిన రాజకీయ నాయకుడు. శ్రీ అల్లూరి సత్యనారాయణ రాజు గోదావరి రాజకీయ ప్రవాహాలలో తలమునకలై రాష్ట్ర నాయకత్వాన్ని చేపట్టిన గజ ఈతగాడు. అతివాదిగా మితవాదుల చేతుల్లో దెబ్బలుతిని, వారి మధ్య తీవ్రవాదిగా రూపొందిన రాజకీయవాది.

విభిన్నమైన ప్రవృత్తులు కల ఈ నాయకుల తత్వాలు విరుద్ధమైనవి. ప్రతికక్షులను దగ్గరకు రానివ్వకుండా విభజించి పాలించాలనే గ్రామ పెత్తనదారు తత్వం శ్రీ సంజీవరెడ్డిది. దగ్గరకు చేర్చి, పదవులలో వుంచి, అవసరమైన ప్రయోజనాలు సాధించాలనే తత్వం శ్రీ అల్లూరిది. అయినా వీరిద్దరికే జట్టు కలిసింది. ఒకరిలోని లోపాలు మరొకరి ద్వారా సరిదిద్దబడుతూ, నీలం అల్లూరి నాయకద్వయం రాష్ట్ర రాజకీయాలలో కొనసాగించిన రణరంగాలలో వర్ణించవలసిన యుద్ధ ఘట్టాలు అనేకం వున్నాయి.

మొదటి ఘట్టం ఆంధ్రరాష్ట్రంలో శ్రీ గోపాలరెడ్డి మంత్రివర్గంలో శ్రీ సంజీవ రెడ్డి ఉప ముఖ్యమంత్రిగా వుంటున్నప్పుడు ప్రదేశ్ కాంగ్రెసు అధ్యక్షపదవిని శ్రీ అల్లూరి గెలుచుకొనడం. అప్పుడిది. సంస్థ స్థాయిలో శ్రీ గోపాలరెడ్డి, ఆయనను బలపరుస్తున్న లోక్ పార్టీ, ప్రజాపార్టీ వగైరా ఉమ్మడి శక్తుల తొలి ఓటమి. అప్పటినుంచి అల్లూరిని సంజీవరెడ్డి పెంచుతున్నాడని.

రెండవ ఘట్టం ఆంధ్రప్రదేశ్ శాసనసభా కాంగ్రెసు పక్షానికి నాయకునిగా శ్రీ సంజీవ రెడ్డి ఎన్నిక అప్పుడిది. పార్టీ స్థాయిలో శ్రీ గోపాలరెడ్డి, ఆయనను బలపరచిన శక్తుల రెండవ ఓటమి. ఇందులో అప్పటినుంచి సంజీవ రెడ్డిని ముఖ్యమంత్రి చేసింది అల్లూరి అని.

ఈ రెండుఘట్టాలు ఆంధ్ర రాజధాని కర్నూలులో జరిగాయి. నీలం—అల్లూరి నాయకత్వాన విజయం పొందిన ఆంధ్రప్రదేశ్ రాజకీయ శక్తులు హైదరాబాదు కోటలో పాగా వేశాయి. నాలుగేళ్ల ఆంధ్రప్రదేశ్ రాజకీయాలకు రకరకాల పాచికలు వేశాయి.

సంజీవరెడ్డి బలహీనతలు అల్లూరికి తెలుసు. అల్లూరి లోగుట్టు సంజీవరెడ్డికి సుపరిచితం. అవకాశం లభిస్తే అల్లూరిలో పెరుగుదలే కాని తరుగుదల వుండదు. అవ

వి. వి. నరసింహారావు

కాశం లభించిన తర్వాత సంజీవరెడ్డి తరుగుతాడే కాని పెరగడు. ఏ వ్యవహారాన్ని అయినా అల్లూరి అయిదా-పైసాగా అయిదు నిమిషాల్లో తేల్చివేస్తాడు: ఏ వ్యవహారాన్ని అయినా సంజీవరెడ్డి తెగనివ్వడు. దాట్లు వేస్తాడు. నాన పెడతాడు. అల్లూరి చూపులో నిర్ణీతలక్ష్యం ముందే వుంటుంది. ఆ లక్ష్యసాధనకోసం ఎంతవరకు పట్టు విడుపులు అవసరమో అంతవరకూ ముక్కుకు సూటిగా పోతాడు. సాధించిన లక్ష్యాన్ని బట్టి జయాపజయాలు నిర్ణయించుకుంటాడు. సంజీవరెడ్డి చూపులో నిర్ణీత లక్ష్యంకంటె ప్రక్క చూపులు అధికం. పరిస్థితులనుబట్టి లక్ష్యం నిర్ణయించుకుంటూ పోతాడు. ఆ పరిస్థితుల సానుకూలతనుబట్టి జయాపజయాలు నిర్ణయించుకుంటాడు.

వీరిద్దరి పోకడల్లోను ఈ వ్యత్యాసం వుంది. కనకనే నాలుగేళ్ల ఆంధ్రప్రదేశ్ రాజకీయాలు వీరిమధ్య దోబూచులాడాయి.

నిజానికి వీరిని ఎదుర్కొనవలసిన వాడు, వీరి ఆట కట్టించడానికి ప్రయత్నించవలసిన వాడు శ్రీ బెజవాడ గోపాలరెడ్డి. ఆయనకు రాజకీయంగా అవసరమైన అర్థబలం, స్థానబలం, అంగబలం వున్నాయి. కాని వాటిని సరిగా వినియోగించగలిగిన దక్షత, రాజకీయానికి అవసరమైన కరుకుతనం, పార్టీని కట్టడానికి కావలసిన తెగువ వీరిలో లోపించాయి. మనిషి ఎంత మెత్తనో మనసు కూడా అంతకంటె మెత్తన. పదిమంది కలిసి పెద్దరికమిస్తే స్వీకరించడానికి మాత్రం సిద్ధపడతారు. అలా సిద్ధించిన పెద్దరికాన్ని స్థిరపరచుకోవాలని, చరితార్థం చేసుకోవాలనికూడా ప్రయత్నించని పెద్దమనిషి తరహా ఈ నెల్లూరి బిడ్డది.

అందువల్లనే సంజీవరెడ్డి మంత్రివర్గ నిర్మాణం, సంజీవరెడ్డి రాజకీయాలు వల్లేరు మీదబండిలా సాగిపోయాయి. సంజీవ రెడ్డి మంత్రివర్గ నిర్మాణం అంచెలు అంచెలుగా సాగింది. ఐక్యకాంగ్రెసులోని ప్రజాపార్టీ ప్రతిపత్తిని గుర్తించ నిరాకరించారు లోక్ పార్టీ మీద విభజించి పాలించే నీతిని ప్రయోగించారు. చివరకు శ్రీ కళా వెంకటరావులాంటి "గురువును" మంత్రివర్గంలో చేర్చుకున్నా, ఆయనకొక అవరోధంగా తూర్పు గోదావరిజిల్లాలో శ్రీ ఎస్. బి. పి. పట్టాభి రామారావును పెంచుతూవచ్చారు. లోక్ పార్టీ నాయకులకు నిలయమైన గుంటూరుజిల్లాను ఆకట్టడానికి శ్రీ గొత్తుల చెన్నయ్యకు ప్రత్యామ్నాయంగా శ్రీ అనగాని భగవంతరావును రంగం మీదికి తెచ్చారు. రాయలసీమలో ఓబులరెడ్డి ప్రభృతులకు ఎదురుగా శ్రీ పెద్దిరెడ్డి తిమ్మారెడ్డిని పెంచారు. చివరకు శ్రీ గోపాలరెడ్డి కూడా, ఒక్క సహచరుడైనా లేకుండా, కేవలం నెల్లూరుజిల్లా ప్రతినిధి హోదాలో ఆలస్యంగా మంత్రివర్గంలో చేరడంతో ఆంధ్రప్రాంతంలో రాజకీయపు పాచికలు చరమదశను అందుకున్నాయి.

ఇక తెలంగాణాలో పరిణామాలుకూడా ఇదేగాడిని నడిచాయి. ఇక్కడ తెలంగాణా వాదులని, విశాలాంధ్ర వాదులని రెండు వర్గాల వారున్నారు. తెలంగాణావాదులకు

సమీక్ష

పితామహుడు శ్రీ కొండా వెంకటరంగారెడ్డి. తెలంగాణాలో చరిత్రకల మనిషే కాని చరిత్రను నిర్మించగల వ్యక్తిత్వం తక్కువ. తాలూకా కోర్టుప్లీడరు తత్వంగల నాయకుడు. అనుచరులను కూడదీయలేడు. వారిచేత ఒప్పించనూలేడు. అందువల్లనే ఆయననుంచి స్వతంత్రులుగా తయారయ్యారు శ్రీ జె. వి. నరసింగరావు, డాక్టర్ మర్రి చెన్నారెడ్డి. విశాలాంధ్ర వాదులలో ప్రముఖుడు శ్రీ వల్లూరి బసవరాజు. ఈయన కేవలం రాజధాని రాజకీయవేత్త. శ్రీ రంగారెడ్డికి తెలంగాణా గ్రామాల్లోవున్న జనబలం ఈయనకు లేదు. కాని తెలంగాణా అంటే హైదరాబాదు, సికిందరాబాదు నగరాలేనన్న దశను ఆ ప్రాంతం అనుభవిస్తున్నందున రాజరికం చేయగలిగాడీయన. అవసరమైతే అతివాద "థీసిస్"ను ఏకరువు పెట్టడం వీరికొక అలవాటు. మంత్రిపదవులను మించిన పదవుల మీద ఆశలు పెట్టుకున్న దీర్ఘసూత్రుడు. చలచిత్తుడు.

ఇలాంటి రాజకీయవేత్తలకు నిలయంగా వున్న తెలంగాణాలో నీలం-అల్లూరి ద్వయం విశాలాంధ్రవాదులను చేతిలో వుంచుకొని, తెలంగాణావాదులను చీలగొట్టారు. తెలంగాణాతో చేసుకున్న పెద్దమనుష్యుల ఒడంబడిక ప్రకారం ఉపముఖ్యమంత్రి పదవి వారికి ఇవ్వాలి కాని ఇది ఎవరికి ఇస్తారనే విషయంలో తెలంగాణా నాయకులమధ్య ఆశలు, అనుమానాలువుండి, ఉపముఖ్య మంత్రిపదవి అనేది నిరుపయోగకరమైన "ఆరవవేలు" వంటిది కనక ఆ పదవి వలదని వారిచేత అనిపించారు. ఇది ఆంధ్ర తెలంగాణాల భావసమైక్యతకు తొలిసోపానంగా చిత్రించారు.

పెద్దమనుష్యుల ఒడంబడిక ప్రకారం మంత్రివర్గంలో మూడు రెండు నిష్పత్తిలో తెలంగాణాకు ఆరు మంత్రిపదవులు రావాలి. కాని అక్కడవున్న మూడువర్గాలు మూడింటిని స్వీకరించడంతో, ఆరవపదవిని పొందవలసినవర్గాన్ని శ్రీ నూకల రామచంద్రారెడ్డికి ప్రదేశ్ కాంగ్రెసు కార్యదర్శి పదవి ఇవ్వడంద్వారా ఆయనను అల్లూరి ఆకట్టారు.

తెలంగాణాకు విడిగా అభివృద్ధిసంస్థ అవసరమని తెలంగాణావారుకోరగా విడిసంస్థ అవరోధమే కాని అసలు పని జరగనివ్వదని రాయలసీమ ప్రతినిధిగా పొందిన అనుభవాన్ని ఉదాహరించారు శ్రీ సంజీవరెడ్డి. తెలంగాణా మంత్రులందరూ తమప్రాంతం అభివృద్ధికి శ్రద్ధ చూపుతూంటే తాను కాదనను అన్నారు. కాని వారు చూపినశ్రద్ధ లేదనిపించారు.

ఈ విధంగా ఆంధ్రరాష్ట్రంలో శ్రీ భాగ్ ఒడంబడికను పంపిదలగా అమలుజరిపించుతున్న శ్రీ సంజీవరెడ్డి తెలంగాణాలో జరిగిన పెద్దమనుష్యుల ఒడంబడిక అమలు అవసరం లేదని తెలంగాణా వాదులతోనే ఆనాడు అనిపించారు. రాయలసీమ ప్రతినిధిగా తెలంగాణావారిని కలుపుకుంటూ ఆంధ్రప్రదేశ్ భావసమైక్యతను సాధించారన్న కీర్తిని పొందారు.

ఈ పరిణామాలన్నింటిలోను నీలం—అల్లూరి నాయకత్వం ఏకంగానే వ్యవహరించింది. వీరి నిర్ణయాలు, వ్యూహాలు, ఎదురులేకుండా సాగిపోయాయి. కాంగ్రెసు పార్టీలో నా ప్రతిఘటనలేదు. ప్రజాపార్టీ, లోక్‌పార్టీ వగైరా వర్గాలు కాంగ్రెసునుంచి వెడొలగాయి. మంత్రివర్గంలో సంజీవరెడ్డి-గోపాలరెడ్డి-కళా "త్రయం" కలయిక సంజీవరెడ్డి నాయకత్వానికి బిగువు తెచ్చింది. ముఖ్యమంత్రిగా శ్రీ సంజీవరెడ్డి దక్షులన్న ప్రసిద్ధి పొందుతూ వచ్చారు.

ఇలా కథానాయకుడు శ్రీ సంజీవరెడ్డి ముఖ్యమంత్రిగా బలపడుతూవుండగా, ఉపకథానాయకుడు శ్రీ అల్లూరి సంస్థాయిలో ప్రదేశ్ కాంగ్రెసు అధ్యక్షులుగా స్థిరపడిపోయారు. కానీ ప్రాగ్జ్యోతిషపుర కాంగ్రెసులో అధ్యక్షులు శ్రీ ధేబర్ కాంగ్రెసు ప్రధాన కార్యదర్శులలో ఒకరుగా శ్రీ అల్లూరిని నియమించుకోనడంతో ఆంధ్రప్రదేశ్ రాజకీయాలలో గయోపాఖ్యాన ఘట్టం ఆరంభమైంది. ఈ నియామకం తన సలహామీద జరగలేదని ఆశ్చర్య ప్రకటన చేశారు శ్రీ సంజీవరెడ్డి. అయినా ఆంధ్రుడు అఖిల భారత కాంగ్రెసు కార్యదర్శి అయ్యాడని అభినందించారు. అయితే అల్లూరి ఎందుకు రాష్ట్ర రాజకీయాలనుంచి తప్పుకున్నారనే ప్రశ్న అప్పుడెవ్వరికీ తట్టలేదు. దానికి సమాధానం చెప్పవలసిన అవసరంకూడా ఎవ్వరికీ కలగలేదు. కాగా ఆయన అలాదూరంగా పోవడం మంచిదనే భావం చాలామందిలో వుంది.

అయితే అయిదవ ఏడు పరిణామాలనుబట్టి ఇప్పుడీ ప్రశ్నలకు సమాధానం చెప్పుకోవలసి తప్పదు. అల్లూరికి సంజీవరెడ్డికిన్నీ వివాదాలు ఎందుకు వచ్చాయనే ఇప్పటి ప్రశ్నకు అప్పటినుంచి సమాధానం రావాలి. కాని ఇప్పటి వివాదంలోకూడా ఆ సమాధానానికి తగిన రహస్యాలు వెల్లడి కావడం లేదు. కాని అంతరంగికంగా వినవచ్చే వదంతులనుబట్టి కళా, గోపాలరెడ్డి, సంజీవరెడ్డి కలయికను ముందు ఆగలేక అల్లూరి అలా పైకి పోయారంటారు. శ్రీ సంజీవరెడ్డికూడా ఈ కలయిక ఆధారంగా అల్లూరిని చిన్న మాపు చూశాడంటారు. ఏమైనప్పటికి అఖిల భారత కాంగ్రెసు కార్యదర్శి పదవీ స్వీకారంతో అల్లూరి కొత్తసమస్యను శ్రీ సంజీవరెడ్డికి తెచ్చిపెట్టారు. ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షులుగా ఎవ్వరిని వుంచుకోవాలన్నదే ఆ సమస్య. ఇది సంస్థాయిలో అప్పుడేర్పడిన కొత్తసమస్య.

మరొక సమస్య శ్రీగోపాలరెడ్డి కేంద్రంలో మంత్రి పదవిని స్వీకరించడం. అలా ఆయన అఖిల భారతరంగంలోకి తప్పుకోనడంతో మంత్రివర్గంలో ఖాళీ ఏర్పడింది. దానిని భర్తీచేయడమనేది కొత్తసమస్య శ్రీ సంజీవరెడ్డిని ఎదుర్కొన్నది. ఇలా రాష్ట్రస్థాయిలో ఆడవలసిన చదరంగంలో అటు సంస్థలోను, ఇటుమంత్రివర్గంలోను రెండు పెద్దపావులు లోపించాయి.

ఈ పావులను భర్తీ చేయడంలో శ్రీ సంజీవరెడ్డి అనుసరించిన విధానంతో రాష్ట్ర రాజకీయాలలో కొత్త నాయకులు తలెత్తారు. దానిలో తొలిఅంకం ప్రదేశ్ కాంగ్రెసు అధ్యక్షపదవి. ఉప ముఖ్యమంత్రి పదవిని రద్దుచేశారు. కనుక అది తెలంగాణాకు రావాలనే వాదన వచ్చింది. కాని అందుకు అభ్యర్థి ఎవ్వరనేదానిలో అప్పటికి మంత్రులుగా వున్న తెలంగాణా ప్రముఖ నాయకులు ఏకీభవించలేరు. శ్రీ భాగ్ ఒడంబడిక ప్రకారం ముఖ్యమంత్రి రాయలసీమ వారు కనక ప్రదేశ్ కాంగ్రెసు అధ్యక్ష పదవి సర్కారు జిల్లాలకు రావాలి. అల్లూరి కూడా దాని ప్రతినిధే కాని తెరవెనుక జరిగిన సమాలోచనలలో శ్రీ పిడతల రంగారెడ్డి ప్రదేశ్ కాంగ్రెసు అధ్యక్షులుగాను, శ్రీ నూకల రామచంద్రారెడ్డి ప్రధాన కార్యదర్శిగాను వచ్చారు. అంటే ముఖ్యమంత్రి పదవి, ప్రదేశ్ కాంగ్రెసు అధ్యక్షపదవిని రాయలసీమవారు స్వీకరించారు.

ఇది తప్పు అని పైకిఅనలేదు కాని ఈ పదవికి తాము పోటీ చేయగలమన్న ప్రకటనలను శ్రీ ఎ. సి. సుబ్బారెడ్డి, శ్రీ మంతెన వెంకటరాజు ఆనాడు చేశారు. కాని ప్రదేశ్ కాంగ్రెసు సర్వసభ్య సమావేశంలో శ్రీ కళా వెంకటరావు అధ్యక్ష పదవికి శ్రీ పిడతల రంగారెడ్డి పేరు ప్రతిపాదించడంతో, ఆ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగిపోయింది. అవసరాన్నిబట్టి సర్కార్ల ప్రతినిధులు ఆనాడు తలవంచారు.

ఇక మంత్రివర్గంలో శ్రీ గోపాలరెడ్డి స్థానం ఖాళీగా మిగిలింది. కాని ఇది చివరవరకూ భర్తీకాలేదు. దీనికి అభ్యర్థిగా నిలిచినవారు శ్రీ ఎ. సి. సుబ్బారెడ్డి. కాని వారికి సంజీవరెడ్డి హయాంలో లభించింది మంత్రి పదవి. ప్రదేశ్ కాంగ్రెసు అధ్యక్షపదవి కాదు తిరుపతి దేవస్థానం ట్రస్టీబోర్డు చెయిర్మన్‌హోదా.

మరి ఈ ఖాళీని శ్రీ సంజీవరెడ్డి ఎలా భర్తీ చేయదలచారు? ఈ ప్రశ్నకు సమాధానం అప్పుడు రాలేదు. కాని కాంగ్రెసు కార్యదర్శిగావున్న శ్రీ అల్లూరిని తన మంత్రి

సమీక్ష

వర్గంలోకి పదే పదే శ్రీ సంజీవరెడ్డి ఆహ్వనిస్తూ వచ్చారని, ఆయన నిరాకరించారని అభిజ్ఞవర్గాలు చెప్పుకుంటాయి. ఏ సమయంలో ఆహ్వనించిందీ చెప్పలేదు కాని, శ్రీ అల్లూరికూడా తనకు మంత్రికాగల అవకాశాలు చాలాదఫాలు వచ్చాయని ఈ మధ్య వచ్చిన వివాదంలో వెల్లడించారు. శ్రీ అల్లూరి తన మంత్రివర్గంలో చేరి, తనకింద మంత్రిగా వుండడానికి నిరాకరించాడన్నదే నీలం-అల్లూరి విభేదాలకు ప్రధాన ప్రాతిపదిక అని స్థూలంగా ఇప్పుడు చెప్పుకోవచ్చు.

ప్రదేశ్ కాంగ్రెసు అధ్యక్షులుగా శ్రీ పిడతల రంగారెడ్డి ఎన్నికైన అనంతరం రెండు మూడు ప్రముఖపరిణామాలు సంభవించాయి. అందులో ఒకటి సంజీవరెడ్డి పాలనను విమర్శించాడని డాక్టర్ మర్రి చెన్నారెడ్డిమీద ప్రదేశ్ కాంగ్రెసు కార్యవర్గం క్రమశిక్షణ చర్య తీసుకోవడం. రెండవది ఎన్నికలలో అవినీతి చర్యలు కొనసాగించారనే కారణాన శ్రీ అల్లూరి బసవరాజు శాసన సభ్యత్వం రద్దు కావడం. దానితో మంత్రివర్గంనుంచి ఆయన నిష్క్రమణం. మూడు శ్రీ కళా వెంకటరావు అస్తమయం.

ఈ పరిణామాలన్నింటితోను శ్రీ సంజీవరెడ్డి ఏకైక రాష్ట్రనాయకుడుగా నిలిచారు. గోపాలరెడ్డి, కళాలతో కట్టుకున్న పునాది సడలింది. అల్లూరితో నేస్తం పూర్వపు స్థాయిలో లేదు. మంత్రివర్గంలో ఏర్పడిన ఖాళీలను భర్తీచేయకుండా, వాటిమీద చూపు పెట్టుకొనివున్న వారందరినీ, దూరంగా వుంచి, వాగ్బంధనం చేశారు. శ్రీ సంజీవరెడ్డికి తిరుగు లేదనిపించుకున్నారు. చివరకు తోటి మంత్రులశాఖలను మార్చినట్టు టెలిఫోనులలో పిలిచి చెప్పేస్థితికి వచ్చారు.

ఈ దశలోనే శ్రీ సంజీవరెడ్డి తన అంతరంగికులుగా ఒకరిద్దరిని చేర్చుకున్నారు. అందులో ముఖ్యులు శ్రీ కాసుబ్రహ్మనందరెడ్డి. రెండవవారు శ్రీ పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి, మూడవవారుగా కొంతకొంత కాలం శ్రీ ఎస్. బి. పి. పట్టాభిరామారావు, శ్రీ జె. వి. నరసింగరావు, శ్రీ కె. వి. రంగారెడ్డి అని అభిజ్ఞవర్గాలలో వినవచ్చేది.

వీరిహయాంలో నడిచిన రాష్ట్ర రాజకీయాల చివరిఘట్టంలో జిల్లా కాంగ్రెసు సంఘాలకు ఎన్నికలు జరిగాయి. వీరుకోరుకున్నవారే చాలవరకు జిల్లా కాంగ్రెసు సంఘాలకు నాయకులుగా వచ్చారు. ఇలా సంస్థను నిర్మాణం చేయడంలో ప్రదేశ్ కాంగ్రెసు అధ్యక్షులుగా శ్రీ పిడతల రంగారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా శ్రీ నూకల రామచంద్రారెడ్డి ప్రముఖపాత్ర వహించి కొత్తనాయకులుగా రూపొందారు.

సంస్థస్థాయిలో రాష్ట్రం నలుమూలలా తిరుగుతూ అటు సంజీవరెడ్డికి తలలో నాలుకగా శ్రీ పిడతల రంగారెడ్డి, ఇటు అల్లూరికి హంకుదారుడుగా శ్రీ నూకల రామచంద్రారెడ్డి ప్రదేశ్ కాంగ్రెస్ రథసారథులుగా నిలిచారు. పైకి ఇద్దరూ మెత్తనివారుగా కనిపిస్తారు. ఇద్దరూ మౌనముద్రాంకితులు. పలుకులో కరుకుదనం వుండదు. కాని పలకడమంటూ వస్తే, అది అంబ పలుకే. మిన్ను విరిగి మీదపడుతుందన్నా చలనం చూపరు. నకుల సహదేవులవంటి వారు. మనసు రగులుతున్నా, కింద ఏమి జరుగుతున్నా చూపు అన్నలమీద వుంటుంది.

కనకనే వీరిద్వారా ప్రదేశ్ కాంగ్రెసు అనేది ముఖ్యమంత్రి ఆదేశాల ప్రకారం వ్యవహరించే అనుబంధ సంస్థగా తయారై పోయింది. సంస్థలోకి ఎలాంటి వ్యక్తులు రాకుండా శ్రీ సంజీవరెడ్డికి అండగా నిలిచారు వీరిద్దరూ. వీరికి తెరచాటున సలహాదారుగాను, పైకి మద్దతుదారుగాను శ్రీ అల్లూరి వ్యవహరిస్తూ వచ్చారు. అక్కడ అఖిలభారత కాంగ్రెసులో కార్యదర్శిగా ఆయన వుండటం ఇక్కడ ప్రదేశ్ కాంగ్రెసు స్థాయిలో వీరు వుండటంతో అటు సంస్థద్వారా కాని, ఇటు పార్టీ ద్వారా కాని వ్యతిరేకశక్తులు తలెత్తడానికి వీలులేకుండా పోయినవి. అందరూ గుంభనగా వుండి పోయారు.

ఇలా అంతర్గతంగా వున్న శక్తులు తిరిగి ఒక రూపకు రావడానికి ప్రదేశ్ కాంగ్రెసు అధ్యక్షుని ఎన్నిక మరొక అవకాశాన్ని యిచ్చింది. అప్పటికి అఖిలభారత కాంగ్రెసు అధ్యక్షులుగా శ్రీ ఢేబర్ స్థానే శ్రీమతి ఇందిరాగాంధి వున్నారు. కార్యదర్శి పదవిలో శ్రీ అల్లూరి కొనసాగుతూ వచ్చారు. కొత్త అధ్యక్షుని ఎన్నిక రానున్నదను కుంటున్న రోజులవి. అప్పుడు ప్రదేశ్ కాంగ్రెసు అధ్యక్షులు కాదగిన వారుగా శ్రీ దామోదరం సంజీవయ్య, శ్రీ అల్లూరి సత్యనారాయణరాజు పేర్లను ముఖ్యమంత్రిగా శ్రీ సంజీవరెడ్డి సూచించారు. శ్రీ సంజీవయ్య వుంటే తనకు అభ్యంతరం లేదన్నారు శ్రీ అల్లూరి. కాని శ్రీ సంజీవయ్యతోను ఆ భారాన్ని నిర్వహించలేనని తప్పుకున్నారు. అప్పటికి ఎటూ తెగక మరికొంతకాలం శ్రీ నీడతల గంగారెడ్డిగారినే అధ్యక్షులుగా వుంచాలనే తీర్మానం జరిగింది.

ఈ సందర్భంలోనే ఒకటి, రెండు సూచనలు వచ్చాయి. ఒకటి ఉపముఖ్యమంత్రి పదవిని ఇవ్వలేదు కనక తెలంగాణా వారిని ప్రదేశ్ కాంగ్రెసు అధ్యక్షులుగా ఎన్నుకోవాలి. కాని అందుకు అభ్యర్థి ఎవ్వరనేది అక్కడి వారలనుబట్టి తిరిగి పెద్ద సమస్య అయింది. రెండు సర్కారు జిల్లాల వారిని ఎన్నుకోవాలని. అప్పుడు ఆలోచనలోకి వచ్చిన పేర్లు శ్రీ పళ్ళంరాజు, శ్రీ గోటిపాటి బ్రహ్మయ్యగార్లవి. వీరు కేవలం వ్యక్తులు కారు. రాష్ట్ర కాంగ్రెసు చరిత్రకు ప్రతినిధులు. కారణాలు ఏమైనప్పటికి అధ్యక్షుని ఎన్నిక వాయిదా వేశారు. అల్లూరి-నీలం ఏకాభిప్రాయం లేదన్నది అప్పుడు అందరికీ బహిరంగంగా తెలియవచ్చింది. కాంగ్రెసునుంచి పోయినవారు పోగా, మిగిలిన వారి మధ్య కీచులాట ప్రారంభమైనదని ప్రజలు నవ్వుకున్నారు.

మొత్తంమీద శ్రీ సంజీవయ్య హయాంలోని చివరి సంవత్సరంలో మంత్రిపదవులు కాని, ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షపదవి కాని అందరూ అనుకున్న వారికి, నలుగురూ ఆశించిన వారికి లభించలేదు. చివరకు మంత్రివర్గంలో ఏర్పడిన మూడు ఖాళీలు (గోపాలరెడ్డి, వి. బి. రాజు, కళావెంకట్రావు) భర్తీ కాలేదు. మిగిలిన మంత్రులతో శ్రీ సంజీవరెడ్డి ఏకదాటిగా సాగించిన పాలనలో, అటు పార్టీలోను, ఇటు సంస్థలోను ఒక రకమైన భీతి, శ్రీ సంజీవరెడ్డి అంటే భయం జనింపజేశాయి. దీనినుంచే అయిదవ ఏడాది పరిణామాలు ఉత్పత్తిల్లాయి.

శ్రీ సంజీవరెడ్డి ఇక ఆట్టే కాలం ఏకఛత్రాధిపత్యం సాగించ వీలులేదనుకుంటున్న సమయంలోనే ఆయనకు రెండు అవకాశాలు లభించాయి. ఒకటి. తనకు ఎదురువచ్చిన వారినందరినీ బయటకు నెట్టివేశాడనే అపకీర్తిని తొలగించుకోవడానికి, సోషలిస్టుగా వుంటున్న విజయనగరంరాజా శ్రీ పి. వి. జి. రాజును కాంగ్రెసులో చేర్చుకొనే అవకాశం. రెండు. అఖిలభారత కాంగ్రెసు అధ్యక్షపదవిని స్వీకరించమని వచ్చిన ఆహ్వానాన్ని అందిపుచ్చుకొనడం. చివరకు కాంగ్రెసు అధ్యక్షులు కానున్న హోదాతోనే ఇటు శ్రీ రాజును కాంగ్రెసులో చేర్చుకున్నారు. అటు జిల్లా పరిషత్తులకు అధ్యక్షుల ఎన్నికలు జరిపించారు.

కొన్ని జిల్లాపరిషత్తుల అధ్యక్షులుగా అనువైన కోరుకున్న వారు రాలేదని ఆవేశాన్ని ప్రదర్శించారు. నెల్లూరు నుంచి ఇలాంటి వార్తలు వచ్చాయి. శ్రీ పి. వి. జి. రాజును ఎందుకు కాంగ్రెసులో చేరుస్తున్నారంటే, శ్రీ అల్లూరికి పోటీగా అనే వదంతులు వ్యాపించాయి. కాని రాజకీయ చపలత్వం కల ఈ రాజు మరొకరకంగా వ్యవహరించారు. ఇలా అఖిలభారత కాంగ్రెసు అధ్యక్షపదవిని స్వీకరిస్తూనే జిల్లాల స్థాయిలోను, రాష్ట్ర స్థాయిలోను కొన్ని కొత్తశక్తులను శ్రీ సంజీవరెడ్డి పెంపొందచేశారు. వానిద్వారానే తాను కోరిన వారిని రాష్ట్ర ముఖ్యమంత్రి చేయవచ్చునని అనుకున్నారు. కాని ఆచరణలో అలా చేయలేక పోయారు. రాజీగా శ్రీ సంజీవయ్య ముఖ్యమంత్రి పదవిని స్వీకరించడానికి తప్పనిసరిగా అంగీకరించి, అఖిలభారత కాంగ్రెసు అధ్యక్షులుగా వెళ్ళిపోయారు.

శ్రీ సంజీవరెడ్డి అఖిలభారత కాంగ్రెసు అధ్యక్షులుగా వెళ్ళకుండా వుంటే రాష్ట్ర రాజకీయాల స్థితి మరొకరకంగా వుండేది. కాని ఆయన స్వయంగా ఆ పదవికి అంగీకరించారు. కారణాలు ఏమైనప్పటికి, రానని కాంగ్రెసు అధిష్ఠానవర్గానికి చెప్పలేకపోయారు. అయినప్పటికి ఆయనను రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఇంకా కొంతకాలం వుంచాలనే ప్రయత్నాలు జరిగాయి. కాంగ్రెసు శాసనసభా పక్షంలో ఇందుకు తీర్మానం కూడా శ్రీ సంజీవరెడ్డి అంగీకారం మీదనే జరిగింది. అర్థంలేని ఈ తీర్మానాన్ని ప్రతిపాదించిన వారు శ్రీ గోటిపాటి బ్రహ్మయ్య. ఆ తీర్మాన ప్రతిపాదనే ఆయన రాజకీయ భవిష్యత్తును మరికొంతకాలం అజ్ఞాతంలోకి నెట్టింది. ఆ తీర్మానమే శ్రీ సంజీవరెడ్డి సందిగ్ధస్థితిని నవ్వులపాలు చేసింది.

(ఇంకా వుంది)

తెనుగు వాణి



మహాభక్తుడు, వాగ్గేయకారుడు అయిన శ్రీ త్యాగరాజస్వామి భారతీయ తాత్త్వికులలో అగ్రగణ్యుడు. ఆ మహానుభావుని 114 వ వర్ధంతి సందర్భంలో ప్రత్యేకంగా తపాలా బిళ్లలు ముద్రించి భారత ప్రభుత్వం తనకర్తవ్యం నెరవేర్చుకున్నది.

త్యాగరాజు సంగీతం కేవలం స్వరరాగ తరంగిణి కాదు. స్వరరాగ సుధారసయుతభక్తి మందాకిని. ఆయన భావావేశ పరవశుడై అవ్యక్త మధురాలాపన చేసిన కవి కాదు. అనుభూతి భంగాలలో లోతులు తరచి తరచి తనకు తోచిన తత్వం పరతత్వంగా దర్శించి ప్రదర్శించిన ద్రష్ట, తాత్వికుడు. ఋషిపరంపరలో కొలికిపూస.

ఆంధ్రుల రామభక్తి తాత్పర్యం త్యాగరాజస్వామి సంగీతంగా, సంకీర్తనంగా ప్రభవించింది. "తనగీతి అరవజాతిని పాటకులనుగా దిద్దివర్ధిల్లిన తెనుగువాణి త్యాగరాజు. నాదశరీరుడైన త్యాగరాజు చిరంజీవి. ★

ఆఫీసులో తరగని ఫైళ్లతో కుస్తీపడుతున్న 'శంకరం' తనకోసం యెవరో వచ్చారనగానే విసుక్కుంటూ బైటకువచ్చి 'మధు'ను చూసేటప్పటికి వుక్కిరిబిక్కిరయ్యాడు. సంతోషంతో యేం మాట్లాడాలో తోచలేదు. అవునుమరి యెప్పుడో చిన్నప్పుడు గోళీకాయలూ, బెచ్చాలాటా, దాగుడు మూతలూ ఆడుకొంటూ క్షణమైనా విడని స్నేహితులు, మధ్యలో విడిపోయి నిండా పదేళ్ల తర్వాత హైదరాబాద్‌లో కలుసుకొని, మళ్లీ యీ రోజున సంవత్సరం తర్వాత హఠాత్తుగా కలుసుకొంటే యెవరికి సంతోషంగా వుండదు.

ఎట్లాగో బ్రతిమిలాడి ఆఫీసర్ దగ్గర పర్మిషన్ తీసుకొని స్నేహితుడితోసహా బైటపడ్డాడు శంకరం. ఇద్దరూ మౌనంగా హోటల్‌వైపు దారితీశారు. ఏం మాట్లాడాలో యెవరికీ తోచలేదు. కొంతసేపటికి శంకరమే 'ఏరా మధూ ! ఏమిటి యిట్లా అనుకోకుండా వచ్చిపడ్డావ్ ! ఉత్తరమైనా రాయలేదేం ? అంతా బాగున్నారా? అసలు నువ్విక్కడి కెందుకొచ్చినట్లు ?'' అని ప్రశ్నలవర్షం కురిపించాడు కావలసినదానికి అర్వరిచ్చి.

'అవునురా బాబూ ! అనుకోకుండా అమాంతం బయల్దేరి రావలసిన అవసరం వచ్చింది. ఇక్కడ ఒక సంబంధం వుందంటే చూసి, ఖాయం చేసుకుపోదామని వచ్చాను' అన్నాడు మధు.

'కంగ్రాట్యులేషన్స్ మధూ ! అయితే పిల్లను చూసుకోవటాని కొచ్చావన్నమాట ! శెభాష్ ! ఒక్కడివే వచ్చావా ? లేక......'

'లేదురా చిట్టీ. పిల్లను చూడటానికి కాదు—పిల్లాడిని చూడటానికే — మా శారదకు —ఒక్కడినే వచ్చాను' అన్నాడు మధు నవ్వుతూ.

ఈ మాటలను వింటూంటే శంకరం నీరుకారిపోయాడు. ముఖం వెలవెలపోయింది! 'శారదపెళ్లి' అనగానే అతనికి పుట్టెడు దుఃఖం ముంచుకొచ్చింది. అయినా ఆపుకొన్నాడు. లేకపోతే మధు యేమనుకుంటాడు !

మధు మళ్లీ మొదలెట్టాడు. ''కుర్రాడు బుద్ధిమంతుడేనట ! యేదో మంచి ఉద్యోగమే చేస్తున్నాడు — ఈడూ — జోడూ కూడా కుదిరింది. మా శారదకు అన్నివిధాలా తగినవాడేనని నా అభిప్రాయం. అయినా యెందుకైనా మంచిది. నువ్వు కూడా అతన్నొక్కసారి చూసి మా శారదకు తగినవాడో కాదో చెప్పరాదూ !''

శంకరానికి మధును నమిలిమింగెయ్యాలన్నంత కోపం వచ్చింది. 'దుర్మార్గుడు !. మిత్రద్రోహి ! నేను శారదను మనసారా ప్రేమించానే ! ఏ రాత్రీ ఆమెను తలచుకోకుండా నిద్రపోనే ! శారద మరెవ్వరికీ లభ్యంకాదనీ, శారద నా సొత్తేననీ యింతకాలమూ అనుకొంటూ, శారదమీదే అన్ని ఆశలు పెట్టుకొని బ్రతుకుతున్నానే ! అటువంటప్పుడు నా శారదకు మరొక సంబంధాన్ని చూడటమే కాకుండా ఆ వెధవని తను కూడా చూసి శారదకు తగునో—తగడో అని తన అభిప్రాయాన్ని చెప్పాలట ! ఎంత కుటిలబుద్ధి! ఛీఛీ. కెంత గర్వం! వాడేదో మంచి ఉద్యోగమే చేస్తున్నాడట ! శారదకూ వాడికీ యీడూజోడూకూడా సరిపోతుందట!అంటే తను చేసేది సన్నాసి వుద్యోగమనీ—తను శారదకు తగనివాడిననేగా అర్థం. తన నెంత అవమాన పర్చాడు. ఛీ....ఛీ, ఇటువంటివాడా తన స్నేహితుడు'' అనుకొంటూ కాఫీతోపాటు కోపాన్ని కూడా దిగమింగటానికి ప్రయత్నంచేస్తున్నాడు శంకరం.

ఇద్దరూ మౌనంగా బైటకు వచ్చారు. అంతకు ముందువరకూ మధును తన యింటికి తీసుకెళ్దామనుకొన్నవాడల్లా ఆ మిత్రద్రోహిని తన యింటికి రమ్మనమంటానికి శంకరంమనస్సొప్పుకోలేదు.ఇద్దరూ యేదో పిచ్చాపాటీ మాట్లాడుకొంటూ సాయంత్రం దాకా తిరిగారు. మధును చూస్తుంటే శంకరానికి ఒళ్లు మండుతోంది. అయినా బైటికి యేమాత్రమూ కనపడనీయకుండామధుతోపాటునవ్వుతూ-ప్రేలుతూ-మనస్సులో మాత్రం యేడుస్తూ, మధును కసిదీరా తిట్టుకుంటూ తిరిగాడు. బాగా చీకటిపడ్డాక మధు 'శంకరం నాకోసం మాపిన్ని ఎదురు చూస్తూంటుంది—చాలా విషయాలు మాట్లాడుకోవాలి. రేపు తప్పకుండా ఆ కుర్రవాడిని నీకు చూపిస్తాను. రేపు సాయంత్రం మీ ఆఫీసుకు వస్తాను. రెడీగావుండూ !

> ఆతడు—నేనొక అమ్మాయిని వివాహం చేసుకోవాలను కొంటున్నాను. నీ ఉద్దేశ్యం ఏమిటి?
>
> ఆమె—నన్నడిగితే మహా భాగ్యంటాను.
>
> —పార్సి ఓంప్రకాశ్ (జడ్‌చర్ల)

బై.....బై'' అంటూ వెళ్లిపోయాడు.

శంకరం కాళ్లీడ్చుకొంటూ యింటిదారి పట్టాడు.

* * *

ఆ రాత్రి నిద్రపట్టక పక్కమీద అటూ యిటూ దొర్లుతున్న శంకరం ఆలోచనలు సంవత్సరం వెనుకకు పోయాయి.

అప్పుడు శంకరం హైదరాబాద్‌లో వున్నాడు.

''ఏమండీ మీది బెజవాడ కదూ ?''

కాఫీ తాగుతున్న శంకరం ఎదుటి వ్యక్తి ఆ ప్రశ్న తననే అడుగుతున్నాడని గ్రహించి 'అవునండీ'అన్నాడు.

''మీ పేరు ?''

''శంకర్రావు''

ఆ వ్యక్తి కాస్సేపు యేదో ఆలోచించి, శంకరాన్ని రెండు నిముషాలు పరకాయించిచూసి, మనస్సులో యేదో గొణుక్కొని, ''నీ పేరు శంకర్రావుకాదు—నే చెప్పనా ?'' అన్నాడు నవ్వుతూ చివరికి.

అతని ప్రవర్తనలోని యీ హఠాత్పరిణామానికి—అతని యీ యేకవచన ప్రయోగానికి శంకరానికి చాలా ఆశ్చర్యం కల్గింది. ఒకవేళ కొద్దిగా మతి చలించిన విద్యాధికుడేమోననుకొని 'చెప్పు' అన్నాడు తాను కూడా యేకవచన ప్రయోగం చేస్తూ.

''దీర్ఘ నాశిక''

అతని యీ మాటలను విన్న శంకరం ఆశ్చర్యంతో మునిగిపోయాడు. అతను నవ్వుతూ శంకరంవైపే చూస్తున్నాడు. ఆ నవ్వు శంకరానికి చిరపరిచితం లాగానే కనిపించింది. శంకరం గబగబా బాల్యస్మృతులను జ్ఞాపకం తెచ్చుకోసాగాడు. అవును. తనకు బాగా గుర్తు. తనపేరు 'దీర్ఘనాశికే'యీ పేరునుఎంతో ఆలోచించి తనకు తన ప్రియ స్నేహితుడు యిచ్చాడు. అతను తనను 'దీర్ఘనాశికా' అని తప్ప పేరుపెట్టి యెప్పుడూ పిలిచేవాడేకాదు. అప్పుడతనట్లా అన్నాడని కోపమొచ్చి ఏం చేయలేక యేడిచేవాడు. అయినా అతనట్లా పిలవటం మటుకు మానలేదు. తను మూడవఫారం చదివేటప్పుడనుకుంటా — వాళ్ళ నాన్నకు బెజవాడనుండి బదిలీ అయింది. ఆ తర్వాత కొన్నాళ్లపాటు అప్పుడప్పుడు అతన్ని జ్ఞాపకంతెచ్చుకొని తనలోతాను నవ్వుకొనేవాడు. అతను లేనందువల్ల తనకు మొదట్లో కాస్త బాధకల్గినా కాలక్రమేణా అతన్ని మర్చిపోగల్గాడు. అతని పేరేమిటబ్బా !''

ఆలోచిస్తూ—ఆలోచిస్తూ శంకరం మళ్లీ ఆ వ్యక్తివైపు చూచాడు. అతనింకా అట్లాగే శంకరంవైపు చిరునవ్వుతో చూస్తున్నాడు. శంకరానికి తనమీద తనకే కోపమొచ్చింది, 'ఇదేమిటి నా జ్ఞాపకశక్తి యిరవై మూడేళ్లకే యిట్లా ఏడిసింది. అనుకొని హఠాత్తుగా యేదో గుర్తుకువచ్చి 'వురేయ్ మధూ' అని అది హోటలనైనా గమనించకుండా పెద్దగా అరచి అతన్ని కావలించుకున్నంత పని చేశాడు.

''ఇప్పటికి గుర్తుపట్టావన్నమాట'' అన్నాడు మధు.

''అబ్బాయ్ ! నువ్వు చాలా మారిపోయావురా ! అసలు చిన్నప్పుడు చూసినవాళ్లెవరూ యిప్పుడు నిన్ను గుర్తుపట్టలేరు.'' అన్నాడు శంకరం తప్పు తనదేమీ లేదనీ—మారిపోవటం అతని తప్పేననీ ధ్వనింపజేస్తూ.

''అది సరేగాని—నిన్నుమటుకు ప్రపంచంలో యే మూల, యే పరిస్థితుల్లోనున్నా తేలికగా గుర్తుపట్టేయవచ్చు'' అన్నాడు మధు భావగర్భితంగా అతని ముచ్చటైన ముక్కువైపు చూస్తూ. శంకరం కొద్దిగా సిగ్గుపడ్డాడు.

హఠాత్తుగా మధు 'ఒరేయ్ శంకరం. మనం తర్వాత తీరికగా మాట్లాడుకోవచ్చునుగానీ—త్వరగా లే. ఇవ్వాళ ఒకడి ముక్కాలు విరగ్గొట్టి, యేకిలు కాకిలు తీసి, వాడి భరతం పట్టాలి' అన్నాడు కోపంతో.

''ఎందుకురా బాబూ ! ఎందుకంత కోపం ? ఎవరిని చెప్పు ?'' అన్నాడు శంకరం నవ్వుతూ.

''నిజంరా. నవ్వులాటకాదు. మా శారదలేదూ ! అది ప్రైవేటుగా మెట్రిక్‌కు చదువుతోందిలే. ఎవడో కొంటెవెధవ ప్రతిరోజూ క్రమం తప్పకుండా దాన్ని యిక్కడనుండి స్కూలుకు, స్కూలునుండి యిక్కడికి దింపి మరీ వెళ్తున్నాడట. ఇవ్వాళ వాడి పని పట్టాలిరా'' అన్నాడు మధు.

శంకరం గుండె గుభేల్‌మంది. ''అయితే ఆ అమ్మాయి నీ శారదేనన్నమాట. అందుకే నన్నిట్లా బందీనిచేసి తనవెంట తిప్పుకుంటోంది. శారద నన్ను గుర్తుపట్టివుండదు. గుర్తుపట్టేవుంటే తనమీద యిటువంటి ఫిర్యాదే చేసివుండేదికాదు'' అనుకొని యెందుకైనా మంచిదని ''ఒరేయ్ నాకు అర్జం




టు పనుంది. వాడి సంగతేదో నువ్వేచూడు—నేను కూడా ఎందుకు'' అని తప్పుకొందామనుకొన్నాడు గాని మధు అతన్ని వదలిపెట్టక "నువ్వు కూడా వుంటే మంచిదిరా ! నాకు కొంత ధైర్యంగా కూడా వుంటుంది'' అని అతని రెక్క పట్టుకొని బస్ స్టాప్‌వైపుగా లాక్కుపోయాడు.

తన "బాడీగార్డు''కోసం ఒళ్లంతా కళ్లు చేసుకొని యెదురుచూస్తున్న శారద తన అన్న అతన్ని రెక్క పట్టుకొని రావటంచూసి విస్తుపోయింది. "అరే ! నాకు తెలియకుండానే—నేను చెప్పకుండానే అతన్నెట్లా తెలుసుకోగల్గాడు'' అనుకొని ఆశ్చర్యపోయింది.

"అమ్మాయ్ ! వాడొచ్చాడా ?'' అన్న అన్నగారి ప్రశ్నవిన్న శారద "దయచేసి చెప్పొద్దు'' అన్నట్లు యేడుపుముఖంతో తనవైపు చూస్తున్న శంకరం మీద జాలి తలచి, కాస్సేపు యేదో ఆలోచించి 'లేదు'

(91-వ పేజీ చూడండి)





సాయంకాలం నాకు ఖాళీ అని తెలిసి సినిమాకి పోదాంపదమంటూ వచ్చారు మిత్రులిద్దరు. ఐదు న్నర కావస్తోంది. బయల్దేరదాం అన్నారు. ముఖం కడుక్కుని బట్టలు మార్చుకువచ్చాను. వాళ్ళు కూడా టాయిలెట్ అయ్యారు. వాళ్ళిద్దరూ అన్నదమ్ములే అయినా చాలా చనువుగా కలిసి తిరుగుతారు. సిగరెట్లు కాలుస్తాడు తమ్ముడు అన్న ఎదుటే.

"ఉండండి. పాపిడి సరిగ్గా కుదిరిచావలేదు" అంటూ హాల్లోకి వెళ్ళాడు తమ్ముడు.

మేం కుర్చీలో కూలబడ్డాం. తెలుగు సినిమా దుస్థితి గురించి, దాన్ని మరమ్మతు చేయడానికి అవ సరమైన పరిస్థితులను గురించి ప్రాబ్లెంస్‌కి సొల్యూ షన్స్ గురించి లెక్చరు యిస్తున్నాడు అన్నగారు. అంతకుముందే కొంత అయిందిలెండి. అతను చాలా సీరియస్‌గా చెప్పేస్తాడు — "అర్జంటుగా సిక్స్‌మంత్సులో యిండస్ట్రీ ఛేంజి" అయిపోవాలని. నేనూ, అతని తమ్ముడూ అంతా సీరియస్‌గావిని చివర్ని వకాలున వన్వేస్తాం. "బ్రదర్! నువ్వను కున్నంత అర్జంటుగా ఫిలిం యిండస్ట్రీయేకాదు, పెస రట్టుని కూడా తిరగెయ్యడం కష్టం" అంటాడు తమ్ముడు. ఇది మామూలే.

నేను లెక్చరు వినడంలేదు ఆవేళ. విన్నా నిజంగా నాకది వినబడ్డంలేదు. పరధ్యాన్నంలాంటిది వచ్చింది. ఎదురుగుండా, స్తంభంపక్కన ఒక బిస్కట్ రవ్వతో తిప్పలు పడుతోంది ఒక చీమ. పరిమాణంలో తన కన్నా పెద్దదే అయినా ఉపాయంగా తోసుకునీ, లాక్కునీ తీసుకుపోతోంది. వరండా చివరికి వెళ్ళింది మెల్లిగా. అంతలో గాలివీచి అంచుమీదనుంచి రెండూ కలిసి ఒక్కసారిగా కింద తోట మట్టిలో పడ్డాయి. ఒక్క నిముషం తర్వాత చీమ మళ్ళీ వచ్చింది. ఇది ఆ చీమేనని ధైర్యంగా చెప్పడానికి తగినంత ముఖ పరిచయంలేదుగానీ — అది తిన్నగా యిందాకటి చోటుకే తెలిసినట్లు వెళ్ళి యింకో తునకను పట్టు కుని లాగడంచూసి అదే అనుకున్నాను. తోటివాళ్ళ కోసం మోసుకెళ్తోంది కాబోలు. లేదా, దొరకని రోజులకోసం వెనకేసుకొంటోందేమో !....

నేను ఆ ఊఁ అనకపోడం గమనించాడు కాబోలునా మిత్రుడు లెక్చరు ఆపుచేశాడు.

"చీమల్ని చూస్తున్నావా? ఇదెప్పట్నించి?" అన్నాడు.

నేనేం మాట్లాడలేదు—ఏమనాలో తోచక.

"ఎంత ఆశో ! వ్వా తోసుకుపోతోంది" అంటూ "ఏరా నీ పాపిడి యింకా కుదరలేదా, తెలుగు సిని మాకి సొల్యూషను లాగా" అని ఒక కేక వేశాడు హాలులోకి.

"తెలుగు సినిమా సొల్యూషను సంగతి నాకు తెలియదు కాని, నాకు పాపిడ కుదిరింది లేవోయ్" అంటూ వచ్చేశాడు అతని తమ్ముడు.

"చీమలకి ఆశ చాలా ఎక్కువ అంటున్నాడు మీ అన్నయ్య" అన్నాను నేను తలెత్తకుండానే.

"ఆశేముంటుంది నా తలకాయ. ఇంకో పనేదన్నా ఉంటేగదా వాటికి. అవేం మినిస్ట్రీలు పెట్టాలా ? పడగొట్టాలా ? సినిమా తియ్యాలా ? ఆర్టిస్టుల కోసం పడిగాపులు పడాలా ! ఎంత సేపూ దొరికిం దంతా పోగేసుకు తోసుకుపోడం, పుట్టలగోడవునులో సడెయ్యడం. ఎన్ని లక్షల చీమలు బతకాలో..ఆశేమిటి నా తలకాయ" అన్నాడతను.

"కాపోడవేవిఁటి ? చాలా దురాశ" అన్నాడు అన్న పంతంగా. అతని మాటల్లో అతనికే విశ్వాసం ఉన్నట్లు తోచలేదు.

అయినా నా కాశ్చర్యం వేసింది.

ఆ చీమ పొట్టకూటికి దొరికింది తీసుకువెళ్తోంది ఎన్ని లక్షల చీమలు తింటాయో మనకి తెలీదు.

మొత్తంమీద సహజమైన, ప్రకృతిసిద్ధమైన ఆకోరిక నా మిత్రులలో ఒకరికి సహజమైన ఆశగాకనబడింది. రెండో వారికి మాత్రం దురాశగా,క్షమింపరాని కోరికగా కనబడింది. ఇద్దరూ అన్నదమ్ములే ! కలిసి మెలిసి తిరిగిన వారే !

ఏది సత్యం ? ఏ దసత్యం ? వాళ్ళకి

అక్కినేని నాగేశ్వర

ఆశలు

కనబడ్డ సత్యం వాళ్ళ కళ్ళకి తగిలించుకున్న రంగు టద్దాలనుబట్టి ఉంటుందా ? రంగుటద్దాలు చూపించేవన్నీ సత్యాలేనా ? కొన్ని సత్యాలుఅయి, కొన్నిఅసత్యాలు కావడానికి వీలుందా? కోరికలు,ఆశల్నా ఆశలు దురాశల్నా కనబడతాయా ? వాటిని అలా చూపించే భూతద్దాలు ఉంటాయా ? అప్పుడు ఆ తప్పు, భూతద్దాలదా లేక, తెలియకో, తెలిసో అవి పెట్టుకున్న వాళ్ళదా ? ఇంకొకళ్ళ కళ్ళకి తప్పుగా కనిపించే పని తనకి ఒప్పుగా కనుపించినపుడు ఇవతలి వాడు ఏం చెయ్యాలి ? ఈ నిర్ణయం చేసేది ఎవరు ? ఆత్మవిశ్వాసానికీ అహంకారానికీ మధ్య గోడ ఏది? ఎలాగ ? ఆశకీ, దురాశకీ సరిహద్దులు నిర్ణయిం చడం ఎలా ? అవి ఎక్కడ ఉంటాయి ? ఈ ప్రశ్న లతో నా బుర్ర గంద్రగోళం అయిపోయింది. హోరు గాలిలో కిటికీ తలుపులు తెరిస్తే గదిలో కాయితాలూ, దుమ్మూ ఎగిరినట్లు, మనస్సులో నాకు తెలీకుండా అంటి పెట్టుకున్న యీ ప్రశ్నలు ఒక్కసారిగా చెల రేగాయి.

*　　　*　　　*

పిక్చరు చూస్తున్నంత సేపూ యిదే ఆలోచన. అందులో కథ కూడా అందుకు తగినట్టే ఉంది. హీరోకి ఏవో గొప్ప ఆశయాలు ఉంటాయి. అవి సాధించాలని ఆశతో కృషి చేస్తూ ఉంటాడు. కానీ చివరికి ఆ వెర్రివాడే అనుకున్న పని సాధించి బాగు పడతాడు. తమాషా ఏమిటంటే వాడివల్ల, అంత వరకూ వాడిని హేళన చేసిన వాళ్ళు కూడా కొన్నిపాఠాలు నేర్చుకుని బాగుపడుతారు.

*　　　*

ఇలాంటిది నా జీవితంలో నేనుస్వయంగా చూశాను. అది సినిమా కథ అంత విషయం కాకపోవచ్చు. నేనునాటకాల్లో వేషాలువేస్తూ ఉండేవాడిని అపుడు. ఓ కుర్రాడు మా పొరుగునే ఉండేవాడు.అతనికీపాటలన్నా, నాటకాలన్నా పిచ్చి.కానీ పాటచేతకాదు. కంఠం తిరిగేదికాదు. తెల్లవారు గట్ల చలిలో కూర్చుని సాధికంచేస్తే, ఆ ఒణుకుకు గమకాలు తిరుగుతాయని చెప్పారట ఎవరో. అందుకని అతను ఆ శీతాకాలపు రోజుల్లో తెల్లవారుజామునే లేచి ఓ గోచీ పెట్టుకుని కూచుని గజగజ వణకుతూ పాట పాడేవాడు. అతనిపాట కాదుగానీ, అందువల్ల పక్కవాళ్ల నిద్దర్లు చెడేవి. కొన్నాళ్ళు తిట్టుకున్నారు తరువాత తిట్టేరు. కాని అతను పట్టు వదల్లేదు. మెల్లిగా ఒక దారికివచ్చి సాధించాడు. ఈ లోపల అతని పాట ధర్మమా అని తెల్లవారుగట్ల లేవడానికి బద్ధకించేవాళ్ళు కూడా తప్పనిసరిగా లేవవలసివచ్చేది.ఎలాగా లేచాం గదా అని వాళ్ళ విద్యలో వాళ్ళు సాధకంచేసుకునేవారు. అప్పుడు కాకపోయినా తరవాత తరవాత అనిపించేది. ఒకడు ఆశపడినా, లేదాదురాశపడినా—వాడు లేపే అలజడివల్ల చెరువు నీటిలా కదలకుండాఉన్న తోటి వాళ్ళ జీవితాలలో కూడా చలనం కలుగుతుంది గదా అని.

అదే ముఖ్యం. జీవితం చెరువు నీటిలా అలా నిలిచి మురిగిపోకుండా ఉండాలంటే ప్రతీ జీవికీ ప్రాణ వాయువునిండా ఆశ ఉండాలి. అదే మనని ముందుకు నడిపేది. అది లేకపోతే జీవితంలో పసలేదు. అది యీనాటిదికాదు. సృష్టి ఆరంభమైననాటినుండీ ఉంది. మనలోనేకాదు. ప్రతి జీవిలోనూ ఉంది. ఆహారం సంపాదించాలన్న ఆశ, ఆపదలు తప్పించుకోవాలన్న ఆశ, ప్రాణం నిలబెట్టుకోవాలన్న ఆశ, ఇవి



రాము

ప్రకృతి సిద్ధమైనవి. మత్స్య, కూర్మ, వరాహ, నరసింహాది దశావతారాలనూ పరిశీలిస్తే సృష్టిలో పరిణామం జరిగినవిధం అర్థం అవుతుంది. సముద్రంలో చేపలకి ఉండేది తినాలన్న కోరికా, బ్రతకాలన్న ఆశా. అవి మెల్లగా భూమిమీదికి వచ్చేసరికి పరిస్థితినిబట్టి అవసరాలనుబట్టి కొత్త కొత్త అంగాలు—కాళ్ళూ, చెవులూ, తోకలూ, కోరలూ యివన్నీ వచ్చాయి. అవసరాలనూ, ఆ యా జీవుల కోరికలనూబట్టి క్రమంగా కోరలులాటివి తగ్గడం జరిగింది. 'మనిషి దశ' వచ్చేసరికి చేతులుమంచి పరికరాలు కావడంతో తోలయొక్క అవసరం తగ్గిపోయింది. అవి పోయాయి. ఒక్కొక్కసారి అనిపిస్తుంది. ఆశా, కోరికా ముందుపుట్టాయా ? ప్రాణాలు ముందు పుట్టాయా ? అన్నంతవరకూ వెళ్తుంది ఆలోచన. ప్రాణి అంటూ ఒకటిలేందే కోరిక ఉండడానికి వీల్లేదు. నిజమే ! కానీ కోరికలేందే ప్రాణి ఎలా పుట్టినట్లు ?

పుట్టినప్పటినుంచీ ప్రతి ప్రాణికీ ఆశ ఉంటుంది. అదే దాన్ని నడుపుతుంది. ఆక్షణంనుంచీ — చనిపోయేవరకూ కొందరు ఏదో ఒకటి సాధిస్తూనే ఉంటారు. పుట్టిననాటినుంచీ ప్రయత్నించి చివరికి సాధించేది చావేనని కూడా కొందరు తిక్క వేదాంతులు అంటారు. సాధించదలచుకున్నది అదే గనుక అయితే అందులో తప్పేమీ లేదేమో. అందువల్ల ప్రశ్న "ఏది లక్ష్యం" అని కాదు. అసలు లక్ష్యం ఉందా అన్నదే. అది ఉంటే సాధించాలన్న ఆశ ఉంటుంది. ఆశను, కోరికను జయించాలన్నది కూడా ఆశే అవుతుంది !

ఈ ఆశలేకపోతే జీవితమే వ్యర్థం. అంతా నిరాశ, నిస్పృహ, నీరసం ఆవరిస్తాయి. శూన్యంగా కనుపిస్తుంది. అందువల్లనే ప్రతి జీవీ ఒక ఆశ పెట్టుకుంటుంది.అదిదీపంలా వెలిగించుకుంటుంది. అందుకే 'ఆశాజ్యోతి' అన్నారు. ఆ జ్యోతి వెలుగులో ముందుకు పోతారు.

బాలచంద్రుడిని యుద్ధానికి పోకుండా వెనక్కి లాగిందీ ఆశే ! తరువాత యుద్ధానికి పురికొల్పి ముందుకుతోసిందీ ఆశే ! ! అయితే మొదటిది — ఇంట్లో కూర్చుని సుఖపడాలన్న ఆశ. రెండోది తన సీమకోసం, గౌరవంకోసం పోరాడి, కీర్తి గడించాలన్న ఆశ. ఈ రెండూ దీపాలే. బాలచంద్రుడు మొదట ఆ దీపాన్నిచూసి అదే దారి అనుకున్నాడు.కాని మాంచాల రెండో దీపాన్ని—అంతకన్నా ప్రకాశవంతమైనదాన్ని చూపించింది.

ఖడ్గతిక్కన కథ కూడా యిలాటి నీతినే చెబుతుంది మనకి. తరతమాల తేడానే బోధ పరుస్తుంది. ఏది మంచిది ! ఏది యింకా మంచిది ? ఏది తప్పు అనేది మనం ఉండే పరిస్థితులనుబట్టి, మనస్తత్వాలనుబట్టి. మనం పెట్టుకునే రంగుటద్దాలనుబట్టి ఉంటుంది. అందువల్లనే మనం ప్రతిసారీ మన దృష్టి సరిగ్గా ఉందో, లేదో మన అద్దాలు నిజ రూపాలను చూపిస్తున్నాయో, లేదో తెలుసుకోవాలి. అద్దాలు మార్చిచూసి నిజాల అసలు రంగులు తెలుసుకోవాలి. మన కళ్లతో చూసినదాన్ని మరొకళ్ల కళ్లజోడ్లతోచూసి బొమ్మా బొరుసూ తెలుసుకోవాలి. ఆ తర్వాత ఆశాజ్యోతిని చూచుకొని ఆ దారిలో పోవాలి.

ఆ జ్యోతిని అలాగే ఉపయోగించుకోవాలి తప్ప, అత్యాశకుపోయి దానిమీదపడి మింగెయ్యాలని చూడకూడదంటారు పెద్దలు. అలా ముసిరినవారు — "దీపం దగ్గర పురుగులలాపడిపోతా"రని జీవితం అడుగడుగునా చెబుతూనే వుంది.

కొన్ని ఆశాజ్యోతులు నిజంగా ఆశాజ్యోతులు అయివుండవు. అవి—కొరివి దెయ్యాలంటారే — అవి చేత పట్టుకొనివూరేగే కొరివి కాగడాలు — మన అమాయకత్వాన్నిబట్టి, అవివేకాన్నిబట్టి అఖండ జ్యోతుల్లా కనబడిమనని ఆకర్షిస్తాయి — ఏ గోతిలోకో, నూతిలోకో !

ఇక్కడే యీ సరిహద్దులు నిర్ణయించుకోవడంలోనే, దీనికి అంచనాలు కట్టుకోవడంలోనే మనం తప్పటడుగువేస్తాం. కొందరం తెలిసివేస్తాం. కొందరం తెలియకుండా వేస్తాం. తెలిసి వేసినా తెలియక వేసినా ఫలితానికి జాలి ఉండదు. దీపాన్ని పసిపిల్లాడు ముద్దొచ్చి ముద్దెట్టుకున్నా, మూతి కాలక మానదు. ఆశ కూడా అంతే. అగ్నిలాంటిది. అణుశక్తిలాంటిది. దీన్ని మన సుఖానికీ, ఆనందానికీ మనతోపాటు లోక కల్యాణానికీ ఉపయోగించుకోడానికీ ఎంత అవకాశం ఉందో, మన నాశనానికి, మనతోపాటు లోక విధ్వంసానికీ ప్రయోగించగల ప్రమాదం అంతా ఉంది.


'వెలుగునీడలు'లో నాగేశ్వరావు

అందుకే తెలియక కొందరు దురాశపడి, దెబ్బ తింటారు. చిన్నప్పుడు విన్నకదొకటి గుర్తుకొస్తోంది ఒక బీద పిల్లాడు ఆకలితో వూరంతా తిరిగి తిరిగి ఏమీ దొరక్క చివరకు సత్రవుకు వచ్చాడు. అక్కడ ఏడుస్తూ ఒక స్తంభాన్ని కౌగలించుకుని నిలబడ్డాడు. అంతలో దారినపోయే యింకో కుర్రాడికిదిచూసి జాలేసింది. తన ఒళ్లో మర మరాలున్నాయి. ఇంద అని రెండు పట్టెళ్ళు బీద పిల్లాడి దోసెట్లోపోసి వెళ్లిపోయాడు. పిల్లాడికి చిక్కు వచ్చింది. ఖంగారులో స్తంభాన్నికౌగలించుకునే అలా దోసిలి పట్టాడు. స్తంభం లావు పాటిది. ఇపుడు మర మరాలు నోటికి అందవు. దోసిలి విడదీస్తే రెండు గుప్పిళ్ళు చేతికి వస్తాయికానీ, కొన్ని పడిపోతాయి. పిల్లాడికి ఆకలిగా వుంది. అన్నీ తినాలనివుంది. ఏమీ పాలుపోలేదు. దోసిలి అలాగే పట్టుకుని వాటికేసి ఆశగా చూస్తూ నిలబడ్డాడు. రివ్వున గాలి వీస్తోంది. చూస్తూ ఉండగానే దోసిట్లో మరమరాలు గాలికి ఎగిరి దుమ్ముతో కలిసి కొట్టుకుపోయాయి.

ఈ పిల్లవాడిది ఆశా ? దురాశా ? ? అది తెలిసి చేసిన తప్పా ? తెలిక చేసినదా ? వాడు ఒరుల సొమ్ము కోరలేదు. తన చేతిలో ఉన్నవన్నే తినాలని మాత్రం అనుకున్నాడు. ఆలోచిస్తే కఠినంగా వినిపించినా—దీనిని దురాశ అనాలేమో అనిపిస్తుంది. దీన్నె అలా అంటే — కుక్కా మాంసం ముక్కా అనే ఈసప్ కథలో తన ప్రతిబింబం నోట్లో మాంసం — మరో కుక్క నోట్లో వున్నదనుకొని మొరిగి లాక్కోపోయి ఉన్నది పోగొట్టుకున్న కుక్కను ఏమనాలో ? బంగారు గుడ్లన్నీ ఒక్కసారే దోచుకుని దాచుకోవాలని బాతును కోసిన వెర్రివాడి ఆశను ఏమనాలో ?

కొన్ని సందర్భాలూ, కొందరి విఫల ప్రయత్నాలూ చూస్తుంటే గుండె నీరయిపోతుంది. కొందర ఎంత ఆశతో, ఆత్మ విశ్వాసంతో ప్రయత్నించినా ఆ కార్యం నెరవేరదు. ఉట్టి సంబరాలలో ఉట్టి కొట్టడానికి పదిమందివిగిరితే ఒకడికే అందుతుంది. తొమ్మండుగురికి ఒళ్లు హూనం అయి కీళ్ళు పట్టేస్తాయి అంతే. కొందరికి ఫలితాలు దక్కుతాయి, కొందరికి పర్యవసానాలే మిగులుతాయి. ఈ రెండో రకం వాళ్ళు నిరాశతో కృంగిపోతారు. అదే—తగదని పెద్దలు చెబుతారు. జయాపజయాలూ, ఫలాఫలాలూ, మనకి కనబడినవే అయిఉండాలని లేదు. మనం యీరోజున మేలు అనుకున్నది, లాభం అనుకున్నది, సంతోషించినది—కీడు అనీ, నష్టం అనీ రేపు అనిపిస్తుంది. ఆ ఫలితాలను దూరం నుంచి చూచి నిర్ణయించుకోవా లేమో అనిపిస్తుంది. ఈరోజు కీడు జరగడమే మేలుకు దారి తీస్తుందని ఒక్కొసారి అర్థం అవుతుంది. అనుభవంమీద వే సీ

పాఠాలు నేర్చుకున్నాను. జీవితానికి సంబంధించి నంత వరకు ఎన్ని దెబ్బలు తిన్నా లొంగకూడదనీ, అపజయాన్ని అంగీకరించకూడదనీ నా నమ్మకం.


అలా అంగీకరించవలసినది తెలిసో, తెలియకో తప్పులు చేసినపుడే. 'మనిషి' అన్నాక 'తప్పులు' చేయకుండా ఉండలేడు. వెలుగు పక్క నీడ ఎలా ఉంటుందో ఆశ చాటున అత్యాశ ఎలా ఉంటుందో, న్యాయాన్యాయాలూ, ధర్మాధర్మాలు సత్యాసత్యాలూ యివన్నీ కలిసి మెలిసి ఉంటాయి. వాటిలో నిజంగా ఉండవలసిన వాటికి, ఉండాలని మనం కోరుకున్న వాటికీ ఎపుడూ సమరంజరుగుతూనే ఉంటుంది. అదే మన నిత్య జీవనసమరం.

పాపమని తెలిసీ, తెలీకొ పాపమే పుణ్యమని భ్రమపడీ ఎన్నో తప్పులు చేస్తాం. ఈ పాప పుణ్యాల 'బాలెన్స్ షీట్' ఎప్పుడో యమధర్మరాజు 'ఆడిట్' చేస్తాడనీ, తీర్పులూ, శిక్షలూ వేస్తాడనీ చెబుతారు. అప్పటి సంగతి ఎలా ఉన్నా యీలోపల మనం కూడా స్వయంగా విలువలు కట్టుకుని, సరిహద్దులు నిర్ణయించుకోకపోతే జీవితమే నరకమై పోతుంది—తరువాతి నరకం సంగతి అలా ఉంచి.

ఆశ లేకపోతే, కోరిక లేకపోతే యీ గొడవలన్నీ రావంటారు కొందరు. అలా ఉండబోయి ప్రయత్నం చేసి, దెబ్బతిన్నవారు, అణిగి, అణిగి, ఉన్న కోరికలు సముద్ర కెరటంలా ఒక్కసారి విజృంభించడంతో ఎగిరిపడి కొట్టుకుపోయినవారు ఎందరో ఉన్నారని మనకు చరిత్ర చెబుతోంది. ఎన్నో కథలు చెబుతున్నాయి. అసలు అలాంటిది నూటికో, కోటికో ఎవరో సాధిస్తారు. అంతా అలా చెయ్యలేరు. అంత కన్నా, సవ్యమైన ఆశలూ, న్యాయమైన కోరికలూ పెట్టుకుని, పెంచుకుని వాటికోసం కృషిచేస్తే మనకి ఆనందం, తృప్తి లభిస్తాయి. కోరికలను చంపడానికి చేసే యుద్ధం కన్నా వాటిని మంచి పద్ధతులకు మళ్ళించి, మచ్చిక చేసుకుని మనం లొంగి లొంగదీసుకోవడం మంచిది. అది సులభసాధ్యం.

మధ్యరకంగా—చాల తేలికైన కోరికలూ, కొద్దిపాటి ఆశలూ, పెట్టుకోవచ్చని కొందరు అంటారు. కొద్దిపాటి ఆశ లన్నవి అందరికీ ఒక్క మాదిరిగా ఉండవు. ఆయా మనుష్యులను బట్టి, వారి శక్తి సామర్థ్యాలను బట్టి ఉంటాయి. ఒకడికి బహు కొద్ది అయినది మరోడికి కొండంతలా వుంటుంది.

'ఉమర్ ఖయాం' కోరిక చాలా తేలికైన దంటారు. ఆయనకి రోజుకో రొట్టిముక్కా, సీసాలో కాస్త 'చుక్కా', పక్కనో చక్కని చుక్కా ఉంటే చాలట. ఎంత గడుసైన కోరిక ? ఆయనే అన్నా డనుకోండి, "ఇంతకన్నా స్వర్గ మెందుకని" ఎంతో చిన్నదిగా కనబడే గొప్ప కోరిక. నిజమే ! స్వర్గం కన్నా యిది సాధించడమే కష్టం. ఆయనకి వేళకి రొట్టెముక్కా, చుక్కా సరఫరా కావాలంటే అవి తయారు కావడానికి ఎన్నో వేలమంది బయట ప్రపంచంలో పని చెయ్యాలి. వాళ్ళు పని చెయ్యాలంటే, వాళ్ళకి తిండి పంపించేవాళ్ళూ, బట్టలు నేసేవాళ్ళూ, కుట్టేవాళ్ళూ, అవి ఎత్తుకుపోయే వాళ్ళూ, పట్టుకు దండించేవాళ్ళూ యింతమంది పని చెయ్యాలి.–ఒక్కమనిషి చిన్న కోరిక తీరాలంటే. లోకంలో ఏ ఒక్క మనిషి, ఒక్కడుగా ఒరుల



చిత్రకారుడు: 'మురళి' (గుంటూరు)

సహాయం, ప్రమేయం లేకుండా నిలబడలేడు. క్షణ క్షణం పీల్చే వూపిరిని 300 కోట్ల మందితో కలిసి పంచుకుంటున్నాడు. తిండి అందరితోనూ కలిసి తింటున్నాడు. అలాగే అతను ఏపని చేసినా దాని ప్రభావం నూతిలో కెరటంలా లోకమంతా ప్రత్యక్షంగానూ. పరోక్షంగానూ ఉంటుంది.

ఒక్కమనిషి ఆశపడి కీర్తికోసం చేసిన కృషివల్ల రైళ్ళొచ్చాయి. విమానా లెగురుతున్నాయి. రేడియోలు పాడుతున్నాయి. సినిమాలాడుతున్నాయి.. కావ్యాలొచ్చాయి. గానాలొచ్చాయి. అలాగే ఒక్క మనిషి ఆశవల్ల భయంకర యుద్ధాలు జరుగుతున్నాయి. ఒక్కడి నిర్ణయంతో లక్షలాది జనం మరణించారు. కోట్లాది బాధలుపడ్డారు. ప్రపంచం పెద్దదే గాని అంత చిన్నది అదే. జీవితం విశాలమైనదే గాని అంత యిరుకైనది అదే.

అందువల్ల ఒకరి జోలీ, జోక్యం, సాయం లేకుండా మన మట్టుకు మనం బ్రతుకుదా మనుకోవడం, బ్రతుకుతున్నా మనుకోవడం, బ్రతకగల మనుకోవడం—అమాయకత్వం,పొరబాటు. మనం అందరికోసం ఆశపడాలి. అందరికోసందురాశ కూడా పడాలి. లక్ష్యం మంచిదైనపుడు స్వార్థం ఎపుడూ తప్పదు. అది కొంతవరకు అవసరం.

అంతే తప్ప—అందరం ఆశలు చంపుకుని కూర్చుంటే లోకం స్తంభించిపోతుంది. అందరూ అనుకొనే పరమేశ్వరు డంటూ ఒక పెద్దమనిషి ఉంటే ఆయన 'లీల' కోసం మనల్ని తయారుచేసి ఆడించి వినోదిద్దామని తీరుబడిగా కూర్చున్నాక—మనం కోరికలూ, ఆశలూ చంపేసుకున్నామని చెప్పి జీవనరంగస్థలంపీద మఠాలు వేసుకుకూర్చుంటేఎంత ఎబ్బెట్టుగా ఉంటుంది ? మీరు నాటకానికి వెళ్ళి కూర్చున్నాక నటులు కూడా స్టేజీ మీద కుర్చీలు వేసుకుని మీకేసి చూస్తూ కూర్చుంటే ఏం బావుంటుంది ? జీవ న్నాటకమూ అంతే ! అది కష్ట సుఖాలతో, సుఖ దుఃఖాలతో, ధర్మా ధర్మాలతో, క్రమ అక్రమాలతో పాపపుణ్యాలతోలలాగ జరుగవలసిందే!

ఇందులో కుడి ఎడమలూ, మంచి చెడ్డలూ, ఏవి యేవో చూసుకుని మనకీ, తోటి వాళ్ళకీ కూడా మంచిచేసే లక్ష్యాలకోసం పాటుపడడం ధర్మం. మన ఆశయం గొప్పదిగా ఉంటే, సాధించేది సగమైనా ఉంటుంది. మనమూ మరి వందమందీ కాకపోతే, మనమూ, మరిద్దరైనా బాగుపడడం జరుగుతుంది. అందుకోసం నిత్యం సంగ్రామం జరగవలసిందే ! అందులో మనందరం సైనికులమే. గెలిస్తే గర్విస్తాం. వోడిపోయినా, పోరాడాము కదా అన్న తృప్తి ఉంటుంది. అసలు ఏమీ చెయ్యకపోతే మిగిలేది ఏమీ ఉండదు. అంచేత తోటివాళ్ళతో పోటి పడ్డట్టుగా మనం ఆశలు పెట్టుకుని ఉత్సాహంగా రోజూ వో పండు గన్నట్టు జీవించాలని నా నమ్మకం. ఈ పోటీలో ఒక ప్రత్యేకత ఉంది. మిగతా పోటీలలోలా ఏ యిద్దరి ముగ్గురికో బహుమతులు వచ్చి ఆగిపోవడం ఉండదు. పోటీలో పాల్గొన్నవా రందరికీ ఏదో ఒకవిధమైన బహుమతి ఉంటుంది—తారతమ్యాలు ఉండవచ్చు గాని, బహుమతి మాత్రం ఉంటుంది. మనం పెట్టుకునే రంగు టద్దాలను బట్టి దాని అందచందాలు కనిపిస్తాయి. దానిని చూసి మరింత గొప్పది సాధించాలన్న మరో ఆశతో ఆశాజ్యోతితో ముందుకు మరో సమరం ఆరంభిస్తాం. ★

మానవదేహశ్రేయ

దంతములు : వాటి సంరక్షణ

1 వ చిత్రంలో పై పళ్ళవరస, క్రిందిపళ్ళ వరస, ఎల్లా అనుకుని ఉన్నవో తెలుస్తుంది. గోడలో నాటబడిన సిమెంటు స్తంభముల లాగా పళ్లు దవడ ఎముకలలో నాటబడి ఉన్నవి. దవడలోనూ దాని పరిసరములలోనూ ఉన్న కొన్ని కండరములు చిన్నవీ పెద్దవీ కావడం వల్ల నములడం సాధ్యమవుతున్నది.

ముక్కులాగా చెవులలాగా పళ్లు జన్మతః వచ్చి ప్రవృద్ధిచెందే అంగములు కావు. దవడ ఎముకలలో పిండకాలంలోనే ఏర్పడే 'పంటి మొగ్గలు' (Tooth buds) క్రమంగా వృద్ధిచెంది శిశువుకు 6 మాసముల వయస్సు వచ్చిన తర్వాత 'పాలపళ్లు' వచ్చి-ఒక క్రమంలో రాలిపోయి, అసలు పళ్ళు మొలుస్తవి. ఒక్కొక్కప్పుడు పాలపళ్ళు మొలవడం కొద్దిగా ఆలస్యం కావచ్చును. ఏమైన $2\frac{1}{2}$ సంవత్సరముల వయస్సు వచ్చేటప్పటికి పాలపళ్ళన్నీ మొలుస్తవి. వయస్కులలో పైవరసలో 16, క్రింది వరసలో 16 మొత్తం 32 పళ్ళు ఉంటే పాలపళ్ళు 20 మాత్రమే మొలుస్తవి.

కొరికేవి, చీల్చేవి నమిలేవి అని పళ్ళను మూడురకములుగా విభజించవచ్చును. ప్రతి దవడలోను ఎడమప్రక్క రెండు,కుడిప్రక్క రెండు, పారలవంటి ఆకారముగల పళ్లున్నవి. వీటిని ఇన్సైజార్లు అంటారు. వీటి వెనక కొనదేరిన కోరపన్ను ఉన్నది. దాని వెనక రెండు చిన్న దంతము లున్నవి. ఆ చిన్న దంతముల వెనక మూడు పెద్ద దంతము లున్నవి. కోరపళ్లు చీల్చడానికీ, దంతములు నమలడానికీ పనికివస్తవి. ఈ విధంగా రెండు వరసలలోనూ 32 పళ్ళు గుర్రం లాడంలాగా ఏర్పడి ఉన్నవి (2 వ చిత్రము).

3 వ చిత్రంలో పంటిలో భాగములు చూపించబడినవి. ఇది నమిలేపంటి చిత్రము. ఏ పంటి నయినా, తల, నడుము, మూలము అని మూడుభాగములుగా విభజించవచ్చును. చిగురు పైన ఉన్నది తల, దవడ ఎముకలో నాటుకుని ఉన్న భాగము మూలము, కొరికే పళ్లకు, చీల్చేపళ్ళకు, మూలము ఒకటే ఉంటుంది. దంతములకు మూలములు రెండు, సకృత్తుగా మూడూ ఉంటవి. అందుచేత చిన్న పళ్ళు రాలడమూ పీకడమూ సులభంగా జరుగుతుంది. దంతముల విషయంలో అల్లా కాదు. ఏ కారణంచేతనయినా ఒక నమిలేదంతమును కావాలి. లేకపోతే మూలము పూర్తిగానో సగంగానో విరిగి దవడ ఎముకలో ఉండి పోతోంది. అది కుళ్ళి చీముపట్టి, దవడ ఎముకలోకు ఇన్ఫెక్షన్ ప్రాకుతుంది.

పంటితలలో రెండు పొరలున్నవి. పైన ఉన్నది అతికఠినమైన ఎనామెల్ పొర. దాని క్రింద డెంటైన్ అనే బొమికవంటి పదార్థముతో తయారయినపొర వున్నది. ఈపొర

డా॥ గాలి బాలసుందరరావు

క్రింద, మూలమువరకూ వ్యాపించివున్నది. తల లోపలిభాగము బోలుగా వుంటుంది. ఆ ప్రదేశంలో పంటిగుజ్జు (Pulp) ఉన్నది. ఈ పంటిగుజ్జులోకి, మూలములోవున్న నాళము ద్వారా, ఆర్టెరీ, వెయిను, నరముల శాఖలు పంటిగుజ్జులో ప్రవేశిస్తవి. పన్ను వృద్ధిచెందడానికి ఆరోగ్యముగా ఉండడానికి అందులో ఉన్న గుజ్జు ఆరోగ్యవంతమై ఉండాలి. ఇందుకు కావలసిన ఆహారపదార్థములను ఆర్టెరీ సరఫరాచేస్తుంది.

దంతమూలమునకు దవడ ఎముకకూమధ్య, పెరిడోంటల్ మెంబ్రేను అనే పొరవున్నది. దీని పైభాగమే చిగురుగా ఏర్పడి వున్నది. చిగురు రక్తపుష్కలమై, దానిమ్మగింజలాగా అందంగా వుంటుంది. చిగురు పంటిని అదిమి, కరుచుకొనివుండి ఆహారపదారములు ఏవీ అక్కడ ఇరుక్కోకుండా చేస్తుంది. ఏరకం దంతమయినా ఆరోగ్యస్థితిలో ఈ విధంగా ఉంటుంది.

దంతముల ముఖ్యవిధి ఆహారమును నమిలి ముద్దచేయడం. ఇదికాక శబ్దోత్పత్తిలో శబ్దోచ్చారణలో ఇవిసహాకరిస్తవి. పెదవులలాగే దంతములు సౌందర్యానికి సంబంధించిన అంగములు. దంతముల ఆకారము కొన్నివృత్తులలో అతి ప్రధానమైనది.

దంతవ్యాధులు ఇన్ఫ్లుయెంజాలాగా నాలుగు రోజులు ఉండిపోయేవి కావు. నోటిలో పున్న దంతములు అంగిలిలోవున్న టాన్సిలులు (Tonsils) క్రిమిదోషానికి గురిఅయితే, వాటినుంచి వచ్చే చీము-టాన్సినులు, ఆహార పానీయాదులద్వారా కడుపులోకి ప్రవేశించి, శరీరంలో అనేక వ్యాధులను కలిగిస్తవి. నోటిలో దుర్గంధం ఏర్పడి జీవితం నరక సమానం అయిపోతుంది. అందువలన దంతములను గురించి, వాటి వ్యాధులనుగురించీ కొంచెం విపులంగానే తెలుసుకోడం చాలా అవసరం.

పాలపళ్ళు:- నిరుపేదల ఇంట్లోనయినా, సంపన్నుల ఇంట్లోనయినా బిడ్డకు మొదటి పళ్లు రావడం చాలా ఆనందకరమైన విషయం. ముందు రెండుపళ్లు వచ్చిన ఆరు మాసముల పాపాయి ముత్తి కుందేలు మూతిలాగా ముద్దొస్తూ ఉంటుంది. పంటి మొగ్గలలో క్రమముగా కేల్షియం చేరి, పన్ను తయారవుతుంది. ఈ కేల్షియం చేరడం అన్ని దంతములలోనూ ఒకే కాలంలో జరుగదు. ఒక్కొక్క రకం పళ్లలో ఒక్కొక్క కాలంలో జరుగుతుంది. అదేవిధంగా అన్ని రకముల పాలపళ్ళు ఒకే కాలంలో మొలవవు. రెండు దవడలలోనూ ఒకే కాలంలో మొలవవు. అందరు పిల్లలలోనూ ఒకే కాలంలో మొలవవు. కాని, ఆ కాలవ్యత్యాసం విపరీతంగా ఉండకూడదు. తమ పిల్లలకు ఇంకా పళ్ళు మొలవలేదని అనేకమంది తల్లులు ఆందోళన పడుతూ ఉంటారు. ఆయా కాలములలో మొలవవలసిన పళ్లు మొలవకపోవడం శిశువు శరీర ప్రవృద్ధిలో, లోపములను సూచిస్తుంది. ఆ విషయం గమనించిన తల్లులు వెంటనే వైద్య సహాయం పొందడం అవసరం. సాధారణంగా పాలపళ్లు మొలవవలసిన కాలములను రాలిపోయే కాలములనూ యీ క్రింద వివరిస్తున్నాను.

	పైదవడలో	క్రింది దవడలో
మధ్య ఇన్సైజారులు (కొరికే పళ్లు) మొలిచే కాలము.	6 వ నెల నుంచి 10వ నెల మధ్య.	5 వ నెల నుండి 8 వ నెల మధ్య.
రాలిపోవడం.	7-8 సంవత్సరముల మధ్య.	6-7 సంllరాllల మధ్య.
ప్రక్క ఇన్సైజారులు.	8-12 నెలల మధ్య.	10-14 నెలల మధ్య.
రాలిపోవడం.	8-9 సంllల మధ్య.	7-8 సంllల మధ్య.
కస్పిడ్లు (కోరపళ్లు).	16-20 నెలల మధ్య.	16-20 నెలల మధ్య.
రాలిపోవడం.	11-12 సంllల మధ్య.	9-11 సంllల మధ్య.
మొదటి మోలార్లు (దంతములు).	11-18 నెలల మధ్య.	11-18 నెలల మధ్య.
రాలిపోవడం.	9-11 సంllల మధ్య.	10-12 సంllల మధ్య.
రెండవ మోలారులు.	2 -30 నెలల మధ్య.	20-30 నెలల మధ్య.

పాలపళ్ళయినా అసలు పళ్ళయినా దవడ ఎముకలపైన ఉన్న పొరలను చీల్చుకుని పైకి రావాలి. అంటే ఈ పొర ఎంత మృదువుగా, పలచగా ఉంటే పన్ను అంత తేలికగా పైకివస్తుంది. అలాగే పంటిలో క్లేల్షియం ఎంతబాగా చేరితే అంత త్వరగా మొలవడం జరుగుతుంది. నూటికి 99 మంది శిశువులలో యీపని ఏ బాధా ప్రమాదమూ లేకుండానే జరుగుతుంది. కాని కొంతమందిలో చాలా ఉపద్రవములు ఏర్పడతవి: ఆ ఉపద్రవముల నివారణ కని అజ్ఞానంతో అనేక ఘాతుకకృత్యములు, పొరపాట్లు చేయడం జరుగుతుంది. ఆ సంఘటనలను గురించిన కించిద్వివేకం ఉంటే అపాయములనుండి శిశువుల తప్పించడానికి వీలు కలుగుతుంది.

స్త్రీ స్తనాగ్రము కొంచెం గట్టిగా ఉంటుంది. బిడ్డ పాలు త్రాగేటప్పుడు దీనితో దవడ ఎముకలపై ఉండే పొరలకు రాపిడి ఏర్పడి అవిపలచబడతవి. ఆరోగ్యవంతురాలైన తల్లి పాలలో తగినంత క్లేల్షియం శిశులకు లభిస్తుంది. అందుకని స్తన్యపానం చేసే శిశువులలో, పళ్ళు తేలికగా, ప్రమాదములు లేకుండా మొలుస్తవి. ఇతర రకముల పాలుతాగే శిశువులలో, ఈ అవకాశం ఉండదు. డబ్బాపాలు త్రాగే బిశువులలో కూడా పాలపీక మరీమెత్తగా ఉండడం మంచిదకాదు. అందుకని అతి కఠినంగానూ ఉండకూడదు, మరీ కఠినంగా ఉంటే బిడ్డ బుగళ్ళలో అల్సర్లు (Ulcers) ఏర్పడతవి. పళ్ళు మొలిచేకాలములలో చేతి వ్రేలుకి లింటుగుడ్డ (Lint) గాని గాజు (Gauge) గుడ్డ గాని చుట్టుకొని, గ్లిసరిన్‌లో ముంచి, మృదులంగా చిగుళ్ళమీద రాస్తూఉంటే చిగురు పలచబడి బిడ్డపళ్ళు తేలికగా వస్తవి. ఇల్లా చేసినా పళ్ళు మొలిచేకాలంలో కొన్ని ప్రమాదములు ఏర్పడవచ్చు. అందువల్ల ఆనందించవలసిన ఆ తరుణంలో తల్లిదండ్రుల ప్రాణాలు తల్లడిల్లిపోవడం సంభవిస్తుంది. అప్పుడు సాధారణంగా యేర్పడే ప్రమాదములను వివరిస్తాను.

(1) ఆకలి మందగించడం.

(2) వయస్సుకు తగినట్లుగా బిడ్డ వళ్ళు చేయకపోవడం.

(3) విడువకుండా ఏడవడం.

(4) నిద్రపోకపోవడం.

(5) అజీర్తి.

(6) వాంతులు.


(7) భేదులు.

(8) జ్వరం.


(9) చిన్నబిడ్డగుణం. (Canvaltin)

(10) ఊపిరితిత్తుల వ్యాధులు.


(11) బిడ్డనరములు మెదడూ ఉద్రిక్తమునై, గుడ్లు పీక్కోడం, మెల్లకన్ను, కంటిగ్రుడ్లు గెండూ ముక్కువైపుకు రావడం



(1)



(2) (3)ఎ



(3)

లేదా ఏదో ఒకప్రక్కకు పోవడం. చేతులు కాళ్ళు బాదుకోడం.

(12) కాంతిభీతి, (బిడ్డ వెలుతురును సహించలేకపోవడం.)


(13) మూర్ఛలు.

(14) మెడ విరుచుకుని కొయ్యబారిపోవడం.

(15) శిరఃకంపనం, నేత్రగోళ్ళముల కంపనం. (తల కంపెడుస్తూ నిలకడగా ఉండక ఆడిపోవడం.)

(16) బుగ్గ ఎర్రగా కందిపోవడం.

పైకి భేదించుకునివచ్చే పన్ను బిడ్డ చిగురుమీద వత్తిడి చేసినప్పుడు చికాకు, భయమూ, ఉద్రేకము బిడ్డకుకలిగి విపరీతంగా ఏడుస్తుంది. ఆ ఏడుపు ఆకలి ఏడుపని, పదేపదే పాలు బట్టడం జరుగుతుంది పాలు త్రాగేటప్పుడు చిగురుమీద రాపిడి హాయిగావుండి బిడ్డ పాలు త్రాగుతుందికూడా. కాని ఒకమాటు కడుపులోకి పోయినపాలు జీర్ణమై ప్రేగుల్లోకి పోవడానికి మూడుగంటల కాలమయినా పడుతుంది. యీలోగా పాలు పడితే అజీర్ణం ఏర్పడుతుంది. అజీర్ణం ఏర్పడగానే వాంతులు భేదులు, కడుపునెప్పి, జ్వరం, చిన్నబిడ్డగుణం (కళ్ళు తేలవేసి ఒళ్ళు విరుచుకు



పోయి, బిడ్డకు ఊపిరి ఆగడం) ఎగ డుతుంది. బిడ్డకు అజీర్ణం రాగానే శ్వాసనాళములు ఇన్‌ఫ్లేం అయి బ్రాంకైటిస్ (Bronchtis) ఊపిరితిత్తులు ఇన్‌ఫ్లేం అయి నెమోనియా (Pneummonia) వస్తవి. ఆహారంసరిగ్గా జీర్ణం కానప్పుడు కొన్ని విష వస్తువులు తయారయి, నరములను మెదడును ఇరిటేట్ (Irritate) చేస్తవి. దానితో ఇతర లక్షణములు వస్తవి.

తనలోట్లో ఏదో చికాకు ఏర్పడగానే బిడ్డకు భీతి ఏర్పడి నరముల ఉద్రిక్తత ఏర్పడుతుంది.

చర్మంగానీ, మ్యూకస్ మెంబ్రేన గానీ, చీలినప్పుడు 'హిస్టమైన్' అనే పదార్థం శరీరంలో ఉత్పత్తి అవుతుందని ఇదివరకే చెప్పాను. శరీర ధర్మములపై హిస్టమైన్ ప్రభావం అనేక విధములుగా ఉంటుంది. పళ్ళు మొలిచే సమయంలో ఏర్పడే చాలా లక్షణములు హిస్టమైన్ ఉత్పత్తివల్ల కావచ్చు.

శరీరంలో కేల్షియం, దంతములు, ఎముకలు గట్టిపడడానికే కాక, నరముల ఉద్రిక్తతను నరముల ద్వారా శరీరంలో కండరముల ఉద్రిక్తతను తగించడానికి చాలా అవసరం. మెడవిరుపు, శరీర కంపనం ఇటువంటి లక్షణములు చాలా కేల్షియం తక్కువై రావచ్చును.

మూర్ఛవ్యాధి కొన్నికుటుంబముల పిల్లల్లో పళ్ళు మొలిచే కాలంలో ఆరంభించి లక్షణాపన్ను మొలవగానే ఆగిపోతుంది.

శరీరంలో కేల్షియం తక్కువైతే, రికెట్సు అనే వ్యాధి వస్తుంది. ఆవ్యాధిలో ఎముకలు దృఢంగా ఉండక వంగి శరీరం వికృతం అయిపోతుంది. మొలవవలసిన సమయానికి

మనమూ–మనదేహస్థితి

పళ్ళు మొలవకపోవడం, రికెట్సు వ్యాధికి అంకురార్పణ కావచ్చు. రికెట్సు ఏర్పడ్డ తర్వాత పళ్ళు మొలవడంగండమే అవుతుంది. ఆవిధంగానే మూర్ఛలు, కండరములు బిగుసుకుపోవడం, 'టెటనీ' (Tetany) అనే వ్యాధిలో కూడా ఏర్పడుతవి మెదడు పొరలు వాచి ఏర్పడే 'మెనింజైటెస్' (Menungitis)అనే వ్యాధిలోనూ ఏర్పడుతవి. ఈ లక్షణములు ప్రాణాంతకములు కావచ్చు ఇవి ఏర్పడగానే శీఘ్రంగా వైద్యసహాయంపొందడం అవసరం.

పై విషయాలు పరిశీలిస్తే, పళ్ళు మొలిచే కాలంలో ఏర్పడే ప్రమాదాలకు (1) అజీర్ణము (2) కేల్షియం లోపము (3) నరముల ఇరిటేషను ముఖ్య కారణములని తెలుస్తున్నది.

ఇందులో అజీర్ణము గాకుండా చేయవలసిన బాధ్యత కేవలం తల్లులది. ఒకసారి పాలు ఇచ్చినతరువాత, కనీసం మూడుగంటల వ్యవధి లేనిదే మళ్ళీ ఇవ్వరాదు. ఇతరసమయాల్లో బిడ్డఏడిస్తే, కాచిచల్లార్చిన నీళ్లు పాలసీసాలో పోసియిస్తే బిడ్డ చప్పరిస్తూ పడుకుంటుంది. బిడ్డ ఏడుపు ఆకలివల్ల నే కాదని వెంటనే తెలుస్తుంది. ఇందువల్ల చిగుళ్ళుకూడా పలచబడతవి. ఆరోగ్యంతో ఉన్న బిడ్డకు రోజు రెండుమార్లకన్నా విరోచనం కారాదు. లేత పసుపువర్ణంతోనో, గోధుమవర్ణంతోనో బిడ్డ విరేచనం గట్టిగా చిలగడదూపంవంటి ఆకారం కలిగిఉండాలి. తెలగా పలచగా విరేచనం, లివరుజబ్బులలో, పసరుగాలక ఏర్పడుతుంది. అజీర్ణంలోనూ ఏర్పడుతుంది. అతికఠినమైన విరేచనంకూడా అజీర్ణానికే దారితీస్తుంది. ఇందువల్ల చిన్నబిడ్డ నొప్పి తేలికగా ఏర్పడుతుంది. అజీర్ణ లక్షణములుఏర్పడగానే,బిడ్డకు లిక్విడ్ టాకాడయాస్టేజు (Liquid Taka ıastsae Park Davis & Co) గాని,(2) కేరిపెప్టిక్ లిక్విడ్ (Carı Peptıc Liquide), గాని 5 నెలల బిడ్డకు 10 చుక్కలు, చెమిచా నీళ్ళలో కలిపి ఆహారం ఇచ్చినతరవాతయిస్తే జీర్ణమౌతుంది. ఇవి చాలా ఉపయోగకరములయిన మందులు. ఏప్రమాదములేని మందులు. చిన్నవారు పెద్దవారు ఉపయోగించదగినవి. ప్రతి యింట్లోను ఉండవలసినవి. 5వ నెల తరవాత ప్రతినెల వయస్సుకు ఒకటి చుక్కలు అధికంచేసి ఇవ్వవచ్చును.

కడుపులో గాలిచేరి బిడ్డకు కడుపులో నెప్పి వస్తే, పొట్టకు పలచగా ఆముదంరాచి, వేడి నీళ్లు సీసాలోపోసి, దానికి ఒక తువ్వాలు చుట్టి పొట్టకు కాపడం పెట్టడం మంచిది. ఎక్కువ వేడివుంటే పొట బొబ్బలు పొక్కుతుంది. తగిన మోతాదులో గ్రైప్ వాటర్ వాడవచ్చును. ఇందువల్ల గాలి తగ్గుతుంది.

నరములు, మెదడు, ఉద్రిక్తము లయినందువ వచ్చే లక్షణములకు గృహవైద్యం ఎంతమాత్రమూ కూడదు. ఈ లక్షణములు అతి భయంకరములుగా కనుపించినా, తగిన వైద్యంతో తేలికగా నివారించదగినవి. ఇందులో మెడ విరుపు, చిన్నబిడ్డ ఒణం ప్రాణాంతకములు కావచ్చు. కాని చిన్న బిడ్డఒణం రాగానే ప్రాణరక్షణ హేతువైన గృహవైద్యం ఒకటే. అది గ్లిసరిన్ ఎనీమా, (Glycerine Enema) ఇవ్వడం. చిన్న బిడ్డ లక్షణములు కనబడగానే డాక్టరుకు కబురుపంపి, అతను వచ్చేలోగా విరేచనం అయ్యేటట్లు చూడడం మంచిది. పిల్లలున్న ప్రతియింటిలోనూ గ్లిసరిన్ ఎనీమాసిరింజి ఉండితీరాలి. ఒకటి రెండు చెమిచాల గ్లిసరిన్‌కు అరఔన్సు నీళ్లుకలిపి, సిరింజి మొనకు వేస్‌లైన్ రాసి, ఎనీమాగా యివ్వడం ప్రతివారూ నేర్చుకోవాలి. గ్లిసరిన్ విరేచనం కదిలించుతుంది. అంతేకాదు, ప్రేగుల్లో ఉండే విషపదార్థములను అది తనలోకి గుంజుకుంటుంది. అందుకని అదే పనిగా యివ్వరాదు. గ్లిసరిన్ ఎనిమా సిరింజి లేనిచోట, అది ఉపయోగించడం చేతకానిచోట, బట్టల సబ్బుముక్క సన్నగా మొన దేరేటట్లు చేసి నీళ్లలోముంచి ముడ్డిలోపలికి తోస్తే విరేచనం అవుతుంది. కాని ఇది పెద్దదిగా చేస్తే అదీ ఇరిటేట్ చేసి బిడ్డ ఇంకా ఏడుస్తాడు. ఇది అత్యవసర పరిస్థితులలో అవలంబించ వలసిన చర్య! కొందరు బిడ్డకు

(94వ పేజీ చూడండి)

ప్రేమించిన పడతి

(83-వ పేజీ తరువాయి)

అన్నట్లు తలవూపి, "యీాయనెవరు ?" అన్నట్లు మధువైపు చూసింది.

"మన శంకరమే ! చిన్నప్పుడు మనందరం కలిసి ఆడుకునేవాళ్లంకదూ ! నువ్వప్పుడు చాలా చిన్న దానివిలే ! మరిచిపోయుండవచ్చు ! 'ఒరేయ్ ! మా శారదరా' ! అని మధు ఒకరికొకరిని పరిచయం చేశాడు. ఇన్నాళ్లకు, మొదటిసారిగా ఆ నాలుగు కళ్ళూ కలుసుకొన్నాయి. ఇద్దరి ఆలోచనలూ షుమారు పది సంవత్సరాలు వెనక్కు పోయాయి.

ఆరోజులే వేరు. అటువంటి రోజులు మళ్లీ యెప్పుడూ రావు. చిన్నప్పుడు శారదకు శంకరమంటే యెంత యిదో ! క్షణమయినా అతన్ని విడువకుండా అతనివెంటే తిరుగుతూ వుండేది. ఆటల్లోకూడా శారద శంకరం జట్టే. ఎప్పుడైనా మధు కోపంతో శారదను కొట్టటానికివస్తే, శారద భయంతో పరుగెత్తుకుంటూవచ్చి "శరణు—శరణు" అంటూ శంకరం వెనుక నిలబడేది ధైర్యంగా.అతని వెనుకవుంటే చాలు, తనకేమీ భయంలేదని ఆ పిచ్చిపిల్ల నమ్మకం కాబోలు. ఇంతలో ఒగర్చుకుంటూ పరుగునవచ్చి 'లేవరా ! లే ! ఇవ్వాళ్ల దాన్ని చీరెయ్యాలి' అంటున్న మధుతో శంకరం యుద్ధం చేసేవాడు.ఆ యుద్ధంలో మధు వోడిపోయేవాడు. అంతవరకు సంతోషంతో కేరింతాలు కొడుతూండే శారద, మధును క్రింద పడదోసి, పైన కూర్చున్న శంకరం వీపుమీద ఒకటి అంటించి పారిపోయేది. అప్పుడు శంకరానికి తగని కోపమొచ్చి, వాడినొదిలేసి శారదవెంట పరుగెత్తేవాడు. అబ్బ ! చిన్నప్పుడు శారద యెంత వేగంగా పరుగెత్తేదో ! శంకరాన్ని యింటిచుట్టూ పరుగెత్తించి, ముప్పతిప్పలు పెట్టేది. అయినా శంకరం పట్టుదలగా ఎట్లాగో చిట్టచివరకు శారదను పట్టుకొనేవాడు. అతని చేతుల్లో పట్టుపడ్డ శారద, తన విశాలమైన కళ్ళతో అతనివైపు జాలిగొలిపేటట్లు చూస్తూ, 'యింకెప్పుడూ నిన్ను కొట్టనుగా ! మరి నన్నేం చెయ్యకేం' అంటూ గట్టిగా రెండు చెంపలూ వేసుకొంటుంటే శంకరం కోపం 'టప్'మని యెగిరిపోయేది. 'కొంటెపిల్లా' అని నవ్వుతూ శారద బుగ్గను అతిసున్నితంగా గిల్లేవాడు శంకరం. నెప్పేమీ లేకపోయినా 'అబ్బ' అని అతను గిల్లినచోట చెయ్యి పెట్టుకొనేది శారద అతని కళ్ళల్లోకి చూస్తూ.

గతమంతా ఒక్కసారి స్మృతిలోకి రాగానే యేదో లోకంలోనున్న శారదచెయ్యి అప్రయత్నంగా ఆమె చెంపమీదకు వెళ్లింది. ఇంతలో 'బస్' వచ్చి పెద్దగా రొద చేసుకొంటూ ఆగిన చప్పుడుకు యీ లోకంలోకివచ్చి, శంకరం తనను చూసి చిరునవ్వు నవ్వుతుండటం గమనించి, కొంచెం సిగ్గుపడి గభాల్న చెంపమీది చేతిని తీసేసుకొంది శారద వచ్చే నవ్వును బలవంతాన ఆవుకొంటూ.

మధుకు వీళ్ల భాగోతమేమీ పట్టలా. అతను, 'వాడెప్పుడొస్తాడా ? అసలు వాడెట్లా వుంటాడు ? తనకంటే బలవంతుడా ? ఎంత బలవంతుడైనాసరే శంకరం కూడా వున్నాడుగదా ! ఇద్దరం కలిసి వాడికి బుద్ధి చెప్పలేమా ?' అని ఆలోచిస్తున్నాడు.

"అమ్మాయ్ ! ఇంక యివ్వాళ వాడు రాడేమోలే ! ఈరోజున వాడి జాతకం బాగుంది. ఇంక నువ్వు మ్మాటుకెళ్ళు" అన్నాడు మధు కాసేపు చూసి.

"అవును. ఇవాళ నా జాతకం బాగుంది" అనుకున్నాడు శంకరం మనస్సులో. అయినా శారద పొరపాటున నోరు జారుతుందేమోనన్న భయం ఒకపక్క పీకుతూనేవుంది.

"ఇంకేం వెళ్తానన్నయ్యా ! టైముకూడా అయిపోయింది. రా యింటికిపోదాం" అంది శారద మధుతో శంకరం వైపుచూస్తూ.

"నేను యీ బస్‌లో వెళ్తారా" అంటున్న శంకరం చెయ్యి పట్టుకొని "ఒరేయ్! మనం యెన్నాళ్లకెన్నాళ్లకు కలిశాం ! ఎన్ని సంగతులు మాట్లాడుకోవాలి ! రారా మాయింటికి పోదాం" అని తమతోపాటు వాళ్లింటికి తీసికెళ్లాడు మధు.

ఇద్దరు ప్రియస్నేహితులూ తమ చిన్ననాటి సంగతులూ, తమ ప్రస్తుత పరిస్థితులూ మొదలైనవన్నీ మాట్లాడుకుంటున్నారు. ఇద్దరూ ఒకటో క్లాసునుండి మూడో ఫారంవరకు కలిసే చదువుకున్నారు. ఇద్దరికీ చిన్నప్పుడు ప్రాణస్నేహం. ఆతర్వాత మధూవాళ్ల నాన్నకు బెజవాడనుండి యెక్కడికో బదిలీఅవటంవలన యిద్దరి స్నేహమూ తెగిపోయింది. ఆరోజున అనుకోకుండా శారదమూలంగా యిద్దరూ కలుసుకొన్నారు.

మధుతో మాట్లాడుతున్నాడన్నమాటే గాని, శంకరం మనస్సంతా శారదమీదే వుంది. చిన్నప్పుడెంతో అల్లరిచేస్తూ, "చిలిపి పిల్ల" అని అందరిచేతా అనిపించుకున్న శారద యిప్పుడు చాలా మారిపోయింది. అవును ! ఎందుకు మారిపోదు. అప్పుడు శారదకు ఆరేళ్లో, యేడేళ్లో వుండేవి. ఇప్పుడు సుమారు పదిహేడు. అబ్బ యేమి వయస్సు, యేమి అందం ! ఆ అందాన్ని యే విధంగా వర్ణించాలో అతనికి తెలియలేదు."

ఈ ఆలోచనలలోనున్న శంకరం మధువేసే ప్రశ్నలకు అన్యమనస్కంతో జవాబు లిస్తున్నాడు.

"ఓరేయ్ ! నీకు పార్వతి గుర్తుందా ? ఒకసారి ఆ అమ్మాయిని ఆటల్లో మనం యేడిపించామని మన మీద డ్రిల్లుమాస్టారితో రిపోర్టుచేస్తే ఆయన మనిద్దర్నీ పేంబెత్తంతో కొట్టాడు" అన్నాడు మధు.

"గుర్తుంది' అన్నాడు శంకరం యేదో ఆలోచిస్తూ.

"నువ్వు యేమన్నా మారావా ? లేకపోతే చిన్నప్పటిలాగానే అమ్మాయిలను యేడిపిస్తున్నావా ?"

"ఊ...."

"వాళ్ల వెనకాలే తిరుగుతున్నావా ?"

"ఊ...."

ఇద్దరికోసమూ కాఫీలు తీసుకువచ్చిన శారద వీళ్ల సంభాషణవింటూ విరగబడి నవ్వసాగింది. మధుకూడా నవ్వాపుకోలేకపోయాడు. వాళ్లిద్దరూ యెందుకు నవ్వుతున్నారో తెలియకపోయినా శంకరం వాళ్లననుసరించాడు.

"ఒరేయ్ దీర్ఘనాశికా ! ఏదో ఆలోచిస్తూ సమాధానాలు సరిగ్గా యివ్వవేం ? అసలు నువ్వేమాలోచిస్తున్నావంట" అన్నాడు మధు కాఫీ త్రాగుతూ.

"నేనేమీ ఆలోచించటంలేదుగాని నువ్వు దయచేసి ఆ పేరుతో మాత్రం పిలవొద్దు. ఆడపిల్ల దగ్గర పరువు తీస్తావేంరా సన్నాసీ" అన్నాడు శంకరం నవ్వుతూ.

"అబ్బాయిగారి కింకేం పనుంది. ఎవరో అమ్మాయినిగురించే ఆలోచిస్తుండాలి. లేకపోత అంత పరధ్యాన్నమేంటి" అంది శారద కల్పించుకొని శంకరం వైపు చూసి దోరనవ్వుతో.

"శారద మాట్లాడుతుంటే కోటి వీణలు ఒక్కసారి మ్రోగుతున్నట్లనిపించింది శంకరానికి. కొద్దిగా సిగ్గుపడి 'అబ్బే ! అదేం లేందండి" అన్నాడు శారద వైపు తిరిగి.

"ఏమండోయ్ ! నేను మీకంటె చిన్నదాన్ని. అదీగాక చిన్నప్పటి పరిచయం కూడా వుంది. కాబట్టి దయచేసి నన్ను 'అండీ' అని మాత్రం సంబోధించకండి" అంది శారద.

"ఎంతయినా మనస్నేహం చిన్నప్పటిదేగా ! అదీగాక మీరుకూడా నన్ను మర్యాదగా పిలుస్తున్నప్పుడు నేను మిమ్మల్ని యేకవచన ప్రయోగం చెయ్యటం...."

"ఇది మరీ బాగుంది ఎంత చెడ్డా మీరు నాకన్నా పెద్దవాళ్లుగా. అందుకనైనా మిమ్మల్ని నేను మర్యాదగా పిలవాలి" అంది శారద అతన్ని మధ్యలోనే ఆపేసి.

"ఐతే నేను చెడ్డవాడినన్న మాట"

"అనెవరన్నారూ"

"ఇప్పుడనలా"

ఒకరు ఏమండోయ్! చూశారా-మొన్న మా పెరటి దొడ్లో తవ్వుతూంటే ఏ కాలం నాటివో టెలిఫోన్ తీగెలు కనిపించాయి. అంటే మా పూర్వికులు టెలిఫోన్ ఉపయోగించేవారన్న మాట.

మరొకరు: మా పెరట్లో టెలిఫోన్ తీగెలు కనుపించలేదు. మా పూర్వికులు మీ వాళ్ళకన్నా గొప్పవాళ్ళు. వైర్లెస్ వాడేవారు.

* * *

ఒకరు—తెల్లవారిన తర్వాత అందరు తలో ప్రక్కకుపోతారు-ఎందుకనో?

మరొకరు—ఏ మీ లేదు— అందరుహూ ఒక ప్రక్కకే పోతే బరువు ఎక్కువై భూమి ఒరిగి పోతుందని.

మందలపర్తి భుజంగరావు (భీమవరం)

"నేనేమీ అనలా"

"ఒరేయ్! నువ్వు చాలా మంచివాడివేరా! ఆ సంగతి నీ ముఖమే చెప్తోంది. ఇంక వాదం చాలించండి" అన్నాడు మధు నవ్వుతూ.

అనుకోకుండా తామిద్దరూ యీ విధంగా మాట్లాడుకున్నందుకు యిద్దరూ సిగ్గుపడ్డారు.

ఆ తర్వాత శంకరం వాళ్ళింటి కెప్పుడూ వెళ్ళలేదు గాని, శారద మాత్రం అప్పుడప్పుడు బస్‌లోనో, బస్ స్టాప్‌లోనో, గుళ్ళోనో కనబడేది. ఇద్దరూ కళ్లతోనే యేమోమో మాట్లాడుకొనేవారు.

గతమంతా తల్చుకొంటున్న శంకరానికి కన్నీళ్లతో దిండంతా తడిసిపోయింది. "తాను శారదనెంతగా ప్రేమిస్తున్నా, ఆ సంగతి ఎవరితోనూ చెప్పలేదు. ఒకవేళ చెప్పినా తాను నవ్వులపాలు కావలసిందే తప్ప లాభం శూన్యం. తాను శారదకు తగినవాడు కానని అందరి అభిప్రాయమూనేమో! నిజం కూడా అంతేనేమో! అయినా, శారద ప్రవర్తనను బట్టి, ఆమె చూపులనుబట్టి శారద కూడా తనను ప్రేమిస్తోందేమోనని అనుమానంగావుంది. ఒకవేళ శారద కూడా యిదేవిధంగా తనలాగానే బాధను హృదయంలోనే యిముడ్చుకొని, చెయ్యగల్గిందేమీలేక మిన్నకుందేమో...."

ప్రేమించిన పడతి

ఈ ఆలోచనలతో తెల్లవార్లూ నిద్ర పట్టలేదు శంకరానికి. "నేను శారదను యింత యిదిగా యెందుకు ప్రేమించాలి. ప్రేమించటం తప్పా! నా జీవితమంతా శారదా నామస్మరణతోనే గడపాలా! ప్రేమ ఫలమే ఖేదమా?" అనుకున్నాడు శంకరం.

* * *

మధు వచ్చిన మూడోనాటి సాయంత్రం, అతన్ని సాగనంపటానికి స్టేషన్‌కెళ్ళాడు శంకరం. బండి బయలుదేరటానికి యింకా టైముంది. మధు సిగరెట్ కాలుస్తూ, "ఒరేయ్ శంకరం దేముని దయవల్ల మా శారదకు యీ సంబంధం ఖాయమైనట్లే. నేను కూడా త్వరలోనే వివాహమాడబోతున్నాను. నీక్కూడా యేవో సంబంధాలొస్తున్నాయటగా! నిన్న నీ అమ్మగారు అన్నారులే. కాని నువ్వు 'నేనసలు పెళ్ళే చేసుకోనని, సంబంధాలేవీ చూడవద్దనీ అంటున్నావటగా. నీ అమ్మగారు నిన్నుగురించి చాలా బెంగెట్టుకొంటున్నారు. అయినా నువ్విట్లా అయిపోతున్నావేంటి! కొంపదీసి ప్రేమలోగాని పడలేదుగదా! ఇంకా యెన్నాళ్లు యిట్లా బ్రహ్మచారిగా పడివుంటావు? ఎవర్నో ఒకర్ని కట్టుకో. నీ అమ్మగారి మనస్సు కాస్త కుదుటపడుతుంది" అని ఒక చిన్న ఉపన్యాసం యిచ్చాడు.

అతని యీ ఉపన్యాసం వింటుంటే శంకరానికి చిర్రెత్తుకొచ్చింది. "ఏడిశావులేరా" అని మనస్సులో అనుకొని, ఏడవలేక చిన్న నవ్వోకటి పారేశాడు చిరుహాసంగా శంకరం.

ట్రయిను వేగంగా ముందుకు తీసుకుపోతుంటే మధు చివరిసారిగా "ఒరేయ్ తప్పకుండా పెళ్ళి చేసేసుకో. నన్ను మాత్రం పిలవటం మరచిపోకు సుమా" అని హెచ్చరిస్తూ వెళ్ళిపోయాడు. శంకరం భారంగా యింటివైపు నడిచాడు.

శంకరం యింకా నిద్రపోవటం లేదని గ్రహించిన వాళ్ళమ్మ "ఏరా ఆ అబ్బాయి వెళ్లిపోయాడా" అంది.

"ఆ...."

"మధ్యాహ్నం మనింటి కొచ్చాడులే. వాళ్ల చెల్లెలికి యేదో సంబంధం వుంటే చూసిపోదామని వచ్చాట్ట. ఆ అమ్మాయిని నువ్వుకూడా చూశావటగా! బాగుంటుందా?"

అసలే చిరాకుగా వున్న శంకరానికి యీ మాటలతో కోపమొచ్చింది. అయినా "అమ్మ గదా అని తమాయించుకొని "యేం బాగులే! ఏడ్చినట్లుంటుంది యింతలావుగా" అన్నాడు. ఆతర్వాత 'యింత మాట యెట్లా అన్నానా' అని తనకే ఆశ్చర్యమేసింది. "శారదంటే నా కెందు కింత కోపమొచ్చింది. పాపం ఆ అమ్మాయేంచేస్తుంది" అనుకున్నాడు మళ్లీ శంకరం.

"అయితే ఆ అమ్మాయి అంత బాగుండదన్న మాట. మరి అతను ఆ అమ్మాయిని గురించి తెగ పొగిడేశాడే! నేనప్పుడే అనుకున్నాలే ఆ అమ్మాయి అతను చెప్పినంత బాగుండదని. అయినా 'ఫోటో'లో బాగానేవుంది కదరా! అయితే రేపే వాళ్ళకి వుత్తరం రాస్తానుండు "మీ అమ్మాయి మా వాడికి నచ్చలేదుట"' అని...."

ఆమె యీ విధంగా అంటుంటే శంకరానికి మతిపోయినట్లయి "యేమిటే నువ్వనేది" అని పొలికేక పెట్టాడు.

"ఏం లేదురా! ఆ అమ్మాయి నీకు కూడా నచ్చిందనీ, నన్నోకసారివచ్చి పిల్లను చూసివెళ్లమనీ ఆ అబ్బాయి చెప్పి వెళ్లాడు. నీకు నచ్చనప్పుడు నేను కూడా వెళ్ళిచూడటమెందుకంట దండుగ. వుత్తరం రాసిపారేస్తే పోలా"

శంకరం ఈ దెబ్బకు తట్టుకోలేకపోయాడు. గుడ్లు అప్పగించి తల్లివంక చూడసాగాడు.

అతని వైఖరి చూచి ఆ తల్లి కంగారుపడలేదు. నవ్వుకొంది.

"పిచ్చినాయన" అనుకొంది.

"నీకు ఇష్టంలేదు కనుక చూడను...."

"అమ్మా" అన్నాడు శంకరం.

"ముహూర్తం పెట్టిస్తానులే" అంది ఆ తల్లి.

వాడిగుండె పీచు పీచుమంది. వాడి చెయ్యి పక్కనున్న సంచీమీద పడింది. సంచీలో రబ్బరుబొమ్మ కీచుకీచుమంది. ఫరవాలేదు. రైలు వచ్చేస్తుంది. ఎక్కి యింటికి వెళిపోవచ్చు. తను పిన్నితో ఎన్ని సార్లు ప్రయాణం చెయ్యలేదు గనక? కిష్టుడు కన్నీళ్లు తుడుచుకుని రబ్బరుబొమ్మని దగ్గిరగా తీసుకుని ముద్దెట్టుకున్నాడు.

ఈ బొమ్మ ఎవరిదీ?

ఈ సొమ్ము ఎవరికీ?

సరిగ్గా ఆరు నెలల క్రిందట...

* * *

దుర్భరమైన జీవితాన్ని ముందుకి లాగుకుంటూ, తోపుడు బండిని తోసుకుంటూ కిష్టుడు ఆలోచిస్తున్నాడు. నిస్సహాయమైన ఆత్మాభిమానంతో బ్రతుకులోనూ ఆరోజే మొదటి సారిగా వాడి మనసు ఎదురు తిరిగింది. వాడి సహనం దెబ్బతింది. అమాయకంగా అయోమయంగా ఆకాశంవైపు చూసి 'అమ్మా' అని ఆనాడే వాడు మొఱ పెట్టుకున్నాడు.

ఆవాళ బజారు పని చేసి యింటికివస్తూ దార్లో మోళీ చూస్తూ కూచున్నాడు. అందరితోపాటు వాడూ చప్పట్లుకొట్టేడు. అంతా అయిపోయిందాకా అయిపోయిందేవిటో వాడికి తెలీలేదు. దాంతో యింటికి పరుగు లంకించుకున్నాడు. దార్లో పడ్డాడు. గట్టి దెబ్బే తగిలింది. ఆలస్యం అయిందని యింటికి వెళ్లగానే పిన్ని వంద గుంజీలు తీయించింది. దెబ్బ తగిలిందని తియ్యలేకపోతే కొట్టింది. దెబ్బకూడా ఆ దెబ్బమీదే తగిలింది. అయినా ఆవిడ వదల్లేదు. పాపాయిని పడుకోబెట్టి తోపుడు బండి చేతికిచ్చి షికారు తీసికెళ్ళమంది.

తోపుడు బండి పక్కన ఇసుకలో కిష్టుడు తలకింద చేతులు పెట్టుకుని వెల్లకిలా పడుకుని హృదయవిదారకంగా అన్నీ చూశాడు. ఆకాశంలో పోటీపడుతూ ఎగురుతున్న నల్లని మబ్బులూ తెల్లని కొంగలూ చూసి ఆశపడ్డాడు. ఆకుపచ్చని ఆకులూ ఎఱ్ఱని పువ్వులూ చూసి అసూయ పడ్డాడు. పసుప్పచ్చని జాకెట్టూ నీలంరంగు పరికిణీ కట్టుకుని తన పక్కనే గిరగిరాలు తిరుగుతున్న చిన్నపిల్లని చూసి ఆక్రందన చేశాడు. సహించలేని ఆకలితో వాడి మనసు ఆవురు మంది. భరించ లేని వేదనతో వాడి మనసు బావురుమంది.

కిష్టుడు లేచినిలబడ్డాడు. అగాథమైన ద్రంలో వాడికి అమ్మ కనిపించింది. ఆ చల్లని తల్లిలోనే వాడికి స్థానం అనిపించింది. లేచి గబగబా నది వైపు నడిచాడు. రెండడుగులు నీళ్లలోకి దిగేడు.

'క్యారు, క్యారు'మని పాపాయి ఏడుపు వినిపించింది.

కిష్టుడు ఆగేడు–వెనక్కి చూసి ఆశ్చర్యపోయాడు.

తోపుడు బండిలోంచి పాపాయి కిందకి ఎలా దిగేడో దిగిపోయాడు. తన వైపు

పాకి కిష్టుడు

(23-వ పేజీ తరువాయి

మెల్లిగా పాకి వస్తున్నాడు. ఏడుస్తున్నాడు. చెయ్యెత్తి పిలుస్తున్నాడు.

కిష్టుడు పరిగెత్తుకువచ్చి పాపాయి నెత్తుకున్నాడు. ఒళ్ళంతా యిసక. తలనిండా యిసక...నోట్లో ముక్కులో కూడా యిసక. కిష్టుడు చొక్కా పెట్టి వాణ్ణి దులిపేడు.

పాపాయి నవ్వేడు.

కిష్టుడు వింతగా చూశాడు. మనసుకి గిలిగింతకాగా చూశాడు. ఆత్మకి పులకింతకాగా చూశాడు.

తన బట్టలు మాసిపోయాయని పక్కింటి చిట్టి నవ్విన నవ్వూ, తనకంటే బాగా చగువుకుంటున్నానని సున్నగా తల దువ్వుకుని నీటుగా బట్టలు వేసుకుని జోళ్ళు చప్పుడు చేసుకుంటూ వెడుతూ ఎదురింటి రామం నవ్విన నవ్వూ, పిన్ని తన వీపుమీద దెబ్బలు కొడుతూంటే చూసి దాసీ దాని కూతురు మల్లి నవ్విన నవ్వూ–ఈ నవ్వులన్నీ కలిపి నయాపైసకంటె తక్కువ. ఈ పాప నవ్వో? వేల నవ్వు, వరాల నవ్వు, వజరాల నవ్వు!

ఇన్నాళ్ళూ తనది పుట్టుగుడ్డి. ఇప్పుడు తనది దివ్యదృషి. పాలరాయిలాంటి, పావురాయిలాంటి పాపగారిని కిష్టుడు ఉక్కిరిబిక్కిరి అయేలా ముద్దు పెట్టుకున్నాడు. ఏడ్చేదాకా నవ్వించాడు. నవ్వేదాకా ఏడిపించాడు. బరువుగా భారంగా బండి తోసుకువచ్చిన కిష్టుడు నవ్వుతూ తేగుతూ పాడుతూ యింటికి వెళ్లి ఆలస్యమైందని పిన్నిచేత హాయిగా దెబ్బలు తిన్నాడు!

ఆనాటి మొదలు హిమాలయా సమభావంగా, నయాగరా నయగారంలా కిష్టుడి బతుకు చాలా హాయిగా నడిచింది. సంచీనిండా కూరల భారం వాణ్ణి క్రుంగదీస్తున్నప్పుడు సాయంకాలపు చక్కని భావం వాణ్ణి లేవనెత్తేది. ఎక్కువ దూరం నడవలేక కాళ్లు పీకుతున్నపుడు పాపాయి చల్లని తలపు సాయంచేసేది. పిన్ని తిట్లు విని భరించలేనప్పుడు, భావ్యంలేని పాపాయి భావగానంచేసేది.

నాన్న వెళ్లమంటే దిగబెట్టడానికేమో అనుకుని సుందరక్కతో వెళ్లేడు గాని తన తోడూ నీడా విడిచి ఎవరుండగలరూ?


తను ఎక్కవలసిన రైలు వచ్చింది. ఇంక తనకీ బొమ్మకీ భయంలేదు. ఎడంచేత్తో టిక్కెట్టూ కుడిచేత్తో సంచీపట్టుకుని కిష్టుడు రైలెక్కి కూచున్నాడు.

* * *

'అదేవిట్రా నాలుగురోజులకే వచ్చేశావూ?' అన్నాడు–ప్రసాదు.

'బాగుంది, మీ కలాగే ఉంటుంది..., ఆ కన్నతల్లి ఎంతచల్లనిదో వాడు లేకపోతే... ఉంటే తెలిసేదికాదు...నా ప్రాణం ఎంత కొట్టుకుందనీ!...అసలు పాపాయిని ఎవరేనా పట్టుకో గలుగుతేనా?' ప్రసాదు సావిత్రి వైపు ఆశ్చర్యంగా చూశాడు. వీడు పిన్ని కిష్టుడు అయాడా? దాని మనసు మార్చగలిగేడా?

అవాళ సాయంకాలం నది ఒడ్డున పిన్ని కంటపడకుండా జాగ్రత్తగా దాచిన రబ్బరు బొమ్మను కిష్టుడు పాపాయికిచ్చాడు. పాపాయి రబ్బరు బొమ్మతో ఆడుకుంటున్నాడు. కిష్టుడు పాపాయితోఆడుకుంటున్నాడు. పైనున్న భగవంతుడు వీళ్లతో ఆడుకుంటున్నాడు! ★



చిత్రకారుడు: అబ్దుల్ సమద్ (గుడివాడ)

మనమూ-మనదేహస్థితి

(90-వ పేజీ తరువాయి)

విరేచనం కానప్పుడల్లా, ఈ పద్ధతి అవలంబిస్తారు. ఇందువల్ల ముడ్డి దగరఉండే కండరములు ఉంగరములు సత్తువతప్పి, బిడ్డదొడ్డికి రావడం ఆపుకో లేని స్థితి ఏర్పడుతుంది. ముడ్డివద్దపుండ్లే బంక విరేచనములు ఏర్పడతవి. విరేచనం బాధాకరమైన కృత్యమవుతుంది.

నరముల ఉద్రిక్తతవల్ల ఏర్పడే చిన్నబిడ్డ లక్షణములు మెడవిరుపూరారాంగానే, చుట్టతోనో కాల్చిన పసుపు కొమ్ముతోనూ, నొసటను మునచ్చెలగుంటలోనూ, వీపుమీద, పొట్టమీద కాల్చడం ఈ దేశంలో ఆచారంగా ఉండేది. ఇప్పుడూ అక్కడక్కడ ఉంది. ఇందువల్ల ఏలాభము లేదు కాని, ప్రమాదాలు చాలా ఉన్నవి. ఎన్నో సుందర వదనాలు ఈ విధంగా కాల్చినందున ఏర్పడ్డ మచ్చలతో వికృతములై పోయినవి. శరీరం కాలినప్పుడు, హిస్టమైన్ ఉత్పత్తి అయ్యే ప్రమాదం ఉంది శరీరం చుర్రుమనగానే స్థబ్ధమైన మెదడులో కేంద్రములు పని చేయవచ్చును. అంగుడు కాల్చవలసిన పనిలేదు. ఘాటైన పదార్థం (ఉల్లిపాయ వంటిది.) ఏదైనా వాసన చూపిస్తే చాలు. అల్లాగే బాగా చల్లని నీళ్ళు బాగా వేడిగాఉన్న నీళ్ళు శరీరంమీద మార్చి మార్చిపోస్తే చాలా మంచిది. ఇదే విధంగా అజీర్ణ వ్యాధి పోతోందని పొట్టమీద నెలల వయస్సులో సూదితో కాలుస్తారు. ఇదొక అజ్ఞాన జనితమైన ఘాతుక కృత్యము వైజ్ఞానిక వైద్యం వచ్చాక ఈ ఆచారములు చాలావరకు అంతరించినవి కాని, ఇంకా అక్కడక్కడ యీ దురాచారం ఉంది. ఇవి అర్థంలేని ప్రేమతో శిశువుల విషయంలో పెద్దలుచేసే అక్షంతవ్యమైన అపరాధాలు.

బిడ్డలకు కేల్షియం లోపం రాకుండా ఉండడానికి ఒక్కటే మార్గం. అది ఆహారంలో ఆవస్తువులను విరివిగా సరఫరా చేయడం. స్తన్యపానంతో పెరిగే బిడ్డకు తల్లి నుంచే కేల్షియం రావాలి. కేల్షియం విరివిగా ఉన్న వస్తువులు చాలా ఉన్నవి. కాని మానవశరీరం ఆహరించుకునే స్థితిలో ఆ కేల్షియం కొన్ని వస్తువులలోనే ఉన్నది. ఆ విషయం ఆహారలోప వ్యాధులు చర్చించేటప్పుడు వివరిస్తాను. పచ్చగడ్డి మేసే జంతువుల పాలలో కేల్షియం విరివిగా ఉంటుంది. బాదంపప్పులు, బీట్‌రూట్, చీజ్ (Chease) రాగిధాన్యం, నారింజ రసం, వీటిలో శరీరం ఆహరించగల కేల్షియం విరివిగా ఉన్నది. ఇంతేగాక ఈ వస్తువులలో విటమిన్ ఎ. బి. సి. లు కూడా విరివిగా ఉంటవి. పచ్చగడ్డి భూములన్నీ మాగాణి అయిన చోట్ల, పులిస్తరాకులు, వార్తా పత్రికలు తిని పశువులు బ్రతికే పట్టణాల్లో పుష్టికరములయిన పాలు కరువై పోతున్నవి. ప్రాజెక్టులమీద తీసుకునే శ్రద్ధ, పాలమీద కూడా ప్రభుత్వం త్వరలో తీసుకోకపోతే, ప్రజారోగ్యం నాశనమయ్యే స్థితి వచ్చింది. ★

హోదాకుతగ్గ చదువు

నౌకరు "చినబాబుగారూ! డాక్టరీ ఐదేళ్ళ చదువేకదండి? మీరు మరి ఏడో సంవత్సరంలో ఉన్నారేమండి" అని యజమాని కుమారుని ప్రశ్నించాడు.

ఆ విద్యార్థి ఏమీపట్టించుకోనట్లుగా "వాళ్లు అప్పుడప్పుడు కోర్సు పొడిగిస్తూ ఉంటారులే" అన్నాడు.

అమాయకుడైన ఆ నౌకరు "అవును మరి, వాళ్ళకు తెలియదూ మీలాంటి గొప్ప ప్రభువులుకూడా చదువుకుందుకు వస్తారని. సామాన్యులందరిలా మీకూ ఐదేళ్ళేనా మరి?

"ఈ తాలూకా అంతకూ మోతుబరిఅయిన భూస్వాముల బిడ్డలుకదా? పోసి చినబాబుగారూ, మరో ఐదేళ్లు పొడిగించమన లేకపోయారూ? అప్పుడు రెండింతలు డాక్టరీ పాసయేవారు" అన్నాడు.

ఆ విద్యార్థి చిరునవ్వుతో "పొడిగించమనిమనంకోరనక్కరలేదులే. నా గొప్ప వాళ్ళకు అప్పుడే బాగా తెలిసిపోయింది. నేనడక్కుండనే నా గొప్ప హోదాకు తగినట్లుగా వాళ్ళే పొడిగిస్తూఉంటారులే" అన్నాడు.

బుచ్చిలింగము (సికిందరాబాదు)

ఉత్తరాలు

(4-వ పేజీ తరువాయి)

ఎక్కడో చదివినట్లు జ్ఞాపకానికి వస్తున్నాయి.

సర్వతోముఖంగా వెలుగొందుతున్న మీ (మా) పత్రికలో కాపీ కథలు, ప్రచురించినట్లయితే పత్రిక తాలూకు అవున్నత్యానికి దెబ్బ తగులుతుందేమో నవే అనుమానం కలుగుతున్నది.

యు. సత్యనారాయణ, (భిలాయి)

* * *

28—12—60 తేదీ సంచికలోని "భిషగ్గర్వభంగం" కథ నాకెంతో నచ్చినది ఆ కథ ప్రచురించినందుకు మీకు నా ధన్యవాదాలు.

తనికెళ్ల వెంకటరమణశాస్త్రి (పార్వతీపురము).

* * *

11-1-61 తేదీ సంచికలో ప్రచురింపబడిన "జీవాతువు", 'రజతోత్సవం' అన్న కథలు చాలా బాగున్నవి.

చవకబారు ప్రేమకథలతో విసుగెత్తిన మాకు, ఈ కథలు కాస్త రిలీఫ్ ఇచ్చినవి. రచయితలకు, మీకూ మా అభినందనలు.

ఎస్. లక్ష్మి (విజయపురి నార్త్)

* * *

4-1-61 వారపత్రికలోని "ఉదర పోషణార్థం" కథ చాల బాగుంది. మానవ జీవితములో దుర్గయ్యవంటి వ్యక్తులు మనలను కలుసుకుంటునే ఉంటారు. ఈ కథ రచించిన వేమూరి సుబ్రహ్మణ్యంగారికి నా ధన్యవాదము లర్పిస్తూ ముందు ముందుకూడ వాస్తవికతకు దగరయిన కథలు అందిస్తూ వుంటారని ఆశించుచున్నాను.

ఎస్. రాజ్యలక్ష్మి (గుంటూరు) ★

గళ్లనుడికట్టు - 34
ఆధారాల పోటీ ఫలితం

శ్రీ తాళ్లూరి వేంకట రమణయ్య (హైదరాబాదు) పంపిన ఆధారాలు ఉత్తమమైనవిగా నిర్ణయించి, ఆయనకు బహుమతిగా రు 5 లు పంపుతున్నాము.

శ్రీ వేంకట రమణయ్య పంపిన ఆధారాలు ఇవి:


8 అడ్డం: "గవిరి కొప్పునపూవు ఘనముగా కనుపించు" (మేము ఇచ్చినది—ఆవిరి పూస్తుందా) జవాబు: విరి.

32 నిలువు: "వేడుకన పొడసూపు వెల్లనౌ చుక్క గూఢ వార్తను యపుడు గురుతుగా బంపు." (మేము ఇచ్చినది——చుక్క) జవాబు: వేగు.


ఇది కొత్తరకం గొలుసుకట్టు. ఒక్కొక్క ఆధారం చదివి, జవాబు తేల్చుకున్నాక ఒక చిత్తుకాగితంమీద వ్రాసుకోవాలి. తరువాత ఆధారాల పక్కనేఉన్న అంకెలవరుస ప్రకారం మీ జవాబులో ఒక్కొక్క అక్షరాన్ని, ఆయాసంఖ్యలుగల గడులలో వ్రాసుకొంటూపోవాలి. ఆధారంపక్క ఎన్నిసంఖ్యలుంటే, జవాబులో కూడా అన్నిఅక్షరాలే ఉంటాయని వేరేచెప్పనక్కరలేదు. ఉదాహరణకు మొట్టమొదటి ఆధారానికి జవాబుగా మూడక్షరాలమాట వస్తుంది. ఆపక్కనున్న సంఖ్యల ప్రకారం, మొదటి అక్షరం 6 వ గడిలోను, రెండవఅక్షరం 55 వగడిలోను, మూడవది 12 లోను వ్రాయాలి.

గడులు నింపుతున్నప్పుడు, కొన్ని ఆధారాలకు జవాబులలో కొన్ని అక్షరాలు వచ్చినవే రావచ్చు. అంతకుముందోసారి ఆగడినింపిఉంటే, రెండోసారి అదేఅక్షరం వచ్చినపుడు సరిగా ఉందోలేదో చూసుకుంటేచాలు. ఉదాహరణకు 70 వ గడిలోని అక్షరం రెండుమూడు జవాబులలో రావచ్చు. ఒక్కసారి గడిలో వేశాక, మిగతావాటికి సరిచూచుకుంటే చాలు. ఈ విధంగా ఈ గొలుసుకట్టు గడు లన్నీ నింపితే మహాభారతంలోని ఒక పద్యంతయారవుతుంది.

వ్రతంచెడ్డా ఇది దక్కాలనే ఇంత సులువైన ఆధారంఇవ్వడం—6,55,12.
ఎట్నుంచి అడిగినా నేర్చుకోవడం అంటూ ఉండా అనే ప్రశ్న—38,39,40.
రెండు రెళ్లలో ఒకటిపోగా మిగిలేది—33,5.
షష్ఠీ విభక్తికి తెలుగుమాట—66,67.
గబగబా గెలుతును అనుకోండి, మాటతటి తీరుతుంది 13,14,35.
రెండుసార్లు గుచ్చిచూస్తే సరి—43,2,75,22.
నీట తడిసేసరికి వలువలు కుంచించుకుపోయాయి—10,37,32.
గుక్కపట్టి గిర్రున తిరుగుతున్నా కదలనట్టే కనబడేవి—73,17,20,32.
ఈ మాట తెలియడానికి 76 వగడిలో అక్షరాన్ని, 57 లో దాన్ని ఒక్క చోటికి—.
మే డెక్కవి—68,69.
కొందరు గట్టిగా పట్టుపట్టి పనిచేయాలంటే ముందర ఈ పట్టు అవశ్యం ఉండితీరాలి—28,11,12.
దీనితో కట్టు కట్టితే మెల్లగా కాలవ దాటిస్తుంది—29,51.
బెదరిపోవద్దు. పరికాయించిచూస్తే ఒడ్డు, దగ్గరే కనిపిస్తుంది—63,72.
గుళ్లకి ఏకవచనం—44,84'
పెనుగులాడిచూస్తే సరి ఇటూ అటూ పినం గినం కనిపిస్తాయి—25,26,27.
ఉర్దూలో లేదు—24.
కరవాలం చివర తోక—4,30.
మూడక్షరాలలో నలుగురు సర్దుకున్నారు—3,7,49.
గుంటకల్లులో మద్యం నిషేధించండి—46,34.
నా మాటల కిందుకో తమరు నవ్వుకుంటున్నారు. ఏం కనబడిందనీ?—56,77.
చే దే దా?—76,74.
యీవిధముగా—69,59.
అందరాని దానిని చూసే అది వచ్చేదికాదనే అనిపిస్తుంది—18,45,70.
చేయదగునను ప్రతిపనీ చేదే అగును—76,79,80.
వాడదరిపడ్డాడు భయంతో. వాణ్ణిపట్టుకున్న వోణుకు కనిపిస్తూనే ఉంది—68,48.
మనికి పట్టులో ఉండడం—15,70,23.
పులుసు వడ్డించేది—17,72,50.
నీనికి కొడు—4,70,61.
పుస్తకం చింపితే...పోకేంచేస్తుంది?—65,72,72.
కూర్గంబుల – మరోమాటని చూడండి—52,53,31,27.
డర్గాకి పెట్టింది పేరు—3,4,54.
మేనమామభార్యలో నెమ్మదైన స్వభావం గలదుంది—28,71.
భవనంలో తోట—1,16.
ఇది ఎక్కడ పడ్డా పెరుగుతుందేమోగాని పేరుమీదపడితే చెరగదు—15,62.
అపవాదు వేసినతరవాత రాగల కలహం అందులోనే ఉంది—4,19.
ఇదియుం—78.
దంశ ధరించేది—68,9.
అరటిచెట్టు వేసేది—36,21,65.
ధర.. తగ్గును అన్నాడు సుమతి—41,2,3.
పోగాలం వచ్చినప్పుడు చేప దీన్ని పట్టుకుంటుంది—60,64.
పొమ్మంటే పోనిది రమ్మంటే వస్తుందా?—20,19.



35-వ గళ్లనుడికట్టుకు జవాబులు



ఎవరి ఇల్లు?

ఒకావిడ తన స్నేహితురాలితో ముచ్చటిస్తూ తన గొప్ప ఇలా చెప్పుకొంది:

"పండక్కి వెళ్ళి తిరిగి వస్తూంటే ఒకావిడ 'ఏమమ్మా, మీ అత్తవారింటికి వెళ్ళుతున్నావా' అనడిగింది. నేను ఏమి చెప్పానో తెలుసా? 'కాదమ్మా, నాభర్త ఇంటికి' అన్నాను. ఆవిడ నోరు మూసుకుంది."

ఇది విన్న స్నేహితురాలు గంభీరంగా ఇలా అన్నది: "నేనైతే 'మా ఇంటికి వెళ్ళుతున్నాను' అని ఉండేదాన్ని."

వంతుల సౌభాగ్యలక్ష్మి (విజయనగరం)

* * *


పెళ్ళికొడుకు మాట ఏమిటి?

రైలుబండిలో ఒకానొక వృద్ధుడు కాళ్ళుముడుచుకొని బల్లక్రింద పడుకొని ఉన్నాడు. టిక్కెట్ ఎగ్జామినర్ అతని లేపి టిక్కెట్ చూపమన్నాడు.

ఆవృద్ధుడు చేతులు జోడించి దయనీయమైనస్వరంతో ఇలా నివేదించుకొన్నాడు: "బాబూ! నాదగ్గర టిక్కెట్ లేదు. ఒక్క దమ్మిడీ అయినా లేదు. నా కూతురుపెండ్లికి మా ఊరు వెళ్ళుతున్నాను. ఈ సారికి విడిచి పెట్టండి."

టిక్కెట్ ఎగ్జామినర్ జాలిపడి అతని విడిచి ముందుకు పోయాడు. మరో బల్లక్రింద ఒక యువకుడు కనుపించాడు.

బహుమతి పొందిన కార్టూన్



చిత్రకారుడు— ఎస్. రఘురామారావు (విల్లివాక్కం)

పొట్టికథలు

టిక్కెట్ ఎగ్జామినర్‌కు కోపం వచ్చింది. ఆ యువకుని "ఏమిరా నువ్వు కూడా కూతురి పెళ్ళికే వెళ్ళుతున్నావా ఏమిటి" అని వ్యంగ్యంగా ప్రశ్నించాడు.

ఆ యువకుడు తలబయిటికి పెట్టి సవినయంగా అన్నది ఇది: "లేదండి బాబూ! నేను ఆ ముసలాడికి [illegible]బోయే అల్లుణ్ణి!"

ఎస్. అన్నపూర్ణ (ఖర్గపూర్)

* * *

ఒకటీ ఒకటీ....?

తాను చదివిన కథ తన మిత్రునిచేతకూడా చదివించాలన్న ఆవేదనతో చెప్పుకుపోతున్నాడు ఒకవిద్యార్థి: "నల్లని చీకట్లు క్రమ్ముకుంటున్నాయి. చీకట్లు అతని (అంటే కథలో నాయకుడు) చుట్టూ పరిభ్రమిస్తున్నది. అతని హృదయం శారద (కథానాయికి) చుట్టూ పరిభ్రమిస్తున్నది..."

కాంపోజిట్ మాథమాటిక్స్ చదువుతున్న ఆ రెండవ విద్యార్థి అడ్డువచ్చి "అందుచేత చీకటి శారద చుట్టూ పరిభ్రమిస్తున్నది" అన్నాడు.

ఒక విద్యార్థి (విశాఖపట్టణం)

* * *

"నిన్ను హృదయపూర్వకంగా ప్రేమించాను. నువ్వు తిరస్కరించావంటే తప్పకుండా చచ్చిపోతాను" అన్నాడు అతడు.

ఆమె తిరస్కరించింది. అతడూ చచ్చిపోయాడు—నలభై ఏళ్ళ తరువాత.

మైనూరి నీలకంఠం (మద్రాసు-12)

★

Printed and Published for NageswaraRao Estates (Private) Ltd,. by S. Radha Krishna at TheAndhra Patrika Press 6 & 7, Thambu Chetty Street, Madras-1. Editor S. Sambhu Prasad


RAJA
COSMETICS
SOAPS
PERFUMERY
ESSENTIAL OILS
For the Skin
RAJA
SNOW
for Beauty & Complexion
MANUFACTURERS
MANYAM & CO.
BANGALORE
HAIR OIL
MANYAM & CO., RAJA SNOW BUILDINGS, BANGALORE 20